

ఈనాడు



విజయవాడ 23-8-2017 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 14

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

తలాక్‌కు తాళం



తీర్పు అనంతరం మంగళవారం దిల్లీలో సుప్రీంకోర్టు వద్ద మాట్లాడుతున్న ముమ్మారు తలాక్ బాధితురాలు జీనత్ అలీ సిద్దిఖీ

అది చట్టవ్యతిరేకం... రాజ్యాంగ విరుద్ధం

- ఖురాన్ మూల సూత్రాలకూ వ్యతిరేకం.. రద్దు చేయాల్సిందే
- 3-2 మెజారిటీ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తలాక్ పద్ధతిని 6 నెలలు ఆపాలి
- కేంద్రం చట్టం చేయాలి: సీజేఐ

ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చే తీర్పును సుప్రీంకోర్టు వెలువరించింది. ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతి ఏ రకంగా చూసినా చెల్లబోదని విస్పష్టంగా చెప్పింది. సమానత్వ హక్కు కోసం పోరాడుతున్న అతివలకు కొండంత అండనిచ్చింది. ఈ సమస్యకు ప్రభుత్వం చట్టపరమైన పరిష్కారాన్ని చూపించాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినా, 3 : 2 ఆధిక్యంతో చరిత్రాత్మక తీర్పు వెలువడింది. చట్టాలతో పాటు ఖురాన్‌లోని అంశాలనూ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఉటంకించారు. అనేక మందిపై ప్రభావం చూపించే ఈ తీర్పును ప్రభుత్వం స్వాగతించింది.



జస్టిస్ లలిత్



జస్టిస్ నారీమన్



జస్టిస్ జోసెఫ్

'ముమ్మారు తలాక్‌తోపాటు ఖురాన్ చెప్పే మూల సూత్రాలకు విరుద్ధమైనవి ఏవైనా ఆమోద యోగ్యం కాదు. తలాక్ ఏకపక్షం అనేది విస్పష్టం. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. దీనిని రద్దు చేయాల్సిందే.

వివాహానికి పవిత్రతను, శాశ్వతత్వాన్ని ఖురాన్ ఆపాదిస్తుంది. అత్యంత అరుదైన సందర్భాల్లోనే తలాక్‌ను అనుమతించాలి. అప్పుడూ రాజీకి ఒక ప్రయత్నం జరగాలి. అది ఫలిస్తే విడాకుల్ని వెనక్కి తీసుకోవాలి.

తలాక్ కార్యరూపం దాల్చడానికి ముందు ఇవన్నీ తప్పనిసరిగా జరగాలని ఖురాన్ చెబుతోంది. ముమ్మారు తలాక్‌లో ఈ తలుపు మూసుకుపోతోంది.

పవిత్ర ఖురాన్ చెబుతున్న ప్రాథమిక సూక్తులకు విరుద్ధంగా, షరియత్‌ను ఉల్లంఘించేదిగా ముమ్మారు తలాక్ ఉంది.'



జస్టిస్ ఖేహర్



జస్టిస్ నజీర్

ముమ్మారు తలాక్‌తో విడాకులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు: **6**

పిటిషన్లు దాఖలు చేసిన వారు:

★ సాయరా బానో ★ ఇష్రత్ జహాన్ ★ గుల్షన్ పర్వీన్
★ అఫ్రీన్ రెహ్మాన్ ★ అతియా సబ్రీ
★ భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ)

ముమ్మారు తలాక్ అనేది మతపరమైన ఆచారం. దానిని ఆరు నెలల పాటు నిలుపు చేసి, ప్రభుత్వం ఒక చట్టం చేయడం మేలు. ఈ పరిస్థితిని శాసనమార్గం ద్వారానే పరిష్కరించగలం. ఇదే మా అభిప్రాయం. ఇందులో అనుమానమేమీ లేదు. ఒక అంశంపై చట్టం తీసుకురావాలంటూ శాసన వ్యవస్థకు సలహా ఇవ్వడం సరికాకపోయినా, ప్రస్తుత కేసులో పరిస్థితి కాస్త విభిన్నం.

- జస్టిస్ ఖేహర్, జస్టిస్ నజీర్

ముమ్మారు తలాక్‌పై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకం. ఇది ముస్లిం మహిళలకు సమానత్వ హక్కును ప్రసాదిస్తోంది. మహిళా సాధికారతకు ఇదొక గీటురాయి **- ప్రధాని నరేంద్ర మోదీ**



2లో



ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం లఖ్‌నవూలో ముస్లిం మహిళల ఆనందం

సున్నీలకు ఇక రెండు పద్ధతులే

సున్నీ ముస్లింలలో ముమ్మారు తలాక్ పద్ధతి ఎక్కువగా పాటిస్తుంటారు. ఇకపై వీరు ఈ పద్ధతిని పాటించడానికి వీలుండదు. ఒకవేళ అలా చేసినా చట్ట విరుద్ధమవుతుంది. విడాకుల కోసం వారు ఇకపై 'తలాక్ హసన్', లేదా 'తలాక్ అహ్సాన్' పద్ధతులపై ఆధారపడాల్సి ఉంటుంది. తలాక్ అహ్సాన్ కింద ముస్లిం పురుషుడు నెలకో సారి చొప్పున వరుసగా 3 నెలల పాటు తలాక్ చెప్పి విడాకులు ఇవ్వవచ్చు. ఇది స్త్రీ రుతుక్రమ చక్రం (తుహర్) బట్టి ఆధారపడి ఉంటుంది.



ఓటరు కరుణ ఎవరిపైనో!

- నంద్యాలలో నేడే పోలింగ్
- భారీగా పోలీసుల మోహరింపు

2లో



తూర్పులో బెట్టింగ్ దందా!

2లో

- కాకినాడలో 17 మంది బుకీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అంతా వైకాపా మాజీ ఎమ్మెల్యే అనుచరులే!



జనావాసాల్లో మద్య రక్కసి

- నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుపై అసంతృప్తి

2లో

ఇదేనా సంస్కారం, సభ్యత?

- కాల్చేయండి, చెప్పులతో కొట్టండి అంటారా!
- ఏం మాటలవి? సహనం ఉండక్కర్లేదా?
- జగన్ వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు ఆవేదన
- అతడ్ని నియంత్రించడం ప్రజలందరి బాధ్యతని వ్యాఖ్య

ఈనాడు - అమరావతి

"కాల్చేయండి, ఉరేయండి, బట్టలూడదీయండి, బంగాళాఖాతంలో కలిపేయండి... ఏం మాటలవి! సభ్యత సంస్కారం ఉండొద్దా" అని విపక్ష నేత జగన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా నేత జగన్ ఇటీవల ముఖ్యమంత్రినుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. 'అతను విద్వేషపూరితమైన వ్యాఖ్యలతో అందరి దృష్టిని అతని వైపునకు తిప్పుకోడానికి ప్రయత్నిస్తూ విచక్షణ కోల్పోతున్నారన్నారు. 'ఆయన (జగన్) అలా మాట్లాడటమేంటి? ఇదేనా సభ్యత, సంస్కారం' అని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రికే రక్షణలేని (మిగతా 2లో)



'నాకు కూడా రాజకీయాల్లో చాలా ఇబ్బందులొచ్చాయి. అలాగని నేనెప్పుడూ సహనం కోల్పోయి మాట్లాడలేదు. సంస్కారం అంటే అలా ఉండాలి.

అమెరికాలో మానసిక సమస్యలు ఎక్కువై మానసిక వైద్యులకు డిమాండు పెరుగుతోంది. మన రాష్ట్రంలో కూడా వారికి డిమాండు అధికమవుతోంది.


ప్రజలకు మంచి చేస్తున్నా అడ్డుపడుతున్నారు. నరేగా పనులు ఎక్కడా లేని విధంగా ఎంతో బాగా అమలు చేస్తోంటే దానిపైన విపక్ష నేతలు ఫిర్యాదులు చేసి ఆ నిధులు రానివ్వకుండా అడ్డుపడుతున్నారు.'

ఇసుకాసురులపై పీడీ చట్టం

- సరిహద్దుల్లో అక్రమ రవాణాపై సమగ్ర నిఘా
- ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక

2లో

ఇదీ సంగతి!



దాహార్తిపై లేఖాస్త్రం

- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు భేటీలో నిర్ణయం
- ఎగువ రాష్ట్రాల నుంచి తాగునీరైనా ఇప్పించండి
- బోర్డు చొరవ తీసుకోవాలని కోరిన తెలుగు రాష్ట్రాలు
- టెలిమెట్రీల ఏర్పాటుతీరుపై భిన్నాభిప్రాయాలు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దారుణమైన నీటి కటకటపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్వయంగా కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించింది. ఈ రాష్ట్రాల్లో కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఎగువ నుంచి జలాలు దిగువకు చేరకపోవడం వల్ల తాగునీరు అందించలేకపోతున్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని ఈ సమావేశం భావించింది. బోర్డు ఛైర్మన్ ఎస్. కె. శ్రీవాస్తవ ఈ మేరకు (మిగతా 2లో)



విజయవాడలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ నేతృత్వంలో సమావేశమైన అధికారులు





ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముంబయిలో మిఠాయిలు పంచుకుంటున్న ముస్లిం మహిళలు

తలాక్‌కు తలాక్

దిల్లీ: ముమ్మారు (ట్రిపుల్) తలాక్ చెప్పి విడాకులు తీసుకునేందుకు ముస్లింలలో ఉన్న పద్ధతి చెల్లనేరదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చాలా కాలం నుంచి వివాదానికి, చర్చోపచర్చలకు తావిస్తున్న ఈ విధానంపై సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఏ రకంగా చూసినా ఈ పద్ధతి సరికాదని విస్పష్టంగా ప్రకటించింది. అసలు ఈ పద్ధతే చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమని కుండ బద్దలుగొట్టినట్లు చెప్పింది. ఖురాన్ మూల సూత్రాలకూ ఇది వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు 3-2 ఆధిక్యంతో అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 395 పేజీలతో మంగళవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఏ రకంగా చూసినా ఈ పద్ధతి సరికాదని చెబుతూ- 1400 ఏళ్లుగా ముస్లిం సమాజంలో కొనసాగుతూ వచ్చిన ఆచారానికి తెర దించింది. ముమ్మారు తలాక్‌తో విడాకులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఆరు పిటిషన్లపై ధర్మాసనం తీర్పునిచ్చింది. వివిధ హైకోర్టులు దీనిపై ఇచ్చిన తీర్పులను ఉటంకించింది. ఈ విషయంలో షమీమ్ అరా కేసు- 'న్యాయపరమైన పూర్వత్వం'గా నిలవబోదన్న అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదనను తోసిపుచ్చింది. ముమ్మారు తలాక్ అనేది మతపరమైన ఆచారమనీ, దానిని ఆరు నెలల పాటు నిలుపు చేసి, ప్రభుత్వం ఒక చట్టం చేయడం మేలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లు తమ తీర్పులో అభిప్రాయపడ్డారు. జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్, జస్టిస్ యు.యు.లలిత్‌లు మాత్రం దీనితో ఏకీభవించలేదు. ముమ్మారు తలాక్ పద్ధతి రాజ్యాంగ అతిక్రమణేనని వారు పేర్కొన్నారు. జస్టిస్ నారీమన్, జస్టిస్ జోసెఫ్‌లు విడివిడిగా తీర్పులు వెలువరించారు.

"ముమ్మారు తలాక్‌తో పాటు ఖురాన్ చెప్పే మూల సూత్రాలకు విరుద్ధమైనవి ఏవైనా ఆమోద యోగ్యం కాదు. తలాక్ ఏకపక్షం అనేది విస్పష్టం. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. దీనిని రద్దు చేయాల్సిందే"నని ముగ్గురు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ముమ్మారు తలాక్ ఇస్లాం మూల సూత్రాలకు లోబడి ఉందా లేదా అనే కీలక విషయంలో జస్టిస్ ఖేహర్, జస్టిస్ నజీర్‌లతో మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు విభేదించారు. '3:2 ఆధిక్యంతో భిన్నాభిప్రాయాలు నమోదైన దృష్ట్యా, ముమ్మారు తలాక్‌ను రద్దు చేస్తున్నాం' అని సీజేఐ ఏక వాక్య ఉత్తర్వులో రాశారు.

సీజేఐ అభిప్రాయంతో ఏకీభవించలేకపోతున్నాం...

మెజారిటీ న్యాయమూర్తుల తరఫున జస్టిస్ జోసెఫ్ తీర్పును రాస్తూ- ముమ్మారు తలాక్ విధానం ముస్లింల పర్సనల్ లాలో అంతర్భాగంగా పరిగణించాలన్న సీజేఐ అభిప్రాయంతో తాను ఏకీభవించడం అత్యంత కష్టమని అన్నారు. ఆయన అభిప్రాయంతో జస్టిస్ నారీమన్, జస్టిస్ లలిత్‌లు ఏకీభవించారు. ఖురాన్‌లోని సూక్తుల్ని జస్టిస్ జోసెఫ్ ఉటంకిస్తూ- తలాక్‌కు సంబంధించినంతవరకు అవి చాలా స్పష్టంగా, ఎలాంటి సందిగ్ధతకు తావులేకుండా ఉన్నాయని చెప్పారు. ఈ అలవాటు- సమానత్వం, హుందాతనాలకు విరుద్ధంగా ఉందన్న కేంద్ర ప్రభుత్వ వాదనను ఆయన సమర్థించారు. చట్టానికి మొదటి ఆధారం ఖురాన్ అనీ, దాని ఔన్నత్యాన్ని కాపాడాలనీ చెప్పారు. ఖురాన్‌లో స్పష్టంగా లేని విషయాల్లోనే హదిత్, ఇజ్మా, ఖియాస్ వంటివాటిపై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. అందువల్ల ఖురాన్‌లో ఉన్నవాటికి విరుద్ధంగా ఈ మూడింటిలో ఏదీ ఉండరాదన్నారు. ఖురాన్‌కు వ్యతిరేకంగా ఇస్లాం ఉండజాలదు' అని జస్టిస్ జోసెఫ్ చెప్పారు. ఖురాన్‌లో చెడ్డదిగా చెప్పే దానిని షరియత్ మంచిదిగా చెప్పజాలదనీ, మతపరంగా చెడ్డది చట్టప్రకారమూ చెడ్డదే అవుతుందనీ వ్యాఖ్యానించారు. తలాక్ పద్ధతి 14 శతాబ్దాలుగా అమల్లో ఉందన్న ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదనను ఆయన తోసిపుచ్చారు. ఒక అలవాటు దీర్ఘ కాలం నుంచి కొనసాగుతూ వస్తున్నంతమాత్రాన అది ఎప్పటికీ చెల్లుబాటవుతుందని చెప్పలేమన్నారు. ఇలాంటి అభ్యాసానికి రాజ్యాంగపరమైన రక్షణ ఉండదన్నారు. ఆ విషయంలోనే తాను సీజేఐతో విభేదిస్తున్నానని వివరించారు. ఇది మతాచారంలో భాగమైనా దాని అమలును సుప్రీంకోర్టుకు ఉన్న అసాధారణ అధికారంతో 142వ అధికరణం కింద ఆరు నెలల పాటు నిలిపివేయాలన్న అభిప్రాయంతో ఏకీభవించలేనన్నారు. ప్రాథమిక హక్కునైనా ఉపయోగించుకోకుండా ఆ అధికరణం కింద ఇంజంక్షన్ ఇవ్వడంపై తనకు తీవ్ర సందేహాలున్నాయని చెప్పారు.

సమానత్వ హక్కును ఉల్లంఘించే పద్ధతి ఇది

ముమ్మారు తలాక్‌తో విడాకులు తీసుకోవడం.. రాజ్యాంగంలోని 14వ అధికరణం ప్రసాదిస్తున్న సమానత్వ హక్కు ఉల్లంఘన కిందికే వస్తుందని జస్టిస్ నారీమన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన విడిగా తీర్పు రాశారు. తలాక్ కేవలం చట్టపరంగా అనుమతించే పద్ధతి మాత్రమేననీ, అదే సమయంలో దానిని పాపపు చర్యగా హనాఫీ స్కూలే చెబుతోందనీ గుర్తు చేశారు. '...ఈ పద్ధతి తక్షణం జరిగిపోయేదీ, వెనక్కి రాలేనిది. కుటుంబానికి చెందిన మధ్యవర్తుల ద్వారా భార్యాభర్తలు పశ్చాత్తాపం చెంది వెనక్కి రావడానికి ఆస్కారమే దీనిలో లేదు. వివాహ బంధాన్ని కాపాడడానికి ఇలాంటిదానికి ఆస్కారం ఉండాలి. తలాక్ పద్ధతి ఖురాన్‌కు తగ్గట్టుగా కూడా లేదు. ఏకపక్షంగా, చపలచిత్తంతో వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేసుకునేందుకు తలాక్ పద్ధతి ఉపయోగపడుతోందనేది సుస్పష్టం' అని అన్నారు.

తూర్పులో బెట్టింగ్ దందా!

ఈనాడు, కాకినాడ: కాకినాడ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై 17 మంది బుకీలను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా కాకినాడకు చెందిన వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు. రెండు రోజుల కిందట దుంబల్లాలో భారత్-శ్రీలంక మధ్య జరిగిన వన్డే మ్యాచ్ కోసం వీరు భారీగా బెట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం అయిదుగురిని, మంగళవారం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కాకినాడ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో చీకట్ల ఈశ్వరరావు, గంగాధర్, బాబ్జీ, శ్రీరాం, లక్ష్మీపతి తదితరులు ఉన్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న వారిలో చాలా మంది బెట్టింగ్, నెంబర్ గేమ్‌ల ద్వారా రూ.కోట్లు సంపాదిస్తున్నట్లు పోలీసు వర్గాల సమాచారం.

కాకినాడ ఎన్నికల నేపథ్యంలో కుట్రతో ఇలా చేస్తున్నారు

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో కుట్రతోనే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారంతా వైకాపా కార్యకర్తలే. గత 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. నాకు అనేక మంది అనుచరులు ఉంటారు. వారు ఏం వ్యాపారాలు చేస్తుంటారో, వాటి వివరాలు నాకు ఎలా తెలుస్తాయి? వాటితో నాకేం సంబంధం?


–ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి,
మాజీ ఎమ్మెల్యే, కాకినాడ అర్బన్

ఇసుకాసురులపై పీడీ చట్టం

ఈనాడు – అమరావతి

'ఇసుక అక్రమ రవాణా నిరోధానికి అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తాం. చెక్‌పోస్టులు పెడతాం. ఒక్క వాహనం రాష్ట్రం దాటినా స్వాధీనం చేయడంతో పాటు బాధ్యుల్ని అరెస్టు చేస్తాం. పీడీ చట్టం ప్రయోగిస్తాం. చాలా కఠినంగా వ్యవహరిస్తాం..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. 'ఇసుక ఉచితం.. దందాలు చేస్తే ఊరుకునేది లేదు.. ఇందుకు ఎవరూ అతీతులు కారని...' స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నాడి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అభిప్రాయాలు తీసుకుంటున్నామని.. కేవలం వీటి మీదనే ఆధారపడకుండా మూడో పార్టీతో మరోసారి పరిశీలన చేయిస్తామని చెప్పారు. ఇందుకు పేరున్న సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజాభిప్రాయ సేకరణపై వివరాలు తెలియజేశారు. ఇసుక ధరలపై గృహనిర్మాణ లబ్ధిదారులు, క్రెడాయ్, అధికారుల నుంచి సమాచారం తీసుకుంటున్నామని చెప్పారు. పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

- మద్యం గొలుసు దుకాణాలను తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మొబైల్ రైడింగ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తెస్తున్నాం. నివాస ప్రాంతాల్లో ఎక్కడైనా దుకాణాలున్నా తొలగించాలని ఆదేశించాం.
- పట్టణ ప్రణాళిక విభాగంలో ఆన్‌లైన్ అనుమతులపై పరిశీలన సందర్భంగా 85శాతం బాగుందని చెప్పారు. 10శాతం మంది ఆన్‌లైన్‌లోనూ అవినీతికి పాల్పడినట్లు తేలింది.



- విశాఖపట్నంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇంటికి తీసుకెళ్లి ఇవ్వమని ఆదేశిస్తే 35 మంది డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. విచారించి వారిపై కేసులు నమోదు చేయమని ఆదేశించాం. విశాఖపట్నంలో సిట్ ఏర్పాటుకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. 2వేల ఫిర్యాదులు అందాయి.
- అన్న అమృత హస్తంలో పాత బియ్యం ఇవ్వమని అడుగుతున్నారు. దీనిపై సాధ్యాసాధ్యాలు అంచనా వేస్తున్నాం. ఇళ్లకే బియ్యం ఇవ్వమని ఎక్కువ మంది అడుగుతున్నారు. అది సాధ్యం కాదు.
- రైతు బజార్లను గాడిలో పెడుతున్నాం. ఈ ఏడాది 96 నుంచి 150 చేయబోతున్నాం. దశలవారీగా పెంచుతాం. వర్షాకాలం కావడం వల్ల పంటలు లేక ధరలు పెరిగాయి.
- ఇళ్ల నిర్మాణంలోనూ బిల్లులు చెల్లించిన వెంటనే లబ్ధిదారులకు ఫోన్ చేసి సమాచారం తీసుకుంటాం. సేవలకు ఒక విధానం తెస్తున్నాం. అధికారులు సహకరించాలి.
- సెప్టెంబరు 15 నాటికి రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయం సచివాలయానికి వస్తుంది. అంతా నేనే పర్యవేక్షిస్తాను.
- ఫైబర్‌గ్రిడ్ పథకంలో భాగంగా సెప్టెంబరు 15 నాటికి లక్ష కనెక్షన్లు పూర్తి చేస్తాం. ప్రజలతో ముఖాముఖి మాట్లాడతాను.
- ఏకీకృత దస్త్రాల విధానం అమలు చేయబోతున్నాం. పది మంది పింఛన్లు తీసుకుంటే పది దస్త్రాలు కాకుండా అందరికీ ఒకటే ఉంటుంది. అర్హులందరితో కలిపి తయారు చేస్తారు.
- దుల్హన్ పథకం కింద ముస్లిం యువతుల వివాహానికి ఇచ్చే రూ.50వేల మొత్తాన్ని పెళ్లిరోజునే అందిస్తాం. పెళ్లయ్యాక ఆరు నెలలకు కూడా సొమ్ము అందకపోవడం అనే సమస్యే ఇక మీదట ఉండబోదు.
- లబ్ధిదారులకు సత్వరం ప్రయోజనం కలిగేలా చంద్రన్న బీమా పథకంలో మార్పులు చేస్తున్నాం. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5లక్షలు, వికలాంగులైన వారికి రూ.5లక్షలు, పాక్షికంగా వికలాంగులైతే రూ.2.5లక్షలు ఇస్తున్నాం. 50 ఏళ్ల లోపు సహజ మరణం పొందితే రూ.2.50లక్షలు అందిస్తాం. 50 నుంచి 60 ఏళ్లలోపు వారికి రూ.30వేలు ఇస్తాం. సొమ్మును పెద్దకర్మ నాటికి బ్యాంకులో వేసి చెక్కుతో పాటు సీఎం సంతాపసందేశం కూడా అందుతుంది.
- రాష్ట్రంలోని హిజ్రాలకు పింఛన్లు ఇచ్చే ఆలోచన ఉంది. గృహనిర్మాణంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు కూడా వారికి వర్తింపజేస్తాం. వృద్ధులకు ఆశ్రమాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నాయి. భిక్షాటకులు, మతితప్పిన వారికి కూడా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

పౌరసన్మానం.. అందరికీ ఆహ్వానం

ఉపరాష్ట్రపతిగా ఎంపికైన వెంకయ్యనాయుడుకు ఈ నెల 26న పౌరసన్మానం నిర్వహిస్తున్నాం. తెలుగువారు అత్యున్నత పదవి అలంకరించడం గర్వించదగ్గ విషయం. ఈ కార్యక్రమానికి ప్రతిపక్షంతో సహా న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, అధికారులు అందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. విమానాశ్రయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నాం.

మూడేళ్లలో రూ.2లక్షల కోట్లు

2014లో మళ్లీ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై పుస్తకాన్ని విలేకరుల సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మూడేళ్ల కాలంలో రూ.2లక్షల కోట్లతో పథకాల అమలుపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్ కుటుంబరావు, రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈఓ ఎ.బాబు ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఏడాదికి రూ.65వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు సీఎం వివరించారు. రైతు రుణమాఫీ నుంచి చంద్రన్న దళితబాట, పంట సంజీవని, ఉపాధిహామీ తదితర 60 అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను పేర్కొన్నారు.

ఇదేనా సంస్కారం, సభ్యత?

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు తీసుకొస్తారా అని జగన్‌పై మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నవ్యక్తికే రక్షణ లేని పరిస్థితి ఉంటే, ఇంక ఎవరికి రక్షణ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి పెద్దగా ఉన్న వ్యక్తినే లెక్క చేయట్లేదంటే ఇంకెవర్ని లెక్క చేస్తారని విపక్ష నేతను విమర్శించారు. అలాంటి నేతకు సంస్కారం నేర్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. ఒకప్పుడు గాలి జనార్దన్‌రెడ్డి, వైఎస్ జగన్‌లను కూడా కొంతమంది అనుసరించాలని అనుకున్నారని, అయితే చివరకు ఏమైందో అందరికి తెలిసిందేనన్నారు. పాలనలో స్థిరత్వం చాలా అవసరమన్నారు. ఒక స్థిరమైన విధానంతో ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో తాను, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దిశగా పాలన అందిస్తున్నామన్నారు.

కృష్ణా జలాలపై న్యాయ పోరాటం

కృష్ణా జలాలపై కర్ణాటక అనుసరిస్తున్న విధానంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై అవసరమైతే న్యాయ పోరాటం కూడా చేస్తామన్నారు. చట్టపరంగా మనకు రావాల్సిన కృష్ణా జలాలు మనకు ఇవ్వాలని అన్నారు. కర్ణాటక వైఖరి వల్ల తెలంగాణ కూడా ఇబ్బందులు పడుతోందన్నారు. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా వంద టీఎంసీల నీళ్లు తెచ్చామన్నారు. గోదావరి జలాలను సోమశిలకు ఎత్తిపోతల ద్వారా తీసుకెళ్తామన్నారు. రాబోయే మూడు నెలల్లో 28 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని సీఎం చెప్పారు. నిధులు ఉన్నాయా లేవా అనేదానితో పనిలేకుండా ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

5 నుంచి జలసిరికి హారతి.. 10 నుంచి ఇంటింటికి తెలుగుదేశం

కొన్ని కార్యక్రమాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు నుంచి నిర్వహించతలపెట్టిన జలసిరికి హారతి కార్యక్రమాన్ని వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసినట్లు చంద్రబాబు తెలిపారు. సెప్టెంబరు 10వ తేదీ నుంచి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. రెండు నెలల పాటు ఉంటుందన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు చేస్తున్న పెత్తనంపై ఆయన స్పందిస్తూ కొన్ని చోట్ల సమస్యలున్న మాట వాస్తవమేనని, అయితే అర్హుల ఎంపికలో మాత్రం పార్టీ కార్యకర్తల ప్రమేయం ఉండదని అన్నారు. అర్హులైన వారిని తప్పకుండా ఎంపిక చేస్తామని, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకల ఫలాలన్నీ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

దాహార్తిపై లేఖాస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

తాను లేఖ రాయనున్నట్లు ప్రకటించారు. బోర్డు సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత బోర్డు సమావేశంలో ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఈ అంశాన్ని ప్రస్తావించగా తెలంగాణ ముఖ్య కార్యదర్శి ఎస్.కె.జోషి సమర్థించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చొరవ తీసుకుని ఇక్కడి పరిస్థితిని కేంద్రానికి వివరించాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని శశిభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. ఊళ్లల్లో తాగునీటిని ఎలా అందించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఎగువ రాష్ట్రాల్లో వందల టీఎంసీలు సాగుకు వినియోగిస్తున్నారని ప్రస్తావించారు. వరుసగా మూడేళ్ల నుంచి ఇంతగా కరవు ఎదుర్కొంటున్నామని చెప్పారు. హైదరాబాద్‌కు తాగునీరు అందించడమూ చాలా సమస్యగా ఉందని జోషి వివరించారు. ఆంధ్రప్రదేశ్ కోరినట్లు కృష్ణా బోర్డు చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటికే తాము కర్ణాటకకు లేఖ రాసిన విషయాన్ని జోషి ప్రస్తావించారు. దీంతో బోర్డు ఛైర్మన్ ఇందుకు అంగీకరించారు. విజయవాడలోని గేట్ వే హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశమైంది. ఛైర్మన్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ, కార్యదర్శులతో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఎం.వెంకటేశ్వరరావు, మురళీధర్‌లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెలీమెట్రీ వ్యవస్థ ఏర్పాటు, బోర్డు వర్కింగ్ మాన్యువల్, విధివిధానాలు, నీటి పంపకాల విషయంలో గత సంవత్సరం ఏర్పాటునే కొనసాగించడం, సిబ్బంది కేటాయింపులు, బడ్జెట్, లోగో రూపకల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. లోగోను ఖరారు చేశారు. ఆ లోగోలో వరి కంకులు కూడా చేర్చాలని సూచించారు. దాదాపు గత సమావేశాల్లో రెండు రాష్ట్రాల అధికారుల మధ్య ఎలాంటి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయో ఇప్పుడూ అవే అభిప్రాయాలు కొనసాగాయి. టెలీమెట్రీ వ్యవస్థ, వర్కింగ్ మాన్యువల్‌కు సంబంధించి సెప్టెంబర్ 16న మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

తొలిదశలో 18 చోట్ల టెలీమెట్రీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. రెండో దశలో 29 చోట్ల ఏర్పాటు చేయాలని బోర్డు ప్రతిపాదించింది. తాము ప్రతిపాదించిన ప్రదేశాలు ఈ జాబితాలో ఎందుకు చేరలేదంటూ తెలంగాణ జలవనరులశాఖ కార్యదర్శి జోషి ప్రశ్నించారు. ఈ జాబితాపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్నారు. బనకచర్ల వద్ద మూడు చోట్ల తాము ప్రతిపాదిస్తే పోతిరెడ్డిపాడు ఒక్కటే చేర్చారన్నారు. అసలు ఈ మీటరీలను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో చెప్పాలన్నారు. ప్రతి జలాశయానికి సంబంధించి అవుట్ లెట్ వద్ద ఏర్పాటు చేస్తే సరిపోతుందని ఏపీ కార్యదర్శి శశిభూషణ్ సూచించారు. బనకచర్ల వద్ద తెలంగాణ ప్రస్తావిస్తున్న మూడు పాయింట్లకు పోతిరెడ్డిపాడు నుంచే నీరు వెళ్తుందని అక్కడ ఒక చోట ఏర్పాటు చేస్తే సరిపోతుందని, లేకపోతే గందరగోళం తలెత్తుతుందని ఏపీ వాదించింది.

బోర్డు నిర్ణయాలు అమలు కాలేదు: ఏపీ

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలకు సంబంధించి గత సంవత్సరం ఏర్పాటునే కొనసాగించాలని బోర్డు భేటీలో నిర్ణయించారు. ట్రైబ్యునల్‌లో ఖరారయ్యే వరకు ఇదే నిష్పత్తిలో నీరు పంచుకునేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని వర్కింగ్ మాన్యువల్‌లో చేర్చాలని ఏపీ కోరింది. ఏపీ, తెలంగాణల మధ్య 512:299 టీఎంసీల నిష్పత్తిలోనే నీరు వాడుకునేందుకు అంగీకారం కుదిరింది. చిన్ననీటి వనరుల వాడకంపైనా చర్చ జరిగింది. చిన్ననీటి వనరుల్లో నీటి లభ్యత, వాడకంపై శాటిలైట్ చిత్రాల ఆధారంగా లెక్కలు తీస్తామని బోర్డు సభ్య కార్యదర్శి పేర్కొన్నారు. బోర్డు నిర్ణయాలు సరిగా అమలవక ఏపీ గత రెండు సంవత్సరాలుగా ఎదుర్కొన్న ఇబ్బందులను శశిభూషణ్‌కుమార్ వివరించారు. ఎవరి భూభాగంలో ప్రాజెక్టులు వారే నిర్వహించుకునేందుకు వీలు కల్పించాలన్నారు. తెలంగాణ అధికారులు కలగజేసుకుని ఇప్పుడు బోర్డు ఆధ్వర్యంలోనే అంతా జరుగుతోంది కదా అని పేర్కొన్నారు. తెలంగాణ తమ నిర్ణయాలు అమలు చేయడం లేదంటూ బోర్డే కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని ఏపీ కార్యదర్శి ప్రస్తావించారు. ముందస్తు నిర్ణయాలు తీసుకుంటే ట్రాన్స్‌కో, జెన్‌కోలకు వర్తమానం అందించి అమలయ్యేలా చూస్తామన్నారు. గతంలోను ముందస్తు నిర్ణయాలు తీసుకున్నా అమలు కాలేదని ఏపీ అధికారులు గుర్తు చేశారు. విద్యుత్తు ఉత్పత్తికి అనుగుణంగా నీళ్లు ఇస్తామంటే కుదరదని, సాగు,తాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమకు నీళ్లు ఇవ్వాలని ఒక్కోసారి ఒక్కో తరహాలో నీళ్లు ఇవ్వడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇక ముందు ఇబ్బందులు కలగకుండా చూస్తామని బోర్డు పేర్కొంది.

ఆ ప్రాజెక్టులను కృష్ణా నదీ బోర్డు పరిధిలోకి తేవాలి

ఏపీ పునర్విభజన చట్ట ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ తదితర ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి.) పరిధిలోకి తేవాలని, ఏపీలోని గుంటూరు జిల్లాలో ఉన్న నాగార్జునసాగర్ కుడికాలువ ప్రధాన నియంత్రిక నీటి నిర్వహణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించాలని బోర్డు ఛైర్మన్ ఎన్.కె.శ్రీవాస్తవకు కృష్ణా డెల్టాకు చెందిన సాగునీటి సంఘాల సారథులు మంగళవారం విజయవాడలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ జలవనరుల ఎపెక్సు కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో గత ఏడాది కె.ఆర్.ఎం.బి. 9.10 టీఎంసీల నీటిని కేటాయిస్తే.. . తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రా సరిహద్దుకు కేవలం 6 టీఎంసీల నీటిని ఇచ్చిందన్నారు. మిగిలినవి 100 శాతం నీటి నష్టాలుగా చూపిందన్నారు. ఇకపై నీటి ఆవిరి (నష్టాలను) లెక్కించడానికి రెండురాష్ట్రాల ఇంజినీర్లు, నీటి సంఘాల ప్రతినిధులతో సంయుక్త కమిటీని వేయాలని కోరారు.

నంద్యాలలో నేడే పోలింగ్

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: నంద్యాల ఉప ఎన్నికలో ఓటరు తీర్పుపై రాష్ట్రమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. భారీగా ఆర్థిక ప్రలోభాలు.. రూ.కోట్ల అభివృద్ధి పనులు.. రాజకీయ వర్గ వైషమ్యాలు.. ప్రచారాల హోరు.. ఘాటైన విమర్శలు, ప్రతి విమర్శలతో వేడెక్కిన నంద్యాల ఉప ఎన్నిక కీలక ఘట్టానికి చేరింది. బుధవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. తెదేపా, వైకాపా, కాంగ్రెస్‌తో కలిపి మొత్తం 15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నియోజకవర్గం మొత్తాన్ని సమస్యాత్మకంగా భావిస్తుండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 25 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్మాత్మకంగా గుర్తించారు. ఫలితాలు 28న వెల్లడి కానున్నాయి.


భద్రతకు ప్రత్యేక యాప్.. నంద్యాల ఉప ఎన్నికల భద్రతకోసంపోలీసులు అండ్రాయిడ్ యాప్‌ను రూపొందించారు. గుగూల్ ప్లేస్టోర్ నుంచి 'ఈ-మానిటరింగ్ యాప్ ఫర్ నంద్యాల బై ఎలక్షన్' అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వాటికి సంబంధించిన చిత్రాలు, సమాచారాన్ని ఫిర్యాదుల బాక్సుద్వారా తెలియజేయవచ్చు. యాప్ గురించి సందేహాలు ఉంటే ఫోన్‌నం.9966612718కు సంప్రదించవచ్చని పోలీసులు ప్రకటించారు.

జనావాసాల్లో మద్య రక్కసి

ఈనాడు – అమరావతి

నివాస ప్రాంతాల్లోని మద్యం దుకాణాలపై నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పరిష్కార వేదిక నిర్వహించిన అభిప్రాయ సేకరణలో దాదాపు 69 శాతం ప్రజలు ఇలా దుకాణాలు కొనసాగడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రధానంగా నెల్లూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో జనావాసాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు.

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాల తొలగింపునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మీ అభిప్రాయం ఏమిటని మొత్తం 34,214 మందిని ప్రశ్నించగా.. 1916 మంది (6 శాతం) బాగోలేదని, మిగతా 32,298 మంది (94 శాతం) బాగుందని తెలిపారు. బాగోలేదని చెప్పిన వారితో పాటు అదనంగా మరో 256 మందిని కలిపి మొత్తం 2172 మంది నుంచి ఎందుకు బాగోలేదని అభిప్రాయం సేకరించారు. ఇందులో 1504 మంది మద్యం దుకాణాలు ఇంకా నివాస ప్రాంతాల్లోనే ఉన్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడచూసినా నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయని చెప్పిన వారి సంఖ్య 65 శాతానికిపైనే ఉంది.



సర్వేలో పాల్గొన్న వారి అభిప్రాయాలు

- అభిప్రాయాలు చెప్పిన వారి సంఖ్య: **2172 మంది**
- నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయని చెప్పిన వారు: **1509 మంది**
- నాయకుల అండదండలతోనే ఇవి కొనసాగుతున్నాయని చెప్పిన వారు: **220 మంది**
- అధికారుల అలసత్వంతో అని చెప్పిన వారు: **100 మంది**
- ప్రభుత్వ నిర్ణయాన్ని అమలుపరచడంలో లోపాలున్నాయని చెప్పిన వారు: **348 మంది**

నాయకుల అండదండలతోనే.. నాయకుల అండదండలతోనే నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయని అభిప్రాయపడిన వారు పది శాతం ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలుపరచడంలో లోపాల వల్ల ఇవి కొనసాగుతున్నాయని 16 శాతం, అధికారుల అలసత్వం కారణమని ఐదు శాతం మంది వివరించారు. వీటికి సంబంధించిన వివరాలను పరిష్కారవేదిక నుంచి ఎక్సైజ్ శాఖ అందుకుని లోపాలను అధిగమించడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జులైలో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకూ నివాస ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుపై నిరసనలు వ్యక్తమైన వాటికి సంబంధించి 194 మద్యం దుకాణాలు, బార్లను జనావాసాలు లేని ప్రాంతాలకు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలవారీగా నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయని చెప్పిన వారి వివరాలు

జిల్లాపేరు	అభిప్రాయాలు చెప్పినవారు	నివాస ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని చెప్పినవారు	వారి శాతం
అనంతపురం	165	111	67 శాతం
చిత్తూరు	175	121	69 శాతం
తూర్పుగోదావరి	194	141	73 శాతం
గుంటూరు	168	115	68 శాతం
కడప	125	85	68 శాతం
కృష్ణా	185	123	66 శాతం
కర్నూలు	157	100	64 శాతం
నెల్లూరు	120	91	76 శాతం
ప్రకాశం	135	97	72 శాతం
శ్రీకాకుళం	153	99	65 శాతం
విశాఖపట్నం	218	146	67 శాతం
విజయనగరం	119	82	69 శాతం
పశ్చిమగోదావరి	258	193	75 శాతం
మొత్తం	2172	1504	69 శాతం

గ్రహం అనుగ్రహం

23–8–2017 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
విదియ: రా. 9-58 తదుపరి తదియ
పుబ్బ నక్షత్రం: మ. 3-54 తదుపరి ఉత్తర
అమృతఘడియలు: ఉ. 9-34 నుంచి 11-09 వరకు
వర్జ్యం: రా. 11-07 నుంచి 12-44 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-38 నుంచి 12-29 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-47; సూర్యాస్తమయం: సా.6-19
బలరామ జయంతి

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	23.1	32.9
తిరుపతి	24.0	34.4
గుంటూరు	24.0	36.0
కర్నూలు	24.8	34.0
అనంతపురం	25.0	34.8
విజయవాడ	25.2	35.4
ఒంగోలు	25.3	36.9
నరసాపురం	25.8	31.0
కడప	26.0	33.0
రాజమహేంద్రవరం	26.0	35.5
శ్రీకాకుళం	26.5	35.0
విశాఖపట్నం	26.8	35.2
తాడేపల్లిగూడెం	27.0	28.0
సూర్యాపేట	28.0	33.0
నెల్లూరు	28.0	34.0

దక్షిణాది విద్యుత్ బంధం

- పరస్పర సహకారానికి రాష్ట్రాల అంగీకారం
- పవర్ ఎక్స్ఛేంజీ జోక్యానికి చెల్లుచీటి
- ఎప్పుడంటే అప్పుడు ఇరుగుపొరుగు నుంచి తీసుకోవచ్చు
- దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ సమావేశంలో నిర్ణయం
- త్వరలో విధివిధానాల రూపకల్పన

ఈనాడు – హైదరాబాద్

దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ బంధం కుదిరింది. పరస్పరం విద్యుత్‌ను ఇచ్చి పుచ్చుకునేందుకు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. దక్షిణ భారతదేశంలోని ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరం ఉన్నా వెంటనే పక్క రాష్ట్రాల నుంచి పొందేందుకు నిర్ణయించారు. ఈ విధానం అమల్లోకి వస్తే పవర్ ఎక్స్ఛేంజీ జోక్యం లేకుండా సత్వరమే ఇరుగు పొరుగు రాష్ట్రాలు విద్యుత్‌ను ఇచ్చి పుచ్చుకోవచ్చు. త్వరలో దీనిపై ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) అధ్యక్షుడు, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌రావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో కమిటీ రెండురోజుల సమావేశం మంగళవారం ముగిసింది. దీనికి సభ్యకార్యదర్శి ఎస్.ఆర్. భట్, కేరళ విద్యుత్ బోర్డు, కర్ణాటక, ఏపీ, తమిళనాడు ట్రాన్స్‌కోల సీఎండీలు ఇలంగోవన్, జావేద్ అక్తర్, విజయానంద్, షణ్ముగం, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో డైరెక్టర్లు నర్సింగ్‌రావు, జగత్‌రెడ్డి, సచ్చిదానందం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుత విధానంలో పవర్ ఎక్స్ఛేంజీ ద్వారా విద్యుత్ కొనుగోళ్లు జరగాలి. దీని వల్ల క్రయవిక్రయాల్లో జాప్యం జరుగుతోంది. ఒక రోజు ముందుగానే సమాచారమివ్వాలి. ఒకరోజు ముందే అంచనా వేయడం వాస్తవ పరిస్థితికి తగ్గట్లుగా ఉండటం లేదు. ఈ సమస్యల పరిష్కారానికి వీలుగా కొత్త విధానం తేవాలని నిర్ణయించారు.

ఇదీ కొత్త విధానం

మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాల నుంచి విద్యుత్ అవసరమైన రాష్ట్రాలు పొందవచ్చు. విద్యుత్, ఉత్పత్తి, పంపిణీ సరఫరా అంశాల్లో సహకరించుకోవాలి. దీనివల్ల ఎప్పుడు కావాలంటే అప్పుడు విద్యుత్‌ను కేవలం గంట వ్యవధిలోనే పక్క రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలు పొందవచ్చు. క్రయవిక్రయాల కోసం ప్రతిసారి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం లేదు. ఈ విధానం వల్ల ఏ రోజు డిమాండ్‌ను ఆ రోజే అంచనా వేసి విద్యుత్ పొందడమో, అందించడమో చేయవచ్చు. దీని వల్ల మిగులు విద్యుత్ రాష్ట్రాలకు, లోటు రాష్ట్రాలకు మేలు కలుగుతుంది. ఎవరికి విద్యుత్ కావాలన్నా, ఎవరు విద్యుత్ పొందాలన్నా సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్‌కు సమాచారమివ్వాలి. దక్షిణాది రాష్ట్రాలు ఈ సెంటర్ ద్వారానే విద్యుత్‌ను ఇచ్చి పుచ్చుకుంటాయి. ఈ ముసాయిదాను సభ్యరాష్ట్రాలు రెండు రోజుల పాటు చర్చించాయి. దీనిపై విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించాయి.

ప్రైవేటుగా చదివిన వాళ్లకే స్థానిక ధ్రువీకరణ

రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: పదో తరగతి వరకూ ప్రైవేటుగా చదువుకున్న వాళ్లకు స్థానిక ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తుదారు స్వీయ ప్రకటన ఇస్తే అందుకు అనుగుణంగా స్థానిక ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ధ్రువీకరణ జారీకి సంబంధించిన మార్గదర్శకాలను భూపరిపాలన ప్రధాన కమిషనర్ రూపొందించి రెవెన్యూ యంత్రాంగానికి త్వరలో ఇవ్వనున్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి స్థానికత ధ్రువీకరణ విషయంలో నెలకొన్న గందరగోళంపై ఏపీపీఎస్సీ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాసింది. నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఎక్కడ చదువుకొంటే ఆ జిల్లా/జోన్‌నే స్థానికతకు ప్రామాణికంగా తీసుకొంటారు. వారి నివాసాన్ని ధ్రువీకరిస్తూ రెవెన్యూ శాఖ పత్రం ఇచ్చేది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ప్రతులు జత చేస్తే నివాస ధ్రువీకరణ అవసరం లేదని ఇటీవల నిర్ణయించారు. పాఠశాలలో ఇచ్చే స్టడీ ధ్రువీకరణ పత్రాలూ ఇందుకు ఆధారంగా ఉంటున్నాయి. అయితే రెగ్యులర్‌గా విద్యాభ్యాసం లేకుండా ప్రైవేట్‌గా చదివినవాళ్లకు ధ్రువీకరణలో సమస్యలు వస్తున్నాయి. ఈ అంశంపైనే ఏపీపీఎస్సీ స్పష్టత కోరింది. తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో ప్రైవేటుగా చదువుకొన్నవాళ్లకు ఊరట కలుగుతుంది.

కార్తి చిదంబరానికి హైకోర్టులో చుక్కెదురు

చెన్నై, న్యూస్‌టుడే: అవినీతి ఆరోపణల కేసులో విచారణకు హాజరు కావాలని సీబీఐ పంపిన సమన్లను సవాలు చేసిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తి చిదంబరానికి మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. ఈ విషయమై దిల్లీ హైకోర్టును సంప్రదించాలని మద్రాసు హైకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఎన్ఎక్స్ అనే సంస్థ విదేశీ పెట్టుబడుల అభివృద్ధి బోర్డు నిబంధనలను ఉల్లంఘించగా...దానిపై చర్యలు తీసుకోకుండా బోర్డును కార్తి ప్రభావితం చేశారని, ఇందుకు ముడుపులు స్వీకరించారని ఆయనపై ప్రధానమైన ఆరోపణ ఉంది. దీనిపై విచారణకు సీబీఐ సమన్లు పంపగా వాటిని మద్రాసు హైకోర్టులో కార్తి సవాలు చేశారు. ఈ కేసులో కోర్టు ప్రాదేశిక న్యాయపరిధిని దృష్టిలో పెట్టుకుని ఇతర కక్షిదారులు వెలిబుచ్చే విరుద్ధమైన అభిప్రాయాలను విచారించేందుకు దిల్లీ హైకోర్టుకే సంబంధిత పత్రాలు పంపాలని జస్టిస్ వేణుగోపాల్ ఆదేశించారు.

నవంబరు ఒకటి నుంచి రేషన్ డీలర్ల బంద్‌కు పిలుపు

- దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండాలని డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబరు ఒకటి నుంచి అన్ని రాష్ట్రాల్లోని చౌక ధరల దుకాణాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆల్ ఇండియా ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ ఫెడరేషన్, ది తెలంగాణ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. ఇందుకు రాష్ట్రంలోని డీలర్లను ఏకతాటిపైకి తెచ్చేందుకు మంగళవారం ఖైరతాబాద్‌లోని వాసవీ సేవా కేంద్రంలో సమావేశమయ్యారు. సమావేశ నిర్ణయాలను ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు విలేకర్లకు వెల్లడించారు. ఈ-పోస్ విధానం అమలు చేస్తే అదనపు సౌకర్యాలు కల్పించాలని నిబంధన ఉందని, దాన్ని అమలులోకి తెచ్చి 18 నెలలవుతున్నా ఎలాంటి సదుపాయం కల్పించ లేదన్నారు. నగరాల్లో దుకాణ నిర్వహణకు నెలకు రూ.14వేల దాకా ఖర్చవుతుండగా ఒక్కో బ్యాగుపై రూ.16, లీటరు కిరోసిన్‌పై 25పైసలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు మహ్మద్ అజీజుద్దీన్, జాతీయ ఉపాధ్యక్షులు కాశం కృష్ణమూర్తి, వివిధ జిల్లాల అధ్యక్షులు మాట్లాడారు.



కర్నూలు జిల్లా గని, శకునాల వద్ద ఏర్పాటుచేసిన అల్ట్రా మెగా సోలార్ విద్యుత్తు ప్రాజెక్టు ఇది. 5500 వందల ఎకరాల్లో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. 2016లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు 90 శాతం పైగా పూర్తింది. ప్రస్తుతం 9 వందల మెగావాట్లపైగా ఉత్పత్తి జరుగుతోంది. వేయి మెగావాట్లతో ఏర్పాటైన దేశంలోని పెద్ద ప్రాజెక్టులో ఇదొకటి. ప్రాజెక్టు పూర్తి రూపు సంతరించుకోవడంతో బీడు భూములన్నీ ఇలా సౌరఫలకాలతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. – ఈనాడు, అమరావతి

25 ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయాలి: పితాని

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు 25 ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయాలని కార్మిక మంత్రి పితాని సత్యనారాయణ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నీరబ్‌కుమార్‌ప్రసాద్, వరప్రసాద్‌లతో కలిసి ఆయన కేంద్ర కార్మికశాఖ కార్యదర్శి సత్యవతితో భేటీ అయ్యారు. ఇప్పటికే ఉన్న 19 డిస్పెన్సరీలను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం పితాని మీడియాతో మాట్లాడారు. "అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని కోరాం. తిరుపతిలో 30 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పెంచడానికి కేంద్రం అంగీకరించింది. విశాఖలో 500 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సుముఖంగా ఉంది" అన్నారు.



ఐఐసీటీ శాస్త్రవేత్తలకు 'నైనా సక్సేనా ఎక్సలెన్స్' అవార్డు

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక పురస్కారం హైదరాబాద్ ఐఐసీటీ శాస్త్రవేత్తల బృందానికి దక్కింది. సామాజిక సంక్షేమం, పారిశ్రామిక పురోగతి కోసం మెంబ్రేన్ టెక్నాలజీని వృద్ధి చేయడంలో చేసిన కృషికి ఖరగ్‌పూర్ ఐఐటీ 'నైనాసక్సేనా ఎక్సలెన్స్ ఇన్ టెక్నాలజీ అవార్డు-2017' పేరిట ఈ పురస్కారాన్ని అందజేసింది. ఐఐసీటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగ ముఖ్య శాస్త్రవేత్త ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో పావని వాద్యా, సిద్ధార్థ మౌలిక్, డా.వై.వి.ఎల్.రవికుమార్, బి.గోవర్ధన్, ఎస్.ఎస్.చంద్రశేఖర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఖరగ్‌పూర్ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి విభాగం ప్రతినిధి కేవల్ శర్మ వారికి అవార్డు అందజేశారు.

అమరావతిలో 6 వరుసల రహదారులు

- విస్తరణకు టెండర్లు పిలిచిన ఏడీసీ

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలో ప్రధాన రహదారులన్నింటినీ ఆరు వరుసలతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాజధాని అభివృద్ధి సంస్థ (ఏడీసీ) తాజాగా టెండర్లు పిలిచింది. ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు) మినహా. . మరో 10 ప్రధాన రహదారుల నిర్మాణానికి ఏడీసీ గతంలోనే టెండర్లు పిలిచింది. వీటిలో ఎన్9, ఈ8 రహదారులను ఆరు వరుసలుగా నిర్మిస్తుండగా, మిగతా రహదారుల్ని నాలుగు వరుసలుగా నిర్మించేందుకే అప్పట్లో టెండర్లు పిలిచారు. వీటిలో ఏడు రహదారుల పనులు ప్రారంభమయ్యాయి. ఈ6, ఈ12, ఎన్11 రహదారుల పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఈ దశలో మిగతా 8 రహదారుల్ని ఆరు వరుసలుగా విస్తరించడంతో పాటు, పది రహదారుల వెంబడి ప్రధాన మౌలిక వసతుల కల్పనకు ఏడీసీ మంగళవారం టెండర్లు ఆహ్వానించింది. 10 రహదారుల్ని మూడు ప్యాకేజీలుగా విభజించింది. మొత్తం పనుల విలువ రూ.1520.28 కోట్లు. ఈపీసీ విధానంలో పనులు చేపట్టనున్నారు.

చేపట్టే పనులు ఇవీ

రహదారుల నిర్మాణంతో పాటు వర్షం నీటి పారుదల కాలువలు, తాగునీటి సరఫరా నెట్‌వర్క్, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్, కమ్యూనికేషన్ కేబుళ్లు వెళ్లడానికి డక్ట్‌లు, పునర్వినియోగ నీటి సరఫరా పైప్‌లైన్లు, నడకదారులు, సైకిల్ ట్రాక్‌లు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం, స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటు వంటి పనులన్నీ చేపట్టాల్సి ఉంటుంది.

ఈ10, ఈ14, ఎన్16 రహదారుల్ని ఒక ప్యాకేజీగా (రూ.435.20 కోట్లు); ఎన్9, ఎన్4, ఎన్14 రహదారుల్ని ఒక ప్యాకేజీగా (రూ.570.80 కోట్లు); ఈ6, ఈ8, ఈ12, ఎన్11 రహదారుల్ని ఒక ప్యాకేజీగా (రూ.514.28 కోట్లు) టెండర్లు పిలిచారు. బిడ్‌లు దాఖలు చేయడానికి సెప్టెంబరు 11 వరకు గడువిచ్చారు. పనులు అప్పగించిన సంవత్సరంలోగా పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇక వారాంతాన ఆనంద లహరి

- నగరాలు, పట్టణాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి సమీక్షలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రజల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఆనంద లహరి పేరుతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ఈ కార్యక్రమాలు తోడ్పడేలా ఉండాలని భావిస్తోంది. సామాజిక రుగ్మతలైన వరకట్నం, బాల్యవివాహం, లింగ వివక్ష, మత్తు పదార్థాలు, కుల వివక్షలాంటి వాటిని రూపుమాపేందుకు దోహదపడేలా కార్యక్రమాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సాంస్కృతిక శాఖ అధికారులకు సూచించారు. సాంస్కృతిక శాఖ కార్యక్రమాలపై మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. విజయవాడ సత్యనారాయణపురంలో రూ.పది కోట్ల అంచనా వ్యయంతో కళాభవన్ పేరిట సాంస్కృతిక శాఖ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని 110 పురపాలక పట్టణాలు, నగరాల్లో ప్రతీ వారాంతంలో 4గంటలపాటు ఆనంద లహరి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. వృత్తి కళాకారులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీల నిర్వహణతోపాటు అక్కడే హస్తకళల ప్రదర్శనలు, ఆహారకేంద్రాలు ఏర్పాటుచేయాలని భావించారు. థియేటర్, డ్రామా, స్టేజీ ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, రచయితలతో సదస్సులు, సంగీతం. చిత్రలేఖనాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

వెలగపూడిలో తరచూ ఆహారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 30రకాల సంప్రదాయ ఆంధ్ర రుచులను ఈ ఉత్సవాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అలాగే వచ్చే నెలలో వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో భారీ స్థాయిలో ఆహారోత్సవాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చెన్నై-బెంగళూరు కారిడార్‌పై నేడు కేంద్రంతో ఒప్పందం!

ఈనాడు, అమరావతి: చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిపై కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం దిల్లీలో కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వాటాదారుల ఒప్పందం, రాష్ట్ర సహకారంపై ఒప్పందాలు కుదిరే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఈ ఒప్పందాల ముసాయిదా పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖకు పంపింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండీ ఏ.బాబు ఈ ఒప్పందంపై ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంతకాలు చేయనున్నారు. సంతకాల ప్రక్రియ పూర్తయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి మొదటి విడత పనుల కోసం కేంద్రం నుంచి రూ.3వేల కోట్ల గ్రాంటు రానుంది. ఈ కారిడార్ మొదటి దశ పనుల్లో భాగంగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఒక కేంద్రాన్ని (నోడ్) అభివృద్ధి చేస్తారు.

ఈనాడు

సంకెళ్లను తెంచిన తీర్పు

'షరియత్ న్యాయం పక్రీకరణకు గురైంది... ముమ్మారు తలాక్ పద్ధతి ఇస్లాం మౌలికాంశాలకు దూరంగా ఉంది... ప్రాచీనకాలంలో అరేబియా ప్రాంతంలో ఆడ శిశువుల్ని సజీవంగా పాతిపెట్టే ఆచారాన్ని తలపించే విధంగా ఈ అనాచారం కొనసాగుతోంది'- అఖిల భారత ముస్లిం మహిళా పర్సనల్ లా బోర్డు తరఫున ఇస్లామిక్ మేధావి, కేంద్ర మాజీ మంత్రి ఆరిఫ్ మహ్మద్ ఖాన్ సర్వోన్నత న్యాయస్థానంలో వినిపించిన వాదన అది. దేశ జనాభాలో దాదాపు ఎనిమిది శాతంగా ఉన్న ముస్లిం మహిళల సమానత్వ హక్కుల కోసం ఎలుగెత్తిన వివిధ వర్గాల ఆందోళన పట్ల సానుకూలంగా స్పందిస్తూ- ముమ్మారు తలాక్ పద్ధతి రాజ్యాంగబద్ధం కాదని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మెజారిటీ తీర్పునిచ్చింది. ముస్లిం సమాజంలో మహిళల అణచివేతకు, వారి ప్రాథమిక హక్కుల నిరాకరణకు కారణమవుతున్న 'తలాక్'పై న్యాయసమీక్ష జరగాల్సిందేనంటూ స్పష్టమైన వైఖరితో పదునైన వాదనలు వినిపించిన మోదీ ప్రభుత్వానికి లభించిన అపురూప విజయమిది! 'తలాక్'ను తిరస్కరించే సౌలభ్యం ముస్లిం మహిళలకు కల్పించగలరా' అంటూ విచారణ సందర్భంగా ఆరా తీసిన ధర్మాసనం- ముమ్మారు తలాక్ హీనమైన పద్ధతి అని మొన్న మే నెల రెండో వారంలో ఈసడించడం తెలిసిందే. రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన మూడు వేరు వేరు తీర్పుల్లో తలాక్‌కు చాపచుట్టేయాలన్నది మెజారిటీ నిర్ణయమైనా, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కలిసి చీఫ్ జస్టిస్ ఖేహర్ ఇచ్చిన మైనారిటీ తీర్పు ద్వారా వినిపించిన భిన్నగళమే! తలాక్‌పై తను చట్ట రూపకల్పనకు సమకట్టాలంటూ రాజ్యాంగంలోని 142 అధికరణ కింద కేంద్రప్రభుత్వాన్ని మైనారిటీ తీర్పు నిర్దేశించింది. షరియత్‌ను వైయక్తిక చట్టం(పర్సనల్ లా)గా ప్రకటించినందున, పవిత్ర ఖురాన్ ప్రకారం తప్పు అయినది చట్టపరంగా సక్రమం ఎలా అవుతుందంటూ తలాక్‌ను మెజారిటీ తీర్పు తోసిపుచ్చడంతో- దశాబ్దాల ఛాందసవాద శృంఖలాలు తెగిపడ్డాయి. బాధిత మహిళాలోకానికి దక్కిన గొప్ప సాంత్వన ఇది!

ఒక హిందూ వారసత్వ వ్యాజ్య విచారణ సందర్భంగా- విడాకుల కేసుల్లో ముస్లిం మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారా... అన్న అంశాన్ని పరిశీలించేందుకు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు 2015 అక్టోబరులో భారత ప్రధాన న్యాయమూర్తికి సూచించింది. ముమ్మారు తలాక్ ఉచ్చారణ, నిఖా హలాలా, బహుభార్యాత్వాలను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణకు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చెయ్యాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఆయా అంశాలు న్యాయవ్యవస్థ పరిధిలోకి రావని, విచారణకు స్వీకరించవద్దని పర్సనల్ లా బోర్డు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన న్యాయపాలిక- అయిదుగురు భిన్న మతస్థులతో ధర్మాసనాన్ని కొలువుదీర్చి, రోజువారీ విచారణతో వేసవి సెలవుల్లోనే తుది తీర్పునకు పూర్వరంగం సిద్ధం చేసింది. రాజ్యాంగ మౌలిక భావనలైన స్త్రీ పురుష సమానత్వం, లౌకికవాదంతోపాటు మతాచారాలు, ఇస్లామిక్ దేశాల్లోని వివాహ చట్టాల ఆధారంగా న్యాయనిర్ణయం జరగాలని న్యాయమంత్రిత్వ శాఖ ప్రమాణపత్రం సమర్పించింది. తలాక్ తరహా అంశాలు పవిత్ర ఖురాన్ నుంచి పుట్టినవైనందున న్యాయపరిధిలోకి రావంటూ కోర్టులో వాదించిన పర్సనల్ లా బోర్డు- కారణాల్లేకుండా ముమ్మారు తలాక్‌తో భార్యలకు విడాకులిచ్చేవారిని సామాజికంగా బహిష్కరించాలని మొన్న ఏప్రిల్‌లో తీర్మానించింది. షరియా నిర్దేశిత పద్ధతుల్ని అడ్డగోలుగా ఉల్లంఘించి 'వాట్సప్' లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానూ తలాక్ చెబుతున్న ధోరణులు పెరిగిపోతున్నాయి. వాటిని పర్సనల్ లా బోర్డు సైతం సమర్థిస్తున్న నేపథ్యంలో- 92 శాతం ముస్లిం మహిళలు తలాక్ పద్ధతి పోవాలని కోరుతున్నట్లు 'భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్' అధ్యయనం వెల్లడించింది. పిడివాదాలను తిరస్కరించి సమానత్వ హక్కులకు మన్నన దక్కించిన విశిష్ట తీర్పుగా దాన్ని స్వాగతించాలి!

బహుభార్యాత్వాన్ని నిషేధించిన ప్రతిచోటా అక్రమ సంబంధాల జోరు పెరిగిందని, తలాక్ తరహాలో అనాయాసంగా భార్యను వదిలించుకునే వీలులేకపోతే, హత్యలతో వాళ్లను తుదముట్టించే ప్రమాదమూ ఉందని ముస్లిం పర్సనల్ లా బోర్డు సుప్రీంకోర్టుకు ప్రమాణపత్రం సమర్పించింది. అనాగరిక ఆలోచనా ధోరణికి పరాకాష్ఠ అది! ఉన్నపళంగా భర్త వదిలేసిన ముస్లిం మహిళల వేదన ఎంత దుర్భరమో న్యాయకోవిదుడు జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ 1971లో ఇచ్చిన తీర్పు కళ్లకు కడుతుంది. దరిమిలా పద్నాలుగేళ్లకు షాబానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పునకు గండికొట్టేలా అప్పటి రాజీవ్ ప్రభుత్వం ముస్లిం మహిళల మనోవర్తి చట్టం తెచ్చింది. ఆ మేరకైనా తనకు జీవనభృతి దక్కించుకొనేందుకు దాఖలైన షమీమ్ అరా కేసులో 2002 అక్టోబరులోనే న్యాయపాలిక ఇచ్చిన తీర్పు- అడ్డగోలు తలాక్‌ను రద్దుచేసే సంచలనం సృష్టించింది. 141 అధికరణ అనుసారం షమీమ్ అరా తీర్పునకే దేశంలో చట్ట ప్రామాణికత ఉండటంతో జస్టిస్ కురియన్ జోసెఫ్ చేసిన న్యాయనిర్ణయం నేడు బాధిత జనావళి నెత్తిన పాలుపోసింది. ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంకలతోపాటు ఇండొనేసియా, ఈజిప్ట్, ఇరాన్, టర్కీ, మొరాకో వంటి ముస్లిం దేశాలన్నీ తలాక్ తరహా అనాగరికత లేకుండా మతాచారాల్ని మానవీయంగా సంస్కరించుకొన్నాయి. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు దరిమిలా, ఇండియాలోనూ జరగాల్సింది అదే. తాము చట్టం చేయాలంటే, రాజ్యాంగబద్ధంకాని తలాక్ పద్ధతిని కొట్టేయాలని 'సుప్రీం'కు నివేదించిన కేంద్రం- ప్రగతిశీల ముస్లిం మేధావుల తోడ్పాటుతో వైయక్తిక శాసనాల ప్రక్షాళనకు సత్వరం నడుం కట్టాల్సిందే!


'ఉద్దాన' పతనాల ప్రజారోగ్యం!

రెండు తెలుగు రాష్ట్రాల్లో కొన్ని మండలాల్లో మూత్రపిండాల వ్యాధులు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దానం, తెలంగాణలో లొద్దిగూడ ప్రాంతాల్లో మూత్రపిండాల వ్యాధులు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. అందమైన ఉద్యానవనం అనే అర్థం వచ్చే ఉత్తరాంధ్ర శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం పేరు రెండు దశాబ్దాలుగా విషాదభరిత వార్తల నడుమ నలుగుతూనే ఉంది. మూత్రపిండాల వ్యాధి మరణ మృదంగానికి మౌన సాక్షిగా ఆ ప్రాంతం మిగిలిపోయింది. పచ్చటి పంట పొలాలు, కొబ్బరి, జీడిమామిడి తోటలతో విరాజిల్లే ఉద్దానం పరిసర మండలాల్లో ఇంటికి కనీసం ఒక్కరైనా అంతుపట్టని మూత్రపిండాల వ్యాధితో మంచంపట్టి ఉండటం చూపరులను కలచివేస్తోంది. మొదటి కేసు నమోదై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇంత వరకు వ్యాధిమూలాలు అంతు చిక్కడంలేదు. ఉద్దాన ప్రాంతంలోని ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మందస, సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల్లోని సుమారు 120 గ్రామాల్లో ఈ కిడ్నీ వ్యాధి అధికంగా ఉంది. జాతీయస్థాయి తీవ్రత సగటున ఏడు శాతం ఉంటే, ఉద్దాన ప్రాంతంలో అధికారిక గణాంకాల ప్రకారం అది 30 శాతం. అనధికారికంగా 40-50 శాతం వరకు ఉంది!


ఏళ్ల తరబడి ఉదాసీనత

ఉద్దాన ప్రాంతంలో నివసించే గిరిజన, వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన ప్రతి ముగ్గురిలో ఒకరు మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత తీవ్రంగా మూత్రపిండాల వ్యాధులు అధికంగా ప్రబలిన దేశాల్లో మధ్యఅమెరికాలోని నికరగువా, ఎల్‌సాల్వెడార్ దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఉత్తర శ్రీలంక రెండోస్థానంలో ఉంది. మూడోస్థానం ఉద్దానానిదే అనడం అతిశయోక్తి కాదు. 2013లో హాంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ మూత్రపిండాల వ్యాధి నిపుణుల సదస్సులో ఈ వ్యాధిని 'ఉద్దానం నెఫ్రోపతి' అనే ప్రత్యేకమైన జబ్బుగా గుర్తించారు. 2015నాటి అంచనాల ప్రకారం పదేళ్ల వ్యవధిలో ఉద్దానంలో 34 వేలమంది మూత్రపిండ వ్యాధుల బారిన పడ్డారు. వీరిలో దాదాపు 4,500 మంది మరణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కిడ్నీ రోగుల్లో 70 శాతం ఉద్దాన ప్రాంతంవారే. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం, నెల్లూరు జిల్లాలోనూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ వ్యాధి ప్రాబల్యం అధికంగా ఉంది. తెలంగాణలోని నల్గొండ జిల్లాలో వందల గ్రామాలు ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్నాయి. ఇటీవల నిమ్స్ వైద్యబృందం నిర్వహించిన పరిశోధనల్లో ఆశ్చర్యకర వాస్తవాలు వెలుగు చూశాయి. కొమురంభీం జిల్లాలోని లింగాపూర్ మండలంలోని లొద్దిగూడ, వంజారీగూడ గిరిజన గ్రామాల్లోని బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధి తీవ్రత 30-35 శాతం వరకు ఉందని నిర్ధారించారు. ప్రతి కుటుంబంలో ఒకరు లేదా ఇద్దరు కిడ్నీల్లో రాళ్లు లేదా మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్నారు. దశాబ్దకాలంగా పదుల సంఖ్యలో మరణాలకు ఈ వ్యాధులే కారణమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని కడికస, గుడిహత్నూర్ మండలంలోని గిరిజ, బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి, లంబాడీగూడ, నాగెపల్లి, దొడ్డిగూడ, మొగవెల్లి, ఇప్పలగూడ, చింతపల్లి గ్రామాల్లో కిడ్నీ వ్యాధి ప్రాబల్యం అధికంగా ఉంది.

ఏమిటీ ఉద్దానం నెఫ్రోపతి?



ప్రత్యేకమైన ఉద్దానం నెఫ్రోపతి వ్యాధి 30-50 వయోపరిమితివారిలో, వ్యవసాయ కూలీలైన గిరిజనుల్లో కనిపిస్తోంది. రక్తపోటు, మధుమేహం లక్షణాలతో ఇది ప్రారంభమవుతుంది. వాస్తవానికి ఆరంభంలో జబ్బు లక్షణాలు కనిపించవు. ఆకలి తగ్గడం, వాంతులు, నీరసం, మొహం కాళ్ల వాపులు, రక్తహీనత లక్షణాలు తొలుత బయటపడతాయి. హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని ఎముకలు, కండరాలు బలహీనపడతాయి. దాంతో రోగి నీరసించిపోతాడు. తీవ్రమైన నొప్పులు తట్టుకోలేక మందులు తీసుకుంటారు. నాటువైద్యులను ఆశ్రయిస్తారు. దీంతో కిడ్నీ జబ్బు ఉధృతమవుతోంది. ఆపై రక్తశుద్ధి (డయాలసిస్) లేదా కిడ్నీ మార్పిడి అవసరమయ్యే దశకు చేరుకుంటున్నారు. ఒక్కోసారి రక్తంలో పొటాషియం ధాతువు అధికమై గుండె లయ తప్పి ఆగిపోయి హఠాన్మరణమూ సంభవించవచ్చు.



-రవి..

కిడ్నీవ్యాధి మరణాలు ఇంకెన్నేళ్లు?

కెరమెరి మండలం, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలు బోలపటార్, ఇంద్రనగర్‌లలోనూ వ్యాధి బాధితులు ఎక్కువగా ఉన్నారన్నది అధికారిక సమాచారం. సిలికా, కాల్షియం కార్బొనేట్ (సుద్ద) అధికంగా ఉన్న నీరు తాగడం కిడ్నీ జబ్బుకు మూలకారణమని నిర్ధారించారు. గిరిజనుల్లోని జన్యుపరమైన అంశాలూ వ్యాధి తీవ్రతకు దోహదం చేస్తున్నాయనీ భావిస్తున్నారు. అయినా రోగులను ఆదుకునే దిశగా దీటైన చర్యలు చేపట్టడం లేదు.

కొబ్బరి, జీడిమామిడి తోటల్లో పనిచేసే యువకులైన వ్యవసాయ కూలీల్లో ఈ జబ్బు అధికంగా కనిపిస్తోంది. ఎక్కువ ఉష్ణోగ్రతల్లో చాలాసేపు పనిచేయడం, నీరు తక్కువగా తీసుకోవడం, ఆహారంలో పురుగు మందుల అవశేషాలు ఉండటం వ్యాధి బారినపడటానికి కారణమని తొలుత భావించారు. సహజ నీటి వనరులు లేకపోవడం వల్ల వంటకు పంపునీరు వాడుతుంటారు. దీనివల్ల భూగర్భ జలాల్లోని భార ఖనిజాలైన కాడ్మియం, పాదరసం (మెర్క్యూరీ) శరీరంలోకి చేరి జబ్బు వస్తున్నట్లు భావించి పరిశోధనలు సాగించారు. 2011లో ఓ పరిశోధన బృందం ఉద్దాన ప్రాంతం నీటిలో ఫీనాల్స్, ఆర్గానో క్లోరిన్ వంటి విషధాతువులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. తాగడానికి, వంటకు ఆ నీరు పనికిరాదని తేల్చారు. భారతీయ వైద్య పరిశోధన మండలి, బాబా అణు పరిశోధన సంస్థ, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం, ఆంధ్రా వైద్యకళాశాల నిపుణులు సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించాయి. తాగునీటిలో సిలికా, స్ట్రాన్షియం వంటి భార ఖనిజాలు అధికంగా ఉన్నట్లు అవి గుర్తించాయి. అయితే కిడ్నీ జబ్బుకు అవి ఎంతవరకు కారణమవుతున్నాయో సాంకేతికంగా నిరూపితం కాలేదు. నిధులు, వైద్య పరికరాలు, నిపుణుల కొరత వల్ల పరిశోధనలు నత్తనడక నడుస్తున్నాయి. తాగునీటి కాలుష్యమే వ్యాధి తీవ్రతకు కారణమనడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. అయినా ఏ ఒక్క మండలంలోనూ రక్షిత తాగునీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయం! సంపాదించేవారు జబ్బునపడితే ఆ కుటుంబసభ్యులు తీవ్ర క్షోభకు గురవుతున్నారు. వారానికి రెండు మూడుసార్లు రక్తశుద్ధి చేయాలి. ఖరీదైన మందులు వాడాలి. రక్తం పెరగడానికి సూది మందు తీసుకోవాలి. దీంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి దారిద్ర్యం బారిన పడుతున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా రక్తశుద్ధి ఉచితంగా చేసినా, డయాలసిస్ యంత్రాలు, కిడ్నీ వ్యాధి నిపుణులు, మెరుగైన వైద్యం అందుబాటులో ఉన్న విశాఖ నగరం దాదాపు 250 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రయాణ ఖర్చులే వారికి తడిసి మోపెడవుతున్నాయి. దీంతో అక్కడి రోగులు స్థానిక వైద్యులనే ఆశ్రయించాల్సి వస్తోంది. సమీప ప్రాంతాల్లో సరైన మూత్రపిండ నిపుణులు, రక్తశుద్ధి యంత్రాలు గల ఆస్పత్రులు లేకపోవడం శాపంగా పరిణమించింది. ప్రాథమిక వైద్యకేంద్రాల్లో డాక్టర్లు, ఇతర సిబ్బంది స్థానికంగా నివాసం ఉండటానికే భయపడుతున్నారు. ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వోద్యోగులు సైతం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోతున్నారు. చివరకు పెళ్లి సంబంధాలూ సమస్యాత్మకమవుతున్నాయి.

సమైక్యంగా సమరం

ఉద్దానం బాధితుల గోడు రెండు దశాబ్దాల సమస్య. మరణాలు అధికమైనప్పుడు కంటితుడుపు చర్యలు రివాజుగా మారాయి. వ్యాధి మూలాల నిర్మూలన దిశగా గట్టి చర్యలు చేపట్టిన దాఖలాలు మాత్రం లేవు. సమీప ప్రాంతాల్లో ఎక్కడా సంబంధిత వైద్యసౌకర్యాలు లేకపోవడమే అసలు శాపం. డయాలసిస్, బయాప్సి (ముక్క పరీక్ష) వంటివాటి కోసం విశాఖ వెళ్లాల్సిందే! మూత్రపిండ మార్పిడి వారికి కలలో మాట. మూత్రపిండ మార్పిడి చికిత్సలు విరివిగా చేయగలిగే నిమ్స్ తరహా ఆస్పత్రి మరొకటి రెండు తెలుగు రాష్ట్రాల్లో లేదన్నది నిష్ఠురసత్యం. ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా మొద్దునిద్ర వీడాలి. సరైన ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన నిధులు కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్దాన ప్రాంతం, తెలంగాణలో కేసులు అధికంగా నమోదవుతున్న మండలాలు, గిరిజన గ్రామాల్లో తరచూ సామూహిక కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తుండాలి. అందుకోసం ప్రాథమిక వైద్య కేంద్రాల్లో రక్త, మూత్ర పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించడానికి అధునాతన యంత్రాలు, సిబ్బందిని సమకూర్చాలి. డయాలసిస్, మూత్రపిండ మార్పిడులపై అపోహలు తొలగించాలి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యాధి బాధితులున్న అన్ని మండలాల్లోని గ్రామాలన్నింటికీ రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలి. మండల కేంద్రాల్లో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ, రక్తశుద్ధి కేంద్రాలు నెలకొల్పాలి. డయాలసిస్ ఉచితంగా చేయడంతోపాటు మందులనూ అందజేయాలి. డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేవారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. యంత్రాలతో రక్తశుద్ధికి (హీమోడయాలసిస్)కి బదులుగా ఇంట్లోనే సులభంగా, పొట్టద్వారా రోగి తనకు తానుగా తేలికగా చేసుకోగల 'పెరిటోనియల్ డయాలసిస్' పద్ధతిని ప్రోత్సహించాలి. దీనికి అవసరమైన సామగ్రి, డయాలసిస్ ద్రావణాలను ప్రభుత్వమే ఉచితంగా రోగులకు అందజేయాలి. సేవాదృక్పథంతో పరిశోధనలు చేయడానికి ముందుకొచ్చే ఔత్సాహిక వైద్యులకు తగిన సౌకర్యాలు కల్పించి ప్రోత్సాహకాలు అందజేయాలి. నిరాటంకంగా పరిశోధనలు కొనసాగించి సమన్వయపరచడానికి ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలి. తరచూ ఆస్పత్రికి రాలేని రోగుల కోసం 'టెలిమెడిసిన్' కేంద్రాల ద్వారా నిపుణులు సూచనలు అందజేయాలి. బాధితులకు ఆరోగ్య, జీవిత బీమా కల్పించాలి. జీవనభృతి కోల్పోయినవారికి పింఛను ఇవ్వాలి. మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రభుత్వ రంగంలో ఉచితంగా నిర్వహించగల ఎయిమ్స్, నిమ్స్ తరహా ఆస్పత్రుల్ని ఉత్తరాంధ్రలో నెలకొల్పాలి. అత్యధిక వ్యయప్రయాసలతో కూడిన చికిత్సలో బాధితులను ఆదుకోవడానికి దాతల సహకారమూ ప్రభుత్వం తీసుకోవాలి. వెబ్‌సైట్ ద్వారా బాధితుల వివరాలు, వ్యాధి దశలను తెలియపరచాలి. వీరికి సాయపడటానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చేవారికి ఆదాయపన్ను మినహాయింపు వంటి ప్రోత్సాహకాలు ప్రకటించాలి. బాధిత ప్రాంతాల్లో పిల్లలకు ఉచిత విద్య అందజేయాలి. రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి పారిశ్రామిక సంస్థలు యథాశక్తి తోడ్పాటు అందజేయాలి. ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక సంస్థలు ఆయా గ్రామాలను దత్తత తీసుకోవాలి. మూత్రపిండాల వ్యాధి ప్రాంతాలపై అందరి దృష్టి పడుతున్న రోజులివి. మానవతా దృక్పథంలో అందరూ కలిసి కృషిచేస్తే సమీప భవిష్యత్తులో మూత్రపిండాల వ్యాధి ఉద్ధృతిని నియంత్రించడం సుసాధ్యమే!

– డాక్టర్ గళ్లా రఘుకిశోర్



ఈదర శ్రీనివాసరెడ్డి

సవాలుగా 'సైబర్' భద్రత

మారుతున్న అవసరాలు, ప్రభుత్వ విధానాల వల్ల- ఇప్పటికే బ్యాంకింగ్, టెలికామ్, ఇంధన, విమానయాన, తదితర రంగాల్లో డిజిటలీకరణ వేగంగా సాగుతోంది. డిజిటల్ అక్షరాస్యత విస్తరణకు అనుగుణంగా స్మార్ట్ ఫోన్లు, వైర్‌లెస్ పరికరాల వాడకం పెరుగుతోంది. అదే వేగంతో డిజిటల్ భద్రతా ప్రమాణాలు అమలుకాక పోవడం వల్ల, దేశ సైబర్ భద్రతపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. సరైన ప్రమాణాల ఆచరణ లేమి, అవగాహనా రాహిత్యం కారణంగా- ఎంతో గోప్యంగా ఉండాల్సిన ఖాతాదారుల వేలిముద్రలు, ఐరిస్ స్కాన్ల వంటివి అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లడం దేశ భద్రతకు ఎంత ప్రమాదమో ఊహించవచ్చు. దేశంలోని కోట్లాది ప్రజలు అంతర్జాలాన్ని వాడుకుంటున్నారు. వారు ఉపయోగిస్తున్న పరికరాలు చాలావరకు ఒకే రకమైనవి. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల కంటే స్మార్ట్‌ఫోన్ల వినియోగమే ఎక్కువ. ఈ చరవాణిల్లోనూ చౌకైనవి, చైనా నుంచి దిగుమతి చేసుకున్నవి అధికం. కొన్ని లక్షల మంది ఇటువంటి ఫోన్లనే వాడటం వల్ల, సాంకేతిక భద్రతా ప్రమాణాల్ని అమలుపరచడమూ సాధ్యం కావడం కాదు. ప్రపంచ డిజిటల్ రంగంలో పైచేయి కోసం అమెరికా, చైనా వంటి దేశాలతో ఇండియా పోటీపడుతోంది. అదే స్థాయిలో ఇక్కడ డిజిటల్ భద్రతా ప్రమాణాలు లేవని చెప్పవచ్చు.

పెద్ద నోట్ల రద్దుతో, వివిధ రంగాల్లో డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. అంతేకాక, సైబర్ నేరాల ప్రభావమూ కనిపిస్తోంది. ఇదే విషయాన్ని ఐఐటీ- కాన్పూర్ విద్యావేత్తలు ఇటీవల పార్లమెంటరీ స్థాయీ సంఘం ముందు ప్రవేశపెట్టిన 'సైబర్ భద్రత నివేదిక'లో స్పష్టీకరించారు. ముఖ్యంగా ఆర్థిక రంగంపై సైబర్ నేరాల ప్రభావం అధికంగా ఉంది. అవి బ్యాంకింగ్ రంగానికి సవాళ్లు విసరుతున్నాయి. సైబర్ నేరాలపై కేసులు 2013లో 71,780; 2014లో 1,49,254 నమోదయ్యాయి. అవి 2015లో మూడు లక్షలకు పైమాటే! వివిధ బ్యాంకులకు చెందిన 40,000 సర్వర్‌లను, వాటి పాస్‌వర్డ్‌లను, పెద్దపెద్ద నగరాల్లోని కొన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు సంబంధించిన సమాచారాన్ని కొన్ని 'సంస్థలు' తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు వెల్లడైంది. నేటికీ 'జాతీయ సమాచార కేంద్రం' పలు ప్రభుత్వాలకు చెందిన మెయిల్ సర్వర్లకు సరైన భద్రతా ప్రమాణాలు కల్పించలేకపోతోంది. దాడుల్ని సమర్థంగా ఎదుర్కొనడం ద్వారా సైబర్ భద్రత పెంచడానికి 'సెర్ట్' పేరిట అత్యవసర కంప్యూటర్ ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటుచేశారు. అది 2015లో అనేక సంఘటనలపై స్పందించినా, ఆ ఏడాది నమోదైన కేసుల్లో అవి కేవలం 10 శాతమే. దీనికి ముఖ్య కారణం- ఆ సంస్థ వద్ద తగినంతగా నిపుణులు లేకపోవడం! ఇండియా సహా 150 దేశాల్లో పెద్దయెత్తున సైబర్ దాడులతో భయపెట్టిన



రక్షణ కవచం తక్షణావసరం

'వాన్నా క్రై' అనే రాన్‌సమ్ వేర్ ప్రపంచ వ్యాప్తంగా గల విండోస్ కంప్యూటర్లకు పాకి, వాటిలోని ఫైళ్లు పనిచేయని స్థితి కలిగించింది. స్పెయిన్‌లోని ఫోన్ సంబంధిత సంస్థలు, యూకేకు చెందిన వైద్యశాలలు, అమెరికాకు సంబంధించిన బ్యాంకులూ సైబర్ దాడుల బాధిత సంస్థలే! కంప్యూటర్ నెట్‌వర్క్‌కు అటువంటి అంతరాయం కలగడాన్ని పెద్ద సైబర్ దాడిగా వర్ణించవచ్చు. హానికరమైన కోడ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా కంప్యూటర్లు దెబ్బతిన్నాయి. మనదేశంలోని నెట్‌వర్క్‌ను ఎవరైనా సులువుగా దెబ్బతీసే అవకాశాలు ఎక్కువ. దానికి ముఖ్య కారణం- పాతబడిన కంప్యూటర్లు, లైసెన్సు లేని సాఫ్ట్‌వేర్లను కొన్ని సంస్థలు ఎక్కువగా ఉపయోగించడమే! వినియోగదారులకు తెలియకుండానే హాని కారక వైరస్‌లు వాటిలోకి ప్రవేశించే అవకాశాలు అనేకం.

దేశంలో 'సెర్ట్'తో పాటు- జాతీయ సాంకేతిక పరిశోధన; సమాచార సంస్థలు; వాటిని నియంత్రించే రక్షణ, ఐటీ వంటి శాఖలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తమవుతున్నాయి. తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఆ సంస్థలన్నీ సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే, మరింత సమర్థంగా నేరాల్ని అరికట్టవచ్చు. దీని కోసం జాతీయ సైబర్ భద్రతా విభాగాన్ని తక్షణం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న సైబర్ భద్రతా విధానాలు 2013లో సంబంధిత శాఖలు రూపొందించినవి. వీటిలో కేవలం ప్రాథమిక సూత్రాలు వివరించారు. కాలంతో పాటు అత్యంత వేగంగా సైబర్ నేరాల స్వరూపమూ మారుతోంది కాబట్టి, మన విధానాల్ని ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. కొన్ని సైబర్ నేరాలకు కంప్యూటర్ రంగంలో వస్తున్న వివిధ సాంకేతిక పరిణామాలు కారణమవుతున్నాయి. నిపుణులు భద్రతా ప్రమాణాలపై దృష్టి కేంద్రీకరించాలి. 2000 సంవత్సరంలో రూపొందిన ఐటీ చట్టంలో కొంతవరకు సైబర్ నేరాల గురించి వివరించినా, వ్యవస్థలోని లొసుగుల్ని అది గ్రహించలేకపోతోంది. ఆ రోజుల్లో ఇంతటి మార్పులను, స్మార్ట్ ఫోన్ల వినియోగాన్ని, అంతర్జాతీయ డాటా ప్రవాహాన్ని ఊహించి ఉండరు. ప్రస్తుతం సాగుతున్న సైబర్ దాడులు 17 ఏళ్లనాటి ఐటీ చట్టంలోని నిబంధనలకు సంబంధించి, ఏదో ఒక నేరం కిందకు వస్తున్నాయి. అందువల్ల పరిస్థితులకు అనుగుణంగా అదనపు నిబంధనల రూపకల్పన చేయాల్సి ఉంటుంది. మనదేశ సైబర్ ఆయుధాలకు పదును పెట్టాలి. అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలి. 'సెర్ట్' ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన 148 సంస్థల్లోని భద్రతా లోపాలపై నివేదిక సమర్పించింది. దేశం మొత్తానికీ సైబర్ రక్షణ కవచం ఏర్పాటు చెయ్యాలన్నది, ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొన్న అంశం. ప్రైవేటు భాగస్వామ్యంలోనూ సైబర్ నిపుణుల్ని ప్రోత్సహించాలి. అమెరికా, యూకే వంటి దేశాలు అత్యధిక వేతనాలతో సైబర్ నిపుణుల్ని నియమించుకుంటున్నాయి. అదే విధానం మనదేశంలోనూ అనుసరిస్తే, ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ఐటీ రంగంలో ప్రపంచంలోనే ముందు వరసలోగల భారత నిపుణులకు- సైబర్ దాడుల్ని ఎదుర్కొనే సామర్థ్యం ఉంది.

(రచయిత– ప్రిన్సిపల్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

ఈనాడు లేఖలు

నిఘా సంస్థలు మేల్కోవాలి!

రెండుకోట్ల మంది బంగ్లాదేశ్ ముస్లిములు అక్రమంగా మనదేశంలో నివసిస్తున్నారు. మియన్మార్ నుంచి బహిష్కరణకు గురైన 42వేల రోహింగ్యాలు హైదరాబాద్, దిల్లీ, జమ్ము నగరాల్లో ఉన్నట్లు వచ్చిన వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లో వీరికి నీడనిస్తున్న స్వచ్ఛంద సంస్థల సంఘం అందుకు అవసరమైన ఆర్థిక వనరుల కోసం బహిరంగ ప్రకటన సైతం విడుదల చేసింది. ఈ బృందం కార్యకలాపాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. స్థానికులతో పెళ్ళిళ్లు జరపడం ద్వారా అక్రమంగా ప్రవేశించినవారికి పౌరసత్వం ఇప్పించడానికి ఆ సంస్థలు జరుపుతున్న ప్రయత్నాలను నిఘా సంస్థలు సమర్థంగా అడ్డుకోవాలి.

- డాక్టర్ టీహెచ్ చౌదరి, కార్ఖానా, సికింద్రాబాద్

పోలవరంపై ఆశలు

పోలవరం జలాశయం నిర్మాణం వర్షకాలంలోనూ వేగంగా కొనసాగుతుండటంతో అనుకున్న సమయానికి పథకం పూర్తవుతుందన్న నమ్మకం కలుగుతోంది. ఇప్పటికే పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ప్రధాన కాలువ నుంచి గోదావరి నీరు పారించడం కలిసివచ్చే అంశం. జలాశయం నిర్మాణం పూర్తయ్యేనాటికి పొలాలకు నీటిని చేర్చే కాలవల వ్యవస్థ సైతం అందుబాటులోకి రావాలి. ప్రధాన ప్రాజెక్టుతోపాటుగా కాలువల ద్వారా చెరువులకు అనుసంధానం వంటి పనులూ జరుగుతుండాలి. ఆ దిశగా పనులు ఇంకా సాగని వైనంపై జల వనరుల శాఖ దృష్టి సారించాలి. జలాశయం నుంచి నీరు విడుదలయ్యేసరికి, కాలువల ద్వారా పొలాలకు నీరు పారించగలిగితేనే పనులకు సార్థకత!

- ఆర్కే, ముస్తాబాద, కృష్ణాజిల్లా

తొలి అడుగు

వానప్రస్థం అంటే 'వనం వైపు పయనించడం' అని అర్థం. మానవుడి నివాసం గృహం నుంచి వనానికి మారడాన్ని 'వానప్రస్థ ఆశ్రమం'గా పరిగణిస్తారు. అతడి కోరికలు అనంతంగా ఉంటాయి. వాటన్నింటినీ ఒక్కసారిగా వీడి తాత్విక భావం పెంచుకోవడం సులభసాధ్యం కాదు. అందుకే రామకృష్ణ పరమహంస- ప్రతి మనిషీ తన కోరికల పరంపరను ఒక్కొక్కటిగా తగ్గించుకోవాలంటారు. అనంతర క్రమంలో, అప్పటివరకు తాను నిర్వహిస్తున్న బాధ్యతల్ని బిడ్డలకు అప్పగించి స్వచ్ఛందంగా వైదొలగడమే మానవ కర్తవ్యం. అంటే- కుటుంబసభ్యుల పట్ల గల అనుబంధాలన్నింటినీ విడనాడటం కాదు. మనిషి ఒక దశలో తనంత తానుగా జీవితాన్ని సమీక్షించుకోవాలి. దాని ఫలితంగా అతడు వేసే ఆధ్యాత్మిక సంబంధమైన తొలి అడుగే- వానప్రస్థం.

సంపద వంటి సుఖాల్ని విడనాడటానికి ఏ మనిషీ అంతగా ఇష్టపడడు. ఆ భాగ్యం వల్లనే తాను ఎంతో సుఖపడుతున్నానని అతడు ఎప్పుడూ భావిస్తుంటాడు. సృష్టిలో ఉండేవన్నీ శాశ్వతాలని అనుకున్నప్పటికీ, నిజానికి అవి అశాశ్వతాలు. వాస్తవాలు తెలిసినవారూ తరచుగా భ్రాంతికి లోనవుతుంటారు. వాటి నుంచి వారు త్వరగా బయటపడాలన్నదే వానప్రస్థ ధర్మం వెనక ఆంతర్యం!

తాను కోరుకున్నవాటి కారణంగానే సుఖం లభిస్తుందని మనిషి బలంగా నమ్ముతాడు. అతడిలో ఆ భావం ఉన్నంతవరకు, పూర్తిగా ఆ సుఖాల గురించే మనసు పదేపదే అదేపనిగా ఆలోచిస్తుంటుంది. వాటిని సొంతం చేసుకొనేందుకు ఎంతో తపనపడతాడు. అనుకున్న వాటిని పొందలేనప్పుడు, మానవ హృదయాన్ని నిరాశ లేదా అసహనం ఆవరిస్తుంది. అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయి. ఊహించని వాటిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

జీవన సమరంలో ఒక వయసు దాటిన తరవాత, అనుభవాలే మనిషిని శాసిస్తాయి. పెరుగుతున్న వయసు వల్ల, సర్వసహజంగా సామర్థ్యమూ తగ్గుముఖం పడుతుంది. మరీ మొండిగా వ్యవహరించి, అహంకారంతో పనులు కొనసాగించాలని ప్రయత్నిస్తే ఒత్తిడి ఎక్కువవుతుంది. ఆ కారణంగా అనర్థాలు పెరగవచ్చు. అటువంటి పరిస్థితి కలగకుండా, మనిషి తనంత తానుగా స్వచ్ఛందంగా ఎంచుకొనే మార్గమే వానప్రస్థం!



అంతర్యామి

వానప్రస్థం స్వీకరించినవారు కచ్చితంగా పాటించాల్సిన నియమాల గురించి గాలవుడికి నారదుడు వివరిస్తాడు. వాటిని భారతం విశదీకరించింది. ఆ నియమాలు ఇవి: మనసును పరిశుద్ధం చేసుకోవడం, సమస్త ప్రాణుల పట్ల దయ కలిగి ఉండటం, ఇతరులతో మధురంగా సౌమ్యంగా మాట్లాడటం. అదేవిధంగా అహంకారాన్ని వదిలిపెట్టడం, విషయవాంఛలకు దూరం కావడం, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం- మరికొన్ని నియమాలు. ఆత్మస్తుతికి, పరనిందకు పాల్పడకపోవడం, సోమరితనాన్ని వీడటం కూడా మానవుడు అనుసరించాల్సిన పద్ధతులు. వేదాధ్యయనం, వేదాంత చర్చలు, యజ్ఞయాగాదులు, సత్పురుషులతో సమావేశాలు, సద్గోష్ఠి కొనసాగే ప్రదేశాల్లో నివసించడం లేదా సంచరించడం వంటివీ మానవ జీవితాన్ని మలుపు తిప్పుతాయి.

ఈ నియమాలన్నింటినీ పాటించిననాడు, వ్యక్తి రుజువర్తనుడిగా మారతాడు. మనసు ధార్మిక వ్యాపకాల వైపు మళ్లుతుంది. ఇంద్రియ సుఖాలపై విరక్తి (విగత= పోయిన, రక్తి = అనురాగం) కలుగుతుంది. అంతటా నిండి ఉన్న శక్తి ఏమిటో అర్థమవుతుంది. దాన్ని చేరుకునే మార్గమూ గోచరిస్తుంది. అటువైపు పయనించడానికి వీలుగా మానవుడు బంధనాల నుంచి బయటపడతాడు. దీన్ని తాత్విక పరిభాషలో- సన్యాసం (సత్ = మంచిగా, న్యాసం = విడిచిపెట్టడం) అంటారు. అలా జీవన రంగంలోని ఆశ్రమ ధర్మాల్లో చివరిదైన వానప్రస్థం వైపు సాధకులు పయనిస్తారు. ఆ ధర్మాన్నే రామకృష్ణ పరమహంస ఆచరించి చూపారు!

– అయ్యగారి శ్రీనివాసరావు

దిల్లీ వెళ్లిన ఉప రాష్ట్రపతి వెంకయ్య

ఈనాడు, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తెలంగాణ పర్యటన ముగించుకొని మంగళవారం దిల్లీ బయల్దేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ నరసింహన్, ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల, డీజీపీ అనురాగ్‌శర్మలు వీడ్కోలు పలికారు.

ప్రకృతి వ్యవసాయంపై మొబైల్ యాప్

హైదరాబాద్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు వ్యవసాయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో పంటల సాగుపై తొలిసారిగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారునికి లాభసాటి ధరకు అమ్ముకోవడానికి ఈ యాప్ దోహదపడుతుందని చెప్పారు. దీంతో పాటు వివిధ రకాల వ్యవసాయ వార్తలు, రైతుల విజయగాథలు ఎప్పటికప్పుడు ఇందులో పొందుపరచనున్నట్లు వివరించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లోని ప్లేస్టోర్‌లో రైతునేస్తం అని టైప్‌చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 94905 59999లో సంప్రదించాలని సూచించారు.

పోలవరం ప్రధాన పనులకు మళ్లీ టెండర్లు!

- ప్రస్తుత గుత్తేదారు నుంచి కొంత తొలగింపు
- తాజా ధరలతో మళ్లీ కొత్తగా ఆహ్వానం
- ఎల్ ఎస్ పద్ధతిలో చేపట్టేందుకు నిర్ణయం
- పనుల వేగం పెంచాలన్నదే వ్యూహం

ఈనాడు - అమరావతి



పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనుల్లో కీలకమైన కొన్ని నిర్మాణాలకు మళ్లీ టెండర్లు పిలవాలని జలవనరులశాఖ అధికారులు ఒక ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2018 జూన్ నాటికి కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీరు ఇవ్వాలని భావిస్తున్న ప్రభుత్వం తాజాగా ఈ పనులు వేగం పెంచాలంటే మరో ప్రధాన గుత్తేదారును రంగంలోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇంతవరకు ఈ ప్రాజెక్టులో ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌ట్రాయ్‌తో కలిసి ఉపగుత్తేదారులుగా అనేక మంది వివిధ పనులు చేపడుతూ వస్తున్నారు. ఈ పద్ధతిలోను స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులతో పాటు మరికొన్ని అప్పగించేందుకు అధికారులు ప్రయత్నించినా కొందరు ప్రధాన గుత్తేదారులు ఇందుకు అంగీకరించలేదు. సంబంధిత పనులను ప్రధాన గుత్తేదారు నుంచి 60 సి కింద తొలగించి ప్రస్తుత ధరలతో అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాలని నిర్ణయించారు. స్పిల్ ఛానల్ కాంక్రీటుతో పాటు ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం, కాఫర్ డ్యాంలు, ప్రధాన పనులకు అనుసంధాన కనెక్టివిటీ పనులు, స్పిల్ వేలో కొంత భాగం ప్రధాన గుత్తేదారు నుంచి 60 సి కింద మినహాయించనున్నారు. దాదాపు రూ.1500 కోట్ల నుంచి రూ.2000 కోట్ల విలువైన పనులకు ఇలా కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాంలో అడుగున డయాఫ్రం వాల్ నిర్మాణం పనులు ఇప్పటికే ఎల్ అండ్ టీ బావర్ సంస్థ చేపడుతోంది. అది పునాది వంటి పని. ఆ పని పూర్తయిన తర్వాత ఎగువన మట్టి, రాతితో కట్ట నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. దాదాపు కిలోమీటరుకు పైగా ఈ నిర్మాణం ఉంటుంది. ఈ ప్రధాన డ్యాంకు ఎగువన, దిగువన కాఫర్ డ్యాంలు నిర్మించాలి. 41 మీటర్ల ఎత్తున కాఫర్ డ్యాం నిర్మించి నీటిని నిలబెట్టి గ్రావిటీ ద్వారా నీరు కాలువలకు విడుదల చేయాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా కాఫర్ డ్యాం పునాదిగా జెట్ గ్రౌటింగ్ పనులు చేపట్టారు. కెల్లర్ సంస్థ ఉపగుత్తేదారుగా ఇప్పటికే ఈ పనులు చేపట్టింది. ఎగువన కాఫర్ డ్యాం మట్టి కట్ట నిర్మించాల్సి ఉంటుంది. ఈ కాఫర్ డ్యాంలు ఎత్తు పెంచి 41 మీటర్లకు పెంచి 2018 జూన్ కల్లా నీళ్లు ఇచ్చే దిశగా కొత్తగా టెండర్లు పిలవబోతున్నారు. కాంక్రీటు పనులు కూడా ప్రస్తుతం వేగంగా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారు. స్పిల్ ఛానల్‌లో 18 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని చేయాల్సి ఉంది. స్పిల్ వేలోను కొంత భాగం కాంక్రీటు పని కూడా కొత్త టెండర్లలో కలపనున్నారని సమాచారం.

'తుని' ఘటన ఎవరి వైఫల్యం?

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తుని వద్ద 2016 జనవరిలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దహనం ఘటనలో వైఫల్యం ఎవరిదో గుర్తించేందుకు విచారణ జరిపించాలని రైల్వే మంత్రి సురేశ్‌ప్రభును ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు కోరారు.

అసలు సిసలు దేశభక్తుడు ప్రకాశం పంతులు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి

ఈనాడు అమరావతి: తెలుగువారిలో స్వాతంత్ర్యకాంక్ష రగిలించిన నేతల్లో టంగుటూరి ప్రకాశం పంతులు అగ్ర భాగాన ఉంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. తెలుగువారి ఐక్యతకు ఆయన అవిరళ కృషి చేశారని, ఒక్క భారతీయుడూలేని సైమన్ కమిషన్‌ను 'గో బ్యాక్' అంటూ గర్జించారని, ప్రాణాలకు తెగించి చూపించిన ధైర్య సాహసాలతో తెలుగువారు ఆయనను ఆంధ్రకేసరిగా గౌరవించారని చంద్రబాబు కొనియాడారు. "గాంధీజీ పిలుపునందుకుని మన రాష్ట్రంలో ఉప్పు సత్యాగ్రహానికి ప్రకాశం పంతులు నాయకత్వం వహించారు. ప్రజలను ప్రేమించనివాడు దేశభక్తుడు కాదన్న ఆయన నిష్కళంక దేశభక్తుడు. తన సంపదను, ఎంతో ఆదాయం తెచ్చిపెడుతున్న న్యాయవాద వృత్తిని దేశ శ్రేయస్సు కోసం త్యజించారు. ఆఖరిశ్వాసవరకు నిస్వార్థంగా జీవించారు" అని కొనియాడారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడేళ్లు జైలు శిక్ష అనుభవించారని, రాజ్యాంగం ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయవచ్చునని, తెలుగు భాష మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం ఎందుకివ్వరని నెహ్రూనే నిలదీశారని గుర్తుచేశారు.

జన్మస్థలంలో నేడు ఘన నివాళి

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన జన్మస్థలం ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలో మంత్రి శిద్దా రాఘవరావు, జిల్లాకు చెందిన రాజకీయ, అధికార ప్రముఖులు పాల్గొంటున్నారు. ప్రకాశం పంతులు పుట్టిన నేలపై రూ.కోటి వ్యయంతో సిమెంటు కాంక్రీటు రహదారులు, రూ.10 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం, పాఠశాలలో డిజిటల్ తరగతి గదికి శంకుస్థాపన కార్యక్రమాలుంటాయి. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో పరకాల ప్రభాకర్ ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తారు.

'వేతనాలు చెల్లించండి మహాప్రభో'

ఈనాడు, అమరావతి: ఆయుష్ పారా మెడికల్ సిబ్బందికి 17 నెలల నుంచి వేతనాల చెల్లింపులు జరగడం లేదు. దీంతో వారంతా తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆయుష్ కేంద్రాల్లో పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి గత ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. ఉద్యోగ భద్రత అంశమూ వీరిని వెంటాడుతోంది. కేంద్రం నుంచి నిధులు రానందున వీరి సేవల కొనసాగింపు విషయంలో ఏమీ చేయలేమని వైద్య ఆరోగ్య శాఖ చెబుతోంది. దీంతో.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పారా మెడికల్ సిబ్బంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణలో భాగంగా పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని న్యాయస్థానం తీర్పు చెప్పింది. సేవల కొనసాగింపుపై త్వరలో విచారణ జరపనుంది.

కంప్యూటర్ల కోడ్ మార్పు

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఉద్యోగిపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్యాలయంలో ఉన్న సాఫ్ట్‌వేర్ కోడ్‌ను ఆ సంస్థ ఉద్యోగి ఒకరు మార్చడంతో వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అనంతపురానికి చెందిన మంజుకృష్ణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలో తాత్కాలికఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సంస్థ కార్యాలయాన్ని ఇటీవల హైదరాబాద్ నుంచి విజయవాడకు మార్చారు. గత నెల 6న సంస్థ కార్యాలయంలోని కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, పలు ప్రాంతాల్లోని గనుల వద్ద ఏర్పాటు చేసిన కెమెరాల నుంచి వచ్చే ప్రసారాలు పనిచేయకుండా నిలిచిపోవడంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఆయా రికార్డులు కూడా కంప్యూటర్ల నుంచి తొలగిపోయినట్లు గుర్తించిన అధికారులు విచారణ చేపట్టగా ఈ వ్యవహారం వెనుక మంజునాథ్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో సంస్థ జనరల్ మేనేజర్ ఎ.వెంకటేశ్వరరావు మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంజునాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలపై 29న ముసాయిదా

- వచ్చేనెల 9లోగా అభ్యంతరాల స్వీకరణ
- ప్రత్యేక కమిటీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు అమరావతి: నూతన ఉపాధ్యాయ ఏకీకృత సర్వీసు నిబంధనలపై ఈనెల 29లోగా ముసాయిదా తయారు కానుంది. దీనిపై వచ్చే నెల 9లోగా అభ్యంతరాలు స్వీకరించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంవీ సత్యనారాయణ ఛైర్మన్‌గా ఏర్పాటైన ప్రత్యేక కమిటీ సమావేశం నిర్ణయించింది. విజయవాడలోని ఒక హోటల్‌లో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు ఏకీకృత సర్వీసు నిబంధనల రూపకల్పనపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, గాదె శ్రీనివాసులు నాయుడు, కత్తి నర్సింహారెడ్డి, ఏఎస్ రామకృష్ణ, రాము సూర్యారావు మాట్లాడుతూ నిబంధనల రూపకల్పన ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పురపాలక, గిరిజన, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఇదే సర్వీసు నిబంధనలు వర్తించేందుకు ఉండే అవకాశాలను పరిశీలించాలని కోరారు. సర్వీసు నిబంధనల రూపకల్పన కోసం కమిటీ సభ్యులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల వ్యక్తిగత అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరారు. మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా జిల్లాకు ముగ్గురు జిల్లా విద్యాశాఖాధికారులు, మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారుల నియామకం కోసం కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సూచించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా నిబంధనలు రూపొందించాలన్నారు. అందరి అభిప్రాయాలతో ఈనెల 29లోగా ముసాయిదా రూపొందించి 'స్కూల్ ఎడ్యుకేషన్' వెబ్‌సైట్‌లో పెట్టి వచ్చే నెల 9 వరకు అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తామని ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ ఎంవీ సత్యనారాయణ ప్రకటించారు. 13లోగా ఉపాధ్యాయ ఏకీకృత సర్వీసు నిబంధనలు ఖరారు చేసి 15న ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన వెల్లడించారు. సమావేశంలో పాఠశాల విద్య అదనపు సంచాలకుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ. చిత్రంలో ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులనాయుడు, పాఠశాల విద్య అదనపు సంచాలకుడు మస్తానయ్య

ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించాలి

విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం మాని, ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

రాజధానికి రాచమార్గాలు

- కర్నూలు-గుంటూరు రోడ్డు విస్తరణ
- నాలుగు వరుసలకు సర్వే మొదలు
- అటవీ మార్గంలో విస్తరణకు ఇక్కట్లు



జాతీయ రహదారి 340సి విస్తరణకు జూపాడుబంగ్లా వద్ద రోడ్డుపై వేసిన కొలతలు

ఈనాడు, అమరావతి: కర్నూలు నుంచి రాజధాని నగరానికి చేరుకోవడానికి ఎనిమిది గంటలు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ మార్గాలు జాతీయ రహదారులే అయినా రాజధానికి వెళ్లడం రాయలసీమ వాసులకు పెద్ద ప్రహసనంగా మారింది. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ మార్గం కార్యరూపం దాల్చేలోగా అందుబాటులో ఉన్న జాతీయ రహదారులను విస్తరించడమే ఇందుకు పరిష్కారం. ఇందులో భాగంగానే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరుసలకు విస్తరించడం ద్వారా ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ దిశగా సర్వే ప్రారంభించింది.

కర్నూలు నుంచి దోర్నాల వరకూ ఉన్న జాతీయ రహదారి 340సి తొలి దశలో నాలుగు వరుసలకు విస్తరించనున్నారు. కర్నూలు నుంచి నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా దోర్నాల వరకూ 150 కి.మీ. మేర ప్రస్తుతం రెండు వరుసల మార్గమే ఉంది. కుంట దగ్గర నుంచి ఎన్‌హెచ్ 544డిలో కలుస్తుంది. ఇది వినుకొండ-నర్సరావుపేట మీదుగా గుంటూరుకు చేరుతుంది. కుంట నుంచి గుంటూరు వెళ్లే రోడ్డు కూడా రెండు వరుసల్లోనే ఉంది. ఈ మార్గం అంతటినీ నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆ రహదారి వెంట ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ సర్వే నిమిత్తం కొలతలు వేసింది. ఇందుకు సంబంధించిన నివేదికల్ని కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖకు అందజేశారు. కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలో సేకరించాల్సిన భూముల కోసం జిల్లా కలెక్టర్లకు సమాచారమిచ్చారు. సేకరణకు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలు పరిధిలో ఇందుకు సంబంధించిన కసరత్తు మొదలైంది.

అటవీ మార్గంలో ఇబ్బందే

ఆత్మకూరు దాటిన తరువాత దోర్నాల వరకూ ఈ రోడ్డు నల్లమల అటవీ ప్రాంతంలోంచి వెళ్తుంది. విస్తరణలో ఈ భాగం కీలకమైనది. 60 కి.మీ. మేర ఉండే ఈ మార్గం 7 మీటర్ల వెడల్పులోనే ఉంది. ఈ మార్గాన్ని విస్తరించడం సాధ్యమయ్యే పని కాదని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు చెబుతున్నాయి. అటవీ శాఖ నుంచి రావల్సిన పర్యావరణ అనుమతులు పొందడం ఒక ఎత్తయితే.. విస్తరించేందుకు ఆస్కారం లేకపోవడం మరో కారణం. ఈ మార్గంలో పులుల అభయారణ్యం కూడా వస్తుంది. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ అనుమతులూ అవసరమవుతాయి. ఇక్కడ రోడ్డుకి రక్షణ గోడలు నిర్మించేందుకు కూడా అనుమతులు దక్కడం లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ 60 కి.మీ. మేర విస్తరణ ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ మార్గంలో బలహీనంగా ఉన్న కల్వర్టులను గుర్తించి వాటిని పునర్నిర్మించడం, రహదారిని బలోపేతం చేయడం, రెయిలింగ్ ఏర్పాటు లాంటివి చేపట్టాలని భావిస్తున్నారు.

ఈ మార్గంతో పాటు అనంతపురం నుంచి తాడిపత్రి-తోకపల్లి మీదుగా గుంటూరుకు చేరే 544డి జాతీయ రహదారి విస్తరణపైనా దృష్టిపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్గంలోనే కర్నూలు నుంచి వచ్చే 34సి ఎన్‌హెచ్ కలుస్తుంది. ఇందుకు సంబంధించిన సర్వే కూడా మొదలుపెట్టబోతున్నారు.

ఆక్సిజన్ సరఫరా కోసం నిధుల కొరత లేదు

ఈనాడు, అమరావతి: బోధనాస్పత్రుల్లో ఆక్సిజన్ సరఫరా బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమస్యల్లేవని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే రూ.రెండు కోట్లు విడుదలయినట్లు తెలిపారు. మరో రూ.రెండు కోట్ల విడుదలకు కూడా ఇబ్బందుల్లేవని తెలిపారు. బిల్లుల చెల్లింపులకు నిధుల కొరతలేదని, గుత్తేదారుల నుంచి సమస్యల్లేవని పేర్కొన్నారు.

పునరాలోచన చేయాలి: మెడికల్ అసోసియేషన్

ఈనాడు అమరావతి: ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి...చట్టపరమైన హక్కుల్ని కల్పిస్తామని చేసిన ప్రకటనపై పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఇలా చేయడం ఎంసీఐ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. గాయపడిన వారికి వెంటనే ప్రాథమిక చికిత్సను అందించేందుకు వీలుగా విద్యార్థులు, యువతకు ఇండియన్ రెడ్‌క్రాస్‌తో కలిసి శిక్షణ ఇవ్వబోతున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధరరావు, గౌరవ ప్రధాన కార్యదర్శి కరుణామూర్తి విజయవాడలో మంగళవారం విలేకర్లకు వెల్లడించారు.

పిడుగుపాటుకు పేలిన సెల్‌ఫోన్

యువకుడికి తీవ్ర గాయాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా సబ్బవరం మండలం నాయనమ్మపాలెం గ్రామ శివారు పొలంలో పిడుగుపాటుకు సెల్‌ఫోన్ పేలి యువకుడు మాటూరి అశోక్ (19) గాయపడ్డాడు. మంగళవారం సాయంత్రం పొలం పనులకు వెళ్లిన ఆయన సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా సమీపంలోనే పిడుగు పడింది. సెల్‌ఫోన్ పేలిపోయి చెవికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టెలీమీటరీల ఏర్పాటుకు రూ.4 కోట్లు

ఈనాడు-అమరావతి: కృష్ణా పరీవాహక ప్రాంతంలో రెండో దశ టెలీమీటర్ల ఏర్పాటు కోసం కృష్ణా బోర్డుకు రూ.నాలుగు కోట్లు ఇస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు బోర్డు ఖాతాకు జమ చేయనున్నారు.

జలవనరుల మంత్రిని కలిసిన శ్రీవాస్తవ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ, సభ్య కార్యదర్శి సమీర్‌ఛటర్జీలు మంగళవారం సాయంత్రం జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణా బోర్డు సమావేశం వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

డిఫ్తీరియాతో ఇద్దరు చిన్నారుల మృతి

- వ్యాధి నిరోధక టీకాలు వేయించకపోవడం వల్లేనన్న వైద్యుడు

నల్లజర్ల, న్యూస్‌టుడే: అక్కా చెల్లెళ్లకు చెందిన ఇద్దరు చిన్నారులు డిఫ్తీరియాతో చనిపోయిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం సుభద్రపాలెంలో చోటుచేసుకుంది. వీరిలో ఒకరు వారంరోజుల కిందట, మరొకరు సోమవారం మృతిచెందారు. సుభద్రపాలెంకు చెందిన అక్కా చెల్లెళ్లు ధనమ్మ, కుమారిలు ఒకే ఇంటిలో నివసిస్తున్నారు. వారికి మంగ(9), మధు(4) ఉన్నారు. పది రోజుల కిందట మంగకు, తర్వాత మధుకి విపరీతమైన జ్వరం, వాంతులు అవడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్సపొందుతూ ఈనెల 14న మంగ, 21న మధు మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. నల్లజర్ల మండల వైద్యాధికారి సుధీర్ ఆ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, గుంటూరు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. డిఫ్తీరియా కారణంగా వారు మృతి చెందినట్టు నిర్ధరించారని సుధీర్ తెలిపారు. వీరికి చిన్నతనంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించకపోవడంతోనే ఇలా జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించుకుంటే ఇటువంటి సమస్య ఉండదని ఆయన పేర్కొన్నారు.

శరద్‌యాదవ్ నేతృత్వంలోని జేడీయూ అసమ్మతి నాయకులు పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించిన అసలైన పార్టీ తమదేనని తెలపనున్నట్లు శరద్‌యాదవ్‌కు సన్నిహితుడైన శ్రీవాస్తవ మంగళవారం వెల్లడించారు.

జీఎన్ఎల్ఎఫ్‌కు పశ్చిమబెంగాల్ ఆహ్వానం

కోల్‌కతా: డార్జీలింగ్‌లో ప్రతిష్టంభనను తొలగించేందుకు.. గోర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (జీఎన్ఎల్ఎఫ్) పార్టీని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. గోర్ఖాలాండ్ ఉద్యమ సమన్వయ కమిటీ (జీఎమ్‌సీసీ)లో సభ్య పార్టీ అయిన జీఎన్ఎల్ఎఫ్ చర్చల ప్రతిపాదన చేసిందని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ముఖ్యమంత్రి మమత బెనర్జీ మంగళవారం ప్రకటించారు. ఆగస్టు 29న రాష్ట్ర సచివాలయంలో చర్చలు జరుగుతాయని.. దీనికి అన్ని పార్టీలనూ ఆహ్వానిస్తామని ఆమె తెలిపారు. అయితే గోర్ఖాలాండ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న గోర్ఖా జన్‌ముక్తి మోర్చా (జీజేఎమ్) గురించి ఆమె ప్రస్తావించలేదు. దీనిపై జీజేఎమ్ వర్గాలు మండిపడ్డాయి.

ఖర్చు విషయంలో ఆచితూచి...

స్నేహితుల దగ్గర డబ్బుల గురించి ఆలోచిస్తామా? కొన్నిసార్లు వెనకా ముందూ చూడకుండా ఖర్చుపెట్టేస్తాం. మనతోనూ అవతలి వాళ్లు అలానే ఉండాలని కోరుకుంటాం. అలా ఉండకపోతే నొచ్చుకుంటాం. అలాంటి మన స్పర్థలు రాకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి..



స్నేహితులంతా కలవడానికీ, మనసులోని ఊసులు ఒకరితో ఒకరు పంచుకోవడానికీ ఓ వేదిక కావాలి. వారాంతాల్లో అయితే రెస్టారెంట్లూ, కాఫీషాపులూ, సినిమాహాళ్లే ఆ వేదిక. అలా సరదాగా స్నేహితులంతా కలిసి బయటికి వెళ్లినప్పుడు కొంతమంది డబ్బుల గురించి పట్టించుకోరు. ఎవరో ఒకరు ఇచ్చేస్తార్లే అని ఊరుకుంటారు. అలా ఒకట్రెండుసార్లయితే ఏమోకానీ తరచూ చేస్తుంటే స్నేహితులకు చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. సాధ్యమైనంత వరకూ బయటికి వెళ్లొచ్చాక ఎంత ఖర్చయిందో ఒక అవగాహన ఉంచుకుంటే ఇంకోసారి ఆ బిల్లేదో మీరే కట్టేయొచ్చు.

ఎవరైనా తోడుగా మిమ్మల్ని కొనుగోళ్లకు తీసుకెళ్తే వారే మీ ప్రయాణ ఖర్చులన్నీ పెట్టుకోవాలన్న అభిప్రాయంతో ఉండకండి. ఎప్పుడైనా ఒకసారి అయితే ఫర్వాలేదు. కానీ ప్రతీసారి వద్దు.

డబ్బుల గురించి ఆలోచించాలి కదా అని బిల్లు మీ చేతికి రాగానే తలా ఇంతా అని అక్కడే పంచేసుకోవడం కూడా బాగుండదు. అవన్నీ బయటికి వచ్చాక చూసుకోండి. ముందు ఎవరో ఒకరు చెల్లించేలా చొరవ చూపితే మంచిది.

దూరంగా ఉండే ప్రదేశాలకు విహారయాత్రలకు వెళ్లాలని ప్రణాళికలు వేసుకున్నారా... మీ స్నేహితులందరూ మీరనుకున్నంతగా ఖర్చుపెట్టగలరో లేదో తెలుసుకోండి. ఆ తరవాతే ప్రణాళిక వేయండి. అంతే తప్పు ముందే కాదు.

బంగారం-వెండి



22న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	------	------	29,950	29,900
ఆర్నమెంట్	------	------	27,750	27,750
వెండి (కిలో)	------	------	40,200	40,200
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,830	29,830	29,650	29,500
ఆర్నమెంట్	27,710	27,710	27,720	27,580
వెండి (కిలో)	39,900	39,800	39,200	39,150
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,990	29,920	-------	-------
ఆర్నమెంట్	27,590	27,530	2,772	2,758 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	41.90	41.90 గ్రా

వసుంధర







కాలేజీ అమ్మాయిల నుంచి కొత్త పెళ్లికూతుళ్ల వరకూ.. తమ వస్త్రధారణకు అదనపు అందాన్ని తెచ్చిపెట్టేవి రఫుల్సే అంటున్నారు. అనడమే కాదు.. వాటిని తమ వస్త్రశైలిలోనూ ఇమిడ్చేసుకుంటున్నారు. అంతటి ప్రత్యేకత వాటిల్లో ఏముంది? దాన్నెలా ఎంచుకోవచ్చో వివరిస్తున్నారు డిజైనర్ సింధూరెడ్డి.

రఫుల్స్... అదుర్స్!




రఫుల్స్... పేరు కాస్త కొత్తగా కనిపించినా మన భారతీయ శైలిలో వీటి వాడకం ఎక్కువే. ఈ మధ్యకాలంలో ఫ్యాషన్ ప్రియుల నోట తరచూ వినబడుతోంది. ఎందుకిలా అంటే సంప్రదాయ, ఆధునిక వస్త్రశ్రేణుల మీదకు అదనపు హంగులతో ఇమిడిపోయి... ఆకట్టుకోవడమే ప్రధాన కారణం. పొడవాటి వస్త్రాన్ని చిన్నగా చూపించడానికి కుచ్చిళ్లను వాడుతుంటాం కదా! అది ప్రాథమిక రూపం అయితే వివిధ ఆకృతులలోన్లూ, అంచుల్లోనూ కుచ్చిళ్లతో కొత్తగా కనిపించేలా చేయడమే ఈ రఫుల్స్ ప్రత్యేకత.

వేటి మీదకు నప్పుతాయి: ఈ రఫుల్స్ దుస్తులకు అదనపు అందాన్ని తేవడమే కాదు.. నిండుగానూ కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా పొడవాటి గౌన్‌లూ, అనార్కలీలూ, షర్ట్‌లూ, చీరలూ, కుర్తీలూ, దుపట్టాలూ, బ్లవుజులు... ఇలా వేటిమీదకు ఎంచుకున్నా ఇవి ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి. వీటిని ప్యాంట్లకు అడుగున కూడా జతచేయొచ్చు. అందుకోసం విడిగా రఫుల్స్‌ని కుట్టి వాటిని మనకు నచ్చిన విధంగా అంటే... చేతులకో, మెడకో లేదా దుస్తుల మీదకో వచ్చేలా అతికించుకుంటే సరి. ఇవి రోజువారీ వేసుకునే క్యాజువల్స్ మీదకే కాకుండా ప్రత్యేక సందర్భాలకూ నప్పుతాయి. అయితే వీటిని ప్రయత్నిస్తున్నప్పుడు వస్త్రాన్ని ఎంచుకోవడం కూడా తెలియాలి. సన్నగా ఉన్నవారు ఆర్గాంజా, నేత, బెనారస్ వంటి వస్త్రాల మీదకు ఈ రఫుల్స్‌ని కుట్టించుకోవడం వల్ల బుట్టలా(ఫ్లేర్డ్) కనిపించొచ్చు. అదే కాస్త లావుగా ఉండేవారు షిఫాన్, జార్జెట్ వంటివాటిని ఎంపిక చేసుకుంటే సన్నగా కనిపిస్తారు. నెట్టెడ్ లెహెంగా మరింత వెడల్పుగా, నిండుగా కనిపించేలా చేస్తాయివి.






రకాలెన్నో...

సింగిల్ ఎడ్జ్: మనం ఎంచుకున్న వస్త్రం ఒక స్ట్రిప్‌లా ఉండి దాని ఆధారంగా కుచ్చిళ్లను కుడతారు. అంటే వీటికి ఒక వైపు మాత్రమే కుచ్చిళ్లు కనిపిస్తాయి. మరోవైపు ఓవర్‌లాక్ చేసి ఉంటుంది. ఈ సింగిల్ ఎడ్జ్ రఫుల్స్‌ని కుర్తీలూ, టాప్‌ల వంటివాటి చేతులకూ, టాప్ కింది భాగంలో అంచుల్లా ఎంచుకుంటే మేలు.

డబుల్ ఎడ్జ్: ఎంచుకున్న వస్త్రంతో కుచ్చిళ్లు పెట్టుకున్న తరవాత దాని మధ్యకు వచ్చేలా స్ట్రిప్‌లా కుట్టుకోవాలి. దీనివల్ల రెండు వైపుల అంచులూ రఫుల్స్‌లా కనిపిస్తాయి. వీటిని చొక్కాలకు ముందు భాగంలో, టాప్‌లకి ఒకవైపున వచ్చేలా డిజైన్ చేసుకుంటే బాగుంటుంది. దీన్ని లేయర్డ్ తరహాకూ ఉపయోగించుకోవచ్చు.

వాటర్‌ఫాల్: ఈ తరహా రఫుల్స్ మెడ దగ్గర బాగుంటాయి. ఆఫ్ షోల్డర్, హైనెక్ వంటి బ్లవుజు డిజైన్‌లకు వీటిని ఉపయోగించొచ్చు.

సర్క్యులర్: ఈ సర్క్యులర్ రఫుల్స్‌ని దుస్తుల మీదకు ఎంచుకుంటే అంచులు గుండ్రంగా, వెడల్పుగా కనిపిస్తాయి. వీటిని పెప్లమ్‌లకూ, అనార్కలీ, గౌన్‌లకు ఎక్కువగా జతచేస్తారు.

కాస్కేడింగ్: ఇవి పై నుంచి కిందివైపునకు అంచెలంచెలుగా ఉన్నట్టు కనిపిస్తుంది. మెడ ముందూ, వెనుక భాగాల్లో ఎక్కువగా డిజైన్ చేస్తారు.

– స్వాతి కొరపాటి

ఐదు సూత్రాలతో ఆరోగ్యంగా!

కార్యాలయాల్లో రోజూ ఏడెనిమిది గంటలకు పైగా పనిచేసే మహిళలు ఆరోగ్యానికీ పెద్దపీట వేయాలి. అలాగని బాగా కష్టపడి వ్యాయామాలు చేయాలని కాదు. కొన్ని ఆరోగ్య సూత్రాలను పాటించేందుకు ప్రయత్నించాలి.



రోజూ అరగంట నడిచినా కూడా అవకాశం ఉన్నప్పుడల్లా అడుగులు వేయాలి. అలాగే లిఫ్టు కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా మెట్లెక్కడం కూడా మంచిదే. శరీరానికి వ్యాయామం అందుతుంది.

మహిళలకు గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 75 నుంచి 85 ఉండాలి. ఇది సవ్యంగా ఉండాలంటే... తగిన వ్యాయామాలు చేస్తూ ఉండాలి. డంబెల్స్‌తోనూ వ్యాయామం చేయాలి. యోగా కూడా మంచిదే. ఈ తరహా వ్యాయామం గుండె, రక్తనాళాల్లో రక్తం సవ్యంగా సరఫరా అవడానికి దోహదం చేస్తుంది.

రోజంతా కంప్యూటర్‌పై విధులు నిర్వహించే మహిళలకు చేతుల వేళ్లు ఎక్కువగా అలసిపోతాయి. వేళ్ల నొప్పులు రాకుండా ఉండాలంటే.. జుట్టుకు పెట్టుకునే రబ్బరుబ్యాండ్‌తో చిన్న వ్యాయామం చేయొచ్చు. చేతి అయిదువేళ్లను దగ్గరకు చేర్చి రబ్బరు బ్యాండ్ వేయాలి. తరువాత బ్యాండ్‌ను వెడల్పు చేస్తున్నట్లుగా వేళ్లను దూరంగా, దగ్గరగా చేయాలి. ఇలా ఐదారుసార్లు చేసినా మంచిదే.

నడుమునొప్పి రాకుండా ఉండాలంటే.. నిల్చునా, కూర్చున్నా నిటారుగా ఉండేలా చూసుకోవాలి. కంటికి సమాంతరంగా కంప్యూటర్ స్క్రీన్ ఉండాలి. లేదంటే మెడా, వెన్నూ, భుజాల కండరాలు అలసిపోయి నొప్పి వేధిస్తుంది.

వ్యాయామాలు ఎన్ని చేసినా సరే... ఉదయం అల్పాహారాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఇందులో తాజా పండ్లూ, డ్రై ఫ్రూట్స్ కూడా ఉండేలా చూసుకుంటే.. రోజంతా ఉత్సాహంగా గడపొచ్చు. అలాగే తగినన్ని మంచినీళ్లు తాగుతూ ఉండాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉంటుంది.

నాకు స్మార్ట్ ఫోను అక్కర్లేదట!



డియర్ వసుంధర
డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

? మా పెళ్లై రెండేళ్లవుతుంది. మావారిది ఉమ్మడి కుటుంబం. ఇంట్లో తరగనంత పని. చేసిందే చేస్తూ.. విసుగొస్తోంది. మా ఆయన నా బాధ పట్టించుకోవట్లేదు. కనీసం మాట సాయం చేయట్లేదు. ఇంటి బయటకు వెళ్లి కూర్చుంటున్నా 'ఎందుకూ?' అంటాడు. 'పై చదువులు చదువుతానూ..!' అంటే పట్టించుకోవట్లేదు. స్మార్ట్ ఫోన్ కొనివ్వమంటే 'వద్దే వద్దు' అంటున్నాడు. చివరికి 'నేనిక్కడ ఏమాత్రం సుఖంగా లేను..!' అని చెప్పుకున్నా పెద్దగా స్పందన లేదు. ఏం చేయాలి? - ఓ సోదరి

మీ పుట్టింట్లో ఎలాంటి వాతావరణం నుంచి వచ్చారో చెప్పలేదు. బహుశా.. మీది ఉమ్మడి కుటుంబం కాకపోయుండొచ్చు. అందుకనే ఇన్ని ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఒకమ్మాయి మెట్టింట్లోకి అడుగుపెడుతోందంటే... కొత్త మనుషులూ, తెలియని వాతావరణం, భిన్న మనస్తత్వాలు ఎదుర్కోవడంలో ఎన్నో ఒడుదొడుకులుంటాయి. దానికి భర్త సహకారం కూడా అందాలి. మీ భర్త నుంచి ఆ సహకారం లేకపోవడం వల్లే మీలో ఇంత అసంతృప్తీ, ఆవేదనా, అయోమయం కూడా! కాబట్టి, వీటన్నింటి నుంచి మీరు బయటపడే ప్రయత్నాన్ని ముందు మీరు మీ భర్త నుంచే మొదలుపెట్టాలి. అతనెందుకు మీకు మాటసాయం చేయట్లేదు? అలా చేయడం వల్ల అప్పటికే తనకి అలవాటైన ఆ ఇంటి పద్ధతుల నుంచి పక్కదారిపడతామేమో అనే జంకు కారణమై ఉండొచ్చు. 'భార్యాదాసుడై మన నుంచి దూరమవుతున్నాడు' అని మిగతావాళ్లు అనుకుంటారేమోననే భయం కూడా అతనిలో ఉండొచ్చు. ఆ భయం దూరం కావాలంటే మీరు మనస్ఫూర్తిగా మాట్లాడండి. అతని వ్యక్తిత్వాన్నీ, కుటుంబంతో వ్యవహరించేతీరునీ, వాళ్లకిచ్చే గౌరవాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. ఆ నమ్మకం వస్తే.. మీకు అతనే వెన్నుదన్నుగా నిలుస్తాడు. ఆ ఇంట అప్పటికి అలవాటైన పద్ధతులేమిటో అతనితో మాట్లాడి తెలుసుకోండి. స్మార్ట్‌ఫోన్‌కి అతుక్కుపోయి మీరు ఇంట్లోని వ్యక్తులకి దూరమవుతారనే భయం అతనికీ, వాళ్లకీ ఉంటే వారి అపోహలు పోగొట్టడానికి ప్రయత్నించండి. బయట కూర్చున్నంత మాత్రాన వాళ్లకి దూరం కావట్లేదూ, ఆ ఇంటి పద్ధతులకి భంగం కలిగించడం లేదని వాళ్లు భావించాలి. నిజానికి మీరు ఇష్టం ఉన్నంతమేర చదువుకునే హక్కు మీకుంది. ఉన్నత చదువు చదవాలనే మీ తపననీ, అందువల్ల కుటుంబానికి వచ్చే మేలునీ సౌమ్యంగా చెప్పండి. మీ పట్టుదల వారిలో మార్పు తీసుకువస్తుంది. ఆ ప్రయత్నంలో మీరున్నారని తెలిస్తే వ్యక్తిత్వాన్ని గౌరవించడమే కాదు, మీ వ్యక్తిగత స్వేచ్ఛ అవసరం అని కూడా తెలుసుకోగలుగుతాడు. మీ చదువునీ నిరోధించడు. ఈ రెండేళ్లలో మీకేం కావాలో స్పష్టతయితే వచ్చింది. దాన్ని ఎలా సాధించాలో తెలుసుకోడమే ఇప్పుడు మీముందున్న సవాలు. మీ ప్రయత్నాలు తన కుటుంబానికి వ్యతిరేకం కాదని తెలుసుకుంటే అతను మీ వెన్నంటి ఉంటాడని నమ్మండి. అప్పుడే మీలోని అసంతృప్తీ, ఆవేదన తగ్గి ఏం చేయాలో ఆలోచించగలుగుతారు. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా మార్పులు లేకపోతే ఇద్దరూ కలిసి మ్యారేజ్ కౌన్సెలింగ్‌కి వెళ్లి అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయండి.

- gpadmaja2008@gmail.com

మృత్తికతో పచ్చదనం పెంచుతున్నాం!

మట్టిలో వేసిన విత్తు మొలకెత్తి శాఖోపశాఖలుగా విస్తరించి మహావృక్షమవుతుంది. అదే విత్తుని యువత మెదళ్లలో నాటితే? పచ్చదనం...పర్యావరణం, సాధికారత అనే ఆలోచనల్ని విత్తనాలుగా చేసి పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు జయశ్రీనాయర్, సువర్ణా భట్. మహిళలకు ఉపాధి నైపుణ్యాలతో మొదలుపెట్టి పచ్చదనానికి ప్రాణం పోస్తున్న వారికీ ఆలోచన ఎందుకు వచ్చిందో వివరిస్తున్నారు జయశ్రీ...





నిన్ననే... హైదరాబాద్ కుషాయిగూడలోని ఎన్ఎస్ఐసీ (నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్) ప్రాంగణంలో మా కార్యక్రమాన్ని నిర్వహించాం. మొక్కలతో.. చిన్నారులూ, యువతతో ఆ క్యాంపస్ మొత్తం పచ్చగా కళకళ్లాడిపోయింది. మాతో పాటూ అక్కడకు వచ్చిన పిల్లలంతా 'మొక్కలని కాపాడుకుంటే మన భవిష్యత్తుని కాపాడుకున్నట్టే' అంటూ మనస్ఫూర్తిగా నినాదాలు చేశారు. అంతటితో సరిపెట్టుకోలేదు.. కలబంద, తులసి వంటి ఆయుర్వేద మొక్కల్ని ఇష్టంగా నాటారు. పచ్చదనాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. మీరనుకోవచ్చు.. ఇలా ఎంతో మంది ర్యాలీలు చేస్తారు. ఆ తర్వాత చేతులు దులుపుకుంటారులే అని. కానీ మా ప్రయత్నం అలాంటిది కాదు. ఏడాదిగా కరవును ఎదుర్కొనే విధానాలపై నేను పరిశోధన చేస్తున్నా. అందులో భాగంగా పచ్చదనాన్ని ప్రోత్సహించేలా 'మృత్తిక' అనే కార్యక్రమాన్ని ప్రారంభించాను. మృత్తిక లక్ష్యం.. కనీసం పదివేల మొక్కలు నాటాలని. మొట్టమొదటగా ఎన్ఎస్ఐసీ యాజమాన్యాన్ని సంప్రదించాను. వాళ్లనే ఎందుకు అంటే... ఇక్కడ పచ్చదనానికి ప్రాధాన్యం ఎక్కువ. మొక్కల సంరక్షణ బాధ్యతని చిత్తశుద్ధితో చేస్తారు.



అందుకే వారితో మాట్లాడి వెయ్యి మొక్కల్ని ఆ ఆవరణలో నాటాం. అయితే ఇదే మా మొదటి కార్యక్రమం కాదు.

మహిళలకూ చేయూత....

నాలుగేళ్ల క్రితమే సిన్సోల్ ఇండియా అనే సంస్థను ప్రారంభించాను. దానిలో భాగమే 'నిపుణ'. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉపాధి పొందేందుకు వీలుగా కుట్టూ, సృజనాత్మక కళల్లో అంటే ఆభరణాల తయారీ, జ్యూట్‌బ్యాగుల తయారీలో వారికి శిక్షణ ఇస్తున్నాం. అలాగే ఉపాధి కోసం వారు పట్టణాలకు వలస రావాల్సిన అవసరం లేదు. వారున్న చోటే ఈ పనులన్నీ నేర్చుకోవచ్చు. మేం వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. మొదట్లో ముడిసరుకు కూడా కొనుక్కోవడానికి ఆర్థికదన్ను లేని మహిళలకు కొన్ని నెలల పాటూ అవసరమైన పెట్టుబడిని కూడా అందించాను. ప్రస్తుతం వారంతా తాము తయారు చేసిన వస్తువులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముతున్నారు. ఈ మృత్తిక కార్యక్రమంలో మరో కీలక భాగస్వామి... సువర్ణ. 'వి ఎంపవర్ ట్రస్ట్' అనే సంస్థను నిర్వహిస్తోంది సువర్ణ. ఈ సంస్థ కూడా మహిళలకు ఉపాధి మెలకువలు అందిస్తుంది. అలాగే 'సెకండ్ ఇన్నింగ్స్' పేరుతో పిల్లలు పుట్టిన తర్వాత కూడా మహిళలు పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకుపోయేలా వారికి శిక్షణ ఇస్తోంది. పంచతంత్ర కన్సెల్టెన్సీ పేరుతో పర్యావరణానికి హాని చేయని నిర్మాణాలకు కావాల్సిన ప్లానింగ్ ఇస్తుంటుంది. ప్రస్తుతం చర్లపల్లిలో నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ జైలు ఆవరణలో నిర్మిస్తున్న ఆయుర్వేద విలేజ్ ఆలోచనకు తనూ ఓ కారణమే. తనకీ మొక్కల పెంపకం పట్ల ఆసక్తి ఎక్కువ. ఆయుర్వేద మొక్కలంటే ప్రాణం. పర్యావరణం గురించి ఇద్దరికీ ఒకేరకం అభిప్రాయాలు ఉండటంతో 'మృత్తిక'లో భాగంగా ఈ మొక్కల పెంపకం ఉద్యమానికి శ్రీకారం చుట్టాం.

అమ్మాయిల మనోభావాలే లక్ష్యం!



ప్రస్తుతం యువతను కట్టిపడేసే వీడియోలంటే వెబ్‌సిరీస్‌సే. హాస్యభరితమై, చివరిలో ఆలోచింపజేసే సందేశం ఉండటంతో యువత నుంచి మాత్రమే కాదు, అన్ని వర్గాలవారినీ ఆకర్షిస్తున్నాయి. "చాయ్ బిస్కట్ వీడియోస్" పేరుతో సోషల్ మీడియాలో అందరినీ పగలబడి నవ్వించడమే కాకుండా లక్షలాది లైక్‌లును సొంతం చేసుకుంటున్నాయి. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది 'చాయ్ బిస్కట్ గర్ల్ ఫార్ములా'. యువతుల మనోభావాల్ని చూపిస్తుంది. స్నేహితులమధ్యా చర్చలూ, అమ్మతో సరదా సరదా కబుర్లూ, నాన్నతో చివాట్లూ, అన్నయ్యతో గొడవలు, బ్రేకప్, కాలేజీ బంకులూ, పెళ్లిచూపులూ. ఇలాంటివెన్నో ఇందులో కనిపిస్తాయి. నాలుగు నుంచి అయిదు నిముషాల నిడివిలో అలరించే ఈ సీరీస్‌లో నటించిన వారిలో అమ్మాయిలే ఎక్కువ. లక్షలాదిమంది చూడటం ఈ సిరీస్ ప్రత్యేకత. ప్రతీ దాంట్లో అంశానికి తగ్గట్లు చివరిలో సందేశం ఉండటంతో అన్ని స్థాయివాళ్లూ వీటిని చూస్తున్నారు. జర్నలిజంలో పీజీ చేస్తున్నప్పుడు చాయ్ బిస్కెట్‌లో చేరిన శ్రీదివ్య ఈ సిరీస్‌కు సంభాషణలు రాసేవారు. 'క్రమంగా గర్ల్ ఫార్ములా వెబ్ సీరీస్ అంటూ ప్రత్యేకంగా ఛానెల్ ప్రారంభించాలని అనిపించింది. కథ, సంభాషణ, నటన అన్నింటిలో అమ్మాయిలు ఉండటం.. మా సీరీస్ ప్రత్యేకం. అమ్మాయిల కోసం మాత్రమే ప్రారంభించిన ఇందులో వారి సమస్యలు, అనుబంధాలూ, ఉద్వేగాలూ..



ఇలా అన్నీ ఉండేలా చూసుకున్నాం. స్వయంవరం వీడియో తీస్తున్నప్పుడు అమ్మాయిలు తక్కువయ్యారు. దాంతో నేనూ నటించాల్సి వచ్చింది. అప్పటి నుంచి సంభాషణలు రాస్తూనే నటిస్తున్నాను కూడా. ఇప్పటివరకూ దాదాపు 20 వరకూ విడుదలయ్యాయి. నాతోపాటు ప్రఫుల్ల కూడా నటించి సంభాషణలు రాస్తుంది. ప్రతీ వీడియోని రెండులక్షల మందిదాకా చూస్తున్నారు. నటి తాప్సీతోనూ రెండు వీడియోలు చేశాం. సామాన్య అమ్మాయిలతోనూ మరికొన్ని చేయాలనుకుంటున్నాం..' అని చెబుతుంది శ్రీదివ్య.

జుట్టు ఆరోగ్యానికి మాంసకృత్తులు!

వెంట్రుకలు ఊడిపోవడానికి రకరకాల కారణాలు ఉంటాయి. వాటిల్లో మనం రోజువారీ చేసే తప్పిదాలేంటో చూద్దాం.



తరచూ శుభ్రం చేసుకోకపోవడం వల్ల కూడా జుట్టు ఊడిపోతుంది. నాణ్యమైన షాంపూతో రెండోరోజులకోసారి తలస్నానం చేసి, కండిషనర్‌ని వాడితే.. జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. లేదంటే చివర్లు చిట్లిపోవడం, ఊడిపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి.

గర్భ నిరోధక మాత్రలు వాడే మహిళల్లో నూ కొన్నిసార్లు జుట్టు రాలుతుంది. ఎందుకంటే ఈ మాత్రలు హార్మోన్లపై తమ ప్రభావాన్ని చూపడం వల్ల ఇలా జరిగే ఆస్కారం ఉంటుంది.

కొద్దిమంది బరువు తగ్గడానికి కేవలం పళ్లరసాలనే ఎంచుకుంటారు. దీన్నివల్ల చాలా దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. దానివల్ల సరైన పోషకాలు అందవు. జుట్టు కూడా నిర్జీవంగా మారుతుంది. కాబట్టి పోషకాహారాన్ని ఎంచుకోవాలి. మాంసకృత్తులున్న ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా గుడ్డూ, పాలూ, బాదం, ఓట్స్ వంటివి తరచూ తీసుకోవాలి.

నజరానా

పరిమళంలో ముంచిన దూదిని దుస్తులపై అద్ది ఇస్త్రీ చేయాలి. ఆ పరిమళం ఎక్కువసేపు నిలిచి ఉంటుంది.



మీ అభిప్రాయాలూ, సూచనలూ పంపాల్సిన మా చిరునామా
వసుంధర, ఈనాడు కార్యాలయం,
సోమాజిగూడ, హైదరాబాద్, - 500082
vasundhara@eenadu.net

సెన్సెక్స్ ▲ 33 **31292** | **నిఫ్టీ** ▲ 11 **9766** | **రూపాయి** 64.10 ▲ (ఒక అమెరికా డాలరుకు) 04 పైసలు | **బంగారం** 29,080 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 45 | **వెండి** 38,870 ▼ ముంబయిలో కిలో రూ.లలో 75 | **ముడి చమురు** 52.02 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,865	+161
నాస్‌డాక్	6,283	+70
నిక్కీ 225 (జపాన్)	19,384	−10
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,264	+17
షాంఘై (చైనా)	3,291	+04
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,382	+63
డాక్స్ (జర్మనీ)	12,230	+163

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు)


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.29	67.59
పౌండ్ స్టెర్లింగ్	75.09	87.11
యూరో	68.81	79.80
జపాన్ యెన్/100	53.35	61.87
ఆస్ట్రేలియా డాలరు	46.27	53.54
సింగపూర్ డాలరు	42.82	50.74
థాయ్ బాట్/100	175.27	209.62
బహ్రెయిన్ దినార్	157.94	180.90
కువైట్ దినార్	175.45	218.48
సౌదీ రియాల్	15.50	18.37
యూఏఈ దిర్హమ్	15.86	18.54
మలేషియా రింగిట్	13.32	16.38
చైనీస్ యువాన్	6.81	11.04



మంగళవారం నిఫ్టీ కదలికలు



చెల్లించలేకపోయాం.. చింతిస్తున్నాం

- నష్టాల వల్లే డివిడెండ్లు ఇవ్వలేదు
- దేశీయ వ్యాపారాన్ని నిలబెట్టుకుంటాం
- టాటా మోటార్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్



ముంబయి: దేశీయ వ్యాపారాన్ని పుంజుకునేలా చేయడంపై టాటా మోటార్స్ దృష్టి సారించనుందని కంపెనీ ఛైర్మన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ముఖ్యంగా వాణిజ్య వాహనాల విషయంలో సవాలుభరిత వాతావరణానికి తోడు.. కంపెనీ కార్యాచరణలో పాక్షిక వైఫల్యం, మార్కెట్ మద్దతు లోపించడం తదితరాలు కూడా కారణాలని చంద్ర పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా వాటాదార్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అదే సమయంలో దేశీయ వ్యాపారంలో నష్టాల కారణంగా డివిడెండును చెల్లించలేకపోయామని ఆయన విచారం వ్యక్తం చేశారు. 'భవిష్యత్ వైపు చూస్తే.. వ్యాపార వాతావరణం చురుగ్గా ఉన్నప్పటికీ.. ఊహాతీతంగా ఉంది. అయితే మా దేశీయ వ్యాపారాన్ని తిరిగి పుంజుకునే చేయడంపైనే మా దృష్టి ఉంద'ని మంగళవారమిక్కడ జరిగిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో వివరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

స్టాండలోన్ పద్ధతిలో 2016-17కు టాటా మోటార్స్ స్థూల ఆదాయాలు 3.6 శాతం పెరిగి రూ.49,100 కోట్లకు చేరాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే నష్టాలు మాత్రం రూ.62 కోట్ల నుంచి రూ.2480 కోట్లకు పెరిగాయి. జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు, బీఎస్3 నుంచి బీఎస్4కు మారడం తదితరాల కారణంగా వాణిజ్య వాహనాల(సీవీ) వ్యాపారం దెబ్బతినడం ఇందుకు నేపథ్యం. అయిదేళ్ల కిందట సీవీ విభాగంలో మా మార్కెట్ వాటా దాదాపు 60 శాతంగా ఉండగా.. ఈ ఏడాది మార్చి కల్లా అది 44.4 శాతానికి చేరింది. కంపెనీ సీవీ అమ్మకాలు గత మూడేళ్లలో 3,20,000 దరిదాపుల్లోనే ఉంటున్నాయి. ఇది ఈ ఏడాది కంపెనీ పనితీరుపై ప్రభావం చూపింది. ఈ పరిస్థితులను చక్కదిద్దడం కోసం అనుకున్న గడువుల్లోగా వాహనాలను విడుదలయ్యేలా చూస్తాం. ఎలాంటి ఆలస్యం అవకుండా చూసుకుంటాం. వ్యయ నియంత్రణ చర్యలు చేపడతాం. క్రమంగా మార్కెట్ వాటాను పెంచుకుంటాం. గుంటర్ బుషెక్ ఆధ్వర్యంలోని బృందం ఈ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తోంది.

ఒక్కో ఎస్సార్ ఆయిల్ షేరుకు అదనంగా రూ.75.48

వాటాదార్లకు చెల్లించనున్న ఎస్సార్ గ్రూపు

ముంబయి: ఎస్సార్ ఆయిల్ డీలిస్టింగ్ సమయంలో షేర్లను విక్రయించిన మైనార్టీ వాటాదార్లకు అదనంగా ఒక్కో షేరుకు రూ.75.48 ఎస్సార్ గ్రూపు చెల్లించనుంది. ఎస్సార్ ఆయిల్‌ను 12.9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.83,850 కోట్లు)కు రష్యా సంస్థ రాస్‌నెఫ్ట్ కొనుగోలు చేసిన మర్నాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఎస్సార్ ఆయిల్ కొనుగోలు నిమిత్తం రాస్‌నెఫ్ట్ చెల్లించిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మైనార్టీ వాటాదార్లకు లభించింది తక్కువేననే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. డీలిస్టింగ్ వల్ల ప్రమోటర్లు ఎక్కువగా లబ్ధి పొందారనే విమర్శలూ వచ్చాయి. మరోవైపు ఈ విషయంపై సెబీ కూడా జోక్యం చేసుకొని డీలిస్టింగ్ ధర, తుది విక్రయ లావాదేవీ ధర మధ్య ఎంతైతే తేడా ఉందో ఆ మొత్తాన్ని మైనార్టీ వాటాదార్లకు తిరిగి చెల్లించాలని సూచించింది. దీంతో షేరుకు అదనంగా రూ.75.48 చెల్లించాలని ఎస్సార్ గ్రూపు నిర్ణయం తీసుకుంది. అదనపు చెల్లింపు అనంతరం మైనార్టీ వాటాదార్లకు చెల్లించిన మొత్తం రూ.880 కోట్లు పెరిగి రూ.3,064 కోట్ల నుంచి రూ.3,944 కోట్లకు చేరుతుందని ఎస్సార్ గ్రూపు తెలిపింది.

కార్పొరేట్ చరిత్రలోనే ప్రథమం: 'మా వాటాదార్ల పెట్టుబడి విలువను పెంచేందుకు మేం ఎల్లప్పుడూ కృషి చేస్తాం. మమ్మల్ని నమ్మి పెట్టుబడులు పెట్టిన వాటాదార్లకు తాజా పరిణామంతో మరింత ప్రతిఫలాన్ని అందిస్తున్నందుకు సంతోషంగా ఉంద'ని ఎస్సార్ వ్యవస్థాపకుడు శశి రుయా అన్నారు. డీలిస్టింగ్‌లో షేర్ల విక్రయ లావాదేవీ పూర్తయిన తర్వాత కూడా వాటాదార్లకు తిరిగి అదనంగా చెల్లిస్తుండటం కార్పొరేట్ చరిత్రలోనే ఇదే తొలిసారి అని అన్నారు.

మార్కెట్ కబుర్లు

- అధిక రక్తపోటు నివారణకు వినియోగించే పిన్‌దోలాల్ టాబ్లెట్లను అమెరికాలో విక్రయించేందుకు యూఎస్ఎఫ్‌డీఏ తుది ఆమోదం లభించినట్లు ఔషధ సంస్థ **జైడస్ క్యాడిలా** తెలిపింది.
- **అదానీ గ్రూప్** ఆస్ట్రేలియాలో తలపెట్టిన 16.5 బిలియన్ డాలర్ల కార్మిఖేల్ బొగ్గుగని ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానికులు వేసిన పిటిషన్‌ను బ్రిస్‌బేన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది.
- **హెచ్‌పీసీఎల్‌**లో ప్రభుత్వానికి చెందిన 51.11 శాతం వాటాను కొనుగోలు చేసే ప్రక్రియ కోసం ఇన్వెస్ట్‌మెంట్ లేదా మర్చంట్ బ్యాంకర్‌ను ఎంపిక చేసుకోవాలని **ఓఎన్‌జీసీ** నిర్ణయించింది.
- విమానాల తయారీలో అంతర్జాతీయంగా తొలి 5 స్థానాల్లో నిలిచే దిగ్గజ సంస్థ చైనాలో ఏర్పాటు చేయబోతున్న సంయుక్త సంస్థ నుంచి ఆర్డరు లభించిందని **రామ్‌కో సిస్టమ్స్** వెల్లడించింది.
- రాకేశ్ ఝున్‌ఝున్ వాలా సతీమణి రేఖ, రూ.60 కోట్ల విలువైన **ఫోర్టిస్ హెల్త్‌కేర్** షేర్లు 45 లక్షల మేర కొనుగోలు చేశారు.
- **బాలాజీ టెలిఫిల్మ్స్‌**లో 25 శాతం వాటా (2.52 కోట్ల షేర్లు)ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని **రిలయన్స్ ఇండస్ట్రీస్‌**కు కేటాయిస్తూ, కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ వాటా విలువ రూ.413.28 కోట్లు.
- నిమోనియా నుంచి రక్షణకు ఉపయోగపడే ప్రివెనార్ 13 వ్యాక్సిన్‌కు భారత్‌లో పేటెంట్ పొందినట్లు ఔషధ సంస్థ **ఫైజర్** తెలిపింది.

పొలుసుల వ్యాధి ఔషధం అభివృద్ధి ఎన్‌కోర్ చేతికి: డాక్టర్ రెడ్డీస్

ఈనాడు, హైదరాబాద్: పొలుసుల వ్యాధి (సోరియాసిస్) చికిత్స కోసం అభివృద్ధి చేస్తున్న స్టెరాయిడ్ ఔషధం తదుపరి దశ అభివృద్ధి, తయారీ, వాణిజ్యపరమైన హక్కులను అవుట్ లైసెన్సింగ్ ద్వారా ఎన్‌కోర్ డెర్మటాలజీ ఐఎన్‌సీకి ఇచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. నూరు శాతం అనుబంధ సంస్థ ప్రోమియస్ ఫార్మా అవుట్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఒప్పందం ప్రకారం డీఎఫ్‌డీ-06 రసాయన సమ్మేళనాన్ని అమెరికాలో వాణిజ్యపరంగా విడుదల చేయడం ఎన్‌కోర్ బాధ్యత.

మూర్ఛకు విరుగుడు మందు

ఈనాడు, విశాఖపట్నం: మూర్ఛ రోగులకు విరుగుడు మందుగా 'ఫైకోంపా'ను విడుదల చేసినట్లు జపాన్‌కు చెందిన ఇసాయి ఫార్మా కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 12 ఏళ్లకు మించి వయసున్నవారి కోసం మాత్ర రూపంలో దీన్ని తయారు చేసినట్లు వెల్లడించింది.

కంపెనీలకు కార్వీ వీడియో స్ట్రీమింగ్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: కంపెనీల సర్వసభ్య సమావేశాల కోసం కార్వీ లైవ్ వీడియో స్ట్రీమింగ్ సేవలను ప్రారంభించింది. క్లౌడ్ టెక్నాలజీ ఆధారంగా అందిస్తున్న ఈ సేవలు అత్యంత భద్రమైనవని, వీడియో స్ట్రీమింగ్‌కు అత్యాధునిక ఏబీఆర్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని కార్వీ వెల్లడించింది. లైవ్ వీడియో స్ట్రీమింగ్ వల్ల వివిధ ప్రాంతాల్లో ఉండే వాటాదారులు అక్కడి నుంచే సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనవచ్చు. తమ సందేహాలను తీర్చుకోవచ్చు.



ఆగస్ట్‌ఫెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న జయేశ్ రంజన్. చిత్రంలో ఆగస్ట్‌ఫెస్ట్ ఆపరేషన్స్ ఛీఫ్ సుభాశ్ ఆచంట, ఆది వేమూరి, గుత్తా జ్వాల, స్పోర్ట్స్ కార్నివాల్ వ్యవస్థాపకుడు కార్తీక్.

స్వల్ప లాభాలతో సరి

సమీక్ష

వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. రోజంతా తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. సూచీలు ఆరంభ దూకుడును నిలబెట్టుకోలేకపోయాయి. చివరకు స్వల్ప లాభంతో సరిపెట్టుకున్నాయి. ఎటువంటి కీలక పరిణామాలు లేకపోవడంతో మార్కెట్లకు దిశానిర్దేశం కరవైంది. ఈ వారం చివర్లో జరగనున్న ఆర్థిక విధాన సదస్సు నుంచి వచ్చే సంకేతాలపై మదుపర్లు దృష్టి పెట్టడం ప్రభావం చూపింది. ఇక గత రెండు రోజులుగా కుదేలైన ఇన్ఫోసిస్ షేరు తిరిగి లాభాల్లోకి వచ్చింది. కొనుగోళ్ల మద్దతుతో 0.42 శాతం పెరిగి రూ.877.15 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 31393.93 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 31,484.28 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. చివరకు 33 పాయింట్ల లాభంతో 31,291.85 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ ఇంట్రాడేలో 9,800 మైలురాయిని అధిగమించింది. అయితే లాభాల స్వీకరణతో.. 11.20 పాయింట్లు పెరిగి 9,765.55 దగ్గర స్థిరపడింది.

హెచ్‌సీఎల్ ఇన్ఫో మెరుపులు: భారత విపణిలో ఐఫోన్ సహా యాపిల్ ఉత్పత్తులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ షేరు దూసుకెళ్లింది. ఒకానొక దశలో 17.30 శాతం పెరిగిన షేరు.. చివరకు 9.41 శాతం లాభంతో రూ.47.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభాలతో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ 2.67%, లుపిన్ 2.32%, సన్‌ఫార్మా 2.24%, ఓఎన్‌జీసీ 1.11%, యాక్సిస్ బ్యాంక్ 1.01%, విప్రో 0.66%, హిందుస్థాన్ యునిలీవర్ 0.64%, హెచ్‌డీఎఫ్‌సీ 0.63%, భారతీ ఎయిర్‌టెల్ 0.63%, ఇన్ఫోసిస్ 0.42%లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఎన్‌టీపీసీ అత్యధికంగా 2.56% నష్టపోయింది. హీరో మోటోకార్ప్ (2.07%), బజాజ్ ఆటో (1.09%), టీసీఎస్ (1.01%) చొప్పున నష్టాలను చవిచూశాయి.

నేటి మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సంకేతాలు అందిపుచ్చుకునే అవకాశం ఉండటంతో నేడూ సూచీల లాభాలు కొనసాగొచ్చు. అయితే మదుపర్ల లాభాల స్వీకరణతో ఇవి నిలబడకపోవచ్చని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. గురువారం నుంచి అమెరికాలోని జాక్సన్ హోల్‌లో ప్రారంభం కానున్న అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల అధిపతుల సదస్సుపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ఇన్ఫోసిస్ సీఈఓగా విశాల్ సిక్కా వైదొలిగిన తర్వాత కంపెనీ భవితవ్యంపై మదుపర్లు ఆందోళన చెందుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. అయితే ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు మార్చి వరకు తీసుకున్న గడువు, చాలా ఎక్కువని చెబుతున్నారు. మదుపర్ల సెంటిమెంట్ బలంగా లేకపోవడంతో నిఫ్టీ 9800 పాయింట్ల ఎగువన కొనసాగడం కష్టతరమేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. నేడు నిఫ్టీ 9700- 9850 పాయింట్ల శ్రేణిలో చలించే అవకాశం ఉంది.

క్రీడా అంకురాల కోసం..

26 నుంచి ఆగస్ట్‌ఫెస్ట్

ఈనాడు, హైదరాబాద్: అంకుర సంస్థలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ఒకే చోట అందించే ఆగస్ట్‌ఫెస్ట్ 5వ విడత సదస్సు హైదరాబాద్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జరగనుంది. ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించే ఈ సదస్సులో ఈసారి క్రీడా సంబంధిత అంకురాలకు ప్రాధాన్యం కల్పించనున్నారు. ఇందులో దేశ, విదేశాలకు చెందిన పలువురు నిపుణులు ప్రసంగించనున్నారు. ఈ సదస్సు వివరాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రస్తుతం 2500 వరకూ అంకుర సంస్థలున్నాయనీ, వీటి సంఖ్య పెరుగుతోందని తెలిపారు. అంకుర సంస్థలు ఏర్పాటు చేసే వారికి అనేక సందేహాలుంటాయనీ, వాటన్నింటికీ పరిష్కార మార్గాలు తెలుసుకునేందుకు ఆగస్ట్‌ఫెస్ట్‌లాంటివి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ రంగంలో నిపుణులతో చర్చలను ఏర్పాటు చేయడం వల్ల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపార సూత్రాలు సులువుగా అర్థం చేసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఆటకూ లీగ్‌లు ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఈ రంగంలో ఔత్సాహికులకు ఎన్నో వ్యాపారావకాశాలున్నాయన్నారు. ఆటలు, ఫిట్‌నెస్‌లపై దృష్టి పెరిగినందున దీనికి సంబంధించిన యాప్‌లకు ఆదరణ లభించే అవకాశాలున్నాయని తెలిపారు. ఆగస్ట్‌ఫెస్ట్ వ్యవస్థాపకుడు ఆది వేమూరి మాట్లాడుతూ.. స్పోర్ట్స్ కార్నివాల్‌తోపాటు, ఇప్పటికే ఉన్న అంకుర సంస్థలకు నిధుల సమీకరణ, వ్యాపారాభివృద్ధికి సంబంధించిన అంశాలపై స్కేల్‌అప్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు విభాగాల్లో కలిపి 25 అంకురాలు పాల్గొంటున్నాయన్నారు. అక్టోబరులో మరో సదస్సును ప్రత్యేకంగా పెట్టుబడిదారుల కోసం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఫ్యూజి, ఎక్నోవేట్ విలీనం


ఈనాడు, హైదరాబాద్: తెలుగు వారికి చెందిన ఫ్యూజి ఐఎన్‌సీ, ఎక్నోవేట్ ఐఎన్‌సీలు విలీనమయ్యాయి. ఈ రెండు కంపెనీలకు హైదరాబాద్‌లో కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి కంపెనీకి ఉన్న ప్రత్యేక సామర్థ్యాలను, ఇరు కంపెనీలు వినియోగించుకోవడానికి ఈ విలీనం దోహదం చేస్తుంది. ఇకపై ఫ్యూజి బ్రాండ్‌తో సేవలు అందిస్తారు. విలీనం నేపథ్యంలో ఇప్పటి వరకూ ఫ్యూజి బోర్డులో సభ్యుడిగా ఉన్న ఎక్నోవేట్ సీఈవో సఫీర్ అదేనీ, ఫ్యూజి ఐఎన్‌సీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూజి ఐఎన్‌సీ సీఈఓగా ఉన్న మనోహర్ రెడ్డి ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ (ఆర్‌పీఏ)లో తమ దృష్టి కొనసాగుతుందని, ఈ రంగంలో కొత్త తరం సొల్యూషన్లను ఫ్యూజి తీసుకురాగలదని సఫీర్ అదేనీ అన్నారు.

డాక్టర్ రెడ్డీస్



రూ.1945 వద్ద ప్రారంభమై రూ.1935- 2014 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.1931.10తో పోలిస్తే రూ.53.05 (2.75%) లాభంతో రూ.1984.15 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 7,72,164.

ఎన్‌టీపీసీ



రూ.173.80 వద్ద మొదలై రూ.167.20- 173.85 మధ్య చలించి క్రితం ముగింపు రూ.172తో పోలిస్తే రూ.4.30 (2.50%) నష్టంతో రూ.167.70 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 45,95,418 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
లక్స్ ఇండస్ట్రీస్	1264.00	సనోఫి ఇండియా	3945.50
అవెన్యూ సూపర్‌మార్ట్స్	968.00	అజంతా ఫార్మా	1135.00
బాటా ఇండియా	690.50	ఇన్ఫోసిస్	860.00
వరుణ్ బెవరేజెస్	573.40	వోకార్డ్	530.65
సన్‌ఫార్మా అడ్వాన్స్‌డ్	419.50	జీటీపీఎల్ హాత్‌వే	130.25
పీసీ జువెలర్	395.70	ఫోర్టిస్ హెల్త్‌కేర్	125.55

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
22/08	3,415	4,244	−829	2,843	2,408	435
17/08	3,453	4,434	−981	2,765	1,936	829
16/08	5,400	6,490	−1,090	3,570	2,233	1,337
14/08	3,231	4,870	−1,639	3,653	2,033	1,619
11/08	4,120	6,063	−1,943	5,086	3,069	2,017

22వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
23న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1789.30 (1792.60) 452387
ADANI PORT & 375.65 (375.95) 3245723
AMBUJA CEMEN 273.15 (274.40) 1561082
ASIAN PAINTS 1129.45 (1134.45) 568911
AUROBIND PHA 695.70 (696.10) 1655559
AXIS BANK LT 499.20 (494.80) 6654272
BAJAJ AUTO L 2740.55 (2766.50) 80340
BANK OFBAROD 139.35 (142.10) 17697793
BHARTI AIRTE 422.10 (419.15) 3115334
BHARTI INFRA 387.85 (386.60) 2609604
BOSCH LTD 21898.60 (21969.50) 6204
BPCL 510.35 (497.75) 4590059
CIPLA 559.25 (561.75) 848353
COAL INDIA L 240.55 (238.45) 3428907
DR. REDDYS 1984.15 (1931.10) 772164
EICHER MOTOR 30977.15 (31634.25) 31872
GAIL 377.75 (374.20) 3395213
HCL TECH 875.85 (874.05) 753231
HDFC 1750.40 (1738.15) 1505736
HDFC BANK 1747.00 (1743.20) 1652389
HERO MOTOCOR 3888.05 (3972.05) 290303
HINDALCO IND 228.90 (224.90) 12201333
HINDUSTAN UN 1199.60 (1191.45) 916218
ICICI BANK 293.95 (293.50) 7549155
INDIABULLS H 1176.35 (1198.70) 817906
INDIAN OIL 423.20 (413.20) 5702775
INDUSINDBANK 1626.30 (1616.10) 694864
INFOSYS LTD 875.40 (873.40) 24621299
ITC 282.90 (281.60) 11956919
KOTAK MAHIND 970.80 (969.55) 1206098
LARSEN & TOU 1117.70 (1127.10) 1361351
LUPIN 944.40 (923.40) 2324978
M&M 1374.65 (1378.65) 292349
MARUTI SUZIK 7496.10 (7501.90) 278131
NTPC LTD 167.70 (172.00) 4595418
ONGC 159.45 (157.15) 5611720
POWER GRID C 219.50 (220.30) 3738881
RELIANCE IND 1560.05 (1564.40) 2179230
SBI 273.90 (274.65) 11814388
SUN PHARMA 470.45 (460.55) 3797497
TATA CONSULT 2497.55 (2528.80) 565663
TATA MOT DVR 224.00 (222.85) 983531
TATA MOTORS 373.60 (374.35) 4163794
TATA POWER 80.05 (80.20) 2316424
TATA STEEL L 619.60 (621.55) 3690708
TECH MAHINDR 439.35 (431.10) 4623000
ULTRATECH 3975.25 (4007.90) 106270
VEDANTA LIMI 293.05 (293.80) 9470347
WIPRO 290.25 (287.70) 2714521
YES BANK LTD 1712.90 (1716.70) 2753748
ZEE ENTERTAI 516.45 (509.30) 1303170

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1357.40 (1356.10) 61604
ASHOK LEYLAN 100.35 (102.25) 8361844
BAJAJ FINANC 1682.90 (1690.60) 654334
BAJAJ FINSER 5234.60 (5216.85) 130727
BEL 178.20 (179.10) 2300591
BHEL 125.65 (124.60) 4718958
BRITANNIA 4198.85 (4229.80) 106183
CADILA HEALT 468.50 (473.25) 984325
COLGATE PALM 1084.75 (1080.45) 317112
CONTAINER 1276.40 (1221.95) 738465
CUMMINS INDI 898.55 (881.50) 204015
DABUR INDIA 301.10 (304.25) 856971
DIVIS LAB 629.20 (622.15) 752436
DLF LIMITED 175.30 (180.40) 15103601
EMAMI LIMITE 1103.05 (1110.05) 38858
GLAXOSMI CON 5383.50 (5382.20) 2509
GLAXOSMI PHA 2365.35 (2385.50) 7928
GLENMARK PHA 601.00 (595.80) 785205
GODREJ CONSU 886.20 (903.60) 534682
HAVELLS INDI 473.05 (474.45) 852424
HINDUSTAN ZI 287.05 (290.90) 1634192
HPCL 449.70 (433.80) 8273312
ICICI PRU LI 418.95 (420.15) 514506
IDEA CELLULR 87.95 (89.25) 7181822
INTERGLOBE A 1228.70 (1270.80) 474156
JSW STEEL LT 231.95 (233.70) 4446520
LIC HOUS.FIN 636.10 (648.40) 1063079
MARICO LIMIT 315.10 (317.85) 1800960
MCDOWELL 2492.60 (2532.60) 136863
MOTHERSON 310.65 (320.40) 4279049
NHPC LTD 29.40 (29.85) 5866585
NMDC LTD 121.90 (121.25) 2556190
OIL INDIA 276.10 (272.70) 517343
ORACLE FIN S 3420.25 (3417.85) 30626
P&G HYG&HEAL 8114.90 (8179.15) 20576
PETRONET LNG 229.10 (228.90) 2642613
PIDILITE IND 819.45 (816.50) 335665
PIRAMAL ENTE 2579.35 (2617.00) 239387
PNB 138.00 (137.60) 9256850
POWER FIN CO 116.75 (118.50) 5779706
RURAL ELEC C 152.90 (161.30) 9930387
SAIL 58.80 (59.45) 4384775
SHREE CEMENT 17181.10 (17128.80) 7091
SHRIRAM TRAN 958.40 (959.55) 528431
SIEMENS 1262.50 (1280.70) 125699
SUN TV LTD 698.15 (719.25) 2082592
TITAN IND 615.10 (615.50) 1367266
TORRENT PHAR 1222.15 (1249.10) 136527
UNITED BREWE 805.45 (803.25) 158541
UPL LIMITED 796.55 (810.75) 1340235

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 172.65 (176.45) 931148
ADANI ENTERP 106.30 (107.50) 4036450
ADANI POWER 27.75 (27.90) 9042178
ALL BANK 64.10 (64.20) 2066440
AMARA RAJA 758.40 (759.75) 476691
ANANT RAJIND 54.80 (55.75) 441783
ANDHRA BANK 49.90 (49.80) 1585700
APOLLO HOSPI 1098.50 (1051.30) 1028554
APOLLO TYRES 259.65 (268.90) 4894280
APTECH 256.30 (228.45) 5941108
BAJAJ ELECT. 333.30 (327.55) 73761
BAJAJ HIND 14.50 (14.55) 5560639
BAJAJ HOLDIN 2609.90 (2622.00) 8098
BALAJI TELE 154.30 (157.95) 388760
BALLARPUR IN 13.30 (14.05) 1105008
BALRAMPUR CH 164.60 (165.55) 864003
BANK OF MAHA 26.70 (26.95) 72102
BANK OFINDIA 139.15 (139.50) 3706438
BATA INDIA 683.20 (669.40) 1566384
BGR ENERGY S 128.35 (129.05) 30700
BHARAT FORGE 1136.65 (1135.85) 688862
BHUSHAN STEE 68.50 (68.20) 762900
BIOCON LTD 328.40 (327.35) 1716908
BOMBAY DYE 74.00 (75.85) 562735
CANARA BANK 326.70 (326.75) 1547503
CEAT LIMITED 1628.80 (1675.65) 1192449
CENTRAL BANK 73.30 (73.85) 507546
CHAMBAL FERT 141.50 (140.15) 672047
CHENNAI PETR 403.25 (402.00) 1317979
CITY UNIBANK 156.55 (155.60) 219773
CORPO BANK 44.45 (45.15) 135755
COX & KINGS 261.45 (265.10) 67885
D B REALTY L 35.10 (36.10) 293060
DELTA CORP L 173.20 (171.30) 2806513
DENA BANK 30.40 (30.95) 469537
DHANALAKBANK 33.15 (33.95) 474448
EDELWEISS CA 241.00 (245.00) 2206411
EDUCOMP SOLU 7.95 (8.00) 179673
EID PARRY 319.90 (323.90) 56800
EIH 133.50 (138.15) 130743
ESSAR SHIPPI 27.00 (29.00) 508877
ESTER INDUST 32.50 (32.75) 7278
EXIDE INDUST 197.15 (201.35) 4483993
FEDERAL BANK 105.30 (106.00) 6070776
FINOLEX CABL 531.25 (530.30) 41743
G E SHIP LTD 389.90 (390.55) 44926
GAMMON INDIA 8.45 (8.55) 182669
GAMMON INFRA 3.90 (3.95) 890457
GATI LIMITED 107.90 (108.05) 275583
GAYATRI PROJ 162.55 (161.05) 55387
GITANJALIGEM 60.60 (61.15) 197714
GMR INFRASTR 17.00 (17.50) 33758942
GODREJ IND 577.65 (582.90) 173368
GRASIM IND 1114.25 (1111.45) 1194083
GUJ ALK&CHEM 409.50 (410.60) 103113
HCL INFOSYS 47.00 (42.90) 10794592
HEXA TECH 265.10 (265.65) 1006519
HIMACHAL FUT 15.70 (15.85) 1839235
HINDU MOTORS 8.15 (8.00) 439923
HOUSING DEV 59.55 (58.20) 22349509
IDBI 53.70 (54.10) 2456898
IDFC 53.85 (54.30) 2318267
IFCI 22.75 (22.90) 3605215
IL&FS TRANS 76.40 (78.20) 150056
IND SWIFTLAB 33.30 (33.20) 33102
INDBULLS REL 219.10 (222.50) 8496282
INDIA CEM 174.20 (177.65) 3212566
INDIAN BANK 290.15 (296.90) 1044992
INDO RAMA SY 26.60 (26.70) 28654
INDRAPRASTHA 1259.30 (1256.25) 240134
IND-SWIFTLTD 7.55 (7.85) 24865
INGERSOLL-R 778.85 (790.50) 9034
IOB 22.45 (22.55) 352580
IPCA LAB 408.80 (409.70) 317460
IRB INFRA DE 209.85 (206.45) 2320320
J&K BANK 79.75 (80.85) 862302
JAI CORP 76.50 (78.25) 568565
JAIN IRRIGAT 93.25 (95.90) 3638019
JAYPEE INFRA 14.70 (15.45) 3815145
JAYSHREE TEA 99.65 (99.90) 25303
JET AIRWAYS 556.75 (559.85) 1571820
JINDAL SAW 90.35 (90.75) 556977
JINDAL STEEL 129.00 (131.70) 7656731
JK LAKSHMI C 412.45 (413.30) 40896
JK PAPER LIM 93.25 (93.15) 272272
JM FINANCIAL 124.50 (121.25) 841261
JP ASSOCIATS 21.00 (21.85) 90314893
JSW ENERGY L 61.00 (62.80) 6564095
JUBILANT FOO 1357.10 (1383.60) 993348
JUBILANT ORG 708.40 (697.20) 262741
JYOTHY LABS 375.05 (375.60) 18227
KARNATA BANK 140.95 (141.80) 1695830
KEC INTL LTD 297.30 (297.45) 251369
KOLTE PATIL 161.15 (164.40) 33756
KPIT CUMMINS 110.00 (110.90) 458569
LAK VIL BANK 177.90 (177.80) 978814
M & M FINANC 404.75 (403.95) 2350365
MANAPPURAM G 91.60 (94.60) 14920381
MMTC LIMITED 55.15 (55.75) 303461
MOSER-BEAR 4.55 (4.75) 246880
MPHASIS LTD 592.80 (592.30) 9002
MRPL 123.45 (123.40) 2511235
MTNL 17.25 (17.70) 611238
NCC LIMITED 84.15 (85.05) 1910823
NETWORK18 FI 49.05 (50.35) 533017
NEULAND LAB 1242.45 (1252.15) 3141
NIIT LTD 91.80 (89.00) 911439
NIIT TECHNOL 484.20 (483.55) 350541
OMAXE LTD 200.60 (201.15) 597498
ONMOBILE GLO 55.40 (57.60) 212635
ORIENT PAPER 94.75 (95.30) 130353
ORIENTALBANK 119.65 (120.00) 2760589
PARSVNATH DE 20.40 (20.70) 390684
PATEL ENGG 68.65 (69.35) 97854
PFIZER 1763.30 (1779.70) 30466
POLARIS SOFT 240.05 (239.95) 52905
POWERTRADING 110.20 (111.00) 3411054
PRAJ IND 66.50 (67.50) 209245
PRISM CEMENT 107.55 (111.30) 57761
PROVOGUE (IN 4.00 (4.05) 75742
PUNJ LLOYD 18.80 (19.00) 709707
PUNJAB & SIN 47.40 (47.90) 44482
PURAVANKARA 70.20 (72.55) 80738
PVP VENTURES 4.75 (4.75) 128868
PVR LIMITED 1272.35 (1280.65) 177930
RADICO KHAIT 162.65 (160.90) 910754
RAJ OIL MILL 1.35 (1.30) 35213
RAJESH EXPOR 719.15 (720.35) 833989
RALLIS INDIA 227.75 (228.35) 97521
RAMCO IND 236.70 (230.45) 118105
RAMCO SYS 363.80 (342.25) 212643
RAMKY INFRA 80.05 (81.75) 53703
RAYMOND 731.35 (744.90) 386905
RELIANCE CAP 744.45 (775.45) 5218291
RELIANCE COM 22.90 (23.40) 20863144
RELIANCE INF 465.65 (468.70) 2491036
RELIANCE POW 38.50 (39.25) 2415881
ROLTA INDIA 52.70 (53.15) 179456
SAGAR CEMENT 809.35 (818.75) 4476
SAREGAMA 390.30 (394.75) 78297
SHANTHI GEAR 132.00 (130.75) 28246
SHIPPNG CORP 90.00 (89.50) 1211567
SHREE RENUKA 17.30 (16.90) 8129263
SINTEX IND 29.85 (31.50) 40665156
SOBHA DEVELO 387.55 (392.30) 90498
SOUTHINDBANK 26.55 (26.95) 12615349
STERLITE TEC 213.70 (215.50) 764845
SUJANA METAL 1.60 (1.60) 159362
SUN PHARMA 416.85 (406.20) 1179930
SUND FASTNER 386.25 (388.95) 56745
SUZLON ENERG 16.05 (16.15) 46896812
SYND. BANK 62.75 (63.00) 1560766
TATA CHEM 582.80 (586.50) 509709
TATA COFFEE 132.90 (137.35) 483667
TATA COMMUN 615.25 (631.00) 474392
TATA GLOBAL 189.85 (196.15) 7466196
TATA METALIK 628.00 (638.00) 73309
TATA TELESER 6.70 (6.65) 925020
THE INDIAN H 111.45 (119.90) 1016025
TORRENT POWE 208.55 (211.60) 1419907
TRIVENI ENGG 89.05 (90.65) 865263
TTK PRESTIGE 6365.60 (6351.50) 6222
TV TODAY NET 242.05 (244.45) 122155
TV18 BROADCA 35.50 (35.90) 2602874
TVS MOTOR 582.60 (574.35) 1819737
UCO BANK 30.00 (30.15) 518701
UNION BANK 128.95 (131.00) 4455494
UNITECH 7.15 (7.50) 24365818
UNITED BANK 17.95 (17.95) 350894
USHA MARTIN 19.05 (19.30) 514283
VADILAL INDU 852.85 (860.00) 26620
VENKYS 1964.10 (2007.05) 107775
V-GUARD IND 180.55 (177.55) 530220
VIJAYA BANK 63.70 (62.90) 1103304
VIP 208.30 (206.10) 1085723
VOLTAS 524.90 (532.60) 973052
ZEE LEARN LI 41.20 (41.85) 140079
ZUARI GLOBAL 116.50 (116.10) 3744
ZYDUS WELLNE 865.50 (860.85) 2625

ఘనం (+)

నిఫ్టీ	22న	మార్పు %
DR. REDDY'S LAB	1984.15	2.75
BPCL	510.35	2.53
INDIAN OIL CORP	423.20	2.42
LUPIN	944.40	2.27
SUN PHARMA	470.45	2.15
TECH MAHINDRA	439.35	1.91
HINDALCO	228.90	1.78

గ్రహణం (-)

నిఫ్టీ	22న	మార్పు %
NTPC	167.70	-2.50
HERO MOTOCORP	3888.05	-2.11
EICHER MOTORS	30977.15	-2.08
BANK OF BARODA	139.35	-1.94
INDIABULLS HSG	1176.35	-1.86
TCS	2497.55	-1.24
BAJAJ AUTO	2740.55	-0.94

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 755.55 (767.75) 3166
AMAR RAJA BA 758.55 (759.95) 29934
ANDHRA BANK 49.85 (49.85) 160578
ANDHRA CEMEN 8.57 (8.74) 10550
ANDHRA PAPER 294.75 (296.70) 1231
ANDHRA PETRO 30.30 (28.85) 137376
ANDHRA SUGAR 340.30 (341.85) 4185
ANJANI PORTL 206.25 (210.10) 136
ASTRA MICROW 121.90 (122.10) 13474
AUROBINDO PH 695.45 (695.50) 130477
AVANTEL SOFT 239.25 (238.75) 2603
AVANTI FEEDS 1923.35 (1929.95) 12404
AVON ORG 4.45 (4.70) 14595
BALAJI AMIN 310.55 (313.95) 3577
BARTRONICS 13.85 (14.15) 8475
BHAGIRA CHEM 194.95 (191.15) 35674
BN RATHI SEC 30.40 (31.65) 3190
BRILLIANT SE 7.62 (7.60) 577339
CAMBRIDGE TE 73.50 (72.10) 3843
COMBAT DRUGS 11.71 (11.71) 125
CONT COFFEE 274.80 (275.80) 418
COROMAN FERT 421.75 (437) 7748
CYIENT LIMIT 513.55 (508.45) 1214
DIVI'S LAB 630.25 (622.45) 64960
DIVYA GRANIT 96.95 (97.20) 4274
DR REDDY 1984.85 (1933.15) 59010
FOUR SOFT 96.20 (101.50) 8032
GATI CORPN 107.85 (107.60) 40345
GMR INFRASTR 17.05 (17.50) 2069789
GOLDST INFRA 130.05 (136.85) 222952
GRANULES (I) 127.20 (126) 183462
GVK POWER 12.36 (12.77) 1686180
HBL NIFE POW 43.70 (44.70) 28247
HERITAGE FOO 1299.25 (1290.45) 1711
IDL INDUSTRS 521.30 (538.20) 3704
ILFS ENGINEE 40.35 (41.70) 13542
INNAREDY COM 2.69 (2.61) 6965
IVRCL INFRAS 4.94 (4.96) 527439
KALLAM SPG 32.60 (34.90) 158746
KAVERI SEED 531.05 (542.15) 62170
KCP LTD 103.60 (103.10) 32060
LANCO INFRAT 0.86 (0.90) 2578467
LAURUS LABS 519.25 (526.35) 7235
LOKESH MACH 78 (78.05) 12303
MADHUCON PRO 28.85 (29.20) 5951
MIC ELECTRON 7.85 (7.92) 58781
MOLD-TEK.TEC 49.75 (49.80) 13129
MOLDTK PLA 298.10 (297.85) 4591
NAGARJAGRICH 34.10 (35.30) 19221
NATCO PHARMA 733.05 (723.70) 131650
NAVA BH VENT 120.25 (124.15) 68109
NCC 84.15 (85.20) 304612
NCL IND 232.50 (235.60) 60277
NEHA INTER 4.70 (5.04) 44722
NETTLINX 88.95 (93.90) 17644
NEULAND LAB 1250.70 (1264.65) 47
NIHAR INFO 16 (16.95) 600
PANYAM CEMEN 57.95 (60.80) 8601
PENNER IND 55.85 (57.10) 73144
PITTI LAMIN 58.75 (60.30) 62143
POKARNA 1160.80 (1179.80) 1076
PREMIER EXPL 441.50 (452.95) 4607
PRISM CEMENT 107.85 (111.15) 6866
PRUDENTL PHA 3.98 (4.03) 92625
RAIN INDUSTR 137.40 (139.80) 460978
SAMKRG PIST 259.70 (253.75) 4569
SAMPRE NUTRI 38.50 (39) 5209
SATVAH. ISPA 35.55 (35.75) 2529
SOUTH BIO TE 2.99 (3.20) 43944
SPHERE GLOBA 44.80 (44.50) 20582
SREE RAYAL A 27.10 (27.55) 183639
STEEL EXCHAN 83.80 (80.30) 106255
SUJANA METAL 1.54 (1.61) 35056
SUJANA TOWER 4.02 (4.25) 27252
SURANA TELE 4.63 (4.61) 11803
SURYALAKSH.C 96.05 (97.25) 23649
SUVEN PHARMA 161.45 (164.55) 48722
TAJ GVK HOTE 153.60 (156.80) 10613
TANLA 32.65 (33) 31450
TERA SOFTWAR 60.20 (62.25) 5952
VAMSHI RUBB 60.15 (56.95) 7370
VIMTA LABS 129.80 (129.50) 6164
VISAKA IND 515.15 (520.55) 23847
VISTA PHARMA 34.05 (32.45) 49030
VIVIMED LABS 100.30 (104.25) 151787
YBRANT DIGIT 6.35 (6.53) 93609
ZENTECH 51.45 (51.15) 11492



హ్యుందాయ్ అయిదో తరం వెర్నా

దిల్లీ: దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎమ్ఐఎల్) తమ మధ్య శ్రేణి సెడాన్ వెర్నా మోడల్‌లో అయిదో తరం వెర్షన్‌ని విపణిలోకి ప్రవేశపెట్టింది. ఇది పెట్రోల్, డీజిల్ వెర్షన్‌లలో లభించనుంది. పెట్రోల్ వెర్షన్ ధర రూ.7.99- 12.23 లక్షల మధ్య ఉండగా, డీజిల్ వెర్షన్ ధర రూ.9.19- 12.61 లక్షలు (ఎక్స్‌షోరూమ్ దిల్లీ)గా ఉంది. మధ్య శ్రేణి సెడాన్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్న మారుతీ సుజుకీ సియాజ్, హోండా సిటీలతో వెర్నా పోటీపడనుంది. 1.6 లీటర్ పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌లు కలిగిన మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లలో కొత్త వెర్నా లభించనుంది. వెర్నా కొత్త వెర్షన్ ప్రారంభ ధరలు మొదటి 20,000 వినియోగదారులకు మాత్రమే వర్తిస్తాయని, అనంతరం కొత్త ధరలను నిర్ణయిస్తామని కంపెనీ డైరెక్టర్ (అమ్మకాలు, మార్కెటింగ్) రాకేశ్ శ్రీవాస్తవా తెలిపారు.

ఈనాడు బిజినెస్

బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ ఉంచకపోతే ఆయా బ్యాంకులు వసూలు చేస్తున్న ఛార్జీలు అధిక స్థాయిలో ఉంటున్నాయని, వీటిని నియంత్రించాలని కోరుతున్నారు ఖాతాదార్లు. ముఖ్యంగా తక్కువ స్థాయి ఆదాయ వర్గాలపై ఇవి భారాన్ని మోపుతున్నాయని.. వెంటనే ఈ ఛార్జీల తగ్గింపుపై బ్యాంకులు దృష్టి పెట్టాలని వారు సూచిస్తున్నారు.



వసూల్ రాజా!

- కనీస నిల్వ పేరుతో నడ్డివిరుస్తున్న బ్యాంకులు
- ఛార్జీల భారం సామాన్యుడిపైనే అధికం
- ఖాతాల నుంచి ఏటా రూ.కోట్లల్లో వసూళ్లు
- ఒక్కో బ్యాంకుది ఒక్కో రకమైన వడ్డన..

ఈనాడు - అమరావతి

డబ్బులేనిదే అడుగుతీసి అడుగేయలేం. ఇది వాస్తవం. అందుకే మన అవసరాలు పోగా.. కొద్దో, గొప్పో బ్యాంకుల్లో దాచుకుంటాం. ఇది మనమంతా చేసేదే. ఎందుకుంటే సొమ్ముకు రక్షణ ఉంటుందని.. ఎంతోకొంత వడ్డీ డబ్బులైనా వస్తాయని. సాధారణంగా అవసరాలకు అనుగుణంగా వాడుకోవడానికి పొదుపు (సేవింగ్స్) ఖాతాల్లోనే నిల్వ చేసుకుంటాం. నెలాఖరుకు అనుకోకుండా వచ్చే ఖర్చులను తట్టుకోవడానికి ఒక్కోసారి ఆ డబ్బులు వాడుకుంటాం.

ఇదేనా మనం చేస్తున్న తప్పు. అవునంటున్నాయి బ్యాంకులు. మీ ఖాతాల్లో కనీస నిల్వలు లేనప్పుడు ఛార్జీలు విధించడం సహజమేనని చెబుతున్నాయి. అయితే ఆ ఛార్జీలే భరించలేకుండా ఉంటున్నాయని అంటున్నారు ఖాతాదారులు. ఛార్జీలు ఎక్కువ స్థాయిలో ఉండటంతో పాటు, ఖాతాల్లో నిర్వహించాల్సిన కనీస మొత్తం పరిమితులు కూడా అధికంగానే ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు వారు.

ముఖ్యంగా మెట్రో నగరాలు, పెద్ద పట్టణాల్లో ఈ నిల్వల పరిమితి ఎక్కువగా ఉంటోంది. ఇదే భారంగా మారుతోందన్నది వారి మాట. మెట్రో నగరాలు, పట్టణాల్లో బతుకుతున్నంత మాత్రాన అందరి బతుకులూ లోటులేకుండా సాగిపోయే స్థాయిలో ఉండవని, పేదవాళ్లు, సగటు జీతగాళ్లు, దిగువ మధ్య తరగతి వ్యక్తులు, **పింఛన్లు పొందే వృద్ధులు** కూడా ఉంటారన్న విషయాన్ని బ్యాంకులు పట్టించుకోవాలని వారు సూచిస్తున్నారు. అందరినీ ఒకే గాటన కట్టేయడం.. అందరికీ ఒకేరీతిన ఛార్జీలు వడ్డించేయడం ఇబ్బంది కలిగించే విషయమని అంటున్నారు. నిజమేగా మరి.

బ్యాంకులు వసూలు చేస్తున్న అధిక ఛార్జీల వల్ల ఎక్కువ భారాన్ని మోస్తున్నవారిలో ప్రధానంగా సామాన్యులు, రైతులు, విద్యార్థులు, చిన్న ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఉంటున్నారు. రిజర్వు బ్యాంకు నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం వల్ల ఒక్కో బ్యాంకు ఒక్కో రీతిలో మెట్రో, పట్టణం, సెమీ అర్బన్, గ్రామీణం.. అంటూ వర్గీకరించి ఈ ఛార్జీలను వసూలు చేస్తున్నాయి.

దేశవ్యాప్తంగా..

రూ.235 కోట్లు... ఈ ఏడాది తొలి త్రైమాసికంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతాల్లో 'కనీస నిల్వ' (మినిమమ్ బ్యాలెన్స్) పాటించని ఖాతాదారుల నుంచి ఛార్జీల రూపేణా వసూలు చేసిన సొమ్ము ఇది. దేశవ్యాప్తంగా ఇలాంటి 388.74 లక్షల మంది ఖాతాదారుల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినప్పుడు ఎస్‌బీఐ ఈ వివరాలు బయటపెట్టింది. మిగిలిన బ్యాంకులు కూడా కొంచెం అటూఇటూగానే ఛార్జీలను వసూలు చేసి ఉండొచ్చని భావించొచ్చు. ఆయా బ్యాంకులు తమ వద్ద 'కనీస నిల్వ' పాటించని ఖాతాదారుల నుంచి ప్రతి మూడు నెలలకోసారి జరిమానా రూపంలో రూ.50 నుంచి రూ.750 వరకు వసూలు చేస్తున్నాయి.

రూ.5వేలకు పెంచిన ఎస్‌బీఐ

ఎస్‌బీఐలో ఇటీవల పలు బ్యాంకులు విలీనమయ్యాయి. ఆ బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాల్లో పాటించాల్సిన కనీస నిల్వ పరిమితిని అమాంతం పెంచేసింది. సేవింగ్స్ ఖాతాల్లో ఖాతాదారు కనీసం రూ.5వేలు నిల్వ ఉంచాలి. అలా చేయని పక్షంలో మూడు నెలలకోసారి ఆ బ్యాంకు 'నెల సగటు నిల్వ' (మంత్లీ యావరేజ్ బ్యాలెన్స్) ఛార్జీల పేరిట రూ.వంద, సేవా పన్నులు కలిపి వసూలు చేస్తోంది. ఇలా ఒక్కో బ్యాంకు ఒక్కో విధంగా ఖాతాదారుల నుంచి ఛార్జీల రూపేణా భారీ ఎత్తున వసూలు చేస్తున్నాయి.

15% ఇలాంటి ఖాతాలే

బ్యాంకుల్లో ప్రధానంగా సేవింగ్స్, కరెంటు ఖాతాలని రెండు రకాలు ఉంటాయి. ప్రతి ఖాతాలోనూ ఆయా బ్యాంకులు ప్రతి నెలా ఇంత మొత్తంలో తప్పనిసరిగా 'కనీస నిల్వ' ఉండేలా పాటించాలని చెబుతుంటాయి. చాలా మంది బ్యాంకుల సూచించిన మేరకు కనీస నిల్వలు పాటించకుండా డబ్బులు అవసరాలకు ఉపయోగించుకుంటూ ఉంటారు. ఆయా ఖాతాల నుంచి ఆ బ్యాంకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇంతని ఛార్జీలు, సేవా పన్నుల రూపేణా వసూలు చేస్తున్నాయి. ప్రతి బ్యాంకు శాఖలోనూ కనీసం 15 శాతం ఇలాంటి ఖాతాలు ఉంటాయని అంచనా.

ఏ బ్యాంకు రేటు ఆ బ్యాంకులదే

కనీస నిల్వల విషయంలో బ్యాంకులు ఏకీకృతంగా వ్యవహరించడంలేదు. దాంతో ఒక్కో బ్యాంకు ఒక్కో విధంగా ఛార్జీలను నిర్ణయించాయి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతం		కనీస నిల్వ	ఛార్జీలు (సేవా పన్నులు అదనం)
మెట్రో ప్రాంతాలు	:	5000	100
పట్టణ ప్రాంతాలు	:	3000	50
సెమి అర్బన్	:	2000	50
గ్రామీణం	:	1000	25-50

అంకెలు రూపాయలలో

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు

నాలుగు రకాల శ్లాబులుగా వర్గీకరించి ఛార్జీలు వసూలు చేస్తోంది.

కనీస నిల్వ శ్లాబు	నగరాలు/పట్టణాలు	సెమీ అర్బన్/గ్రామీణ
7500-10000	150	-
5000-7500	300	-
2500-5000	450	150
0 - 2500	600	300

అంకెలు రూపాయలలో

ఆంధ్రా బ్యాంకు: ఆరు రకాల సేవింగ్స్ ఖాతాలను అమలు చేస్తోంది. ఖాతాను బట్టి కనీస నిల్వ రూ.వంద నుంచి రూ.5లక్షల వరకూ పాటించాలి. లేకుంటే ప్రతి మూడు నెలలకొకసారి ఖాతాను బట్టి రూ.వంద నుంచి రూ.250 వరకు ఛార్జీలు వసూలు చేస్తోంది.

ఐసీఐసీఐ బ్యాంకు: మెట్రో, పట్టణ ప్రాంతాలకు కనీస నిల్వను రూ.10000గా, సెమీ అర్బన్‌లో రూ.5000గా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,500గా నిర్ణయించింది. అన్ని ప్రాంతాల్లోనూ ఆ మేరకు నిల్వ లేకపోతే రూ.750లను ఛార్జీలుగా వసూలు చేస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో

తెలుగు రాష్ట్రాల్లో కూడా సామాన్యులు ఇలా 'కనీస నిల్వ' బారిన పడుతున్నారు.

- తెలంగాణాలో 5259 బ్యాంకుల్లో మొత్తం 5.05 కోట్ల ఖాతాలున్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంఖ్య దాదాపు 6.50కోట్ల ఖాతాలున్నట్లు అంచనా.
- బ్యాంకుల వద్ద, బ్యాంకర్ల కమిటీ వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ఖాతాలున్నాయనే దానిపైన నిర్దిష్ట సమాచారం లేదు.
- వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జన్‌ధన్‌యోజన పథకం కింద తెలంగాణలో 52.23 లక్షలు, ఆంధ్రాలో 1.18కోట్ల ఖాతాలున్నాయి.
- జన్‌ధన్‌యోజన ఖాతాల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు. కొన్ని బ్యాంకులు సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించిన ఖాతాల నుంచి కూడా వసూలు చేయడం లేదు. మరికొన్ని మాత్రం వసూలు చేస్తున్నాయి.

దిల్లీ విమానాశ్రయ విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేసిన జీఎంఆర్

2021కల్లా నాలుగో రన్‌వే

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ గ్రూపు సారథ్యంలోని దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ (డీఐఏఎల్) విస్తరణకు రంగం సిద్ధం అయ్యింది. మొత్తం మూడు దశల్లో విమానాశ్రయ విస్తరణ చేపట్టనున్నారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐఏ) టెర్మినళ్లు, ఎయిర్‌సైడ్, లాండ్‌సైడ్‌ల విభాగాల్లో సామర్థ్యం పెంచేందుకు 2016లో డీఐఏఎల్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. పౌర వియానయాన శాఖ, వాటాదార్ల అనుమతితో దీనికి తుదిరూపునిచ్చినట్లు డీఐఏఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ ప్రమాణాలను కల్పించే అంశంలో ఎలాంటి రాజీ పడకుండా, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఈ విస్తరణ చేపడుతున్నట్లు జీఎంఆర్ పేర్కొంది. 3ఏ (2018-21), 3బీ (2021-25), నాలుగో దశ (2026 నుంచి) ఇలా మొత్తం మూడు దశల్లో ఈ విస్తరణ పూర్తి చేయనుంది. దీనిపై డీఐఏఎల్ సీఈఓ ఐ.ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. విమానాశ్రయంలో ప్రయాణీకులకు ఆధునిక, ప్రపంచ స్థాయి ప్రమాణాలను కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే టెర్మినల్-1, టెర్మినల్-3లను విస్తరించడంతోపాటు, నాలుగో రన్‌వేను నిర్మించనున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం.. టెర్మినల్ 1 సామర్థ్యాన్ని 2కోట్ల ప్రయాణికుల సామర్థ్యం నుంచి 4 కోట్లకు, టెర్మినల్-3 సామర్థ్యాన్ని 3.4కోట్ల నుంచి 4.5కోట్ల వరకూ పెంచుతున్నట్లు పేర్కొన్నారు. నాలుగో రన్‌వే నిర్మాణం 2021కల్లా పూర్తవుతుందని పేర్కొన్నారు.

7, 8 తేదీల్లో టై-ఐఎస్‌బీ కనెక్ట్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో అంకుర కంపెనీలకు నిధులు అందించే వ్యవస్థ (ఎకో సిస్టమ్స్) బాగా అభివృద్ధి చెందిందని, హైదరాబాద్ కేంద్రంగా పని చేసే అంకురాలకు నిధులు సమకూర్చడానికి దాదాపు 100 ఫండ్‌లు ఉన్నాయని టై (ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రదీప్ మిత్తల్ తెలిపారు. ఒక్కో నిధి రూ.50-200 కోట్ల నిధులు కలిగి ఉన్నాయని వివరించారు. అంకుర కంపెనీలకు మంచి విలువ వస్తోందని, గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో ఉపయోగపడే సొల్యూషన్లను అభివృద్ధి చేసే అంకురాలకు భవిష్యత్తు ఉందన్నారు. వచ్చే నెల 7, 8 తేదీల్లో టై-ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) కనెక్ట్ కార్యక్రమం జరగనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది దాదాపు 500 మంది ప్రతినిధులు 40 వక్తలు, 30 మంది మదుపర్లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారని, ఈ సారి కూడా అదే స్థాయిలో పాల్గొనే వీలుందని టై-ఐఎస్‌బీ కనెక్ట్ కమిటీ ఛైర్మన్ శ్రీని చందుపట్ల తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఐఎస్‌బీ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యువర్‌షిప్ అధిపతి అరుణ రెడ్డి పాల్గొన్నారు.

స్పెక్ట్రమ్ చెల్లింపులకు 16 ఏళ్ల గడువు!

దిల్లీ: స్పెక్ట్రమ్ కోసం చెల్లింపులకు 16 ఏళ్ల గడువు ఇచ్చేందుకు మంత్రి వర్గ సంఘం సుముఖంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. వేలంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌కు ముందస్తుగా కొంతమొత్తాన్ని టెలికాం సంస్థలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నాయి. అనంతరం రెండేళ్ల విరామం (మారటోరియం) తరవాత, 10 వార్షిక వాయిదాల్లో మిగిలిన మొత్తాన్ని కట్టాల్సి ఉంటుంది. టెలికాం నెట్‌వర్క్ సంస్థలు ఆర్థికంగా కష్టాల్లో ఉన్నందున, ఈ చెల్లింపు గడువును 16 ఏళ్లకు పెంచాలని సంఘం సిఫారసు చేయనుందని ఆయా వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక, టెలికాం శాఖల్లోని ఉన్నతాధికారులు ఈ సంఘంలో ఉన్నారు. అయితే రెండు నెట్‌వర్క్ సంస్థల విలీనం, లేదా ఒక సంస్థను మరో సంస్థ కొనుగోలు జరిపినపుడు, సంయుక్త సంస్థ వద్ద ఒకే బ్యాండ్ స్పెక్ట్రమ్ గరిష్ఠంగా 50 శాతం వరకే ఉండాలన్న నిబంధనను పరిహరించాలన్న డిమాండ్ విషయంలో సంఘం ఏ నిర్ణయం తీసుకోలేదు.

'మ్యాక్స్‌క్యూర్'లో మెడికవర్‌కు 51% వాటా

- విలువ రూ.320 కోట్లు
- 'ఆరోగ్యం'లో తొలి 'పశ్చిమ' పెట్టుబడి
- రెండేళ్లలో మరో 1,500 పడకల సామర్థ్యం

ఈనాడు - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 9 ఆసుపత్రులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన మ్యాక్స్‌క్యూర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో పోలెండ్‌కు చెందిన సమగ్ర ఆరోగ్య సంరక్షణ రంగ కంపెనీ మెడికవర్ 51 శాతం వాటాను చేజిక్కించుకోనుంది. ఈ వాటా విలువ రూ.320 కోట్లు. ఈ మొత్తంలో ఇప్పటికే రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టి 22 శాతం వాటాను సొంతం చేసుకుంది. వచ్చే రెండేళ్ల కాలంలో మరో రూ.220 కోట్లు వెచ్చించి మిగిలిన 29 శాతం వాటాను తీసుకోగలదని మ్యాక్స్ క్యూర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. భవిష్యత్తులో మిగిలిన వాటాను కూడా మెడికవర్ కొనుగోలు చేయడానికి అవకాశాలు లేకపోలేదని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకూ దుబాయ్ వంటి ప్రాంతాలకు చెందిన కంపెనీలు దేశీయ ఆసుపత్రుల్లో పెట్టుబడులు పెట్టాయని.. ఒక పశ్చిమ దేశానికి చెందిన కంపెనీ మల్టీ-స్పెషాలిటీ సేవలందిస్తున్న ఒక ఆసుపత్రిలో వాటాను కొనుగోలు చేయడం ఇదే తొలిసారి కావచ్చని మ్యాక్స్‌క్యూర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) హరి కృష్ణ చెప్పారు. మెడికవర్ సంతాన సాఫల్య కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భారత్‌లోకి అడుగు పెట్టింది. 2017 చివరి నాటికి మరో 10 సంతాన సాఫల్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మెడికవర్ ఛైర్మన్ ఫ్రెడ్రిక్ స్టెన్మో తెలిపారు.



చిత్రంలో మ్యాక్స్‌క్యూర్ గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ అనిల్ కృష్ణ (ఎడమ నుంచి రెండో వ్యక్తి). పక్కన మెడికవర్ ఏబీ సీఈఓ ఫ్రెడ్రిక్ రాగ్‌మార్క్, ఛైర్మన్ ఫ్రెడ్రిక్ స్టెన్మో, మ్యాక్స్‌క్యూర్ సీఈఓ హరి కృష్ణ

విస్తరణ పథం...: ప్రస్తుతమున్న 9 ఆసుపత్రుల్లో (హైదరాబాద్‌లో మూడు) మ్యాక్స్‌క్యూర్‌కు 1,500 పడకల సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యాన్ని సమకూర్చుకోవడానికి దాదాపు రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో మ్యాక్స్‌క్యూర్ టర్నోవరు రూ.350 కోట్లు ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.500 కోట్లకు చేరుతుందని అంచనా. వచ్చే రెండేళ్లలో మరో 1,500 పడకల సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలని మ్యాక్స్‌క్యూర్ భావిస్తోంది. ఇందుకు రూ.250-500 కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయని అంచనా. విస్తరణలో భాగంగా కాకినాడ వంటి పట్టణాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

బ్యాంకింగ్ సేవలపై సమ్మె ప్రభావం

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మెతో మంగళవారం బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. బ్యాంకుల విలీన యోచనను వెనక్కి తీసుకోవడంతో పాటు పలు డిమాండ్లు తీర్చాల్సిందిగా ఉద్యోగులు ఒక రోజు సమ్మె బాట పట్టారు. ఈ సమ్మెలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు. చెక్కుల క్లియరింగ్, నగదు బదిలీ, డిపాజిటు, నగదు ఉపసంహరణ సహా వివిధ బ్యాంకింగ్ సేవలపై సమ్మె ప్రభావం పడిందని వివిధ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధాన వ్యాపార కేంద్రాలైన ముంబయి, కోల్‌కతా, పట్నా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె, జైపూర్‌లో సమ్మె ప్రభావం ఎక్కువగా కనిపించింది. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ లాంటి కొత్త తరం ప్రైవేట్ బ్యాంకుల్లో కార్యకలాపాలు యథాతథంగా సాగాయి.



హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బీఐ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగినులు

ప్రైవేటీకరణ యోచన విరమించాలి

యూఎఫ్‌బీయూ

హైదరాబాద్ (సుల్తాన్‌బజార్), న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ యోచనను ప్రభుత్వం విరమించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) రాష్ట్ర కన్వీనర్ వీవీఎస్ఆర్ రాజు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో, నగరంలోని వేర్వేరు బ్యాంకుల నుంచి వందలమంది సిబ్బంది వచ్చి నిరసన వ్యక్తం చేశారు. వీవీఎస్ఆర్ రాజు మాట్లాడుతూ కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకే ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. కారుణ్య నియామకాలు పునరుద్ధరించాలని, ఇటీవల ఖాతాదారులకు పెంచిన ఛార్జీలు ఉపసంహరించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాట్యుటీ సీలింగ్‌ను రూ.20 లక్షలకు పెంచాలని, బ్యాంక్ బోర్డుల్లో వర్క్‌మెన్ డైరెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ డా.నాగేశ్వర్, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్, రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నేత క్రాంతి, అఖిల భారత బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు హర్షవర్ధన్, సుబ్రమణ్యం, ఎన్‌సీబీఈ రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1200 ఆఫర్ ఇచ్చి ఉంటే..

- మదుపర్లలో విశ్వాసం పెరిగేది
- ఇన్ఫీ బైబ్యాక్‌పై బాలకృష్ణన్

దిల్లీ

కంపెనీలో అనిశ్చితుల కారణంగా మదుపర్లలో విశ్వాసం నింపడం కోసం షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్) పరిమాణాన్ని పెంచి ఉంటే బాగుండేదని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ వి. బాలకృష్ణన్ పేర్కొన్నారు. అయితే అమెరికా న్యాయ కంపెనీల దర్యాప్తు ప్రభావం మాత్రం ఆఫర్‌పై ఉండకపోవచ్చని తెలిపారు. బైబ్యాక్‌కు వచ్చిన సమయం(విశాల్ సిక్కా రాజీనామా చేసిన ఒక రోజు తర్వాత) సరిగ్గా లేదని.. అయితే ధర రూ.1150 మాత్రం ఓ మోస్తరుగా బాగానే ఉన్నట్లు లెక్క అని ఆయన అన్నారు. 'బైబ్యాక్ మరింత ఎక్కువ ఉండాల్సింది. ఆఫర్ ధర రూ.1200గా నిర్ణయించి ఉంటే మదుపర్ల విశ్వాసం పెరిగే ఉండేద'ని పీటీఐకి ఆయన తెలిపారు. రూ.13,000 కోట్ల బైబ్యాక్ కోసం ఆఫర్ ధరను రూ.1150గా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇది సిక్కా రాజీనామా చేసిన రోజు షేరు ముగింపుతో పోలిస్తే 25 శాతం ఎక్కువ.



'సీఈఓ వైదొలగిన సమయంలో బైబ్యాక్ ప్రకటించారు. అది కూడా ఈ విషయం గురించి ఏమాత్రం చర్చించకుండా.. అనిశ్చితిని కొనసాగించారు. వ్యవస్థాపకులతో వివాదాలు ఇంకా సద్దుమణగనూ లేదు. అందువల్ల ఎక్కడో ఈ బైబ్యాక్ తన ప్రాభవాన్ని కోల్పోయినట్లు అనిపిస్తోంద'ని బాలకృష్ణన్ అన్నారు. కాగా, బైబ్యాక్‌లో తాను పాల్గొననున్నట్లు ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్పొరేట్ పాలనలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ.. ఛైర్మన్, సహ-ఛైర్మన్‌లు రాజీనామా చేయాలని సోమవారం బాలకృష్ణన్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

'తప్పులను కప్పిపుచ్చుకోవడానికే'

తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే సిక్కా రాజీనామాకు మూర్తి కారణమని బోర్డు చెబుతోందని బాలకృష్ణన్ అన్నారు. వాటాదార్ల కోసం మూర్తి గొప్ప సేవ చేస్తున్నారు. 'కార్పొరేట్ పాలన అంశాలను ముందుకు తీసుకువస్తూ.. బోర్డును బాధ్యత వహించమని చెబుతున్నారు. కంపెనీ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఆయన అలా చేస్తున్నార'ని అన్నారు.

ఆర్థిక మంత్రిని కలిసిన సహ ఛైర్మన్: ఇన్ఫోసిస్ సంక్షోభం నేపథ్యంలో కంపెనీ సహ ఛైర్మన్ రవి వెంకటేశన్ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిశారు. ఇన్ఫీ పరిణామాలను వెంకటేశన్ జైట్లీకి వివరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, ఇన్ఫోసిస్ దీనిపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఇన్ఫీ షేర్లపై కన్నేశాం: సెబీ

ఇన్ఫోసిస్ షేర్ల కదలికలను సునిశితంగా గమనిస్తున్నట్లు మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పేర్కొంది. శుక్రవారం (సిక్కా రాజీనామా రోజున) 10% నష్టపోయిన షేరు ప్రభావంతో, కంపెనీ మార్కెట్ విలువ రూ.22,519 కోట్లు తగ్గింది. శనివారం షేర్ల బైబ్యాక్ ప్రకటించినప్పటికీ. . సోమవారం ఇన్ఫీ షేర్లు మరో 5% నష్టపోయిన సంగతి తెలిసిందే. రెండు రోజుల్లో మొత్తం మీద మదుపర్లు రూ.34,000 కోట్ల దాకా కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేర్ల చలనాలపై ఓ కన్నేసినట్లు సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి పేర్కొన్నారు.

ఈనాడు సినిమా



సందేశాలిస్తే సందేహంగా చూస్తారు

కమర్షియల్ సినిమాల్లో కొత్త కోణం ఆవిష్కరించారు మురుగదాస్. 'రమణ', 'కత్తి'లాంటి కథలు వినడానికి ఆర్ట్ సినిమాల్లా అనిపిస్తాయి. కానీ వాటిని తెరపై ఆవిష్కరించిన విధానంలో పక్కా వాణిజ్య విలువలు కనిపిస్తాయి. దక్షిణాదిలోనే కాదు, బాలీవుడ్‌లోనూ మురుగదాస్ పేరు మార్మోగిపోయింది. 'గజిని', 'తుపాకి' కథలు అక్కడా కాసుల వర్షం కురిపించాయి. ఇప్పుడు మహేష్ బాబుని 'స్పైడర్'గా తీర్చిదిద్దాడు మురుగదాస్. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం దసరా సందర్భంగా విడుదల అవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో మురుగదాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. 'స్పైడర్' గురించి ఆయనేమన్నారంటే...

'స్పైడర్'ని జేమ్స్‌బాండ్ సినిమా స్థాయిలో ఊహించుకొంటున్నారు. ఇది అలాంటి కథేనా?

'జేమ్స్ బాండ్' మరీ పాతబడిపోయాడు. ఇప్పుడు ట్రెండ్ మారింది. జేమ్స్ బాండ్ సినిమాల్లో వింత వింత ఆయుధాలు, పరికరాలు చూపించేవారు. ఇప్పుడు మన చేతుల్లో ఉన్న సెల్‌ఫోనే జేమ్స్ బాండ్‌లా పనిచేస్తోంది. అందుకే అంతకు మించి ఆలోచించాల్సివస్తోంది. 'స్పైడర్'లో పరికరాలు, ఆయుధాల కంటే... భావోద్వేగాలకు పెద్దపీట వేశాం. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎలా పనిచేస్తోంది? వాళ్లకు ఎదురయ్యే సవాళ్లేంటి? అనే విషయాలపై చాలా పరిశోధన చేసి ఈ కథ రాసుకొన్నా. 'గజిని', 'తుపాకి'లో స్టైల్, 'రమణ', 'కత్తి' కథల్లోని సామాజిక బాధ్యత కలిస్తే ఎలా ఉంటుందో 'స్పైడర్' అలా ఉంటుంది.

మహేష్‌తో పనిచేసే అవకాశం ఇది వరకే వచ్చిందట...

'ఒక్కడు' సినిమాని థియేటర్లో చూసి ఆశ్చర్యపోయా. అప్పట్నుంచి మహేష్‌తో కలసి పనిచేయాలనుకొనేవాడ్ని. 'పోకిరి' సమయంలో మహేష్‌ని కలసి నా మనసులోని మాట చెప్పా. 'తప్పకుండా చేద్దాం' అన్నారాయన. అప్పటి నుంచి ఏవో కథలు అనుకొన్నా, ఏదీ కుదర్లేదు. చివరికి 'స్పైడర్'తో మేం కలిశాం. తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి సినిమా చేయాలనుకొన్నాం. రెండు చోట్ల ప్రేక్షకులు, వాళ్ల అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకొని ఈ కథ తయారు చేశా.

మహేష్‌తో పనిచేయడం ఎలా అనిపించింది?

మహేష్ దర్శకుల హీరో. నా కథ ఇది, నా పాత్ర ఇదీ... అని చెబితే చాలు. దానికి తగ్గట్టు అల్లుకుపోతాడు. తనలో సహనం, ఓపిక చాలా ఉన్నాయి. మిగిలిన నటీనటుల్ని ప్రోత్సహించడంలోనూ మహేష్ తరవాతే ఎవరైనా. తనతో మళ్లీ మళ్లీ పనిచేయాలనుకొంటున్నా. తొలి సినిమాకి పదేళ్లు సమయం పట్టింది. రెండో సినిమాకి మాత్రం అంత టైమ్ తీసుకోను.

మహేష్‌లాంటి అగ్ర కథానాయకులతో పనిచేసేటప్పుడు అంచనాలు అధికంగా ఉంటాయి. వసూళ్ల లెక్కల గురించీ ఆలోచించాల్సి ఉంటుంది కదా?

నా సినిమా ఎక్కువ మంది చూస్తే నాకు ఆనందమే కదా? అయితే నా సినిమాకి ఎంతైంది? దానికి ఎంతొచ్చింది? అనేదే ఆలోచిస్తా. మిగిలిన సినిమాల వసూళ్లతో పోల్చుకొంటే మాత్రం కష్టం.

ఎస్.జె.సూర్యని ప్రతినాయకుడిగా ఎంచుకోవడానికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?

నా కథలో ప్రతినాయకుడ్ని బుద్ధిబలం ఉన్నవాడిగా చూపించదలచుకొన్నా. అలాంటి పాత్రలకు సిక్స్‌ప్యాక్ అవసరం లేదు. నటనలో మేటి అయిన వాళ్లు చాలు. సూర్య మంచి నటుడు. దానికి మించి మేం ఇద్దరం మంచి మిత్రులం. ఇద్దరం ఓ సినిమాకి సహాయ దర్శకులుగా పనిచేశాం. తన తమిళ సినిమా 'ఖుషి'కి 15 రోజుల పాటు సహాయ దర్శకుడిగా బాధ్యతలు నిర్వర్తించా.

మీ సినిమా అనేసరికి బలమైన సందేశం ఏదో ఉండే ఉంటుంది. మరి 'స్పైడర్'లోనూ అది కనిపిస్తుందా?

సందేశాలు చెప్తే సందేహంగా చూస్తున్నారు (నవ్వుతూ). నిజ జీవితంలో ఎవరో ఒకరు మనకు సలహా ఇచ్చేవారే. సినిమాల్లోనూ సందేశాలంటే ప్రేక్షకులకు మొహం మొత్తేస్తుంది. 'గజిని', 'తుపాకి'ల్లో నేనేం సందేశాలివ్వలేదు. కాకపోతే, అంతర్లీనంగా ఓ మంచి విషయం చెప్పాలని బలంగా భావిస్తా. 'స్పైడర్'లో అది ఉంది. మనమంతా మానవత్వం మర్చిపోతున్నాం. సాటి మనిషిపై ప్రేమ లేనప్పుడే అవినీతి, లంచగొండితనం, మారణ హోమం కనిపిస్తాయి. ఆ విషయాన్నే బలంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం.

సినిమాల ప్రభావం సమాజంపై ఏ మేరకు ఉంది?

చాలా ఉంటుంది. అందుకే ప్రతి ఫ్రేమూ, ప్రతి సన్నివేశంలోనూ జాగ్రత్తగా ఉండాలి. నా సినిమాల్లో మద్యపానం, ధూమపానం చూపించను. మహేష్‌లాంటి స్టార్ చేతిలో సిగరెట్ ఉంటే, ఆ ప్రభావం త్వరగా పాకేస్తుంది. తాగుతూ, అమ్మాయిల్ని ఏడిపిస్తే సినిమాల్లో వినోదంలా కనిపిస్తుంది. అవే సన్నివేశాలు నిజ జీవితంలో ఎదురైతే మాత్రం మనం సహించలేం. అలాంటప్పుడు సినిమాల్లో మాత్రం ఎందుకు చూపించాలి? మంచి చెప్పకపోయినా ఫర్వాలేదు, వెండి తెరపై చెడు మాత్రం చూపించొద్దు.

రజనీకాంత్‌తో సినిమా చేస్తున్నారట...

ఓ కథ సిద్ధంగా ఉంది. ఆయనకు ఎప్పుడు కుదురుతుందో చూడాలి.

సల్మాన్‌కి ఇటీవల కథ చెప్పారట...

కథ చెప్పలేదు గానీ, ఆయన్ని ఎప్పుడు కలిసినా 'మనం వెంటనే సినిమా చేసేద్దాం... మరో పది రోజుల్లో షూటింగ్ మొదలెడదామా' అంటుంటారు.

తదుపరి సినిమా ఎప్పుడు?

ముందు ఏ కథానాయకుడు నాకు అందుబాటులో ఉన్నాడో చూసుకోవాలి. దాన్ని బట్టి కథ సిద్ధం చేసుకొంటా.

చిరు 151... 'సైరా నరసింహారెడ్డి'

ముఖ్య పాత్రలో అమితాబ్ ఏఆర్ రెహమాన్ సంగీతం



వరుణ్ తేజ్, పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ, సాయిధరమ్‌తేజ్, అల్లు అరవింద్, సురేందర్‌రెడ్డి, రాజమౌళి, రామ్‌చరణ్

చిరంజీవి అభిమానుల నిరీక్షణకు తెర పడింది. 151వ చిత్రానికి టైటిల్ ఏమిటి? కథానాయిక ఎవరు? ముఖ్య పాత్రల్లో ఎవరెవరు కనిపిస్తారు? సాంకేతిక నిపుణులు ఎవరు? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరికేసింది. స్వాతంత్ర్య సమర యోధుడు 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' జీవిత కథని చిరు తన 151 చిత్రం కోసం ఎంచుకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'సైరా నరసింహారెడ్డి' అనే పేరు ఖరారు చేశారు. మంగళవారం చిరంజీవి పుట్టిన రోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో టైటిల్ లోగో, మోషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ చిత్రంలోని ఓ కీలకమైన పాత్రలో అమితాబ్‌బచ్చన్ నటించనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. కథానాయికగా నయనతార ఎంపికైంది. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రామ్‌చరణ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఆర్‌రెహమాన్ సంగీతం అందించనున్నారు. ఈ కార్యక్రమానికి చిరు రాకపోయినా వీడియో ద్వారా సందేశం పంపారు. "ఎప్పట్నుంచో స్వాతంత్ర్య సమరయోధుడిగా చేయాలని నా ఆశ. నేను పదికాలాలు చెప్పుకునే పాత్రలు చేయాలన్నది నా అభిమానుల ఆకాంక్ష. నా ఆశ, వారి ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇదివరకు భగత్ సింగ్ పాత్ర చేయాలనుకున్నాను. ఇప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి ఆద్యుడు, తెలుగు బిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్ర దొరకడం గొప్ప అవకాశం. అత్యున్నత సాంకేతిక బృందం ఈ చిత్రానికి పనిచేస్తోంది. ఇదో అద్భుత దృశ్యకావ్యం అవుతుందని నా నమ్మకం" అన్నారు. అనంతరం రాజమౌళి మాట్లాడుతూ "మోషన్ పోస్టర్ బాగుంది. పోస్టర్ డిజైనింగ్ అదిరింది. 'బాహుబలి'కి ఉన్నతమైన సాంకేతిక నిపుణుల బలం తోడైంది. ఈ చిత్రానికి పరుచూరి బ్రదర్స్, ఎ.ఆర్.రెహమాన్, రాజీవన్, రవివర్మన్ లాంటి నిష్ణాతులు పనిచేస్తున్నారు. సురేందర్‌రెడ్డికి అన్ని శాఖలపై మంచి పట్టుంది. 150వ చిత్రం తర్వాత కూడా ఇది నా తొలి చిత్రమే అన్న పట్టుదలతో చేస్తున్న చిరంజీవిగారికి గొప్ప విజయాన్ని అందిస్తుంద"న్నారు. "పదమూడేళ్ల క్రితమే చిరంజీవితో ఈ కథ చేయాలనుకొన్నాం. ఇప్పుడు కార్యరూపం దాల్చింద"న్నారు పరుచూరి వెంకటేశ్వరరావు. "భారతదేశ చరిత్రలో తొలి స్వాతంత్ర్య సమరయోధురాలిగా ఝాన్సీ రాణి పేరు చెప్పుకొంటారు. కానీ ఈ సినిమా విడుదలైన తర్వాత 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' పేరు వెలుగులోకి వస్తుంద"న్నారు పరుచూరి గోపాలకృష్ణ. అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ కథ నేను విన్నాను. పతాక దృశ్యాలు చూస్తే ఉద్వేగం కలగడం ఖాయం. దేశంలోనే గొప్ప విజయం సాధించిన చిత్రాల జాబితాలో 'సైరా'కీ స్థానం దక్కుతుంది. చరిత్ర ఎందుకు, ఎవరిని ఎంచుకుంటుందో తెలియదు. ఈ చరిత్ర సురేందర్ రెడ్డిని ఎంచుకుంద"న్నారు. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ "'సైరా' పేరు చెబితేనే నాకు ఒణుకుపుడుతుంది. నాపై ఒత్తిడి ఉంది. ఎందుకో నాకు తెలియదు. అదంతా మరిచిపోయి, నా దృష్టంతా ఈ సినిమాపైనే ఉంచా" అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ "నా కెరీర్‌లో 'మగధీర'లాంటి అతి పెద్ద విజయాన్ని అందించిన రాజమౌళిగారు ఈ పోస్టర్‌ను విడుదల చేయడం నా అదృష్టం. దీనికి మించిన పుట్టిన రోజు లేదు. వారం రోజులుగా గందరగోళంగా అనిపిస్తోంది. అసలు రాజమౌళి 'బాహుబలి' లాంటి గొప్ప చిత్రాన్ని ఎలా తీయగలిగారా అని నాకిప్పుడు అనిపిస్తోంది. ఏదో శక్తి, ఆ ఆంజనేయస్వామి దయ ఉన్నందున అన్నీ సవ్యంగా కుదిరాయ"న్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, వరుణ్ తేజ్, సాయిధరమ్‌తేజ్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: బుర్రా సాయిమాధవ్, రచన: పరుచూరి బ్రదర్స్, ఛాయాగ్రహణం: రవివర్మన్, కళ: రాజీవన్.



రకుల్ ప్రీత్ సింగ్

ప్రయాణం నేర్పిన పాఠం అదే

ఎక్కువ పారితోషికం అందుకొంటున్న కథానాయికల్లో మీరొకరు కదా అని రకుల్‌ప్రీత్ సింగ్ దగ్గర ప్రస్తావించామనుకోండి. 'అవునా... నేను అందుకొన్న మొదటి పారితోషికం ఎంతో మీకు తెలుసా?' అంటూ గతాన్ని గుర్తు చేస్తుంది. వరుస విజయాలతో దూసుకెళుతున్న విషయం గుర్తు చేస్తే - 'నిజమా... ఆరంభంలో ఎన్ని కష్టాలు పడ్డానో తెలుసా? పది నెలల్లో మూడు సినిమాల నుంచి తప్పుకోవల్సి వచ్చింది మరీ' అంటూ మళ్లీ గతంలోకి వెళ్లిపోతుంది. ప్రతి విషయానికీ ఇలా గతాన్ని గుర్తు చేసుకొంటుంటారా? అని అడిగితే 'అది అవసరం కూడా' అంటూ తన మనసుని ఇలా ఆవిష్కరించింది. "మనం ఇప్పుడెక్కడ ఉన్నామన్నది కాదు, మన ప్రయాణం ఎక్కడ మొదలైందనేది గుర్తు చేసుకోవడమే ముఖ్యం. నాపైన నా గతం ప్రభావం ఉంది. ఆరంభంలో నిలదొక్కుకోవడానికి చాలా కష్టపడ్డా. ఆ కష్టాల్లేకపోతే నాకు విజయం విలువేంటో తెలిసేది కాదేమో. పారితోషికం, విజయాల గురించి మరీ ఎక్కువగా ఆలోచించను. అవి శాశ్వతం కాదని తెలుసు. ఒక పరాజయం వచ్చిందంటే విమర్శల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాల్సిందే. అందుకే వాటి గురించి ఆలోచించకుండా చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయడంపైనే దృష్టిపెడుతుంటా. అదే నా ప్రయాణం నాకు నేర్పిన పాఠం" అని చెప్పింది రకుల్.

మంచినే చూడాలి మంచి మాటలాడాలి
మంచితనముతో నీవు మనిషిగానె మసలాలి
అందరి ఆనందం కోసం బ్రతుకు ధారపోయాలి
కొందరైనా నీవెంట అండగానూ నిలవాలి

గీతం: ఎండా వానా గాలీ వెన్నెల...
చిత్రం: కదలడు వదలడు, రచన: వీటూరి
- పంపినవారు: సూరినేని మాధవనాయుడు, బెంగళూరు

గీతోపదేశం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512

దగ్గరికొచ్చిన దాన్ని వద్దంటే...
కావల్సి వచ్చినప్పుడు తలదించుకొని తీసుకోవాలి!
చిత్రం: లంక
- పంపినవారు: ఎం.సందీప్, లాస్ ఏంజిలెస్

పంచ్ డైలాగ్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

ఆటో నెంబర్ 143



శ్రీనివాస్

శ్రీనివాస్, రష్మి రాజ్‌పుత్ జంటగా లక్ష్మణ్ సినీ విజన్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'ఆటో నెంబర్ 143'. సతీష్‌చంద్ర నాదెళ్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మణ్ క్యాదరి నిర్మాత. ఆయన మాట్లాడుతూ "మా సంస్థలో తెరకెక్కుతున్న మూడో చిత్రమిది. 'మేం వయసుకు వచ్చాం', 'అబ్బాయి క్లాస్ అమ్మాయి మాస్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత మరో మంచి కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. అన్నిరకాల భావోద్వేగాలతో కూడిన ఓ తీయటి ప్రేమ కథతో ఈ చిత్రం తెరకెక్కబోతోంది" అన్నారు. ఈ చిత్రానికి మాటలు, పాటలు: లక్ష్మీభూపాల్, ఛాయాగ్రహణం: వినోద్ రాజేంద్రన్, కూర్పు: మార్తాండ్ కె.వెంకటేష్.





మాయ మాయ అంతా మాయ..!

ఇక్కడ మొదటి ఫొటోలో ఉన్న భామను చూశారా? భుజాల పైకి వేలాడుతున్న బంగారు రంగు కేశాలు, గోధుమ రంగు శరీరవర్ణంతో, చిరునవ్వులు చిందిస్తున్న ఈ ముద్దుగుమ్మ ఆస్ట్రేలియన్ నటి మార్గట్ రాబీ. మరి రెండో ఫొటోలో ఉంగరాలు తిరిగిన రాగి రంగు జుత్తు, తెల్లటి శరీరవర్ణంతో ఉన్నదెవరో కనిపెట్టగలరా..?. అబ్బే.. ఎక్కడా చూసినట్లు లేదే అంటారా..! సరిగ్గా చూడండి అక్కడా మార్గట్ రాబీనే. వామ్మో.. అంత తేడానా.. అసలు గుర్తుపట్టలేకపోయాం అని ఆశ్చర్యపోతున్నారా? మీరే కాదు, ఆమెతో కలసి పనిచేస్తున్న చిత్రబృందం కూడా అలాగే ఆశ్చర్యపోయిందట. మేకప్ చేసిన మాయతో రాబీ ఇలా మారిపోయింది. 'మేరీ, క్వీన్ ఆఫ్ స్కాట్స్' చిత్రంలో బ్రిటిష్ రాణి క్వీన్ ఎలిజబెత్-1గా నటిస్తోంది రాబీ. ఆ పాత్ర కోసమే ఆమె ఇలా సిద్ధమైంది.

ప్రేమని వెతుక్కుంటూ..



చంద్రకాంత్

ఒక విభిన్నమైన ప్రేమకథా చిత్రంతో పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు చంద్రకాంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. రాధికా మెహరోత్రా కథానాయిక. రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్.జి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. వచ్చే నెలలోనే చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు విలేకర్లతో ముచ్చటించారు. "ప్రేమని వెదుక్కొంటూ అమెరికాకి వెళ్లే ఓ కుర్రాడి కథ ఇది. జై అనే ఓ నవతరం యువకుడిగా నేను కనిపిస్తా. ప్రేమతో కూడిన ఓ రొమాంటిక్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. సమష్టికృషితో చేసిన ఈ చిత్రం అందరికీ మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నా. నటన కోసం అమెరికాలో శిక్షణ తీసుకొన్నా. ఈ సినిమా చిత్రీకరణ సింహభాగం అక్కడే జరిగింది. తొలి చిత్రంలోనే తనికెళ్ల భరణి, తులసి, జెమినీ సురేష్ తదితరులతో కలిసి నటించడం మంచి అనుభవం" అన్నారు చంద్రకాంత్.

పల్లెటూరి ప్రేమాయణం



బెక్కెం వేణుగోపాల్

'చూడాలని ఉంది', 'ఇంద్ర', 'యువరాజు' చిత్రాల్లో బాలనటుడిగా సందడి చేసిన తేజ కథానాయకుడిగా పరిచయమవుతున్నాడు. హరి దర్శకత్వంలో ఆయన నటించబోతున్నారు. బెక్కెం వేణుగోపాల్ నిర్మాత. వచ్చే నెల 15 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. నిర్మాత మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో ఓ మంచి కథ కుదిరింది. యువతరాన్ని అలరించే ప్రేమకథ. కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. 'ఉయ్యాల జంపాల', 'స్వామి రారా' చిత్రాలకి స్వరాలు సమకూర్చిన సన్నీ.ఎం.ఆర్ సంగీతం అందిస్తున్నార"న్నారు.

ముద్దుగుమ్మల మధ్యలో...

గీకీ రాజా.. క్విర్కీ ప్రేమ్... ఈ ఇద్దరూ కవల పిల్లలు. జన్యుపరమైన సమస్యల కారణంగా రాజా ఏమి చేస్తే తన ప్రమేయం లేకుండానే ప్రేమ్ అదే చేస్తుంటాడు. ప్రేమ్ ఏం చేస్తే రాజా అదే చేస్తాడు. ఇద్దరు ముద్దుగుమ్మలతో సోదరులిద్దరూ ప్రేమలో పడతారు... ఈ కథ ఇటు తెలుగు ప్రేక్షకులకు, అటు బాలీవుడ్ ప్రేక్షకులకు తెలిసిందే. నాగార్జున కథానాయకుడిగా తెరకెక్కిన 'హలో బ్రదర్'ది ఇదే కథాంశం. అప్పట్లో ఈ చిత్రాన్ని 'జుడ్వా'గా సల్మాన్‌ఖాన్‌తో రీమేక్ చేశారు దర్శకుడు డేవిడ్ ధావన్. అక్కడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'జుడ్వా 2' రూపొందించారు డేవిడ్. వరుణ్‌ధావన్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. జాక్వెలైన్ ఫెర్నాండెజ్, తాప్సి కథానాయికలు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. పాత కథలాగే ఉన్నా కొత్త రీతిలో వినోదం పండించే ప్రయత్నం చేసినట్టు అనిపిస్తోంది. ఈ చిత్ర కథానాయికలిద్దరూ హాట్‌హాట్‌గా బికినీల్లో అందాలు ఆరబోశారు. లిప్‌లాక్ ముద్దుల జోరు కాస్త ఎక్కువగానే ఉంది. పూర్తి కమర్షియల్ అంశాలతో ఈ చిత్రం ఉండబోతుందని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. దీంతో సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.



తాప్సీ, వరుణ్‌ధావన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్

పర్సనల్ చట్టాలకు బ్రిటిషు హయాంలోనే పునాది

మన దేశంలో వ్యక్తిగత చట్టాలకు (పర్సనల్ లా) మూలాలను వెదికితే అవి బ్రిటిష్ పాలనలో దొరుకుతాయి. బ్రిటిషువారు తాము ఇక్కడకు వచ్చింది వ్యాపారం కోసం కనుక ఇక్కడి హిందూ, ముస్లిం ప్రజల ఆచార వ్యవహారాల్లో వారు జోక్యం చేసుకోవాలనుకోలేదు. అనవసరమైన అంశాల్లో తలదూర్చి స్థానికుల ఆగ్రహానికి గురికావటంలో అర్థం లేదని అనుకున్నారు. అందుకే ఈ విషయంలో ఎన్నో ఏళ్ల పాటు తటస్థంగా వ్యవహరించారు. 1857లో భారతదేశం ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన నుంచి నేరుగా బ్రిటిషు పాలన కిందకు వచ్చింది. ఆ తర్వాత హిందూ, ముస్లిం చట్టాలపై పరాయి పాలకులు దృష్టి సారించారు. అప్పటికే హిందూ, ముస్లిం మత గ్రంథాల ఆధారిత సంప్రదాయాలు, ఆచారాలు భారతీయ సమాజంలో ప్రబలంగా ఉన్నాయి. వివాహం, విడిపోవటం, ఆస్తి హక్కులు, వారసత్వ హక్కులు.. తదితర వివిధ అంశాలకు సంబంధించి మత సంప్రదాయాలే ప్రామాణికంగా కొనసాగుతూ వచ్చాయి. అందువల్ల బ్రిటిషు పాలకులు వాటి ఆధారంగానే పర్సనల్ లా (వ్యక్తిగత చట్టం) తయారు చేశారు. ఆయా మతాలకు చెందిన వారి పూర్తి అంగీకారం లేదా డిమాండ్ ఉంటేనే వాటిని చట్టంలో పొందుపరుస్తూ వచ్చారే తప్ప పూర్తిగా ఆదర్శప్రాయమైన వ్యక్తిగత చట్టాలు చేయాలని అప్పటి పాలకులు అనుకోలేదు.

బ్రిటిష్ ఛార్టర్‌తో మొదలు...

★ 1726 బ్రిటిష్ ఛార్టర్ ఫలితంగా భారత్‌లో ఇంగ్లిషు చట్టాలు అడుగుపెట్టాయి. 1772 నాటి వారెన్ హేస్టింగ్స్ రెగ్యులేషన్- హిందూ, ముస్లిం పర్సనల్ చట్టాలకు అసలైన పునాది. హిందువులకు హిందూ చట్టాలు, ముస్లింలకు ముస్లిం చట్టాలు ఉండాలని ఈ రెగ్యులేషన్ స్పష్టంచేసింది.

★ భారతదేశం బ్రిటిషు మహారాణి పాలన కిందకు వచ్చాకే పర్సనల్ చట్టాలను క్రోడీకరించే పని మొదలైంది. ఈ దిశగా 1834లో మొదటి లా కమిషన్ నియామకం కీలకమైన పరిణామం.

★ హిందువులకు బ్రిటిషు పాలనలో వచ్చిన చట్టాల్లో సతీ సహగమన నిరోధక చట్టం- 1829, హిందూ వితంతు వివాహ చట్టం- 1856, హిందూ వివాహ రద్దు చట్టం- 1866, భారతీయ విడాకుల చట్టం- 1869, హిందూ విల్లు చట్టం- 1870, ప్రత్యేక వివాహాల చట్టం- 1872, సంరక్షకుల చట్టం- 1890, ఆనంద్ వివాహచట్టం- 1909, హిందూ ధర్మచట్టం- 1916, హిందూ వారసత్వ చట్టం- 1928, హిందూ మహిళల ఆస్తి హక్కు చట్టం- 1937, హిందూ మహిళల ప్రత్యేకనివాస, నిర్వహణ చట్టం- 1946 ముఖ్యమైనవి.

ముస్లిం చట్టాలు ఇలా...

★ ముస్లిం సంప్రదాయాల్లో మార్పులకు, బ్రిటిషు జోక్యానికి మొదటి నుంచీ ముస్లిం సమాజం నుంచి అమోదం లేదు. అందువల్ల బ్రిటిషర్లు స్వతంత్రంగా మార్పులు తలపెట్టేందుకు పూనుకోలేదు. కానీ అమల్లో ఉన్న ముస్లిం సంప్రదాయాలకే చట్టరూపం ఇచ్చేందుకు ప్రయత్నించారు.

★ ముసల్మాన్ వక్ఫ్ చట్టం- 1913, ముస్లిం పర్సనల్ లా(షరియా) అనువర్తన చట్టం- 1937, ముస్లిం వివాహ రద్దు చట్టం- 1939 ఈ కోవలోనివే. అంతకు ముందే బ్రిటిషు పాలకులు ముస్లిం ఖాజీల కోసం ఖాజీస్ చట్టం- 1881 తీసుకువచ్చారు. 1896లో బెంగాల్ ప్రొటెక్షన్ ఆఫ్ మహమ్మదీన్స్ పిల్‌గ్రిమ్ యాక్ట్ అమల్లోకి వచ్చింది.

★ భారత ప్రభుత్వ న్యాయ సభ్యులైన సర్ హెచ్ఎస్ మైన్, సర్ జేమ్స్ స్టీఫెన్ కృషి ఫలితంగా బెంగాల్ ముసల్మాన్ల వివాహం- విడాకుల నమోదు చట్టం- 1876 అమల్లోకి వచ్చింది. బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం తీసుకువచ్చిన అవధ్ నిబంధనల చట్టం- 1876 ను ముస్లిం పర్సనల్ లాకు సంబంధించి ఎంతో ముఖ్యమైన చట్టంగా పేర్కొంటారు.

ముస్లిం పర్సనల్ లా : భారతీయ ముస్లింలకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చే దిశగా బ్రిటిషు పాలకులు 1937లో ముస్లిం పర్సనల్ లా (షరియా) అప్లికేషన్ చట్టాన్ని తీసుకువచ్చారు. అప్పటి నుంచి ముస్లిం సంప్రదాయాలకు..., వివాహం నుంచి విడాకులు, వారసత్వం, కుటుంబ సంబంధాలు వంటి ముఖ్యమైన అంశాలకు ఇదే పునాది అయింది. ఇది స్వతంత్ర భారతదేశంలోనూ పెద్దగా మార్పులకు లోను కాలేదు. షరియా అమలు విషయంలో పలు సందర్భాల్లో ఎన్నో వివాదాలు తలెత్తాయి కూడా. ప్రాథమిక హక్కులు, మత హక్కుల మధ్య సంఘర్షణ న్యాయస్థానాల్లో విచారణకు వచ్చిన సందర్భాలు ఎన్నో. షాబానో కేసు ఇందుకు ఉదాహరణ.

– ఈనాడు ప్రత్యేక విభాగం

విచారణకు హాజరైన వైకాపా ఎమ్మెల్యేలు

- క్రికెట్ బెట్టింగ్ కేసులో నాలుగు గంటల ప్రశ్నల వర్షం
- 27న మరోసారి రావాలని పిలుపు

ఈనాడు – నెల్లూరు

సంచలనం సృష్టించిన క్రికెట్ బెట్టింగ్ కేసులో బుకీ కృష్ణసింగ్‌తో సంబంధాలు, ఆర్థిక వ్యవహారాలపై నెల్లూరు జిల్లాకు చెందిన వైకాపా ఎమ్మెల్యేలు ఇద్దరిని పోలీసులు విచారించారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌లను సుమారు నాలుగు గంటలపాటు ప్రశ్నించారు. ముందుగా శ్రీధర్‌రెడ్డిని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.40 గంటల వరకూ, అనిల్‌కుమార్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 3.15 గంటల వరకూ జిల్లా పోలీసు కార్యాలయంలో విచారించారు. ప్రధానంగా కృష్ణసింగ్ ఇచ్చిన సమాచారం మేరకు ప్రశ్నలు తయారు చేసి ఆరా తీశారు. కృష్ణసింగ్ నుంచి భారీ మొత్తంలో నగదు అందినట్లు వస్తున్న ఆరోపణలు.. బెట్టింగ్ కేసులో అరెస్టు చేసిన ప్రధాన బుకీలు షంషీర్ గురించి.. సబ్ బుకీలు, పంటర్లతో ఉన్న సంబంధాలు.. బెట్టింగ్ కేసులో అరెస్టు చేసిన కొందరు చోటా నేతలతో ఉన్న సంబంధాలపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ వ్యవహారాన్నంతా వీడియో రికార్డింగ్ చేశారు. అదనపు ఎస్పీ శరత్‌బాబుతో పాటు పట్టణ డీఎస్పీ బాలసుందరరావు, గ్రామీణ డీఎస్పీ రాఘవరెడ్డి, నాలుగోపట్టణ సీఐ సుధాకరరెడ్డి, ఆరోపట్టణ సీఐ సంఘమేశ్వరరావు విచారణలో పాల్గొన్నారు. ఎలాంటి సంచలనాలకు తావు లేకుండా విచారణ తర్వాత పోలీసులు ఎమ్మెల్యేలను పంపేశారు. ఈ నెల 27వ తేదీన మరోసారి విచారణకు హాజరు కావాలని పోలీసులు సూచించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద రెండు రోజుల కిందట మంగళవారం విచారణకు హాజరుకావాలంటూ ఎమ్మెల్యేలకు పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విచారణ పూర్తయిన తర్వాత ఎమ్మెల్యేలు ఇద్దరూ ఉత్సాహంగా విలేకరులతో మాట్లాడారు. బెట్టింగ్ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని పేర్కొన్నారు. బెట్టింగ్ వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాభిమానాన్ని దెబ్బతీయటానికి అధికార పార్టీ పోలీసులను వాడుకుంటోందన్న అనుమానం వ్యక్తం చేశారు. సాయంత్రం నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ అక్రమాలకు పాల్పడలేదన్నారు. బెట్టింగ్ కేసులో బుకీల నుంచి పైసా కూడా తీసుకోలేదన్నారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికే ఈ వ్యవహారమంతా అని ఆరోపించారు.



విచారణకు హాజరైన ఎమ్మెల్యేలు అనిల్ కుమార్‌యాదవ్ , కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పోలీసులు అడిగిన కొన్ని ప్రధాన ప్రశ్నలు, శ్రీధర్‌రెడ్డి చెప్పిన సమాధానాలు

2014 నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో మేయర్ ఎన్నికకు సంబంధించి అబ్దుల్ అజీజ్, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో కలిసి గోవా వెళ్లారా?

ఎన్నికల శిబిరం నిర్వహణ కోసం గోవా వెళ్లిన మాట వాస్తవమే.

కృష్ణసింగ్‌తో ఫోన్లో తరచూ మాట్లాడారా?

కృష్ణసింగ్‌తో రెండుమూడు సందర్భాల్లో మాట్లాడాను. అది కూడా తక్కువ వ్యవధి మాత్రమే మాట్లాడా.

లేబూరి శ్రీధర్‌రెడ్డి(ఎల్ఎస్ఆర్)తో ఎక్కువ సార్లు ఫోన్లలో మాట్లాడతారట?

ఎల్ఎస్ఆర్ చిన్నతనం నుంచి స్నేహితుడు. ఇద్దరం కలిసి చదువుకున్నాం. కుటుంబంతో కూడా సంబంధాలు ఉన్నాయి.

కృష్ణసింగ్ తెలుసా? ఎలా తెలుసు?

కృష్ణసింగ్ గ్రామీణ ప్రాంతంలో ఉన్నాడు. అంతకు మించి ఎలాంటి సంబంధం లేదు.

కృష్ణసింగ్‌తో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి? బ్యాంకు ఖాతా ద్వారా నగదు బదిలీ జరిగినట్లు వినిపిస్తోంది?

కృష్ణసింగ్‌తో సంబంధాలే లేవు. ఆయన నుంచి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు. నా ఒక్కడి బ్యాంకు ఖాతా వివరాలు కాదు కుటుంబ సభ్యులకు సంబంధించిన అందరి బ్యాంకు ఖాతాలను మీకు ఇస్తా. పరిశీలించుకోవచ్చు.

కార్పొరేటర్ రూప్‌కుమార్ యాదవ్, ఎల్ఎస్ఆర్, శ్రీకాంత్‌రెడ్డిల ద్వారా మీకు నగదు అందించినట్లు కృష్ణసింగ్ చెబుతున్నాడు?

ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదు. మీరు విచారించుకోవచ్చు.

శ్రీకాంత్‌రెడ్డి ద్వారా పోలీసులకు నగదు అందిందా?

ఈ విషయం నాకు తెలియదు.

2017లో జరిగిన ఐపీఎల్ పోటీల్లో కూడా భారీగా బుకీల నుంచి అందాయట?

ఇందులో నిజం లేదు. బుకీలతో నాకు ఎలాంటి సంబంధం లేదు.

అనిల్‌కుమార్ యాదవ్ విచారణ విషయాలు

కృష్ణసింగ్ తెలుసా?

నా తొమ్మిదేళ్ల రాజకీయ జీవితంలో కృష్ణసింగ్‌తో కనీసం ఒక్క ఫోన్‌కాల్ లేదు. ఏదో ఒక శుభకార్యం దగ్గర కలిసే ఉంటాడు.

ఎన్నికల సమయంలో కృష్ణసింగ్ నుంచి నిధులు తీసుకున్నారా?

ఒక్క పైసా కృష్ణసింగ్ నుంచి తీసుకోలేదు.

నీకు ఇచ్చినట్లు కృష్ణసింగ్ చెబుతున్నాడు?

ఒక్క రూపాయి కూడా ఎవరినీ అడిగి తీసుకోలేదు. ఈ విషయంలో ఇచ్చినట్లు చెబుతున్న వ్యక్తిని నాతో కూర్చోబెట్టి అడగండి. వాస్తవాలు తెలుస్తాయి.

కృష్ణసింగ్ ఖాతా నుంచి నగదు బదిలీ అయినట్లు చెబుతున్నారు?

పూర్తిగా అవాస్తవం. బ్యాంకు ఖాతాలు, లోన్ ఖాతాలు, ఆస్తుల వివరాలను కూడా అందిస్తా.

ఎల్ఎస్ఆర్‌తో సంబంధాలు ఉన్నాయా?

శ్రీధర్‌రెడ్డి పెట్రోలు బంకులో ఆయిల్‌కోసం వెళ్లే వాడిని. 2009 తర్వాత కొన్ని కారణాలతో అతని దగ్గరకే వెళ్లలేదు.

బుకీ శ్రీకాంత్‌రెడ్డితో సంబంధాలు ఉన్నాయా?

ఆయన మా పార్టీ నాయకుడు. అంతకు మించి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవు.

ప్ర: కృష్ణసింగ్‌ను పోలీసుల ఎదుట లొంగిపోటానికి ఏమైనా సాయం చేశారా?

ఎలాంటి సంప్రదింపులు చేయలేదు. అసలు పోలీసులతో మాట్లాడే సందర్భాలు చాలా తక్కువ. ఇలాంటి కేసులకు సంబంధించి ఎప్పుడూ మాట్లాడలేదు.

రూ.వెయ్యి కోట్ల బెట్టింగ్ సామ్రాజ్యం!

- ఏపీ అంతటా విస్తరించిన క్రికెట్ పందేలు
- బుకీలు, సబ్‌బుకీలతో రాజకీయ నాయకుల మిలాఖత్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ బెట్టింగ్ మాఫియా మూలాలు రోజురోజుకు వేళ్లూనుకుపోతున్నాయి. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ వ్యవస్థీకృత దందాను సాగిస్తోంది. బుకీలు, సబ్‌బుకీలు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసుకుని చెలరేగిపోతున్నారు. తాము ఏం చేసినా చూసీచూడనట్లు వ్యవహరించేందుకు గాను కొంతమంది పోలీసు అధికారులను, తమకు ఏం జరిగినా రక్షణగా నిలిచేందుకు కొంతమంది రాజకీయ నాయకులను మచ్చిక చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల పరిధిలో క్రికెట్ సీజన్‌లో రూ.వెయ్యి కోట్ల మేర బెట్టింగ్ జరుగుతోందని తమ అంచనా అని ఒక పోలీసు ఉన్నతాధికారి పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో రాజకీయ నాయకులే బెట్టింగ్ నిర్వాహకుల అవతారమెత్తుతున్నారన్నారు. మరికొందరు బెట్టింగ్‌ల నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో ప్రాబల్యమున్న కొందరు నాయకులతో సన్నిహితంగా మెలుగుతున్నట్లుగుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బెట్టింగ్ మాఫియా మూలాలను బహిర్గతపరచడంపైన పోలీసులు దృష్టిసారించారు.

అవసరాలకయ్యే వ్యయం భరిస్తూ...

స్థానికంగా మంచి పట్టు ఉన్న కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉంటే పోలీసులు కూడా తమ జోలికి రారన్న ఉద్దేశంతో బెట్టింగ్ నిర్వాహకులు తొలుత అలాంటి నాయకులను ఎంపిక చేసుకుని వారితో సన్నిహితంగా మెలుగుతున్నారు. వారు నిర్వహించే రాజకీయ కార్యక్రమాలకు అవసరమైన నిధులు సమకూర్చడం, వారి వ్యక్తిగత అవసరాలకయ్యే ఖర్చులను పూర్తిగా భరించడం, దేశంలోని వివిధ ప్రాంతాలకు విహారయాత్రలకు పంపించి అందుకు అవసరమైన ఖర్చులను పెట్టుకోవడం తదతరాల ద్వారా వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో ఓ రాజకీయ నాయకుడికి రూ.50 లక్షల వరకూ ఇలా అందిందన్న ఆరోపణలున్నాయి. విచారణలో భాగంగా కొందరు బుకీలు ఈ విషయం పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. మరికొందరైతే తమ ప్రాంతాల్లో బెట్టింగులు నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చినందుకు గాను భారీ మొత్తంలో ఒకేసారి తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ఉన్నా.. వాటిపైన పెద్దగా పోలీసుల దృష్టి లేకపోవడంతో అవి వెలుగుచూడటం లేదు. తాజాగా నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో వెలుగుచూసిన అంశాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ మూలాలు తవ్వితీయాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రధానంగా పోలీసులు ఎవరైనా బెట్టింగ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నా..వారికి ఏమీ కాకుండా చూడటం వంటి బాధ్యతలను సంబంధిత నాయకులే చూస్తున్నారు. కొన్ని చోట్ల పోలీసులకు, బుకీలకు మధ్య బేరాలు కుదర్చడం కూడా వీరి పనే. బుకీల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నా.. కొందరు నాయకులే సర్దుబాట్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పార్టీ అండగా ఉంటుంది

ఎమ్మెల్యేలకు ఫోన్‌లో జగన్ అభయం

ఈనాడు–నెల్లూరు: క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణకు సంబంధించిన వ్యవహారంపై వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో ఆరా తీశారు. బెట్టింగ్ కేసులో మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌లకు పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం వరకు నంద్యాల ఉప ఎన్నికల వ్యవహారంలో తలమునకలైన ఎమ్మెల్యేలు.. సోమవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. మంగళవారం ఉదయం పార్టీ అధ్యక్షుడు జగన్ ఎమ్మెల్యేలతో ఫోన్‌లో మాట్లాడారు. పోలీసు విచారణకు సంబంధించి ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భరోసా ఇచ్చారు. విచారణ పూర్తయిన తర్వాతకూడా ఎమ్మెల్యేలకు ఫోను చేసి విచారణ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేవలం ఉద్దేశపూర్వకంగా వేధించటానికి ఇలా చేస్తున్నారని, పార్టీ తరపున ఈ వ్యవహారానికి వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. అవసరమైతే జిల్లాకు వచ్చి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

మంత్రులు నంద్యాల వద్దే మకాం వేశారు

- పోలింగ్‌కు ముందురోజు సీఎం ప్రెస్‌మీట్ ఏంటి?
- ఎన్నికల సంఘానికి వైకాపా ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నిక పోలింగ్ నేపథ్యంలో కర్నూలు జిల్లాకు చెందని ప్రజాప్రతినిధులు వెంటనే జిల్లా వదిలి వెళ్లాలని ఎన్నికల సంఘం ఆదేశించినా రాష్ట్ర మంత్రులు ఆదినారాయణరెడ్డి, కాలవ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అధికార తెదేపాకు చెందిన ఎమ్మెల్యేలు కొందరు నంద్యాల, పక్కనే ఉన్న బనగానపల్లిలో మకాం వేశారని వైకాపా ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఉపఎన్నికలో గెలిచేందుకు అసాంఘిక శక్తులను రెచ్చగొట్టేలా ప్రయత్నిస్తున్నారన్న సమాచారం ఉందని పేర్కొన్నారు. నంద్యాలలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ముక్కుపుడకలు, డబ్బు, సారా పంచుతున్నారని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిసి వివిధ అంశాలపై ఫిర్యాదు పత్రాలను సమర్పించారు. బుధవారం నంద్యాలలో పోలింగ్ ఉండగా మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి రాష్ట్ర సచివాలయం నుంచి పాత్రికేయుల సమావేశం నిర్వహించడంపైనా ఫిర్యాదు చేసినట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

శిల్పా చక్రపాణి నంద్యాలలో మకాంపై తెదేపా అభ్యంతరం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ, వైకాపా నేత శిల్పా చక్రపాణిరెడ్డి ఉప ఎన్నిక సందర్భంగా నంద్యాలలో ఉండడంపై తెలుగుదేశం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన స్థానికుడు కాదని వాదించారు. తాను స్థానికుడినని, నంద్యాలలో నివాసం ఉంటున్నాని ఆధార్‌కార్డు కూడా ఉందని చక్రపాణి స్పష్టం చేశారు. ఆయన ఆత్మకూరు పట్టణంలో నివాసం ఉంటున్నట్లు ఎమ్మెల్సీ ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపర్చారని, మరి నంద్యాలలో ఎలా ఉంటారని తెదేపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికలో తెదేపా ఓటమి పాలవుతుందన్న భయంతోనే తనను ఏదోరకంగా నంద్యాల నుంచి బయటకు పంపేందుకు ముఖ్యమంత్రి కుట్ర పన్నుతున్నారని చక్రపాణిరెడ్డి ఆరోపించారు.

వెంకటరామారెడ్డి పేరిట అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు: కేసీఆర్

ఈనాడు–హైదరాబాద్: రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి ప్రాతఃస్మరణీయుడని.. ఆయన పేరుతో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అత్యున్నత విద్యాసంస్థల సమాహారం ఏర్పాటు కావాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభిలషించారు. వెంకటరామారెడ్డి ధనిక కుటుంబంలో పుట్టినా పేదల కోసం నిరంతరం శ్రమించాడని.. కొత్వాల్‌గా విధులు నిర్వహిస్తూ కూడా నిజాంకు జడవకుండా తెలుగులో విద్యావ్యాప్తికి కృషి చేశారన్నారు. ఆయన ఖ్యాతికి తగ్గట్టుగా ఇక్కడ విద్యాసంస్థల నిర్మాణం జరగాలన్నారు. వెంకటరామారెడ్డి జయంతి వేడుకలు, రెడ్డిహాస్టల్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ శివారు బుద్వేల్‌లో విద్యాసంస్థలు, రెడ్డిహాస్టల్ భవన సముదాయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రెడ్డిహాస్టల్ కోసం ప్రభుత్వం 10 ఎకరాల స్థలంతోపాటు నిర్మాణం కోసం రూ. 10 కోట్లు కేటాయించింది. అవసరమైతే మరో రూ. 10 కోట్లయినా ఇస్తాం. మరో ఐదెకరాల స్థలం కావాలని కోరారు.. అది కూడా కేటాయిస్తున్నాం. అయితే నా కోరిక ఒక్కటే.. వెంకటరామారెడ్డి ఖ్యాతికి తగ్గట్టుగా ఇక్కడ రెండో మూడో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఏర్పాటు కావాలి. చదువు కోవాలనుకున్న పేదలందరికీ అందుబాటులో ఉండటంతో పాటు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా ఇక్కడ సంస్థలు ఏర్పాటు కావాలి. ఉద్యోగ నియామకాల కోసం ఏ అంతర్జాతీయ సంస్థ వచ్చినా మొదట ఈ ప్రాంగణానికే వచ్చేలా తీర్చిదిద్దాలి' అని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రముఖుల వస్త్రాల్లో మనల్ని చూపించే 4డీ సాంకేతికత

బెర్లిన్: ప్రముఖులు ధరించిన వస్త్రాలు మన కళ్లను కట్టిపడేస్తుంటాయి. వాటిలో తాము ఎలా ఉంటామో చూసుకోవాలని అందరికీ ఉంటుంది. ఈ కలను సాకారం చేసేందుకు జర్మనీ శాస్త్రవేత్తలు చక్కని పరిష్కారంతో ముందుకువచ్చారు. వారు ఒక అధునాతన 4డీ స్కానింగ్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. దీనిలో 66 కెమెరాలు, ప్రొజెక్టర్లు ఉన్నాయి. ఇవి వ్యక్తులు కదులుతుండగానే వారి వస్త్రాలను జాగ్రత్తగా స్కానింగ్ చేయగలవు. వారు వేసుకోకముందు ఈ వస్త్రాలు ఎలా ఉండేవో 3డీ నమూనాలను సిద్ధంచేయగలవు. అంతేకాదు ఆ వస్త్రాలను వేసుకుంటే మీరు ఎలా ఉంటారో కూడా చూపించగలవు. మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (ఎంపీఐ-ఐఎస్) అభివృద్ధి చేసిన ఈ స్కానింగ్ వ్యవస్థకు క్లాత్‌క్యాప్‌గా నామకరణం చేశారు. వస్త్రాలు గాలికి ఎగిరే విధానాన్ని సైతం ఇది జాగ్రత్తగా కనిపెడుతుందని పరిశోధకులు గెరార్డ్ పాన్స్-మోల్ తెలిపారు.

నంద్యాల పోరు... 'సోషల్' హోరు..!

- పోటాపోటీగా వాట్సప్, ఫేస్‌బుక్‌ల్లో పోస్టులు
- సొంత బృందాలతో పరస్పర వ్యతిరేక ప్రచారం
- శ్రుతిమించుతున్న ఆరోపణలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న నంద్యాల ఓటర్లు

నంద్యాల నుంచి
ఈనాడు ప్రత్యేక ప్రతినిధి, కర్నూలు

నంద్యాల ఉప ఎన్నికలో అభ్యర్థుల ప్రచారం సోమవారంతో ముగియడంతో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఎవరికివారు తమకు అనుకూల అంశాలతో సామాజిక మాధ్యమాలను హోరెత్తిస్తున్నారు. ప్రధానంగా తెదేపా, వైకాపా తరపున ఈ ప్రచారానికి బృందాలు పని చేస్తున్నాయి. నంద్యాల నియోజకవర్గంలోని ఓటర్ల ఫోను నంబర్లతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఐటీ నిపుణులైన యువతను నంద్యాలకు రప్పించి, ప్రచారం కొనసాగిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఫేస్‌బుక్, వాట్సప్‌ల్లో పోస్టింగ్‌లు పెడుతూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. కొద్ది రోజులుగా ఓ మోస్తరుగా సాగిన సామాజిక మాధ్యమ ప్రచారం ఇప్పుడు యుద్ధాన్ని తలపిస్తోంది. ఓటర్ల ఫోన్‌లకు కుప్పలు తెప్పలుగా పోస్టింగ్‌లు వచ్చిపడుతున్నాయి. ఏది నిజమో ఏది అబద్ధమో అర్థంకాని పరిస్థితి ఓటర్లకు ఏర్పడుతోంది. సర్వేలు, విమర్శలు, ఆరోపణలు, ఇటీవల జరిగిన ప్రచారాల చిత్రాలు, వ్యాఖ్యలు హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని చిత్రాలు, వ్యాఖ్యలతో పెడుతున్న పోస్టులు శ్రుతిమించుతున్నాయి. నంద్యాలవాసులు ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో డాటా ఆన్ చేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతోంది.



ఇలాంటివి ఎన్నో..

■ ఉప ఎన్నికల వేడంటూ పలు వీడియోలను ఫేస్‌బుక్‌లో పెడుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో హాస్యనటుడు వేణుమాధవ్ జగన్‌పై చేసిన వ్యాఖ్యలు హల్‌చల్ చేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా వైకాపా తరపున పోస్టులు పెడుతున్నారు.

■ వైకాపా ఎమ్మెల్యే రోజా.. తెదేపా ఎమ్మెల్యే బోండా ఉమ 'గుండు'పై వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో తిరుగుతున్నాయి.

■ ఎవరి సర్వేలు వారివిగా ఉన్నాయి. ఫలితాల తర్వాత తెదేపాకు భారీ వలసలు ఉంటాయని ఒకపక్కయితే... వైకాపాలోకి ఉంటాయని మరొపక్క దూసుకొస్తున్నాయి.

■ ఇటీవల నంద్యాల్లో జరిగిన ప్రచార సభల్లో వైకాపా అధినేత జగన్ సభకు తక్కువ జనాలు వచ్చారని తెదేపా వారు; ముఖ్యమంత్రి చంద్రబాబుకు తక్కువ మంది వచ్చారంటూ వైకాపా వారు చిత్రాలతో పోస్టులు పెడుతున్నారు.

■ తమ అభ్యరులకు ఓటు వేయాలంటూ ఈవీఎంలపై వారి చిత్రాలు, గుర్తులతో ఫోన్లకు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి.

■ నంద్యాల సీటు మాదేనంటూ ఎవరికీ వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల్లో గెలుపు ఎవరిది? అంటూ ప్రశ్నార్థకంతో మరికొందరు వీడియోలు పెడుతున్నారు.

■ సీఎం ప్యాంట్రీ వ్యాన్ తనిఖీపై ఎవరికివారు వాట్సప్ గ్రూపుల్లో వీడియోలు పంపిస్తున్నారు.

■ జగన్ బహిరంగసభలో 'సీఎంను నడిరోడ్డుపై కాల్చి చంపినా ఫర్వాలేదనడం'; సీఎం అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చినప్పుడు 'నేనేసిన రోడ్లపై నడుస్తున్నారు' అని అనడం... వంటివి సామాజిక మాధ్యమాల్లో చర్చకొస్తున్నాయి.

■ అఖిలప్రియపై రోజా చేసిన వ్యాఖ్యలు.. మాటకు-మాట బదులు పోస్టుకు పోస్టు అన్న తీరున కొనసాగుతున్నాయి.

నిపుణులతో సొంత బృందాలు

చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు చెందిన వైకాపా, తెదేపా సాంకేతిక బృందాలు ప్రత్యేకంగా సామాజిక మాధ్యమంలో ప్రచారం కోసం పని చేస్తున్నాయి. ఒక్కో పార్టీ తరపున 20-30మంది వరకు ఐటీ యువత ఇందు కోసం పని చేస్తోంది. వేల నకిలీ ఖాతాలు తెరుచుకున్నాయి. నంద్యాలలోని ఓటర్ల ఫోన్ నెంబర్లు, ఫేస్‌బుక్ ఖాతాలే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తున్నాయి. మార్ఫింగ్ చేసిన వీడియోలతో కూడా ప్రచారాలు సాగుతున్నాయి. ఇలా ఒక్కసారిగా వచ్చిపడుతున్న పోస్టింగులు, సర్వేలు స్మార్ట్‌ఫోన్‌లకు ఊపిరాడకుండా చేస్తున్నాయి.

సాక్షి ఛానల్, పత్రికలపై తక్షణం చర్యలు తీసుకోండి

- ఎన్నికల సంఘానికి తెదేపా ఫిర్యాదు

ఈనాడు అమరావతి: వైకాపాకు, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు అధికార ప్రసారమాధ్యమం (మౌత్‌పీస్) లా వ్యవహరిస్తున్న సాక్షి ఛానల్, కరపత్రంగా మారిన సాక్షి పత్రికపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని తెదేపా నాయకులు కోరారు. ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సంఘం నిష్క్రియాపరత్వం వల్లే వైకాపా నాయకులు పదే పదే ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్నారని వారు భన్వర్‌లాల్ దృష్టికి తెచ్చారు. సాక్షి ఛానల్, పత్రికల్లో ప్రతి రోజూ వైకాపా అధ్యక్షుడు జగన్, నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డికి విశేష ప్రచారం కల్పిస్తూ కథనాల ప్రసారం, ప్రచురణ చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. అదే సమయంలో తెదేపాపైనా, పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే కథనాలు వండివారుస్తున్నాయని పేర్కొన్నారు. సాక్షి ఛానల్, పత్రికలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అడుగడుగునా ఉల్లంఘిస్తూ, చెల్లింపు కథనాలు ప్రసారం, ప్రచురణ చేస్తున్నాయని తెలిపారు. దీనిపై తాము పదే పదే ఫిర్యాదులు చేసినా, ఎన్నికల సంఘం ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



భన్వర్‌లాల్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని, పల్లె రఘునాథరెడ్డి తదితరులు

చౌకగా నిత్యావసరాలు..!

నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి చెందిన శిల్పా సహకార మార్కెట్‌లోని శిల్పా స్టోర్స్‌లో నిత్యావసర సరుకుల్ని నామమాత్రపు ధరకు విక్రయిస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘానికి తెదేపా రాష్ట్ర కార్యాలయ సమన్వయ కార్యదర్శి టీడీ జనార్దన్ ఫిర్యాదు చేశారు. బుధవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధి పొందేందుకే నామమాత్రపు ధరకు సరుకులు విక్రయిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

శిల్పా సహకార్ మూసివేత

నంద్యాల(చాగలమర్రి), న్యూస్‌టుడే: నంద్యాలలో టెక్కె మార్కెట్ సమీపంలోని వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి చెందిన శిల్పా సహకార్ దుకాణాల సముదాయంపై ఫిర్యాదులు రావడంతో వాటిని అధికారులు మూసివేయించారు. మంగళవారం ఉదయం దుకాణాల్లో నిత్యావసర సరకుల కూపన్లు ఇచ్చి ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో పోలీసులు వెళ్లి దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఉచితంగా ఎలాంటి సరకులు ఇవ్వడం లేదంటూ శిల్పా సహకార్ అధ్యక్షురాలు నాగినిరెడ్డి వచ్చి పోలీసు అధికారులతో మాట్లాడటంతో పరిస్థితి సద్దుమణిగిందనుకున్నారు. సాయంత్రం మళ్లీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందడంతో నోడల్ అధికారి తిప్పేనాయక్ వచ్చి శిల్పా సహకార్ దుకాణాలను మూయించారు. తిప్పేనాయక్ మాట్లాడుతూ.. గత కొన్నాళ్లుగా ఈ సంస్థలో రాయితీపై సరకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎన్నికలు ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాలను మూసివేశామని వివరించారు. పోలింగ్ ముగిసిన తరువాత దుకాణాలను యథావిధిగా తెరుచుకుంటాయన్నారు.

గుమికూడిన కార్యకర్తలను పంపేసిన పోలీసులు: నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున గుమికూడారు. శిల్పా నివాసంలో ఉదయం నుంచి ఏజెంట్ల ఫారాల పంపిణీపై సమాలోచనలు జరిగాయి. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఏజెంట్లతో పాటు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇంటి వద్ద ఎవరూ ఉండొద్దంటూ పంపించారు. పోలీసుల వైఖరిపై శిల్పా మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కోరారు.

వారిని అడ్డుకోవద్దు

- శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగితే వైకాపా పోలింగ్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవచ్చు
- పోలీసులకు స్పష్టంచేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నికలో వైకాపా అభ్యర్థి తరఫు పోలింగ్ ఏజెంట్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పోలీసులకు హైకోర్టు స్పష్టంచేసింది. ఏజెంట్‌గా వారి విధులను నిర్వర్తించకుండా అడ్డుకోవద్దని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. పోలీసుల వల్ల తమకు ఇబ్బందులు కలగకుండా తగిన ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ వైకాపా అభ్యర్థి తరఫున పోలింగ్ ఏజెంట్లు 45 మంది హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

అత్యవసర విచారణకు నిరాకరణ

నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా బయట జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు కర్నూలు జిల్లా విడిచి వెళ్లాలని పేర్కొంటూ చీఫ్ ఎలక్ట్రోలర్ ఆఫీసర్(సీఈవో) ఉత్తర్వులు జారీచేయడాన్ని సవాలు చేస్తూ తెదేపా కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని ఆయన తరఫు న్యాయవాది మంగళవారం హైకోర్టును కోరారు. అందుకు నిరాకరించిన ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం సాధారణ పద్ధతిలో వ్యాజ్యాన్ని దాఖలు చేసుకోవాలని సూచించింది.

కమ్యూనిటీ పారా మెడిక్స్‌గా ఆర్ఎంపీ, పీఎంపీలు

- **శిక్షణ, ఇతర అంశాలపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు**

ఈనాడు, అమరావతి: ఆర్ఎంపీ, పీఎంపీలకు కమ్యూనిటీ పారా మెడిక్ శిక్షణ, పరీక్ష, సర్టిఫికేట్ ప్రదానం, ఇతర అంశాలపై మార్గదర్శకాల్ని తయారుచేసేందుకు ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఏపీవీవీపీ కమిషనర్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు, ఏపీ పారా మెడికల్ బోర్డు కార్యదర్శిని నియమించారు. ఇది ఏపీ పారా మెడికల్ బోర్డు నిబంధనల్లో అవసరమైన సవరణలు చేసే విషయంపైనా అధ్యయనం చేయనుంది. శిక్షణ అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీలు కమ్యూనిటీ పారా మెడిక్స్‌గా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కార్యాలయం మంగళవారం తెలిపింది. ఆర్ఎంపీ, పీఎంపీలు ఆరునెలల పాటు మెడికల్ కళాశాలలో శిక్షణతోపాటు మూడునెలలు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయాల్సి ఉంటుందని వెల్లడించింది. అలాగే మరో 3 నెలలు 104 చంద్రన్న సంచార వైద్య చికిత్స వాహనాల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందచేస్తారని పేర్కొంది. గత 40 ఏళ్ల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రభుత్వ గుర్తింపు కోసం ప్రయత్నిస్తుండగా ఇప్పుడు సానుకూలత కనిపించింది. చంద్రబాబునాయుడు పాదయాత్ర సందర్భంగా వీరి కష్టాల్ని గుర్తించి ఎన్నికల మేనిఫెస్టోలో చట్టబద్ధమైన హక్కుల్ని కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రకారం చర్యలు మొదలయ్యాయి.

క్యాట్ సభ్యుడిగా జస్టిస్ రెడ్డి కాంతారావు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) జ్యుడీషియల్ సభ్యుడిగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రెడ్డి కాంతారావును నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. బి.వి.రావు పదవీ విరమణ అనంతరం దాదాపు 11 నెలలుగా ఖాళీగా ఉన్న జ్యుడీషియల్ సభ్యుడి పోస్టును భర్తీ చేస్తూ కేంద్రం ఈ ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పనిచేస్తూ కేంద్ర సర్వీసులకు సంబంధించి వివాదాలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఈ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బాలాడ గ్రామానికి చెందిన కాంతారావు ఆంధ్ర వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1980లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి 1993లో జిల్లా, సెషన్స్ జడ్జిగా ఎంపికయ్యారు. జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పదవితో పాటు వివిధ జిల్లాల్లో జిల్లా జడ్జిగా పనిచేసిన ఆయన 2008 ఏప్రిల్‌లో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2016 మేలో పదవీ విరమణ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/347/17 dt. 19-8-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం గ్రామమందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు 7ఆర్ మైనర్ @ కి.మీ. 4.700 ఆన్ డి-14 ఆర్ ఆఫ్ మేజర్-4 ఆఫ్ టి.ఇ.బి.సి. నుండి కి.మీ. 0.000 నుండి కి.మీ. 1.100 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియూలేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

గ్రామం: సత్తెన్నగూడెం   మండలం: ద్వారకాతిరుమల

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	21	8.76	0.10	తోకల రామలక్ష్మీ భర్త రామారావు	20	22	14	28	సాగుభూమి
2	30/1	1.85	0.20	చెలికాని శైలజ భర్త వెంకటసత్య మురళీధరరావు	31	21	21	29	సాగుభూమి
3	30/2	1.95	0.16	ముంతకల పుల్లయ్య తండ్రి కృష్ణయ్య	31	21	21	29	సాగుభూమి
4	31/2	4.67	0.29	నరం నరసింహరావు తండ్రి మాణిక్యాలరావు	43	30	19	32	సాగుభూమి
5	32/2	4.25	0.32	చెలికాని వి.యస్.కొండలరావు తండ్రి శ్రీరామారావు	43	29	31	33	సాగుభూమి
6	32/3	9.48	0.42	చెలికాని వి.యస్.కొండలరావు తండ్రి శ్రీరామారావు	43	29	31	33	సాగుభూమి
7	33/3	3.58	0.21	రావిపాటి ఇందిరా భర్త పెదకొండలు బొండాడ ధనలక్ష్మీ భర్త హరినాధము	42	28	32	34	సాగుభూమి
8	34	80	0.41	చెలికాని వి.యస్.కొండలరావు తండ్రి శ్రీరామారావు	41	36	33	35	సాగుభూమి
9	35	2.84	0.24	ఆచంట రాము తండ్రి వరప్రసాద్ దేవాలాల్ కృష్ణకుమార్‌సింగ్ తండ్రి యస్ ఆర్.దేవాలాల్‌సింగ్	40	36	34	39	సాగుభూమి
10	39/1	5.73	0.38	కలిదిండి సత్యనారాయణరాజు తండ్రి నారాయణరాజు పెన్మెత్స విజయకుమార్‌రాజు తండ్రి శ్రీనివాసరావు	40	38	35	గ్రామ సరిహద్దు	సాగుభూమి
	39/5	3.04	0.25	కలిదిండి వెంకట సత్యనారాయణరాజు తండ్రి సత్యనారాయణరాజు పెన్మెత్స విజయకుమార్‌రాజు తండ్రి శ్రీనివాసరావు	40	38	35	గ్రామ సరిహద్దు	సాగుభూమి
11	40/1	17.41	0.63	అంబటి భాస్కరరావు తండ్రి కన్నయ్య మరియు ఇతరులు	59	30	41	గ్రామ సరిహద్దు	సాగుభూమి
మొత్తం			3.56						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం



సభలో సంఘీభావం తెలుపుతున్న శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, శ్రీనివాసులరెడ్డి, వివిధ పార్టీల నాయకులు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

ప్రభుత్వాన్ని హెచ్చరించిన మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఐకాస

విజయవాడ, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. సెప్టెంబరు 15వ తేదీలోగా జీవో నెంబరు 279ని రద్దు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఐకాస ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఐకాస నాయకులు మంగళవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి అలంకార్ ధర్నా చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మికులు చేసే పనులను యంత్రాలతో చేయిస్తూ వారి జీవనోపాధికి గండికొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇందులో భాగంగానే జీవో 279ను ప్రభుత్వం విడుదల చేసిందని ఆరోపించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఐకాస అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

మూత్రపిండాల వ్యాధిగ్రస్థుల బ్యాంకు ఖాతాల వివరాల సేకరణ

ఈనాడు, అమరావతి: మూత్రపిండ వ్యాధిగ్రస్థుల్లో పెన్షన్ పొందేందుకు అర్హులైన వారి బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఆధార్‌కార్డులో అసమగ్ర వివరాలు ఉన్నందున డయాలసిస్ కేంద్రాల వద్దకు వచ్చే వారి నుంచి బ్యాంకు ఖాతా సంఖ్యను సేకరిస్తున్నారు. మరో వైపు.. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా 2600 మంది కిడ్నీ వ్యాధిగ్రస్థులు పెన్షన్ పొందేందుకు అర్హులని అధికారులు లెక్క తేల్చారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో 1300 మంది, మిగిలిన వారు వైద్యవిద్య సంచాలక కార్యాలయం పరిధిలో డయాలసిస్ సేవలు పొందుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకునే వారికి మాత్రమే నెలకు రూ.2500 పెన్షన్ అందించనున్నారు.

వారు కూడా ఇటువైపు వస్తేనే పెన్షన్! : రాష్ట్ర వైద్య విద్య సంచాలక కార్యాలయం, వైద్య విధాన పరిషత్ పర్యవేక్షణలో డయాలసిస్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవ కింద పదివేల మందికిపైగా పేదలు రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకునే వారికి మాత్రమే పెన్షన్ ఇస్తామని ప్రకటించినందున ప్రైవేట్ ఆస్పత్రులకు వెళుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. వారు కూడా ప్రభుత్వ నిర్వహణలోని కేంద్రాల్లో డయాలసిస్ చేయించుకోవాలని, అప్పుడే పెన్షన్ పొందేందుకు అర్హత లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

విద్యార్థులకు ఆరోగ్య కార్డులు: మంత్రి గంటా



ఈనాడు, అమరావతి: విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఆరోగ్యకార్డులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నం జిల్లాలో ప్రయోగాత్మకంగా 71వేల మందికిపైగా విద్యార్థులకు ఆరోగ్యకార్డులను అందించనున్నట్లు తెలిపారు. దీని వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి సమాచారం లభిస్తుందని, ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవచ్చని వెల్లడించారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి గంటా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు ఒకటో తేదీ లోపు అన్ని జిల్లాలకు పూర్తి స్థాయి డీఈఓలను నియమించేలా సత్వర చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం యాన్యూటి పద్ధతిలో రూ.4,848 కోట్లు ఖర్చు చేయనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పైలాన్‌ను ఆవిష్కరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. పైలాన్ ఆవిష్కరణకు పాఠశాలను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, ఏపీఆర్‌ఈఐఎస్‌లలో 8నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ఫౌండేషన్ తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో వర్చువల్ తరగతులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం, అమ్మకు వందనం కార్యక్రమాల నిర్వహణపైనా చర్చించారు. విద్యార్థులకు ఇస్తున్న ఏకరూపదుస్తులు ఎందుకు సరిపోవడం లేదని ప్రశ్నించారు. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఫ్యాన్లు, ఆర్వోప్లాంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొక్కను నాటి పెంచే విద్యార్థులతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి అదనంగా మార్కులు కేటాయించేలా నిబంధనలు రూపొందించాలన్నారు.

కొత్త డీఈఓలకు మార్గం సుగమం!

ఈనాడు, గుంటూరు: పాఠశాల విద్యాశాఖలో గత కొంతకాలంగా వాయిదాపడుతూ వస్తున్న విద్యాశాఖ అధికారుల పదోన్నతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ శాఖలో పలువురు ఉపవిద్యాశాఖ అధికారులు, డైట్ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు డీఈఓ క్యాడర్‌తో సమానంగా పదోన్నతుల కల్పనకు సోమవారం సచివాలయంలో జరిగిన పదోన్నతుల కమిటీ ఆమోదం తెలిపింది. మొత్తం 16 మందికి పదోన్నతులు ఇవ్వనున్నారు. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఈనెల 28తో ఎన్నికల కోడ్ ముగియనుంది. దాంతో నెలాఖరుకు వారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో మాత్రమే రెగ్యులర్ డీఈఓలు ఉన్నారు. 11 జిల్లాల డీఈఓ పోస్టులతో పాటు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో ఖాళీగా ఉన్న మూడు డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు వీరు సరిపోతారని భావిస్తున్నారు. మరో పక్క రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో సర్వశిక్ష అభియాన్ పథక సంచాలకులుగా(ఎస్ఎస్ఎ) పనిచేయటానికి డీఈఓ క్యాడర్ అధికారులే కావాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పథక సంచాలకులు ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మేధోసంపత్తి హక్కులపై పోలీసులకు ప్రత్యేక కోర్సు

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి

దిల్లీ: ఉగ్రవాదులకు నిధుల మళ్లింపు, అక్రమంగా నగదు తరలింపు(హవాలా) వంటి నేరపూరిత చర్యలకు పైరసీ, కాపీరైట్ ఉల్లంఘనలే ప్రధాన వనరులుగా మారుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అక్రమ మార్గాల్లో కూడబెట్టిన సొమ్ము దేశ, సంఘ విద్రోహ శక్తులకు చేరుతుందని హెచ్చరించారు. దీనిని నివారించటానికి దేశంలో మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్)ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఐపీఆర్, కాపీరైట్ ఉల్లంఘనల కేసుల్లో చట్ట నిబంధనలను సక్రమంగా అమలుచేసేలా పోలీసులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కోర్సును శిక్షణ కళాశాలల ద్వారా అందించనున్నట్లు హోంమంత్రి వెల్లడించారు. 'మేధోసంపత్తి హక్కుల చట్టం అమలు'అనే అంశంపై మంగళవారం దిల్లీలో ప్రారంభమైన మూడు రోజుల జాతీయ కార్యశాలలో రాజ్‌నాథ్ సింగ్ కీలకోపన్యాసం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/766/16 dt. 19-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం పెదవేగి గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 7.56 సెంట్లులను ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

మండలం: పెదవేగి   గ్రామం: పెదవేగి

క్ర. సం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ సంపు విస్తీర్ణం	తరగతి	భూ ఆసామి పేరు	పరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, మరియు ఇతరములు
1	299/1B	5.45	0.09	పుంజ	ఉండవల్లి సుబ్బారావు తండ్రి సీతయ్య	229/1A	229/1A	342	299/1A	తాడి-3
2	341/2	5.58	0.73	పుంజ	బల్లు రామారావు తండ్రి లక్ష్మయ్య	341/1	341/3	344	341/1	తాడి-4, డ్రిప్, పైప్‌లైన్
3	343/2	13.35	1.90	పుంజ	బల్లు రామారావు తండ్రి లక్ష్మయ్య	341	343/3	343/3	343/1	డ్రిప్, పైప్‌లైన్, గంధం చెట్లు-1, కొబ్బరి-1, అరటితోట
4	344/1A	0.77	0.25	పుంజ	తాణంకి పార్వతి భర్త పోతురాజు	345	344/1B	344/1B	341	పైప్‌లైన్-1
5	345/1B	7.32	0.49	పుంజ	తలారి పరమేసు తండ్రి వెంకట సుబ్బయ్య (0.32)	346	344	345/1C	345/1A	తాడి-12
6				పుంజ	తాణంకి పార్వతి భర్త పోతురాజు (0.17)					బోరు-1, డ్రిప్, మునగ-1
7	346/3B	0.68	0.16	పుంజ	తాణంకి పార్వతి భర్త పోతురాజు (0.02)	346/3A	345	346/4A	346/3A	టేకు-1
8				పుంజ	తాణంకి శ్రీనివాసరావు తండ్రి వేంకటేశు (0.14)					సాగుభూమి
9	346/4A	0.22	0.19	పుంజ	తాణంకి పార్వతి భర్త పోతురాజు (0.12)	347	346/4B	346/5A	346/3A, 3B	వేప-1
10				పుంజ	తాణంకి శ్రీనివాసరావు తండ్రి వేంకటేశు (0.07)					సాగుభూమి
11	346/5A	0.30	0.05	పుంజ	తాణంకి కృష్ణారావు తండ్రి బైరాగి	347	346/5B	346/5B	346/5A	సాగుభూమి
12	347/6B	1.11	0.34	పుంజ	తాణంకి పార్వతి భర్త పోతురాజు (0.18)	347/9B	346	347/6C	347/6A	సాగుభూమి
13				పుంజ	తాణంకి శ్రీనివాసరావు తండ్రి వేంకటేశు (0.16)					తాడి-6
14	347/8A	0.68	0.05	పుంజ	తాణంకి సుబ్బయ్య తండ్రి శ్రీరాములు	347/9B	347/8B	347/8B	347/6B	తాడి-4, ముష్టిచెట్టు-1
15	347/9B	2.43	0.34	పుంజ	దిమ్మిట నాగేశ్వరరావు తండ్రి వెంకటేశు (0.31)	347/9A	347/9C	347/10B	347/6B, 8A	పైప్‌లైన్
16				పుంజ	దిమ్మిట గనిరాజు తండ్రి వెంకటేశు (0.03)					సాగుభూమి
17	347/10B	1.01	0.24	పుంజ	తాణంకి పాపారావు తండ్రి తాతయ్య	347/10A	347/10C	347/11B	347/9B	వేరుసెనగ పంట
18	347/11B	2.32	0.31	పుంజ	తాణంకి కృష్ణారావు తండ్రి బైరాగి	347/11A	347/11C	381	347/10B	పామాయిల్ తోట, డ్రిప్, పైప్‌లైన్, ఫెన్సింగ్
19	381/1B	5.59	0.74	పుంజ	తాణంకి కృష్ణారావు తండ్రి బైరాగి	381/1A	381/1C	382	347	పామాయిల్ తోట, డ్రిప్, పైప్‌లైన్, ఫెన్సింగ్
20	396/1A	4.56	0.51	పుంజ	ఆట్లూరి కిషోర్‌కుమార్ తండ్రి వెంకటేశ్వరావు (0.48)	394	396/1B	396/2B	579	వేప-2, ఊడిగ-2
21				పుంజ	మాదాల శ్రీనివాసరావు తండ్రి రామకృష్ణయ్య బాస్తీతి దారి (0.03)					కొబ్బరి-3, తాడి-3, పైప్‌లైన్
22	396/2B	2.06	0.39	పుంజ	ముసునూరి నారాయణరావు తండ్రి లక్ష్మీనారాయణ	396/2A	396/2C	397	396/1A	వేప-1, పైప్‌లైన్
23	396/5B	3.21	0.46	పుంజ	ముసునూరి రఘునందిని భర్త నాగవెంకటరాజేంద్రప్రసాద్ (0.23)	397	576	396/5C	396/5A	నిమ్మతోట, పైప్‌లైన్, కొబ్బరి మొక్కలు-10
24				పుంజ	నందిగం శివ శంకర్ తండ్రి నారాయణరావు (0.23)					పామాయిల్ మొక్క తోట, పైప్‌లైన్
25	576/2	25.67	0.32	పుంజ	మాదాల సుబ్బారావు తండ్రి లక్ష్మణస్వామి	396	577	576/1	576/2	కోకో, కొబ్బరి, పామాయిల్ తోట, డ్రిప్, పైప్‌లైన్, మునగ-1, టేకు మొక్కలు
			7.56							

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/345/17 dt. 19-8-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామమందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు 4 ఆర్ సబ్ మైనర్ @ కి.మీ. 3.825 ఆఫ్ 2ఎల్ మైనర్ ఆఫ్ డి-11ఆర్ ఆఫ్ మేజర్-4 ఆఫ్ టి.ఇ.బి.సి. నుండి కి.మీ. 0.000 నుండి కి.మీ. 2.000 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియూలేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామం: తిమ్మాపురం   మండలం: ద్వారకాతిరుమల

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	47/2	6.00	0.04	వడ్లపట్ల రేణుకాదేవి భర్త గంగాధర వరప్రభాకరరావు	46	49	48	55	సాగుభూమి
2	47/3	1.35	0.26	వాసిరెడ్డి పద్మజ భర్త నరసింహరావు	46	49	48	55	సాగుభూమి
3	48/1	5.20	0.65	మాజేటి రాములమ్మ భర్త కృష్ణ మాజేటి వివేక్ హర్ష తండ్రి వీరబోగ వసంతరాయుడు	46	49	49	47	సాగుభూమి
4	49	21.45	0.80	వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు తండ్రి సీతారామబ్రహ్మం	48	53	50	54	సాగుభూమి
5	55/2ఎ	2.86	0.24	కొయ్యలమూడి రామమోహనరావు తండ్రి వెంకటనరసయ్య	56	54	47	65	సాగుభూమి
6	55/3	3.37	0.18	వాసిరెడ్డి పద్మజ భర్త నరసింహరావు	56	54	47	65	సాగుభూమి
7	55/4	5.16	0.45	వాసిరెడ్డి వెంకటేశ్వరచౌదరి తండ్రి వెంకటరామారావు	56	54	47	65	సాగుభూమి
8	65/2	2.98	0.37	గరిమెళ్ళ కృష్ణార్జునరావు తండ్రి వెంకయ్య గరిమెళ్ళ ఇందిరాదేవి భర్త రాంబాబు	64	67	55	68	సాగుభూమి
9	67/4	3.54	0.50	గరిమెళ్ళ రాంబాబు తండ్రి వెంకయ్య	68	గ్రామ సరిహద్దు	66	69	సాగుభూమి
10	69/4	2.33	0.35	గరిమెళ్ళ కృష్ణార్జునరావు తండ్రి వెంకయ్య	68	గ్రామ సరిహద్దు	67	175	సాగుభూమి
11	69/5	2.96	0.31	ఆళ్ళ సామ్రాజ్యం భర్త రామారావు బొంతు చెల్లాయమ్మ భర్త రవీంద్ర	68	గ్రామ సరిహద్దు	67	175	సాగుభూమి
12	164/5	0.09	0.02	పాకలపాటి సీతానాగరత్నం	160	76	163	165	సాగుభూమి
13	165	3.18	0.02	వాసిరెడ్డి సత్యనారాయణ తండ్రి గంగరాజు	166	172	164	169	సాగుభూమి
14	173/1	3.78	0.26	గంటా కనకదుర్గ భర్త చంద్రశేఖర్	172	174	75	171	సాగుభూమి
15	173/2	2.75	0.35	గంటా ఇందిరాదేవి భర్త శ్రీనివాసరావు	172	174	75	171	సాగుభూమి
16	173/3	4.71	0.37	గంటా పద్మావతి భర్త సత్యనారాయణ	172	174	75	171	సాగుభూమి
17	174/2	5.86	0.53	అన్నపనేని శివన్నారాయణ తండ్రి రామయ్య	173	177	175	182	సాగుభూమి
18	174/3	7.00	0.25	గంటా చంద్రశేఖర్ తండ్రి జగదీష్ సత్యనారాయణ	173	177	175	182	సాగుభూమి
19	175/1	6.13	0.26	షేక్ బాషా తండ్రి మస్తాన్ సాహెబ్	71	గ్రామ సరిహద్దు	69	177	సాగుభూమి
20	175/2	1.78	0.25	అన్నపనేని బుల్లికృష్ణ తండ్రి శివన్నారాయణ	71	గ్రామ సరిహద్దు	69	177	సాగుభూమి
	మొత్తం		6.46						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/343/17 dt. 19-8-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురం గ్రామమందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు 2ఎల్ మైనర్ @ కి.మీ. 0.775 ఆఫ్ డి-11 ఆర్ మేజర్-4 ఆఫ్ టి.ఇ.బి.సి. నుండి కి.మీ. 0.895 నుండి కి.మీ. 1.900 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియూలేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉప కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

గ్రామం: వెంకటకృష్ణాపురం   మండలం: ద్వారకాతిరుమల

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	349	10.36	1.22	కొప్పుల వెంకన్న గెడ్డం మధుసూదనరావు మరియు ఇతరులు	358	342	344	349	సాగుభూమి
2	344/1/1	0.26	0.11	అందుగుల నాగభూషణం తండ్రి నాగేశ్వరరావు	358	352	352	344	సాగుభూమి
3	344/1/2	0.22	0.01	పెనుమాల దుర్గ భర్త కృష్ణమూర్తి	358	352	352	344	సాగుభూమి
4	344/1/3	0.30	0.07	అందుగుల సూరయ్య తండ్రి మాధవరావు	358	352	352	344	సాగుభూమి
5	344/1/4	0.15	0.06	అందుగుల నాగ నందిరాజు తండ్రి చినముంగయ్య	358	352	352	344	సాగుభూమి
6	344/1/7	0.12	0.03	కొప్పుల వెంకన్న	358	352	352	344	సాగుభూమి
7	344/1/8	0.12	0.02	గెడ్డం దేవానందరావు తండ్రి వెంకటేశ్వరరావు	358	352	352	344	సాగుభూమి
8	344/1/9	0.25	0.06	గెడ్డం లక్ష్మీ భర్త విశ్వేశ్వరరావు	358	352	352	344	సాగుభూమి
9	344/1/11	0.42	0.08	తాడేపల్లి నందయ్య, తాడేపల్లి సుబ్బారావు తాడేపల్లి వెంకటేశ్వరరావు	358	352	352	344	సాగుభూమి
10	344/1/12	0.34	0.08	మద్దా వెంకటేశు తండ్రి చినగంగయ్య	358	352	352	344	సాగుభూమి
11	344/1/15ఎ	0.21	0.14	కొయ్యగూర వెంకమ్మ భర్త వెంకయ్య	358	352	352	344	సాగుభూమి
12	344/1/15బి	0.20	0.08	శాతనూరి సహదేవుడు తండ్రి భీమయ్య	358	352	352	344	సాగుభూమి
13	344/1/16ఎ	0.51	0.06	బిరుదుగడ్డ కనకయ్య	358	352	352	344	సాగుభూమి
14	344/1/22ఎ	0.21	0.05	మోట్రూ వెంకమ్మ భర్త సుబ్బయ్య	358	352	352	344	సాగుభూమి
15	344/1/23ఎ	0.47	0.03	బిరుదుగడ్డ ఆదినారాయణ తండ్రి రామయ్య	358	352	352	344	సాగుభూమి
16	344/1/24ఎ	0.34	0.01	మాంద్రు ఇమ్మానియేలు తండ్రి గంగయ్య	358	352	352	344	సాగుభూమి
17	344/1/29ఎ	0.32	0.01	బొడ్డు సహదేవుడు తండ్రి వీరయ్య	358	352	352	344	సాగుభూమి
18	344/2	0.22	0.22	బొడ్డు రాంబాబు	358	352	352	344	సాగుభూమి
19	350	20.95	0.13	మాంద్రు ఇమ్మానియేలు తండ్రి గంగయ్య	352	349	353	350	సాగుభూమి
20	353	10.51	0.73	గెడ్డం సూరమ్మ భర్త వెంకటేశ్వరరావు	358	354	356	358	సాగుభూమి
21	356	9.97	0.38	పాకలపాటి పద్మ భర్త వెంకటేశ్వరరావు	357	354	గ్రామ సరిహద్దు	356	సాగుభూమి
22	357	10.57	1.43	నిట్టా నాగేశ్వరరావు తండ్రి సరయ్య మరియు ఇతరులు	358	356	గ్రామ సరిహద్దు	357	సాగుభూమి
	మొత్తం		5.01						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

5 మతాల న్యాయమూర్తులు..

దిల్లీ: చరిత్రాత్మక 'ముమ్మారు తలాక్' తీర్పునిచ్చిన రాజ్యాంగ ధర్మాసనం వైవిధ్యమైనది. దీనిలో ఐదు మతాలకు చెందిన న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ జేఎస్ ఖేహర్ సిక్కుమతస్థుడు కాగా.. జస్టిస్ కురియన్ జోసెఫ్- క్రైస్తవ, జస్టిస్ ఉదయ్ లలిత్- హిందు, జస్టిస్ రోహింటన్ నారీమన్- పార్సీ, జస్టిస్ అబ్దుల్ నజీర్ -ఇస్లాం మతాలకు చెందినవారు. నారీమన్, జోసెఫ్, లలిత్ ముమ్మారు తలాక్‌ను వ్యతిరేకించగా.. ఖేహర్, నజీర్ దీన్ని సమర్థించారు.

1 జస్టిస్ ఖేహర్



అత్యున్నత సీజేఐ పదవిని చేపట్టిన తొలి సిక్కు ఖేహరే. ఈయన జనవరి 4, 2017లో బాధ్యతలు తీసుకున్నారు. ఆదివారం (ఆగస్టు 27)తో ఈయన పదవీ కాలం ముగుస్తుంది. 13, సెప్టెంబరు 2011న సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా అడుగుపెట్టిన ఖేహర్ పలు చరిత్రాత్మక తీర్పులనిచ్చారు. వాటిలో వివాదాస్పద జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం కొట్టివేత ప్రధానమైనది. దీన్ని న్యాయమూర్తుల నియామకాలకు కేంద్రం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. సహారా సంస్థల అధిపతి సుబ్రతా రాయ్‌ను కటకటాల వెనక్కు పంపించిన ధర్మాసనంలోనూ ఖేహర్ సభ్యులుగా కొనసాగారు.

2 జస్టిస్ జోసెఫ్



తిరువనంతపురంలోని "కేరళ లా అకాడమీ" పూర్వవిద్యార్థి అయిన జోసెఫ్.. న్యాయ ప్రస్థానం 1979లోనే మొదలైంది. ఈయన 2000లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఫిబ్రవరి 2010లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఈయనకు పదోన్నతి లభించింది. అనంతరం మార్చి 2013లో సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా అడుగుపెట్టారు. 2015లో 'గుడ్ ఫ్రైడే' రోజు "ప్రధాన న్యాయమూర్తుల సదస్సు" ఏర్పాటును వ్యతిరేకిస్తూ అప్పటి సీజేఐకు లేఖ రాయడంతో ఈయన పేరు మీడియాలో మార్మోగింది. 'మతపరమైన పర్వదినాలు, సెలవుల్లో సదస్సులు ఏర్పాటుచేస్తే.. ఇతర రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థలు, విభాగాలకు న్యాయవ్యవస్థ తప్పుడు సందేశాన్ని పంపినట్లవుతుంది. దీంతో అందరికీ సమ ప్రాధాన్యం ఇవ్వడం, అన్ని పర్వదినాలనూ గౌరవించడం లాంటి విషయాలను వారు తప్పుగా అర్థంచేసుకునే ముప్పుంది'అంటూ ఆయన తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెలిబుచ్చారు.

3 జస్టిస్ లలిత్



సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదిగా లలిత్ కేసులు వాదించిన తీరు సాటిలేనిది. కేసు పూర్వపరాలను నిశితంగా పరిశీలించడం, న్యాయమూర్తులు సంధించిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పడం, కేసులను వాదించేటప్పుడు ధర్మాసనం ముందు హుందాగా నడుచుకోవడం లాంటి అంశాలే ఆయన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. 2జీ కుంభకోణం కేసులో ప్రభుత్వ న్యాయవాదిగా లలిత్‌ను నియమించమని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు జస్టిస్ జీఎస్ సింఘ్వి నేతృత్వంలోని ధర్మాసనం సూచించిందంటే.. లలిత్‌పై న్యాయ వ్యవస్థకున్న విశ్వాసం ఎంతటి దృఢమైనదో అర్థంచేసుకోవచ్చు. 2004లో సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదిగా సేవలు మొదలుపెట్టిన ఆయన.. 2014లో న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

4 జస్టిస్ నారీమన్



నారీమన్ సైతం సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేసిన అనంతరం న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్నారు. రాజ్యాంగ, కార్పొరేట్, సివిల్ చట్టాల్లోని నిబంధనలపై ఆయన పరిజ్ఞానం అమోఘమైనది. ఐటీ చట్టంలోని సెక్షన్ 66-ఏ చెల్లదన్న చరిత్రాత్మక తీర్పు ఈయన నోటినుంచే వెలువడింది. దిల్లీలోని శ్రీరామ్ కాలేజీ ఆఫ్ కామర్స్‌లో డిగ్రీ చదివిన ఈయన.. దిల్లీ వర్సిటీలో న్యాయ విద్య అభ్యసించారు. హార్వర్డ్ లా స్కూల్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు. జులై 2011 నుంచి ఫిబ్రవరి 2013 మధ్య సొలిసిటర్ జనరల్‌గానూ సేవలు అందించారు. 2014 జులైలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్నారు.

5 జస్టిస్ నజీర్



నజీర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ముమ్మారు తలాక్ చెల్లుబాటుపై మే నెలలో ధర్మాసనం వరుసగా ఆరురోజులపాటు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ముస్లింల సంప్రదాయాలు, ఆచారాలపై న్యాయవాదులను ఖేహర్, జోసెఫ్, నారీమన్, లలిత్‌లు పలు ప్రశ్నలు సంధించారు. తమ సందేహాలపై వివరణలు కోరారు. అయితే నజీర్ ఒక్క ప్రశ్న కూడా అడగలేదని మీడియాలో వార్తలు వచ్చాయి. కర్ణాటకకు చెందిన నజీర్ ఆ రాష్ట్ర హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా పనిచేశారు.

ఆ దేశాల్లో చెల్లదు!

ముమ్మారు తలాక్ విధానాన్ని ఎప్పుడో నిషేధించిన 19 దేశాలు

మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులిచ్చే ముస్లిం సంప్రదాయాన్ని ప్రపంచంలోని దాదాపు 19 దేశాలు ఇప్పటికే నిషేధించాయి. ఆ దేశాల సరసన ఇప్పుడు భారత్ కూడా చేరింది. ముస్లింల జనాభా అధికంగా ఉన్న ఇండొనేషియా, పాకిస్థాన్, ఈజిప్టు, బంగ్లాదేశ్ తదితర దేశాలు కూడా తలాక్‌ను నిషేధించిన దేశాల జాబితాలో ఉండటం గమనార్హం. వాస్తవానికి ముస్లిం సమాజంలో విడాకులు తీసుకునే ప్రక్రియ వివిధ దేశాల్లో నాలుగు విధాలుగా ఉంది. ఇందులో భార్యకు భర్త విడాకులిచ్చే తలాక్ విధానంపైనే వివాదాలు, భిన్నాభిప్రాయాలున్నాయి.

1 **తలాక్:** భార్యకు విడాకులివ్వాలనుకుంటే భర్త అనుసరించే పద్ధతి. ఇందుకోసం అతను మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకుంటున్నాడు.

2 **ఖులా:** భార్యాభర్తలు ఇద్దరూ విడిపోవాలని కోరుకుంటే అమలుచేసే విధానం.

3 **ఫస్థ్ ఇ నిఖా:** వివాహాన్ని రద్దుచేసుకోవడం.

4 **తఫ్వీద్ అల్ తలాక్:** భార్య స్వయంగా కోరుకుని విడాకులు తీసుకోవడం.

వివిధ దేశాల్లో తలాక్ నిషేధం ఇలా...


పాకిస్థాన్ దాదాపు 96 శాతం ముస్లిం జనాభా ఉన్న పాకిస్థాన్ 1961లోనే ముమ్మారు తలాక్ విధానాన్ని నిషేధించింది. భార్యకు విడాకులివ్వాలనుకునే వ్యక్తి ముందుగా న్యాయ మండలి ఛైర్మన్‌కు, తన భార్యకు లీగల్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత 90 రోజుల సమయం ఉంటుంది. ఈలోగా కౌన్సెలింగ్ నిర్వహించి.. కలిపే ప్రయత్నమూ చేస్తారు.

ఇండొనేషియా దాదాపు 90 శాతం ముస్లిం జనాభా ఉన్న ఇండొనేషియాలో విడాకుల్ని తలాక్ ద్వారా తీసుకోవడం కుదరదు. ఇండొనేషియా వివాహ నిబంధనల్లోని ఆర్టికల్ 19 ప్రకారం- విడాకులు కోరుకునే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలుచేసుకోవాల్సి ఉంటుంది.

టర్కీ దాదాపు 99 శాతం ముస్లిం జనాభా కలిగిన టర్కీ 1926లోనే స్విస్ పౌరస్మృతిని అంగీకరించింది. కుటుంబ, వ్యక్తిగత వ్యవహారాల్లో మత చట్టాల ప్రమేయాన్ని ఇది నిషేధిస్తుంది. దాని ప్రకారం ముమ్మారు తలాక్ విధానమూ రద్దయిపోయింది.

ఇరాన్ ముమ్మారు తలాక్ చెప్పే విధానానికి- దాదాపు 87 శాతం ముస్లిం జనాభా ఉన్న ఇరాన్‌లో 1992లోనే సవరణలు చేశారు.

ట్రిపుల్ తలాక్‌ను నిషేధించిన దేశాలివీ..



ఈజిప్టు తలాక్ విధానానికి సవరణలు చేసిన తొలిదేశం ఈజిప్టు. 1929లోనే ఈ దేశంలో దీనికి సవరణలు చేశారు. తలాక్‌కు, తలాక్‌కు మధ్య 90రోజుల వ్యవధి ఉండాలన్న నియమం పెట్టుకున్నారు. ఒకే విడతలో మూడుసార్లు తలాక్ చెప్పినా.. దానిని మొదటివిడత కిందే పరిగణిస్తారు.

బంగ్లాదేశ్ దాదాపు 89 శాతం ముస్లిం జనాభా కలిగిన బంగ్లాదేశ్‌లో మూడుసార్లు తలాక్ చెప్పే విధానం చెల్లదు.

ట్యూనీషియా భర్త ఏకపక్షంగా తలాక్ చెప్పడం ఈ దేశంలో కుదరదు. మతపెద్దలు, న్యాయమూర్తులకు కారణం చెప్పాల్సి ఉంటుంది. రాజీకి కొంత గడువు ఇచ్చిన తర్వాత- కోర్టు మాత్రమే విడాకులు మంజూరుచేస్తుంది. 1956లో ఇలాంటి సవరణలు చేశారు.

శ్రీలంక ఈ దేశంలో చేసిన సవరణల ప్రకారం- భర్త ముందుగా బంధువులు, స్థానికుల సమక్షంలో ఖ్వాజీకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ జంట కలిసి ఉండేలా వారంతా ప్రయత్నిస్తారు. అది కుదరని పక్షంలో 30 రోజుల తర్వాత విడాకులిచ్చేందుకు అవకాశం ఇస్తారు. ఖ్వాజీ, ఇద్దరు సాక్షుల సమక్షంలో ఈ ప్రక్రియను చేపడతారు.

అల్జీరియా ఇక్కడ తలాక్ చెప్పడం కుదరదు. కోర్టు మాత్రమే విడాకులు మంజూరుచేస్తుంది.. అదీ రాజీ యత్నాలు చేసిన తర్వాతే! రాజీకి మూడు నెలల సమయం ఇస్తారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

న్యాయపథంలో 'తలాక్' కేసు పయనం...చేరిన గమ్యం

అక్టోబరు 16, 2015: విడాకుల వ్యవహారంలో ముస్లిం మహిళలు ఏమైనా వివక్షను ఎదుర్కొంటున్నారా! అనే విషయాన్ని పరిశీలించడానికి ఓ సముచిత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా భారత ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు బెంచ్ అభ్యర్థన.

ఫిబ్రవరి 5, 2016: మూడుపర్యాయాలు 'తలాక్', 'బహుభార్యత్వం' , 'నిఖా హలాలా'.. ల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ల విషయంలో సహకారం అందించాల్సిందిగా అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీని కోరిన సుప్రీంకోర్టు.

మార్చి 28, 2016: 'మహిళలు-చట్టం: కుటుంబ చట్టాలపై ఓ అంచనా (వివాహం, విడాకులు, పిల్లల సంరక్షణ బాధ్యతలు, వారసత్వంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ)లపై ఉన్నత స్థాయి సంఘం నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని కోరిన సుప్రీంకోర్టు.

జూన్ 29, 2016: ముస్లింలలో మూడుపర్యాయాలు తలాక్ విధానాన్ని రాజ్యాంగ నిబంధనావళి గీటురాయిగా పరీక్షించనున్నట్లు సుప్రీంకోర్టు ఉద్ఘాటన.

అక్టోబరు 7, 2016: తలాక్ తదితర అంశాలను కేంద్రం మొట్టమొదటి సారిగా సుప్రీంకోర్టులో తీవ్రంగా వ్యతిరేకించింది. సమానత్వం, లౌకికత కోణంలో వీటిని పునఃపరిశీలించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. భారత రాజ్యాంగ చరిత్రలో కేంద్రం సంబంధిత అంశాలపై ఈ కోణంలో స్పందించడం ఇదే ప్రథమం.

ఫిబ్రవరి 14, 2017: ఈ నేపథ్యంలో దాఖలైన వివిధ వాజ్యకాలీన(ఇంట్రలొక్యూటరీ) అభ్యర్థనలను ప్రధాన అంశంతో జతపరచేందుకు సుప్రీంకోర్టు అనుమతి మంజూరు.

ఫిబ్రవరి 16, 2017: మూడు పర్యాయాలు 'తలాక్', బహుభార్యాత్వం, 'నిఖా హలాలా'లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించి, నిర్ణయం తీసుకునేందుకు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం ప్రకటన.

మార్చి 27, 2017: పై అంశాలపై దాఖలైన పిటిషన్లు విచారణయోగ్యమైనవి కానేకావని సుప్రీంకోర్టుకు తెలిపిన 'అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు' (ఏఐఎంపీఎల్‌బీ). అసలా అంశాలు న్యాయవ్యవస్థ పరిధిలో లేవన్న అభిప్రాయాన్నీ వెలిబుచ్చింది.

మార్చి 30, 2017: ఈ అంశాలన్నీ అత్యంత ప్రధానమైనవని పేర్కొన్న సుప్రీంకోర్టు. భావోద్వేగాలతో సమ్మిళితమై ఉన్నవని ఉద్ఘాటించింది. మే నెల 11వ తేదీ నుంచీ రాజ్యాంగ ధర్మాసనం విచారణను ప్రారంభిస్తుందని ప్రకటించిన సుప్రీంకోర్టు.

మే 11, 2017: ముస్లింలలో 'మూడుపర్యాయాలు తలాక్' విధానం వారి మతంలో మౌలిక అంశమా! అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పిన సుప్రీంకోర్టు.

మే 12, 2017: ముస్లింలలో వివాహబంధాన్ని తెగతెంపులు చేసుకునే క్రమంలో మూడుపర్యాయాలు తలాక్ అనేది 'దారుణం'.. . 'అవాంఛనీయ' మైన విధానం అంటూ సర్వోన్నత న్యాయస్థానం ఉద్ఘాటన.

మే 15, 2017: ఒకవేళ మూడుపర్యాయాల 'తలాక్' విధానాన్ని కనుక సుప్రీంకోర్టు తోసిపుచ్చితే...ముస్లింలలో వివాహాలు, విడాకులను క్రమబద్ధీకరించేందుకు ఒక కొత్త చట్టాన్ని తీసుకు వస్తానంటూ సర్వోన్నత న్యాయస్థానానికి తెలియచేసిన కేంద్రప్రభుత్వం. రాజ్యాంగంలోని 25వ ఆర్టికల్ కింద అసలు 'మూడుపర్యాయాల తలాక్' అనేది ముస్లింల మతంలో ఓ తప్పనిసరి అంశమా అనే విషయాన్ని పరిశీలిస్తామంటూ సుప్రీంకోర్టు ఉద్ఘాటన.

మే 16, 2017: రాజ్యాంగ నైతికత ప్రాతిపదికన మతవిశ్వాసానికి సంబంధించిన అంశాలను పరీక్షించరాదంటూ సుప్రీంకోర్టుకు తెలియచేసిన 'ఏఐఎంపీఎల్‌బీ'. అసలీ 'మూడుపర్యాయాల తలాక్' అనేది గత 14 వందల సంవత్సరాలుగా ఓ మతపరమైన విశ్వాసంగా కొనసాగుతోందంటూ ఉద్ఘాటన. శ్రీరాముడు అయోధ్యలోనే జన్మించాడన్న నమ్మకం ఎలాంటిదో... మూడుపర్యాయాల తలాక్ విశ్వాసం కూడా అలాంటిదేనంటూ పోలిక.

మే 17, 2017: 'నిఖానామా'ను అమలు చేస్తున్న సమయంలోనే ముస్లిం మహిళలకు మున్ముందు '3పర్యాయాల తలాక్'కు 'కుదరదు' అని చెప్పే అవకాశాన్ని ఇవ్వవచ్చా అంటూ ఏఐఎంపీఎల్‌బీని సుప్రీంకోర్టును అడిగింది.

వాస్తవానికి ఈ తలాక్ వ్యవహారం అనేది అటు ఇస్లాంలో భాగం కానీ...ఇటు మెజారిటీ వర్సెస్ మైనారిటీ అంశం కానీ కాదని సుప్రీం కోర్టుకు కేంద్రప్రభుత్వం స్పష్టంగా తెలియచేసింది. ఇది కేవలం ముస్లిం పురుషులు.... అభాగ్య ముస్లిం వనితల మధ్య ఉన్న అంతర్ వర్గ సమస్య అని కేంద్రం పేర్కొంది.

మే 18, 2017: మూడుపర్యాయాలు తలాక్‌పై తీర్పును వాయిదావేసిన సుప్రీంకోర్టు.

మే 22, 2017: వివాహాన్ని రద్దు చేసుకునేందుకు 'మూడుపర్యాయాలు తలాక్' విధానం జోలికి పోమంటూ ముస్లిం వరులకు తెలియచేయాల్సిందిగా ఖాజీలకు సూచనలు జారీచేస్తామని పేర్కొంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన ముస్లిం పర్సనల్ లా బోర్డు.

ఆగస్టు 22, 2017: చివరకు...మూడు పర్యాయాల తలాక్ ద్వారా వివాహబంధాన్ని నిలువునా తెంపేయడం చట్టవిరుద్ధం, రాజ్యాంగవ్యతిరేకం...పవిత్ర ఖురాన్ ప్రబోధానికి పూర్తి వ్యతిరేకం అంటూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది.



ముమ్మారు తలాక్‌పై మంగళవారం సుప్రీంకోర్టు తీర్పు అనంతరం దిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ సహవ్యవస్థాపకురాలు జకియా సోమన్

తీర్పును అధ్యయనం చేయనున్న లా కమిషన్!

దిల్లీ: 'ముమ్మారు తలాక్'పై మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును ఇప్పుడిక క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు 'లా కమిషన్' సమాయత్తమౌతోంది. ఉమ్మడి పౌరస్మృతి నివేదిక ముసాయిదా రూపకల్పనలో ఈ తీర్పు మార్గదర్శకంగా పనిచేయనుంది. సీనియర్ అధికారి ఒకరు మంగళవారం నాడిక్కడ విషయాన్ని వెల్లడించారు. ఒక్కసారి కనుక ఈ నివేదిక ముసాయిదా సిద్ధమైతే.. దానిని తదుపరి చర్యలు చేపట్టే నిమిత్తం అఖిల పక్ష సమావేశం ముందుంచుతారు. ఉమ్మడిపౌరస్మృతిపై నివేదికరూపకల్పన ప్రక్రియలోభాగంగా సంబంధితులందరితో 'లాకమిషన్' చర్చలు జరుపుతుంది.

కొత్త చట్టం అవసరం లేదు

కేంద్ర న్యాయశాఖ అధికారుల విశ్లేషణ

ఈనాడు, దిల్లీ: ముమ్మారు తలాక్‌పై కొత్త చట్టం తీసుకురావాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సంకేతాలిచ్చింది. గృహహింసకు సంబంధించిన చట్టంతోపాటు ప్రస్తుతమున్న చట్టాలు ఇందుకు సరిపోతాయని పేర్కొంది. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు.. ముమ్మారు తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించినట్లు ప్రాథమికంగా తీర్పు స్పష్టం చేస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఇటు ముమ్మారు తలాక్‌పై ఆరునెలల్లోపు చట్టం చేయాలని జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లు సూచించారు. లేనిపక్షంలో సుప్రీం ఆదేశాలు అమల్లో ఉంటాయన్నారు. అయితే మెజార్టీ సభ్యులు (ముగ్గురు) చట్టం తేవాలని చెప్పలేదని న్యాయశాఖ అధికారులు వివరించారు.

2002లో షమీమ్ అరా కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకీభవిస్తున్నట్లు.. జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ లలిత్‌లు చెప్పారు. ఆ కేసులో తలాక్‌కు ఎలాంటి పద్ధతి అనుసరించాలో చెబుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. "తలాక్‌కు కచ్చితంగా సహేతుకమైన కారణం ఉండాలి. తలాక్‌కు ముందు భార్యాభర్తల మధ్య సయోధ్య కుదర్చడానికి ఇద్దరు మధ్యవర్తుల ద్వారా ప్రయత్నం జరగాలి. ఒకవేళ సయోధ్య విఫలైతే తలాక్‌ను అమలుచేయొచ్చు" అని పేర్కొంది. ఇకపై తలాక్ విషయంలో వీటిని పాటించాల్సి ఉంటుందని న్యాయశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. మెజార్టీ ధర్మాసనం ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని చెప్పింది తప్పితే.. మొత్తం తలాక్‌ను నిషేధించలేదని వారు పేర్కొన్నారు. ఒకవేళ మొత్తం తలాక్‌నే రద్దు చేసి ఉంటే.. ముస్లింల విడాకుల కోసం కొత్త చట్టం తీసుకురావాల్సి వచ్చేదని అభిప్రాయపడ్డారు. ఇకపై ముమ్మారు తలాక్ చెల్లుబాటు కాదని.. అలాంటి చర్యకు పాల్పడిన వ్యక్తిపై వేధింపులు, గృహహింస కింద భార్య కేసు పెట్టొచ్చని చెప్పారు. ఇటు సుప్రీం తీర్పునకు కట్టుబడి సరైన చర్యలు తీసుకునేలా కేంద్రం అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.





తీర్పు అనంతరం మంగళవారం దిల్లీలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాదులు ఫర్హా ఫయాజ్, సైఫ్ మహమూద్

తీర్పుపై తొలుత అయోమయం

దిల్లీ: ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై మొదట కొంత అయోమయం నెలకొంది. తీర్పు ఏకగ్రీవంగా వెలువడిందనే అభిప్రాయం మొదట అందరిలో కలిగింది. తుది తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్. ఖేహర్ చదువుతూ 'మేం...' అని అనడంతో అది ఏకాభిప్రాయ తీర్పుగా పాత్రికేయులు భావించి, బయటి ప్రపంచానికి ఆ విషయం తెలియపరచడానికి ఉరుకులుపరుగులుపై కోర్టు వెలుపలకు వచ్చారు. ఆ తర్వాత జస్టిస్ జోసెఫ్ తన తీర్పును చదివాక గానీ ఇది 3:2 ఆధిక్యంతో వచ్చిన తీర్పు అనేది స్పష్టం కాలేదు. ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయంతోనే తీర్పు ఏకీభవించి ఉందన్న అభిప్రాయం అకస్మాత్తుగా మారిపోయింది. సీజేఐ తీర్పు మైనారిటీ తీర్పుగా నిలవడంపై కిక్కిరిసిన న్యాయస్థానంలో న్యాయవాదులు గుసగుసలాడారు. తీర్పు వెలువరిస్తున్న సమయంలో ఉభయపక్షాల న్యాయవాదులతో పాటు కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయవాదులంతా చెవులు రిక్కించి, ప్రతీ పదాన్ని జాగ్రత్తగా విన్నారు. సీజేఐ తీర్పును వెలువరించడం ప్రారంభించి, 8 నిమిషాల్లో ముగించారు. ఉదయం 10.30 గంటలకు ధర్మాసనం కొలువుదీరగానే అందరి దృష్టీ అక్కడే కేంద్రీకృతమైంది. ఇరు పక్షాల న్యాయవాదులూ ఉత్కంఠలో లేచి నిల్చొన్నారు. సీజేఐ తర్వాత జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ ముమ్మారు తలాక్‌పై తామూ మూడు తీర్పులు ఇస్తున్నట్లు చెప్పారు. జస్టిస్ నారీమన్ తాను రాసిన తీర్పులో ప్రతీ పదాన్ని గుర్తుపెట్టుకున్న రీతిలో రాతప్రతి వైపు చూడకుండానే మొత్తం తీర్పును చెప్పారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందంటూ బాధిత మహిళలు సుప్రీం కోర్టు తలుపులు తట్టినప్పుడు చేతులు ముడుచుకుని కూర్చోలేమనీ, ఆ అలవాటు చెల్లుబాటవుతుందో లేదో చెప్పాల్సిందేనని అన్నారు.

'తలాక్'తో ఎన్నికల ఫలాలు!

కమలంలో ఆశలు..కాంగ్రెస్‌లో సందిగ్ధం

దిల్లీ: తలాక్‌ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పంట పండిస్తుందని కమలనాథులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. సుప్రీం తీర్పు భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారుకు సరికొత్త అస్త్రాన్ని చేర్చినట్లయింది. తాజా తీర్పుతో ముమ్మారు తలాక్‌కు వ్యతిరేకంగా ముందునుంచీ సాగించిన తన వైఖరిని భాజపా ఎలుగెత్తి చాటుకునే అవకాశం కనిపిస్తోంది. లింగ న్యాయం, సమానత్వమనే నియమాలను ఉల్లంఘించిన తలాక్ ఆచారాన్ని తాము వ్యతిరేకించినట్లుగా ఆ పార్టీ చెబుతోంది. ముమ్మారు తలాక్‌పై భాజపా వైఖరి ముస్లిం సమాజంలోని ఉదార మేధోవర్గాన్ని ఆకట్టుకునే అవకాశం ఉందనీ, కాంగ్రెస్‌పై ఉన్న అల్పసంఖ్యాకవర్గాల సంతుష్టీకరణ విమర్శలతో విసిగిన ఇతర వర్గాలనూ ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. సుప్రీం తీర్పు అనంతరం ముస్లిం మహిళల పక్షాన నిలిచినందుకు ప్రధాని మోదీకి, భాజపా ప్రభుత్వానికి కృతజ్ఞతలంటూ భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తన ట్వీట్ చేయడం, చాందసత్వం నుంచి ఇస్లామ్‌ను కాపాడిన తీర్పుగా భావించాలంటూ ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొనడం గమనార్హం. గత అక్టోబరులో ఎన్డీఏ ప్రభుత్వం న్యాయస్థానంలో తలాఖ్‌ను వ్యతిరేకించడం చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఫలించినట్లు చెబుతున్నారు. ముమ్మారు తలాక్‌తో విసిగిపోయిన ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో తమ పార్టీకి ఓటేసినట్లు పలువురు భాజపా నేతలూ ప్రకటించారు. తాజా పరిణామాలపై అలహాబాద్‌లోని జీబీపంత్ సామాజిక శాస్త్రాల సంస్థ ఆచార్యులు బద్రీనారాయణ్ స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు ఎన్నికల పరంగా భాజపాకు ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొన్నారు. భాజపా ఇప్పటికే యూపీ ఎన్నికల్లో లబ్ధి పొందిందనీ, ఇది ముస్లిం సమాజంలో పెద్ద అంశమేననీ, వారి ఓటింగ్ శైలిపై ప్రభావం చూపుతుందనీ, భాజపా తప్పకుండా లబ్ధి పొందుతుందని వివరించారు. 2014 ఎన్నికల తర్వాత నుంచి ముస్లిం వర్గానికి సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ జాగ్రత్తగా స్పందిస్తోంది. తమ ప్రత్యర్థులు తమపై అల్పసంఖ్యాక వర్గాల అనుకూల పార్టీ అనే ముద్రను విజయవంతంగా వేశారనీ, దాని ఫలితం పలు రాష్ట్రాల ఎన్నికల్లో అనుభవించామని కాంగ్రెస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. భాజపా ఎన్నికల వ్యూహమైన మృదు హిందూత్వ, అభివృద్ధిని ఎదుర్కొనేందుకు ఆ పార్టీ వ్యూహకర్తలు మరింత జాగ్రత్తగా కసరత్తు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. తాము సంతుష్టీకరణ రాజకీయాలు చేయబోమనీ, అందరి ప్రయోజనాల కోసం పాటుపడతామంటూ గుజరాత్ సీఎం విజయ్‌రూపానీ తాజాగా వ్యాఖ్యానించడం, ముమ్మారు తలాక్‌పై చర్చను ప్రారంభిస్తామంటూ బీజేవైఎం చీఫ్ పూనం మహాజన్ పేర్కొనడం.. అల్పసంఖ్యాక వర్గాల సంతుష్టీకరణపై విపక్ష పార్టీలను దునుమాడటమే భాజపా ప్రణాళిక అని పరోక్షంగా సంకేతాలిచ్చినట్లుగా భావిస్తున్నారు. ఈ అంశాన్ని ఎన్నికల పరంగా ఉపయోగించుకునే దిశగా భాజపా అడుగులు వేస్తుండగా, ముమ్మార్ తలాఖ్‌ను సమర్థిస్తూ వాదించేందుకు అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపున సుప్రీంకోర్టులో కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ ప్రాతినిధ్యం వహించిన నేపథ్యంలో ఆ పార్టీ ఇప్పుడు నష్టనివారణ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. గతంలో షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును ప్రభావహీనం చేస్తూ రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విషయంలోనూ ఇప్పుడు కాంగ్రెస్ తన ప్రగతిశీల వైఖరిని స్పష్టం చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఉమ్మడి పౌర స్మృతికి సానుకూలత

దేశంలో ఒకే చట్టం ఒకే న్యాయం అంటూ ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలన్న కమలనాథుల యత్నాలకు తాజా పరిణామం ఊతమివ్వనుంది. ఇప్పటి వరకూ భారతీయ జనతా పార్టీతో మతపరమైన అంశాల్లో విభేదిస్తూ వస్తున్న హిందూమతస్తుల్లోని ఉదార లౌకిక వాదులూ ఆ పార్టీకి దగ్గరయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తలాక్‌పై తాజా తీర్పు లౌకికవాద శిబిరంలోని టీఎంసీ, ఆర్జేడీలకూ ఇబ్బందికరమైన పరిస్థితినే కల్పించనుంది. ఇంత వరకూ ఆయా పార్టీలు ముస్లింలకు ఎక్కడ దూరమవుతామనే భయంతో ఆ సమాజంలోని బాధిత మహిళ కష్టాలపై గొంతెత్తింది లేదు. ముస్లిం మహిళల ఓట్లు కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే కమలనాథులకు తరలిపోయిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోనూ ఇదో ఒరవడి కనిపించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆ తీర్పు మహిళా స్వేచ్ఛకు లభించిన విజయం

జయప్రకాష్ నారాయణ్

ఈనాడు, హైదరాబాద్: తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మానవ హక్కులకు, మహిళా స్వేచ్ఛ, హేతుబద్ధ భావాలకు లభించిన పెద్ద విజయమని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడ్డి విశ్వాసాలు, మూర్ఖపు ఆచారాలపై మానవహక్కులు గెలిచాయన్నారు. మతం పేరున్నంత మాత్రాన హిందూయిజంలోని కులం, ఇస్లాంలోని మహిళలకు విడాకులిచ్చే తలాఖ్ ఏదైనా అమానుష విశ్వాసాలు ఆమోదయోగ్యం కాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు పార్లమెంటులో చట్టం చేయటం ద్వారా 'తలాక్' అంశానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు.

ఉత్తరం ద్వారా తలాక్ చెప్పాడు

హోషంగాబాద్: ముమ్మారు తలాక్ చట్ట విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎంతో మంది ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నా, ఆమెకు మాత్రం చేదు వార్తే వినిపించింది. కారణం తన భర్త పోస్టు ద్వారా ముమ్మారు తలాక్ చెప్పి విడాకులివ్వడమే. మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్ జిల్లాకు చెందిన ఫ్రహీన్‌కు విడాకులిస్తున్నట్లు ఆమె భర్త ఇమ్రాన్ ఉత్తరం ద్వారా తెలిపాడు. దీనిపై బాధితురాలు స్పందిస్తూ.. ముమ్మారు తలాక్‌ను నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, ఎంతో మంది మహిళల జీవితాలను కాపాడుతుందని భావిస్తున్నానని తెలిపింది. ఈ ఉత్తరాన్ని ఆమె భర్త ఆగస్టు 16వ తేదీన రాయగా మంగళవారం అందుకున్నారు.

బానోదయం!

ముమ్మారు తలాక్‌పై అయిదుగురు మహిళల న్యాయపోరాటం

దిల్లీ

ఆ అయిదుగురు ముస్లిం మహిళల మానసిక క్షోభ నుంచి ప్రజ్వరిల్లిన న్యాయపోరాటం.. సాటి మహిళాలోకానికి సాంత్వన కలిగించే పరిణామానికి కారణమైంది. పదికాలాల పాటు పచ్చగా సంసారం చేసుకోవాలనుకున్న వారి కలలను 'ముమ్మారు తలాక్' మూణ్నాళ్ల ముచ్చట చేసేసింది. తమ జీవితాల్లో అల్లకల్లోలం రేపిన తలాక్‌కు వ్యతిరేకంగా ఆ 'అయిదుగురు' సర్వోన్నత న్యాయస్థానం మెట్లెక్కారు. న్యాయం జరుగుతుందన్న అపార విశ్వాసం.. అవ్యాజ సంకల్ప బలం వారిని ముందుకు నడిపించాయి. చివరకు సాటి మహిళలందరికీ 'కరదీపిక'గా నిలిచే తీర్పునకు కారకులై చరిత్ర సృష్టించారు. అద్భుత విజయం సాధించారు. సాటి మహిళా సమాజం కూడా వెన్నంటి నిలిచింది. తన భర్త మూడు సార్లు తలాక్ అని రాసి లేఖ పంపడంతో సాయరా బానో (మొదటి పిటిషనర్) సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ తొలి అడుగు వేశారామె. మోదీ ప్రభుత్వం కూడా ఆమె విజ్ఞాపనకు మద్దతుగా.. ముమ్మారు తలాక్‌కు వ్యతిరేకంగా ప్రమాణపత్రం దాఖలు చేసింది. అనంతరం మరో నలుగురు మహిళలు వేసిన వ్యాజ్యాలను కూడా బానో పిటిషన్‌తో జత పరిచారు. భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) సంస్థ ఆరో పిటిషనర్‌గా న్యాయపోరాటంలో భాగస్వామి అయింది.

భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ)

ముస్లిం మహిళలకు సమానత్వం కోసం శోధన (ఎండబ్ల్యూక్యూఈ) పేరిట ముంబయికి చెందిన బీఎంఎంఏ పిటిషన్ దాఖలు చేసింది. స్త్రీ, పురుషులు సమానమేనని అల్లా బోధించినట్లు వాదించింది. 92 శాతం ముస్లిం మహిళలు ముమ్మారు తలాక్ రద్దును కోరుకుంటున్నట్లు ఈ సంస్థ చేసిన సర్వేను పరిగణనలోకి తీసుకుంటూ.. జకియా సోమన్ నేతృత్వంలోని బీఎంఎంఏను సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసులో చేర్చింది.

ఆ అయిదుగురూ...ఇప్పుడు 'డైవోర్సీ'లు కాదు

'మూడు పర్యాయాల తలాక్' విధానాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన బాధిత మహిళలు అయిదుగురికీ నేటి (మంగళవారం) సుప్రీంకోర్టు తీర్పు మరోసారి కొత్త జీవితాన్నిచ్చినట్టయింది. ఆ అయిదుగురు ముస్లిం వనితలు ఇప్పుడు "డైవోర్సీ"లు కాదు. వారి వివాహబంధం అలాగే పదిలంగా ఉంది అంటూ వారి తరపు న్యాయవాదులు పేర్కొన్నారు.

సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుతో పిటిషనర్ల విడాకులు కాస్తా రద్దయిపోయాయని స్పష్టం చేశారు. వాట్సాప్, స్పీడ్‌పోస్టు ద్వారా తమకు 'తలాక్' చెప్పేసి చేతులు దులిపేసుకున్న భర్తల తీరుకు తొలుత కుంగిపోయిన ఆ అయిదుగురు మహిళలు నానాఅగచాట్లూ పడ్డారు. చివరకు న్యాయస్థానం తలుపుతట్టారు. సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించారు. అయితే, సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నేత అయిన సల్మాన్‌ఖుర్షీద్ మాట్లాడుతూ...పిటిషనర్ల తరపు న్యాయవాదుల అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు 'పూర్వవర్తి'(రెట్రోస్పెక్టివ్) కాదని పేర్కొన్నారు. వ్యక్తిగత కేసులకు వర్తించదని కూడా అభిప్రాయపడ్డారు.

సాయరా బానో (36)



ఉత్తరాఖండ్‌లోని కాశీపుర్‌కు చెందిన సాయరా బానో ఎంఏ సోషియాలజీ, ఎంబీఏ చేశారు. 15 ఏళ్లు కాపురం చేసిన అనంతరం ఆమె భర్త రిజ్వాన్ అహ్మద్ (అలహాబాద్‌లో స్థిరాస్తి డీలర్) 2015 అక్టోబరులో ఒక లేఖపై మూడుసార్లు తలాక్ అని రాసి పంపాడు. అలాగే తన 13, 11 ఏళ్ల ఇద్దరు పిల్లలను కూడా తీసుకెళ్లిపోవడంతో ఆమె 2016 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముమ్మారు తలాక్‌తో పాటు, బహు భార్యత్వం, నిఖా హలాలాలను చట్ట వ్యతిరేకం, రాజ్యాంగవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్ వేశారు. ఆమెను అత్తమామలు 6 సార్లు గర్భవిచ్ఛిత్తి(అబార్షన్)కి ఒత్తిడి చేయడంతో.. శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే బానో భర్త మాత్రం ముమ్మారు తలాక్, బహు భార్యత్వం, నిఖా హలాలా ముస్లిం పర్సనల్ లా ప్రకారం చట్ట సమ్మతమంటూ పిటిషన్‌ను వ్యతిరేకించారు.

ఈ తీర్పు చరిత్రాత్మకం..

"ముస్లిం మహిళలందరికీ, నాకు చరిత్రాత్మకమైన రోజు. సంస్కరణల మార్గంలో ఓ మైలురాయి. ఈ తీర్పుతో ఇకపై ముస్లిం మహిళలను ఇష్టారాజ్యంగా ఇళ్ల నుంచి బయటకు గెంటేయడానికి వీలుండదు. నేనెదుర్కొన్న చేదు అనుభవాలు నా కుమార్తె దరికి రాకూడదని కోరుకున్నాను. చివరకు ఈరోజు నాకు ఉపశమనం లభించింది. న్యాయపోరాటంలో నాకు కుటుంబ సభ్యులు వెన్నుదన్నుగా నిలిచారు. మరెంతోమంది ప్రోత్సాహం అందించారు. నా సోదరుడు అర్షద్ ప్రతిక్షణం న్యాయపోరాటానికి అండగా నిలిచాడు. మొదటి నుంచీ సర్వోన్నత న్యాయస్థానంలో నాకు న్యాయం జరుగుతుందన్న బలమైన విశ్వాసంతోనే ఉన్నాను. నా దృఢ సంకల్పాన్ని దెబ్బతీసే ఒత్తిళ్లేవీ నాకు రాలేదు. న్యాయవాది కూడా అదే సంకల్పంతో పోరాటం సాగించారు. ఇదో గొప్ప ఉద్యమం. అయితే సంస్కరణల దారిలో ఇంకా చాలా ముందుకెళ్లాల్సి ఉంది. ఇలాంటి దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఇక నేను నా ఇద్దరు పిల్లల పోషణ కోసం పోరాడుతాను. దిగువ కోర్టులో వ్యాజ్యం వేశాను. ఓ ఉద్యోగంలో చేరాలని అనుకుంటున్నాను. ముస్లిం మహిళల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాను."

అఫ్రీన్ రెహ్మాన్ (28)



రాజస్థాన్‌లోని జయపురకు చెందిన అఫ్రీన్ ఎంబీఏ చేశారు. వివాహాలు కుదిర్చే వెబ్‌సైట్ ద్వారా 2014లో పెళ్లి చేసుకున్నారు. రెండు-మూడు నెలల తర్వాత అత్తమామలు కట్నం కోసం మానసిక, శారీరక వేధింపులు మొదలు పెట్టారు. 2015 సెప్టెంబరులో ఇంటి నుంచి బయటకు పంపేశారు. అనంతరం ఆమె పుట్టింటికి వెళ్లిపోయారు. గత ఏడాది మేలో స్పీడ్ పోస్టు ద్వారా భర్త ఒక లేఖపై ముమ్మారు తలాక్ పంపించాడు. ఇది పూర్తిగా తప్పు, అన్యాయం, అంగీకారయోగ్యం కాదని పేర్కొంటూ.. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆమె సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు.

దుర్మార్గానికి అంతం..

"దేశంలో ముమ్మారు తలాక్‌ను రూపుమాపేందుకు ఇది నాంది. న్యాయస్థానం ఆదేశించినట్లు - దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం చట్టం చేయాలి. కాళ్లకు వేసుకునే చెప్పుల్లా ఇళ్ల నుంచి బయటకు విసిరేసే దుర్మార్గం ఇప్పుడు అంతం కానుంది."

ఇష్రత్ జహాన్ (31)



పశ్చిమ్ బెంగాల్‌లోని హావ్‌డాకు చెందిన ఇష్రత్ జహాన్‌ది.. తన భర్త ముర్తాజాతో 15 ఏళ్ల వైవాహిక జీవితం. అనంతరం 2015 ఏప్రిల్‌లో దుబాయ్ నుంచి ఫోన్‌లో 3 సార్లు తలాక్ చెప్పి ఫోన్ పెట్టేశాడు. నలుగురు పిల్లలను కూడా తీసుకెళ్లిపోయాడు. అతను మరో పెళ్లి చేసుకున్నట్లు ఆరోపిస్తూ జహాన్ పిటిషన్ వేశారు. పిల్లలను తనకు అప్పగించాలని, భరణం ఇవ్వాలని కోరారు. దంపతులిద్దరి సొంత రాష్ట్రం బిహార్. 2000లో పశ్చిమ్‌బెంగాల్‌కు వచ్చేసి.. అదే సంవత్సరంలో పెళ్లి చేసుకున్నారు. ముగ్గురు ఆడపిల్లలు పుట్టిన తర్వాత అతను కొడుకు కోసం మరోపెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అయితే 2010లో వారికి కుమారుడు పుట్టినప్పటికీ వారి బంధం మాత్రం సజావుగా సాగలేదు. అనంతరం దుబాయ్ వెళ్లి ముమ్మారు తలాక్ చెప్పాడు.

ఆనందదాయకం..

"ఈ తీర్పు చాలా ఆనందదాయకం. సర్వోన్నత న్యాయస్థానం సరైన తీర్పు ఇచ్చింది. ఇప్పుడు న్యాయం దొరుకుతుంది. రెండేళ్లుగా న్యాయపోరాటం చేశాను. నేను విడాకులకు వ్యతిరేకం కాదు. కానీ దానికి ఒక న్యాయబద్ధమైన విధానం ఉండాలి."

గుల్షన్ పర్వీన్ (31)



ఉత్తర్‌ప్రదేశ్‌లోని రామ్‌పుర్‌కు చెందిన గుల్షన్ పర్వీన్ ఆంగ్ల సాహిత్యంలో పీజీ చేశారు. 2013 ఏప్రిల్‌లో వివాహం అయింది. రెండేళ్లపాటు వరకట్నం కోసం గృహహింసను కూడా ఎదుర్కొన్నారు. ఆమె భర్త వరకట్న వేధింపులు తదితర అభియోగాలపై అరెస్టయ్యారు కూడా. 2015లో ఆమె పుట్టింటికి వెళ్లారు. ఓ రోజు హఠాత్తుగా భర్త నుంచి రూ. 10 స్టాంప్‌పేపర్‌పై విడాకుల నోటీసు (తలాక్‌నామా) అందింది. దీంతో ఆమె, రెండేళ్ల బాబు రిదాన్‌లు నిరాశ్రయులయ్యారు. తాను పంపిన తలాక్‌నామా ఆధారంగా వివాహాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆమె భర్త రామ్‌పుర్‌లోని న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ముమ్మారు తలాక్‌ను రద్దు చేయాలని పర్వీన్ సుప్రీంలో పిటిషన్ వేశారు.

అతియా సబ్రీ (30)



ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహరన్‌పుర్‌కు చెందిన సబ్రీ ఈ కేసులో ఆఖరు పిటిషనర్. ఆమెకు వాజిద్ అలీతో 2012లో వివాహమైంది. 2015 నవంబరులో చిన్న కాగితం ముక్కపై ముమ్మారు తలాక్ (విడాకులు) అని రాసి ఆమె సోదరుడి కార్యాలయానికి పంపాడు. ఆమెకు 3, 4 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో కుమార్తె పుట్టిన తర్వాత అత్తమామలు విషప్రయోగానికి యత్నించడంతో ఆమె ఆసుపత్రి పాలయ్యారు. దీనిపై ఆమె భర్తను అరెస్టు చేయగా ఆ విచారణ కొనసాగుతోంది. అత్తమామల నుంచి రూ. 25 లక్షలు తేవాలంటూ ఒత్తిళ్లు.. చిత్రహింసలు కూడా ఆమె ఎదుర్కొన్నారు. దీంతో డిసెంబరు 12న ఆమె సహరాన్‌పుర్‌లోని మహిళా ఠాణాలో ఫిర్యాదు చేశారు.

షాబానో కేసు స్ఫురణకు..

గతాన్ని తడిమిన తలాక్ తీర్పు

తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో- గతంలో వెలువడిన ఓ కీలక తీర్పు ఇప్పుడు మరోమారు స్ఫురణకు వస్తోంది. ముస్లిం మహిళల హక్కులు, పర్సనల్ లా పరిధికి సంబంధించి 32 ఏళ్ల కిందట కీలక పరిణామం ఒకటి చోటుచేసుకుంది. భర్త మహ్మద్ అహ్మద్‌ఖాన్ మూడుసార్లు తలాక్ చెప్పడంతో.. విడాకులు పొందిన షాబానో బేగంకు అనుకూలంగా 1985లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పు దేశంలో పెద్దఎత్తున చర్చకు దారితీసింది. రాజకీయ పార్టీలు పరస్పరం దుమ్మెత్తిపోసుకోవడానికి అస్త్రంగా మారింది.

ఇదీ కేసు...

మహ్మద్ అహ్మద్‌ఖాన్ అనే న్యాయవాది 1932లో షాబానో బేగం అనే మహిళను పెళ్లిచేసుకున్నారు. వారికి ఐదుగురు సంతానం. 14 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత అహ్మద్‌ఖాన్- మరో యువతిని పెళ్లాడారు. అయినప్పటికీ- షాబానో వారితోనే కొన్నేళ్లు కలిసి ఉన్నారు. 1975లో ఆమెను అహ్మద్‌ఖాన్ ఇంటి నుంచి వెళ్లగొట్టారు. 1978లో తలాక్ చెప్పారు. ఇస్తామన్న రూ.200 భరణాన్ని కూడా ఇవ్వలేదు. దీంతో 62 ఏళ్ల షాబానో భర్త నుంచి భరణం కోసం 1978 ఏప్రిల్‌లో కోర్టుకెక్కారు. తాను ఇప్పటికే షాబానోతో విడిపోయినందువల్ల- 'ఇద్దత్' కాలానికి మాత్రమే ఆమెకు తాను భరణం చెల్లించాల్సి ఉంటుందని, ఆ తర్వాత ఇవ్వక్కర్లేదంటూ అహ్మద్‌ఖాన్ ప్రతివాదనకు దిగారు. షాబానోకు నెలకు రూ.25 భరణం చెల్లించాలని మెజిస్ట్రేట్ కోర్టు అహ్మద్‌ఖాన్‌ను ఆదేశించింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ హైకోర్టు దానిని రూ.179కి పెంచింది. ఈ తీర్పును అహ్మద్‌ఖాన్ సుప్రీంకోర్టులో సవాలుచేశారు. విడిపోయిన భార్యతో ఆర్థికబంధం సహా ఏ సంబంధమైనా ఇస్లాంకు వ్యతిరేకమని ఖాన్ వాదించారు. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాత్ ఉలేమా హిందులు ఖాన్‌కు అండగా నిలిచాయి. ముస్లిం పర్సనల్ లా పరిధిలో ఉన్న అంశాల్లో జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదని వాదించారు. అయితే 1985 ఏప్రిల్ 23న అతని పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏ మతస్థులైనా చట్టం ముందు సమానులేనన్నట్లుగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 కింద హైకోర్టు మంజూరుచేసిన భరణాన్ని సమర్థిస్తూ- చీఫ్ జస్టిస్ వై.వి.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తీర్పు చెప్పింది. దీనిపై దేశంలో పెద్దఎత్తున దుమారం రేగింది. పర్సనల్ లాల్లో కోర్టులు జోక్యం చేసుకోవడం తమ హక్కులపై దాడిచేయడమేనంటూ ముస్లింలు రోడ్డెక్కారు. పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు చేశారు. ఖురాన్‌లోని విషయాలకు భాష్యం చెప్పేలా.. ఇస్లాం సిద్ధాంతాల్ని విమర్శించేలా ఐదుగురు హిందూ న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు చెప్పిందంటూ ముస్లిం సంప్రదాయవాదులు మండిపడ్డారు. ఇలాంటి తీర్పులు మత ఉద్రిక్తతల్ని రెచ్చగొడతాయన్నారు. 1984లో అధికారంలోకి వచ్చిన రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం- ముస్లింలను బుజ్జగించడం కోసం ముస్లిం మహిళల(ప్రొటెక్షన్ ఆన్ డైవర్స్ యాక్ట్) చట్టం-1986ను ఆమోదించింది. ఈ చట్టం ఒకరకంగా షాబానో కేసులో తీర్పును తోసిరాజంది. ఇద్దత్ కాలానికి మాత్రం భరణం చెల్లిస్తే సరిపోతుందంటూ సుప్రీం తీర్పును పలచనచేసింది. దీనిని సంప్రదాయ వాదులు గట్టిగా బలపరచగా... ఇది ముస్లిం మహిళల హక్కుల్ని కాలరాయడమేనని వ్యతిరేకులు గట్టిగా వాదించారు. అయితే ఇద్దత్ కాలానికి మాత్రమే భరణం పరిమితం కాదంటూ సుప్రీంకోర్టు ఆ తర్వాత మరోమారు తీర్పు చెప్పడం ప్రస్తావనార్హం. షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును నీరుగార్చడానికి ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ...అదో సంచలన తీర్పు. దీనిపై దాదాపు 30 ఏళ్లుగా దేశంలో చర్చ జరుగుతూనే ఉంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం



సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ఒడిశాలోని పూరీ తీరంలో సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం

తలాక్ కేసుల్లో మీడియా కీలక పాత్ర

దిల్లీ: అత్యంత సున్నితమైన తలాక్ విషయంలో న్యాయస్థానాల జోక్యం సరికాదని, ప్రభుత్వమే ఆ దురాచారం రద్దుపై ఒక విధాన నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం తీసుకురావాల్సి ఉంటుందని తొలుత అభిప్రాయపడిన సుప్రీంకోర్టు...తన వైఖరిని ఎందుకు మార్చుకుంది! తలాక్‌ను రద్దు చేస్తూ ఎలా తీర్పును వెలువరించింది! ముస్లిం మహిళల కష్టాలను వివరిస్తూ మీడియాలో ప్రచురితమైన రెండు కథనాలు ఈ మార్పునకు కారణమని తెలుస్తోంది. తాము వివక్షకు గురవుతున్నామంటూ 1997లో అహ్మదాబాద్ మహిళల కార్యాచరణ బృందం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించటానికి అప్పట్లో సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అయితే, 2015లో జస్టిస్ ఏఆర్ దవే, జస్టిస్ ఆదర్శకుమార్ గోయల్‌లతో కూడిన ధర్మాసనం ఇదే అంశంపై విచారణను చేపట్టేందుకు అంగీకరించటం ఓ కీలక పరిణామం. బహుభార్యత్వం, ఏకపక్ష తలాక్‌లతో ముస్లిం మహిళలు అనుభవిస్తున్న కష్టాలు, సమాన హక్కుల కోసం ముస్లిం మహిళలు సాగిస్తున్న పోరును తెలియజేస్తూ ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన రెండు కథనాలు ఆ న్యాయమూర్తులను కదిలించినట్లు తెలుస్తోంది. తలాక్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వరుసగా పలు వ్యాజ్యాలు దాఖలు కాగా వాటిని ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఇదే క్రమంలో సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి విస్తృతస్థాయిలో వాదనలను విని తీర్పును వెలువరించింది.

ఇది ముస్లిం మహిళల విజయం

కొనియాడిన ఏఐఎండబ్ల్యూపీఎల్‌బీ

లఖ్‌నవూ: ముమ్మారు తలాక్ చెల్లుబాటు రద్దును ఇస్లాం, ముస్లిం మహిళల విజయంగా అఖిల భారత ముస్లిం మహిళా పర్సనల్ లా బోర్డు (ఏఐఎండబ్ల్యూపీఎల్‌బీ) అభివర్ణించింది. సుప్రీం కోర్టు నిర్ణయంతో మహిళల్లో ఆశలు చిగురించినట్లయిందని ఏఐఎండబ్ల్యూపీఎల్‌బీ అధ్యక్షురాలు షైస్త అంబెర్ వ్యాఖ్యానించారు. ఈ విధానాన్ని మతపెద్దలుగా చెప్పుకొనే కొందరు అమలులోకి తీసుకొచ్చారు. దీంతో లక్షలాది ముస్లిం మహిళల జీవితాలు నాశనమయ్యాయి'అని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు అఖిల భారత షియా పర్సనల్ లా బోర్డు అధికార ప్రతినిధి మౌలానా యాసూబ్ అబ్బాస్ సుప్రీం కోర్టు తీర్పును ఆహ్వానించారు. ముమ్మారు తలాక్‌ను సుప్రీం రద్దుచేసిన నేపథ్యంలో వచ్చేనెల 10న భోపాల్‌లో అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) కార్యనిర్వాహక కమిటీ సమావేశం కానుంది.

ఆ ప్రయత్నాలేమీ వద్దు: తీర్పు హర్షణీయమైనదేననీ...అయితే, ముమ్మారు తలాక్‌కు సంబంధించి ఏ విధమైన చట్టాన్ని చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయరాదని కూడా ముస్లిం పర్సనల్ లా బోర్డు కోరింది. మూడుపర్యాయాలు తలాక్‌పై రకరకాల అధ్యయనాలు జరిగాయనీ.... ఎప్పుడో అరుదుగా మాత్రమే ముమ్మారు తలాక్‌ను ఆశ్రయిస్తున్నట్లు వెల్లడైందని చెప్పింది.

శాసన మార్గంలోనే పరిష్కారం

- బాధ్యతను న్యాయవ్యవస్థపైకి తోసేసేందుకు కేంద్రం యత్నం
- సుప్రీంకోర్టు మైనారిటీ తీర్పులో స్పష్టీకరణ

దిల్లీ: తలాక్ ఆచారాన్ని ముస్లిం సమాజం నుంచి దూరం చేసే దిశగా చట్టం తీసుకురావడానికి బదులుగా.. కేంద్రం తన బాధ్యతను దురదృష్టవశాత్తూ న్యాయవ్యవస్థపైకి తోసేసేందుకు యత్నించిందని సుప్రీంకోర్టు తన మైనారిటీ తీర్పులో వ్యాఖ్యానించింది. ధర్మాసనంలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లు మైనారిటీ తీర్పును వెలువరించారు. ముమ్మారు తలాక్ అమలును ముస్లిం జనాభా అధికంగా ఉండే పలు దేశాలు, ఇస్లామిక్ దేశాల్లో సైతం చట్టాల ద్వారా తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. తలాక్ వ్యవహారాన్ని మతం, విశ్వాసం ఆధారంగా న్యాయవిచక్షణ ద్వారా పక్కన పెట్టేయలేమనీ, శాసనపరమైన సంకల్పంతోనే పరిస్థితిని చక్కదిద్దొచ్చన్న అఖిల భారత ముస్లిం పర్సనల్ లీగ్ బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) వైఖరితో ఇద్దరు న్యాయమూర్తులు ఏకీభవించారు. 'ఈ పరిస్థితిని శాసనమార్గం ద్వారానే పరిష్కరించగలం, ఇదే మా అభిప్రాయం. ఇందులో అనుమానమేమీ లేదు. ఒక అంశంపై చట్టం తీసుకురావాలంటూ శాసనవ్యవస్థకు సలహా ఇవ్వడం సరికాకపోయినా, ప్రస్తుత కేసులో పరిస్థితి కాస్త విభిన్నం' అని వ్యాఖ్యానించారు. 'కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానంలో పిటిషనర్లకు మద్దతుగా నిలబడింది. దురదృష్టవశాత్తూ అంతా తన చేతుల్లోనే ఉన్నా మా చేతుల వైపు చూసింది' అని పేర్కొన్నారు. ఇతర ఇస్లామిక్ దేశాల్లో ముస్లిం పర్సనల్ చట్టంలో పురోగతిని పరిగణనలోకి తీసుకుంటూ ఆరు నెలల వ్యవధిలో దీనిపై కొత్త చట్టాన్ని రూపొందించాలని అన్నారు. కొత్త చట్టం తీసుకొచ్చే వరకు ముమ్మారు తలాక్(తలాక్ ఎ బిద్దత్) ద్వారా ఆచరిస్తున్న విడాకుల సంప్రదాయం అమల్లో ఉండదని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల్ని పక్కన పెట్టాలి.. భారత్‌లో బ్రిటిష్ పాలకులు ముస్లింలకు చట్టం ద్వారా ఉపకారం కలిగించారనీ, ముస్లిం ప్రపంచంలోనూ పరిష్కార చర్యల్ని ఆమోదించారనీ, స్వతంత్ర భారత్ ఈ విషయంలో వెనకబడి ఉండటం సమంజసం కాదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఇతర మతాల్లో దురాచారాలైన సతి, దేవదాసి, బహుభార్యత్వం వంటివి శాసనపరమైన జోక్యంతోనే రద్దయిన తరహాలోనే పర్సనల్ చట్టంలోనూ సంస్కరణలు రావాలని అభిప్రాయపడ్డారు. భారత్‌లో ఇతర మతాల కోసం చర్యలు తీసుకున్నారనీ, ముస్లింల విషయంలో తీసుకోలేదనీ, అందుకని దీనిని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని శాసనవ్యవస్థను అర్థిస్తున్నామన్నారు.

భారత్ లింగ సమానత్వానికి కట్టుబడి ఉంది..

భారతదేశం లింగ సమానత్వానికి కట్టుబడి ఉందనడంలో ఏమాత్రం సందేహం లేదనీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (చట్టం ముందు అందరూ సమానులే) ఈ అంశాన్ని విస్పష్టం చేస్తోందనీ, లింగవివక్ష రూపుమాపేందుకూ కట్టుబడి ఉందనీ, ఆర్టికల్ 15, 16 దీనిని స్పష్టం చేస్తున్నాయని జస్టిస్ ఖేహర్, జస్టిస్ నజీర్ తెలిపారు. అందుకని ముమ్మారు తలాక్ అంశాన్ని పరిశీలించేందుకు అంతర్జాతీయ ఒప్పందాలు, ప్రకటనలపై ఆధారపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. భారత రాజ్యాంగమే వీటిని అందజేస్తోందని స్పష్టంచేశారు. ముమ్మారు తలాక్ అంశం మతం, విశ్వాసంలో ఒక భాగమనీ, దానిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించలేమనీ, లింగ వివక్ష మాత్రం చట్టవిరుద్ధమని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

దేవుడి దృష్టిలో విడాకులు అప్రియమైనవని మహమ్మద్ ప్రవక్త ఉద్ఘాటించారు: జస్టిస్. నారిమన్

దిల్లీ: విడాకులనేవి భగవంతుడి దృష్టిలో అత్యంత అప్రియమైన అంశం అంటూ మహమ్మద్ ప్రవక్త ఉద్ఘాటించారు. ఇస్లాం ఎంతో ఉత్కృష్టమైనదిగా పేర్కొనే వివాహబంధాన్ని తుత్తునియలు చేసే ఈ చర్యను సాక్షాత్తూ భగవంతుడే హర్షించలేదు అని జస్టిస్.ఆర్.ఎఫ్. నారిమన్ పేర్కొన్నారు. నేటి చరిత్రాత్మక తీర్పు రూపకర్తల్లో ఒకరైన జస్టిస్.నారిమన్ విడాకులనేవి కేవలం స్త్రీ, పురుషుల మధ్య వివాహబంధాన్ని మాత్రమే విచ్ఛిన్నం చేయదు. వారి దాంపత్య ఫలంగా జన్మించిన పిల్లల మనసులపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే...సహేతుక కారణమంటూ ఉన్నపుడే విడాకులు ఇచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. జస్టిస్. నారిమన్ అభిప్రాయాలతో జస్టిస్.యు.యు. లలిత్ పూర్తిగా ఏకీభవించారు.

హేమాహేమీలు... హోరాహోరీ వాదనలు

దిల్లీ: ముమ్మారు తలాక్ కేసులో సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించినవారంతా హేమాహేమీలే. అటు ప్రభుత్వ పక్షాన, ఇటు కక్షిదారుల తరఫున వాదించడానికి న్యాయకోవిదులు, అత్యున్నతస్థాయి న్యాయాధికారులు రంగంలో దిగారు. కపిల్ సిబల్, రాంజెత్మలానీ, సల్మాన్ ఖుర్షీద్, ఇందిరా జైసింగ్ వంటి ప్రముఖ న్యాయవాదుల వాదనలు ఈ కేసును అడుగడుగునా ఆసక్తికరంగా మార్చాయి. ప్రభుత్వం తరఫున మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు వాదించారు. అటార్నీ జనరల్‌గా దిగిపోవడానికి ముందు తాను వాదించిన చివరి కేసు ఇదేనని సంతృప్తితో చెబుతున్నానని రోహత్గీ మంగళవారం విలేకరులతో అన్నారు.

సీజేఐ విచారించే చిట్టచివరి కేసుల్లో ఇదొకటి: భారత ప్రధాన న్యాయమూర్తిగా ఈ నెల 27న పదవీ విరమణ చేయబోతున్న జస్టిస్ జె.ఎస్.ఖేహర్ విచారిస్తున్న చిట్టచివరి కేసుల్లో ముమ్మార్ తలాక్ ఒకటి. దీంతో పాటు గోప్యత హక్కుకు సంబంధించిన కేసునూ ఆయనే విచారిస్తున్నారు. జస్టిస్ ఖేహర్ స్థానంలో జస్టిస్ దీపక్ మిశ్ర రానున్న విషయం తెలిసిందే.

ఏఐఎంపీఎల్‌బీ తగిన చర్యలు తీసుకోలేదు



ముమ్మారు తలాక్ అంశం సుప్రీం కోర్టు వరకూ వెళ్లుండకూడదు. ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఎందుకు చర్యలు తీసుకోలేదు? పైగా ద్వంద్వ విధానాలను అనుసరించింది. మొదట ముమ్మారు తలాక్‌ను అడ్డుకునేందుకు పెళ్లి ఒప్పందంలోనే నిబంధన ప్రవేశపెడతామని సుప్రీం కోర్టుకు తెలిపింది. మరోసారేమో ముమ్మారు తలాక్ చెప్పేవారిని సామాజికంగా బహిష్కరిస్తామని చెప్పింది. అందుకే మహిళలు సుప్రీం తలుపుతట్టారు.

– జామా మసీదు షాహి ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ

మహిళల న్యాయంలో ముందడుగు



సుప్రీం కోర్టు తీర్పును మహిళలకు న్యాయం చేయడంలో పడిన ముందడుగుగా మతపెద్దలు భావించాలి. ఓ మహిళగా చాలా సంతోష పడుతున్నాను. ఆడవారికి అలా(ముమ్మారు తలాక్ విధానంలో) విడాకులు ఇచ్చి.. ఇంటి నుంచి బయటకు పంపించేయడం దారుణం. దేశంలోని మహిళలందరికీ న్యాయం జరిగేలా ఓ చట్టం తీసుకురావాలి. – లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్

దేశ ప్రజలందరూ ఆహ్వానించాలి



ఇది పురోగతికి బాటలు పరిచే నిర్ణయం. దేశంలోని అందరికీ ఇది వర్తిస్తుంది. మతసంబంధిత చట్టాలు అభివృద్ధికి మార్గం చూపాలని, వీటిలోని అంశాలకు రాజ్యంగం భరోసా కల్పించాలని విశ్వసించేవారికి ఇదొక గొప్ప విజయం. తాజా నిర్ణయాన్ని దేశ ప్రజలందరూ ఆహ్వానించాలి. – ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఇది సామాజిక సంస్కరణ



సమాజాన్ని పీడిస్తున్న సమస్యల విషయంలో మొండిగా వ్యవహరించకూడదు. సంస్కరణాత్మక విధానాలను అనుసరించాలి. ఈ విషయంలో కొత్త చట్టాన్ని రూపొందించేందుకు అన్ని పార్టీలతో కేంద్రం చర్చలు జరుపుతుంది.

– కేంద్ర మైనారిటీశాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ

భాజపా స్వాగతిస్తోంది



సుప్రీం కోర్టు తీర్పును భాజపా ఆహ్వానిస్తోంది. ఇదొక చరిత్రాత్మక నిర్ణయం. ముస్లిం మహిళల సమానత్వం, ఆత్మగౌరవ పరిరక్షణలో నూతన శకం మొదలైంది. వారి అభిప్రాయాలను సుప్రీం కోర్టు ముందుంచిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ధన్యవాదాలు. – భాజపా అధ్యక్షుడు అమిత్ షా

పోరాడిన మహిళలకు అభినందనలు



సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నాం. ముమ్మారు తలాక్ చెల్లుబాటు రద్దుతో ముస్లిం మహిళా హక్కులను పునరుద్ఘాటించినట్లయింది. న్యాయం కోసం పోరాడిన మహిళలకు నా అభినందనలు. వివక్షకు గురవుతున్న వారికి ఈ తీర్పుతో ఉపశమనం లభిస్తుంది. – కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ

సామాజిక భూతం వదిలిపోయింది

ఇది చరిత్రాత్మక తీర్పు. తొమ్మిది కోట్ల మంది భారత ముస్లిం మహిళలను పీడిస్తున్న సామాజిక భూతాన్ని సుప్రీం కోర్టు వదిలించింది. ముమ్మారు తలాక్ బాధిత మహిళలు, వారి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేయాలి. విద్య, నైపుణ్యాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చూడాలి.

– ఆరెస్సెస్ నేత ఇంద్రేశ్ కుమార్

ఇది ముస్లిం మహిళల విజయం



ముమ్మారు తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళల విజయమిది. మతపెద్దలు, మతగురువులు, ముస్లిం సోదరులు సుప్రీకోర్టు ఇచ్చిన ఈ చరిత్రాత్మక తీర్పును ఆహ్వానించాలి. – కేంద్ర మంత్రి దత్తాత్రేయ

మతం, రాజకీయాలతో ముడిపెట్టవద్దు

సుప్రీం తీర్పు ముస్లిం మహిళల సాధికారత, స్వావలంబన, మనోధైర్యం, హక్కుల సాధనకు దోహదపడుతుంది. ఈ తీర్పును రాజకీయం, మతంతో ముడిపెట్టకుండా రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు ముస్లిం మహిళలకు అండగా నిలబడాలి. – భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

గౌరవిస్తున్నాం.. కానీ అమలు కష్టం..



తీర్పును గౌరవిస్తున్నాం. అయితే... తలాక్ రద్దును క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై కఠినమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. చట్టాలు చేయడం, తీర్పులు వెలువరించడం వల్ల ప్రయోజనం ఉండదు. సామాజిక సంస్కరణలు జరిగి సమాజంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా చదివిన తర్వాతే స్పందిస్తా.

– ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

తీర్పును ఆహ్వానిస్తున్నాం

పాపపు చర్యలాంటి తలాక్ పద్ధతిని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానిస్తున్నాం. 'పర్సనల్ లా'ను పరిరక్షించాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పౌర స్మృతికి ఈ తీర్పు దోహదం చేస్తుందనే భావనతో నేను అంగీకరించబోను.

– కపిల్ సిబల్, కాంగ్రెస్ నేత, సీనియర్ న్యాయవాది.

ఉమ్మడి పౌరస్మృతికి ముందడుగు

ముస్లిం మహిళలను పరిరక్షించే తీర్పు ఇది. ఇతర భారతీయ పౌరుల్లా వారు కూడా అభివృద్ధి పథంలో కదంతొక్కగలరు. ఉమ్మడి పౌరస్మృతిని సాధించేందుకు ఈ తీర్పుతో మరో ముందడుగు పడుతుంది.

– ముకుల్ రోహత్గీ, న్యాయ నిపుణుడు

అన్ని పర్సనల్ చట్టాల్లోనూ సంస్కరణలు రావాలి

ఒక మతంలోనే కాకుండా అన్ని పర్సనల్ చట్టాల్లో ప్రభుత్వం సంస్కరణలు తీసుకురావాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా చూడాలి.

–డి.రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శి.

తీర్పును ఆహ్వానిస్తున్నాం. –సీతారాం ఏచూరి, సీపీఎం.

స్వర్ణమే లక్ష్యంగా ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ బరిలో దిగిన తెలుగమ్మాయి పూసర్ల వెంకట సింధు ఘనంగా బోణీ కొట్టింది. ఆమె పెద్దగా కష్టపడకుండానే మూడో రౌండ్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్, అజయ్ జయరాం కూడా ముందంజ వేశారు. మిక్స్‌డ్, మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి కూడా శుభారంభం చేసింది.

పడింది తొలి అడుగు..

- సింధు.. అలవోకగా ముందుకు
- రెండో రౌండ్లో సాయిప్రణీత్, అజయ్



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

గ్లాస్గో

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ షట్లర్లు దూసుకెళ్తున్నారు. సింధుతో పాటు సాయిప్రణీత్, అజయ్ సులభంగానే ముందంజ వేశారు. మంగవారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో సింధు 21-16, 21-14తో కిమ్ హో మిన్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించింది. ఈ గేమ్‌లో ఆరంభం నుంచి సింధుదే హవా. తన ట్రేడ్‌మార్క్ షాట్లతో 8-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆమె. విరామ సమయానికి 11-5తో నిలిచిన సింధు.. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించింది. విరామం తర్వాత ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. కిమ్ 8-12తో భారత షట్లర్‌ను సమీపించింది. ఈ స్థితిలో విజృంభించిన సింధు వరుస పాయింట్లతో అంతరాన్ని పెంచుకుంది. చివరికి 21-16తో తొలి గేమ్ గెలిచింది. రెండో గేమ్‌లోనూ 8-3తో భారత స్టార్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే కొరియా అమ్మాయి 8-10తో సింధుకు గట్టిపోటీ ఇచ్చింది. కానీ ఈ దశలో ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లు గెలిచిన సింధు 21-14తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. జాతీయ ఛాంపియన్ రితుపర్ణా దాస్ కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్లో రితు 2-0తో అరి మికెలా (ఫిన్లాండ్)పై ఆధిక్యంలో సమయంలో ప్రత్యర్థి గాయం కారణంగా పోటీ నుంచి తప్పుకుంది.



అజయ్ జయరాం

రెండో రౌండ్లో సాయి, అజయ్ : సాయిప్రణీత్ 21-18, 21-17తో వీయ్ నాన్ (హాంకాంగ్)ను ఓడించాడు. తొలి గేమ్‌లో ఒక దశలో 5-9, ఆ తర్వాత 14-16తో వెనకబడిన ప్రణీత్.. ఆ తర్వాత పుంజుకుని 21-18తో గెలిచాడు. రెండో గేమ్‌నూ దాదాపుగా అదే రీతిలో సొంతం చేసుకున్నాడు. మరో మ్యాచ్‌లో 13వ సీడ్ అజయ్ జయరాం 21-14, 21-12తో లుకా వ్రాబెర్ (ఆస్ట్రియా)పై విజయం సాధించాడు.

మిక్స్‌డ్ ఫలితాలు: అశ్విని పొన్నప్పకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో అశ్విని-సుమీత్‌రెడ్డి 17-21, 21-18, 5-21తో వాంగ్-హుయాంగ్ (చైనా) చేతిలో ఓడగా, మహిళల డబుల్స్‌లో అశ్విని-సిక్కిరెడ్డి 21-15, 21-13తో అమెలియా (ఇండోనేసియా)-అనా చింగ్ (మలేసియా)పై గెలిచారు. మరోవైపు సిక్కి మిక్స్‌డ్ డబుల్స్‌లో ముందంజ వేసింది. తొలి రౌండ్లో సిక్కి-ప్రణవ్ 21-12, 21-19తో ప్రజక్త (భారత్)-యోగేంద్రన్ (మలేసియా)లను ఓడించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-మనీషా జంట, పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్లోనే నిష్క్రమించారు.

లీ చాంగ్ వీకి షాక్: పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. 2015 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రన్నరప్, మాజీ నం.1 లీ చాంగ్ వీ (మలేసియా)కి షాక్ తగిలింది. తొలి రౌండ్లో బ్రైస్ లెవెర్‌డెజ్ (ఫ్రాన్స్) 21-19, 22-24, 21-17తో రెండోసీడ్ లీ చాంగ్ వీపై అనూహ్య విజయం సాధించాడు.

వయసు 60.. హుషారు 20



2015 బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్.. .పురుషుల డబుల్స్ మ్యాచ్.. ఒక కుర్రాడితో మరో ముసలాయన మాట్లాడుతున్నాడు. అతణ్ని చూస్తే కోచ్‌లా అనిపించాడు. కానీ తీరా చూస్తే కోర్టులోకి కూడా వచ్చేశాడు. ఆశ్చర్యపోవడం ప్రేక్షకుల వంతైంది. ఎందుకంటే అప్పటికి అతని వయసు 58 ఏళ్లే! అక్కడితో ఆగలేదు.. తన ఉత్సాహానికి వయసు అడ్డంకి కాదని గ్లాస్గో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కూడా వచ్చాడు. అతనే అమెరికా షట్లర్ మాథ్యూ ఫగాటీ. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడీ పెద్దాయన. ఎనిమిదోసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆడుతున్న ఫగాటీ.. 29 ఏళ్ల నికోస్ బాన్‌కాస్కీతో డబుల్స్ బరిలో ఉన్నాడు. చిన్నప్పుడే బ్యాడ్మింటన్‌పై ఆసక్తి పెంచుకున్న ఫగాటీ తర్వాత ఈ ఆటను ఎప్పుడూ విడిచి పెట్టలేదు. తాను ఏ టోర్నీకి వెళ్లినా తన వెంట వచ్చి.. అన్ని పనులు చక్కబెట్టే 82 ఏళ్ల తన అమ్మ కాస్టెల్లొనే ఫగాటీకి స్ఫూర్తి. నాలుగుసార్లు యుఎస్ జాతీయ టోర్నీల్లో డబుల్స్ టైటిల్స్ గెలిచిన అతను.. సింగిల్స్‌లో అత్యధికంగా 168, డబుల్స్‌లో 58వ ర్యాంకు సాధించాడు. అతను యుఎస్ నేవీలో ఫిజీషియన్‌గా కూడా పని చేశాడు. మరి ఈ టోర్నీలో ఫగాటీ ఎంతవరకు వెళతాడో చూడాలి.



యూపీ, బెంగాల్ హోరాహోరీ..

ఒక్క పాయింట్ తేడాతో..

ఉత్కంఠ పోరులో యూపీపై బెంగాల్ గెలుపు

లఖ్‌నవూ: ప్రో కబడ్డీ లీగ్‌లో మంగళవారం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32-31 తేడాతో యూపీ యోధా జట్టును ఓడించింది. ప్రథమార్ధంలో బెంగాల్ 19-14తో ఆధిక్యంలో నిలవగా.. ద్వితీయార్ధంలో యూపీ ఆటగాళ్లు గొప్పగా పుంజుకుని ప్రత్యర్థి స్కోరును సమీపించారు. ఓ దశలో 25-25తో స్కోరు సమం కావడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. ఐతే ఆట ముగిసేందుకు ఐదే నిమిషాలున్న సమయంలో దీపక్ మూడు రైడ్ పాయింట్లు కొల్లగొట్టడంతో బెంగాల్ మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లింది. అక్కడి నుంచి ప్రత్యర్థి స్కోరును అందుకునేందుకు యూపీ గట్టి ప్రయత్నమే చేసినా.. ఫలితం లేకపోయింది. యూపీ రైడర్ దీపక్ నర్వాల్ (10) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. బెంగాల్ రైడర్ నితిన్ తోమర్ (8) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో గుజరాత్ 35-21తో పుణెరి పల్టాన్‌ను చిత్తు చేసింది.

'అలా క్రికెట్ ప్రసారాలు చేయొద్దు'

దిల్లీ: ఈఎస్‌పీఎన్, స్టార్ అందించే క్రికెట్ ప్రత్యక్ష దృశ్యాలను ప్రసారభారతి సంస్థ దూరదర్శన్ ద్వారా పునఃప్రసారం మాత్రమే చేయాలని, కేబుల్ ఆపరేటర్లకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ విషయంలో ఫిబ్రవరిలో దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. "ప్రత్యక్ష ప్రసారాలను కేవలం తమ టెర్రిస్ట్రియల్, డీటీహెచ్ నెట్‌వర్క్ ద్వారా మాత్రమే ప్రసారభారతి ప్రసారం చేయాలి. లైవ్ ఫీడ్‌ను కేబుల్ ఆపరేటర్లకు ఇవ్వకూడదు. ఈ విషయంలో ఫిబ్రవరిలో దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నాం" అని రంజన్ గొగోయ్, నవీన్ సిన్హా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.



ఛాంపియన్



రహానె

రాహుల్

"ప్రస్తుతం జట్టులో పోటీ తీవ్రంగా ఉంది. ఎప్పుడూ నిలకడగా ఆడుతూ ఉండాలి. నిలకడ తప్పామంటే ఎవరో ఒకరు మన స్థానాన్ని భర్తీ చేసేస్తారు" టీమ్‌ఇండియా ఓపెనర్ శిఖర్ ధావన్ చేసిన వ్యాఖ్యలివి! ధావన్ ఏదో యథాలాపంగా అన్న మాటలు కావివి. ప్రస్తుతం టీమ్‌ఇండియాలో పోటీ అలా ఇలా లేదు మరి. రెండు మూడు మ్యాచ్‌లు విఫలమైతే అంతే సంగతులు! స్థానం లాగేసుకోవడానికి రిజర్వ్ బెంచ్‌లో బలమైన ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు. ఈ ఆరోగ్యకర పోటీ జట్టుకు మంచిదే! అదే సమయంలో ఈ పోటీ ఆటగాళ్లను ఒత్తిడికి గురి చేసేదే!

నువ్వా నేనా!

ఈనాడు క్రీడావిభాగం

శ్రీలంక పర్యటనకు ముందు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అజింక్య రహానె 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు. కానీ శ్రీలంక సిరీస్‌కు వచ్చేసరికి అతడికి తుది జట్టులో చోటు లేదు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత తుది జట్టులో ఉండి.. ఆ టోర్నీకి ముందు గాయం కారణంగా జట్టుకు దూరమైన మనీష్ పాండే.. మళ్లీ ఫిట్‌నెస్ సాధించడమే కాక, భారత్-ఎ జట్టు తరపున ఆడి ఫామ్ కూడా చాటుకున్నాడు. అయినప్పటికీ అతడికి కూడా తుది జట్టులో అవకాశం లేదు. రహానె, పాండేల ప్రతిభ గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఇద్దరూ మంచి ప్రతిభ, టెక్నిక్ ఉన్న.. ఆధారపడదగ్గ ఆటగాళ్లు. అయినప్పటికీ తుది జట్టులో చోటు లేని పరిస్థితి. అలాగని వీరిని అన్యాయంగా పక్కన పెట్టేశారని అనడానికి కూడా లేదు.

ధావన్ దంచడంతో..: కొన్ని నెలల ముందు వరకు శిఖర్ ధావన్ పరిస్థితి కొంచెం డోలాయమానంగా ఉండేది. ఐతే అతను ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టాడు. తాజాగా లంకతో టెస్టు సిరీస్‌లో రెచ్చిపోయి ఆడాడు. వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లోనూ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు గత ఏడాది కాలంలో కీలక ఆటగాడిగా ఎదిగిన కేఎల్ రాహుల్‌ను కూడా పక్కన పెట్టలేని పరిస్థితి. మధ్యలో ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొన్న అతను.. లంకతో రెండో టెస్టుకు జట్టులోకి పునరాగమనం చేశాడు. ఫామ్ చాటుకున్నాడు. దీంతో రోహిత్, ధావన్, కేఎల్ రాహుల్.. ముగ్గురి మధ్య రెండు ఓపెనింగ్ స్థానాలకు పోటీ నెలకొనడంతో పాత జోడీనే కొనసాగించి రాహుల్‌ను నాలుగో స్థానానికి మార్చాల్సిన పరిస్థితి తలెత్తింది. నిజానికి రహానె సైతం ఓపెనింగ్ స్థానానికి పోటీదారే. అతను ఇన్నింగ్స్ ఆరంభించగలడు, మిడిలార్డర్లోనూ ఆడగలడు. ఐతే బ్యాటింగ్‌లో ఆశించినంత దూకుడు లేకపోవడం వల్ల రహానె తప్పక తుది జట్టులో ఉండాల్సిన ఆటగాడు కాలేకపోతున్నాడు. ఇక మనీష్ పాండేలో టెక్నిక్, దూకుడు రెండూ ఉన్నప్పటికీ అతడింకా పూర్తిగా నిలకడ అందుకోలేదు. ఐతే అతడికి చాలినన్ని అవకాశాలు ఇవ్వలేదన్న సంగతీ వాస్తవమే. రహానె, పాండే కాచుకుని ఉన్న నేపథ్యంలో ధావన్, రోహిత్, రాహుల్‌లలో ఎవరు విఫలమైనా వారి స్థానాలు ప్రమాదంలో పడతాయి.



మనీష్ పాండే

ధోనికి కూడా..: ఇక మిడిలార్డర్ విషయానికొస్తే.. ధోని సైతం గట్టి పోటీ ఎదుర్కొంటుండటం విశేషం. గత ఏడాది, రెండేళ్లలో ధోని ఫామ్ ఏమంత గొప్పగా లేదన్నది వాస్తవం. అతడిలో మునుపటి దూకుడు కనిపించట్లేదు. రిషబ్ పంత్, సంజు శాంసన్ లాంటి యువ వికెట్ కీపర్లు సత్తా చాటుకుంటుండటం, సెలక్టర్లు 2019 ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్న నేపథ్యంలో ధోని తానేంటో రుజువు చేసుకోకుంటే అతను రిటైర్మెంట్ వైపు అడుగులేయాల్సిందే. మిడిలార్డర్లో హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్ నిలదొక్కుకున్న నేపథ్యంలో రైనా, యువరాజ్, దినేశ్ కార్తీక్ లాంటి సీనియర్లు జట్టుకు దూరం కాక తప్పలేదు. చాహల్, కుల్‌దీప్ యాదవ్ లాంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అశ్విన్, జడేజా లాంటి సీనియర్ స్పిన్నర్లకు ఇబ్బందులు తప్పట్లేదు. లంకతో సిరీస్‌కు వీరికి విశ్రాంతి ఇచ్చినప్పటికీ.. తర్వాతి సిరీస్‌ల్లో వీరు సత్తా చాటుకోవాల్సి ఉంటుంది. మరోవైపు పేస్ విభాగంలో బుమ్రా, భువనేశ్వర్ ఊపుమీదుండటంతో అనుభవజ్ఞులు మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లకు తుది జట్టులో చోటు ఉండట్లేదు. మొత్తానికి టీమ్‌ఇండియా ఒక్క కోహ్లిని మినహాయిస్తే మిగతా అందరి పైనా ఒత్తిడి ఉంది. ఎవ్వరు నిలకడ తప్పినా.. వేరే వాళ్లు చోటు లాగేసుకుంటారు. మన స్థానానికి ఢోకా లేదని ఎవ్వరూ ఉదాసీనంగా ఉండే పరిస్థితి లేదు. ఇలాంటి ఆరోగ్యకరమైన పోటీ జట్టుకు చాలా మంచిదంటున్నాడు కెప్టెన్ కోహ్లి. తుది జట్టుకు ఆడే ఆటగాళ్లు తమను తాము నిరూపించుకుంటూ ఉండాల్సిన ఒత్తిడి, వేరే ఆటగాళ్ల నుంచి పోటీ ఎప్పుడూ ఉండేవే కానీ.. గతంతో పోలిస్తే టీమ్‌ఇండియాలో ఈ పోటీ, ఒత్తిడి ఇప్పుడు అధికంగా కనిపిస్తున్నాయి. ఇంకో ఐదు నెలల్లో 2019 ప్రపంచకప్ జట్టుపై ఓ అంచనాకు వస్తామని చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ ఐదు నెలలూ టీమ్‌ఇండియా ఆటగాళ్లకు పరీక్షే. ఈ ఒత్తిడిని తట్టుకుని ఎవరు నిలకడ ప్రదర్శిస్తారో.. ఎవరు జట్టులో చోటు కోల్పోతారో చూద్దాం మరి!

'అర్జున'కు విలువ పోయింది!

మాజీ క్రీడాకారుల అసహనం



దిల్లీ: అర్జున అవార్డు ప్రతిష్టను ప్రభుత్వం దెబ్బ తీస్తోందని మాజీ క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. ఒక ప్రమాణాలంటూ లేకుండా చాలామందికి అర్జున ఇచ్చేయడం ద్వారా.. రాను రానూ ఈ అవార్డు విలువ తగ్గిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ అవార్డు హుందాతనాన్ని కాపాడాలి. ప్రతి ఏడాదీ అర్జున అవార్డు ఇవ్వాల్సిన అవసరమేముంది? ప్రస్తుతం అవార్డుల్ని విసిరేసే పరిస్థితి కనిపిస్తోంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడల పతక విజేతలను మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక చేయాలి. క్రీడాకారుల ప్రదర్శన ఆధారంగా ప్రభుత్వమే అవార్డులకు ఎంపిక చేయాలి తప్ప క్రీడాకారులు దరఖాస్తులు పంపకూడదు" అని ధ్యాన్‌చంద్ తనయుడు, భారత హాకీ మాజీ కెప్టెన్ అశోక్ కుమార్ అన్నాడు. 800 మీటర్ల పరుగులో నాలుగు దశాబ్దాలకు పైగా జాతీయ రికార్డును కలిగి ఉన్న శ్రీరామ్ సింగ్ కూడా అర్జున అవార్డుల ఎంపిక తీరును తప్పుబట్టాడు. "1972లో అర్జున అవార్డులు ఎంపిక చేసే సమయానికి నేను ఆసియా క్రీడల్లో పతకం గెలిచి ఉన్నాను. కానీ ఆ ఏడాదికి ఒక్క అవార్డే ఇవ్వాలనుకున్నారు. నాకంటే సీనియర్ అయిన వీఎస్ చౌహాన్‌కు అవార్డు అందజేశారు. అర్జున గ్రహీతలు కనీసం ఆసియా క్రీడల పతక విజేతలై ఉండాలి" అని శ్రీరామ్ అన్నాడు. అర్జున అవార్డే గొప్పదని.. దాన్ని మాత్రమే కొనసాగించి రాజీవ్ ఖేల్‌రత్నను రద్దు చేయాలని వాలీబాల్ కోచ్ సురేశ్ అభిప్రాయపడ్డాడు.

మెరిసిన కరుణ్

భారత్-ఎ విజయం



పోచెఫ్‌స్ట్రూమ్: తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయినప్పటికీ చివరిదైన రెండో అనధికార టెస్టులో భారత్-ఎ అదరగొట్టింది. ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా-ఎపై విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 138/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. నదీమ్ (3/47), అంకిత్ రాజ్‌పుత్ (3/15), గౌతమ్ (2/48) ధాటికి 177 పరుగులకే ఆలౌటైంది. కుక్ 70 పరుగులతో అజేయంగా నిలిచాడు. కరుణ్ నాయర్ (90; 144 బంతుల్లో 13×4), సమర్థ్ (55), బావ్నె (32 నాటౌట్) రాణించడంతో 224 పరుగుల లక్ష్యాన్ని భారత్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది.

ఆంధ్రపై హైదరాబాద్ విజయం

ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత మొయినుద్దౌలా గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య జట్టు శుభారంభం చేసింది. మంగళవారం అంబటి రాయుడు సారథ్యంలోని హైదరాబాద్ 80 పరుగుల ఆధిక్యంతో ఆంధ్రపై గెలుపొందింది. తొలుత హైదరాబాద్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 305 పరుగులు సాధించింది. అక్షత్‌రెడ్డి (113) సెంచరీతో చెలరేగగా.. తన్మయ్ అగర్వాల్ (88), రాయుడు (63 నాటౌట్) రాణించారు. అనంతరం ఆంధ్ర 50 ఓవర్లలో 9 వికెట్లకు 225 పరుగులు చేసింది. డి.బి.రవితేజ (113 నాటౌట్) సెంచరీ వృథా అయింది.

యుఎస్ ఓపెన్‌కు అజరెంక దూరం

న్యూయార్క్: మాజీ నంబర్‌వన్ విక్టోరియా అజరెంక (బెలారస్) ఈ నెల 28న ఆరంభమయ్యే యుఎస్ ఓపెన్ నుంచి తప్పుకుంది. తన బాయ్‌ఫ్రెండ్ బిల్లీ మెక్‌కీగ్ నుంచి విడిపోయిన అజరెంక.. కొడుకు లియో ఎవరి దగ్గర ఉండాలనే విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకోలేకపోవడమే ఇందుకు కారణం. బిల్లీతో సహజీవనం చేసిన అజరెంక గత డిసెంబరులో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ జూన్‌లో తిరిగి కోర్టులో అడుగుపెట్టింది. వింబుల్డన్ తర్వాత బిల్లీతో విడిపోయినట్లు ఆమె ట్విట్టర్లో పేర్కొంది.

జూనియర్ హాకీ కోచ్‌గా జూడ్ ఫెలిక్స్

దిల్లీ: మాజీ కెప్టెన్ జూడ్ ఫెలిక్స్ సెబాస్టియన్ భారత జూనియర్ హాకీ జట్టు కోచ్‌గా నియమితుడయ్యాడు. 250 అంతర్జాతీయ మ్యాచ్‌లకు పైగా ఆడిన ఫెలిక్స్.. రెండు ఒలింపిక్స్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

క్షమించమన్నాడు



లండన్: ముఖానికి నల్ల రంగు పూసుకుని ఉంటే నైట్‌హుడ్ బిరుదు పొంది ఉండే వాడినంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఇంగ్లాండ్ బ్యాటింగ్ దిగ్గజం, వ్యాఖ్యాత జెఫ్రీ బాయ్‌కాట్, క్షమాపణలు చెప్పాడు. చాలా మంది వెస్టిండీస్ క్రికెటర్లకు నైట్‌హుడ్ బిరుదు ఇవ్వడంపై జెఫ్రీ మాట్లాడుతూ.. "ముఖానికి నల్ల రంగు వేసుకుని ఉంటే నాకూ ఆ అవార్డు దక్కేది" అని చెప్పాడు. ఐతే ఇవి జాతివివక్ష వ్యాఖ్యలేనన్న విమర్శల నేపథ్యంలో బాయ్‌కాట్ భేషరతుగా క్షమాపణలు చెప్పాడు. "ఎవరినీ గాయపరచాలనే ఉద్దేశం నాకు లేదు. కానీ నేను మాట్లాడింది పూర్తిగా తప్పు. నేను భేషరతుగా క్షమాపణలు చెబుతున్నా. వెస్టిండీస్ క్రికెట్ అంటే నాకెంతో ఇష్టం. ఆ జట్టు ఆటగాళ్లంటే ఎంతో గౌరవం" అని బాయ్‌కాట్ ట్విట్టర్లో చెప్పాడు.

తాను దూరమైనా...



పారిస్: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ ఇప్పటివరకూ 11 పతకాలు గెలిచింది. చివరిగా నర్సింగ్‌యాదవ్ 2015 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో రజత పతకం గెలిచాడు. ఐతే నిరుడు డోపింగ్‌లో దోషిగా తేలి నాలుగేళ్ల నిషేధం ఎదుర్కొంటున్న అతడు టోర్నీలో పోటీపడే అవకాశాన్ని కోల్పోయాడు. నేరుగా పోటీలో లేకపోయిన ఈ టోర్నీలో తనదైన ముద్ర వేసేందుకు అతనికి అవకాశం దొరికింది. ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న టోర్నీలో పోటీపడుతున్న శిల్పి షెరోన్ నర్సింగ్ భార్య. ఈ ఏడాది మార్చిలో వారిద్దరు పెళ్లి చేసుకున్నారు. పోటీలకు దూరంగా ఉన్న నర్సింగ్.. శిల్పికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. ఆమె పతకంతో తిరిగొస్తుందన్న నమ్మకంతో ఉన్నాడు అతడు. "శిల్పి పతకం గెలుస్తుందన్న నమ్మకం నాకుంది. గత కొన్ని నెలలుగా దాని కోసమే తీవ్రంగా శ్రమించాం. ఆమె పతకం సాధించి నా జీవితంలో ఎదురైన ఆటుపోట్లకు కొంతైనా సాంత్వన చేకూరుస్తుందని భావిస్తున్నా" అని నర్సింగ్ చెప్పాడు.

ఉగ్రవాదానికి ఆశ్రయమిస్తే సహించం

- పాక్‌కు అమెరికా గట్టి హెచ్చరిక
- అఫ్గాన్ నుంచి బలగాలను ఉపసంహరించం
- శాంతి స్థాపనలో భారత్ ప్రముఖ పాత్ర పోషించాలి
- అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ
- దక్షిణాసియా విధానం ఆవిష్కరణ



దక్షిణాసియా విధాన ప్రకటన కార్యక్రమం అనంతరం సైనికులతో కరచాలనం చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్: అఫ్గానిస్థాన్ అంశంలో భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా వృద్ధి చేసుకోనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆ దేశంలో శాంతి వెల్లివిరిసేందుకు భారత్ మరింత విస్తృత పాత్ర పోషించాలని కోరారు. అఫ్గాన్ నుంచి తమ బలగాలను అర్ధాంతరంగా ఉపసంహరించేది లేదని స్పష్టంచేశారు. ఉగ్రవాదానికి సురక్షిత ఆవాసాన్ని కల్పిస్తున్న పాకిస్థాన్‌కు అత్యంత కఠిన హెచ్చరిక చేశారు. వైఖరి మారకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టంచేశారు. అమెరికా సైనిక బలగాల కమాండర్ ఇన్ చీఫ్ హోదాలో ఆర్లింగ్టన్‌లోని ఫోర్ట్ మయర్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ తన దక్షిణాసియా విధానాన్ని ఆవిష్కరించారు. భారత్‌తో అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా వృద్ధి చేసుకోవాలన్నది ఈ విధానంలో కీలకాంశం. అఫ్గాన్‌లో 16 ఏళ్లుగా సాగిస్తున్న యుద్ధంలో గెలుపు కోసం తమ బలగాలు పోరాడతాయని చెప్పారు. అఫ్గాన్ నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించాలని తొలుత తాను భావించినట్లు ట్రంప్ చెప్పారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను మదింపు వేశాక మనస్సు మార్చుకున్నట్లు తెలిపారు. నిర్దిష్ట కాలావధి ఆధారిత విధానంతో కాకుండా పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకోవడం తమ కొత్త వ్యూహంలో కీలకాంశమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఫ్గాన్‌లో 8500 మంది అమెరికన్ సైనికులు ఉన్నారు. అదనంగా మరో 4వేల మందిని అమెరికా.. అక్కడికి పంపే అవకాశం కనిపిస్తోంది. 2011లో ఇరాక్ నుంచి అమెరికా అర్ధాంతరంగా వైదొలగడం వల్ల ఆ దేశం మళ్లీ శత్రువుల చేతుల్లోకి జారిపోయిందని ట్రంప్ చెప్పారు.

అమెరికాకు దీర్ఘకాల మిత్రపక్షంగా పరిగణిస్తున్న పాకిస్థాన్‌పై అనుసరించే వైఖరిలో సమూల మార్పును తీసుకురావడం.. ట్రంప్ కొత్త వ్యూహంలో మరో కీలకాంశం. "హింస, గందరగోళం, ఉగ్రవాదానికి పాల్పడే ముఠాలకు పాకిస్థాన్ సురక్షిత ఆవాసాన్ని కల్పిస్తోంది. పాక్, భారత్ అణ్వస్త్ర దేశాలు కావడంతో.. పాక్ చర్యలతో కలిగే ముప్పు మరింత ఆందోళనకరంగా ఉంటోంది. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు యుద్ధంగా మారే ప్రమాదం ఉంది" అని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. అమెరికా నుంచి వందల కోట్ల డాలర్ల సాయాన్ని అందుకుంటూనే తాలిబన్ వంటి ఉగ్రవాద ముఠాలకు ఊతమిస్తోందంటూ పాక్‌పై మండిపడ్డారు. దీన్ని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. విదేశీ ఉగ్రవాద సంస్థలుగా తాము వర్గీకరించిన ముఠాల్లో 20.. అఫ్గాన్, పాక్‌లోనే ఉన్నాయని చెప్పారు. ప్రపంచంలో ఇంత ఎక్కువగా ఏ ప్రాంతంలోనూ ఉగ్రముఠాలు పోగపడలేదని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్.. అమెరికాకు కీలక భద్రత, ఆర్థిక భాగస్వామి అని ట్రంప్ చెప్పారు. "అఫ్గాన్‌లో భారత్ అందించిన ముఖ్యమైన తోడ్పాటును మేం అభినందిస్తున్నాం. అఫ్గాన్‌ను మరింత ఆదుకోవాలని భారత్‌ను కోరుతున్నాం" అని పేర్కొన్నారు.

స్వాగతించిన భారత్..: ఉగ్రవాదుల సురక్షిత ఆవాసాలపై కొరడా ఝుళిపించాలన్న ట్రంప్ పిలుపును భారత్ స్వాగతించింది. ట్రంప్ హెచ్చరిక నేపథ్యంలో చైనా.. పాక్‌కు మద్దతుగా నిలిచింది. ఉగ్రవాదంపై పోరు విషయంలో పాక్ అనేక త్యాగాలను చేసిందని, శాంతి, సుస్థిరతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. వీటిని అంతర్జాతీయ సమాజం గుర్తించాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యుంగ్ కోరారు.



తరచూ చేస్తున్న బదిలీలపై ప్రశ్నించి సస్పెన్షన్‌కు గురైన మధ్యప్రదేశ్ హైకోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి ఆర్‌కే శ్రీవాస్ సైకిల్‌పై చేపట్టిన న్యాయ యాత్ర మంగళవారం భోపాల్ చేరుకుంది. నిమూచ్ నుంచి జబల్‌పూర్ వరకు ఆయన ఈ యాత్ర నిర్వహిస్తున్నారు

బాలలపై హింసకు వ్యతిరేకంగా భారత్‌యాత్ర

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా బాలలపై జరుగుతున్న లైంగికదాడులు, హింసకు వ్యతిరేకింగా నోబెల్ శాంతిబహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి భారత యాత్ర తలపెట్టారు. ఇది సెప్టెంబర్ 11న కన్యాకుమారి నుంచి ప్రారంభమై అక్టోబర్ 16న దిల్లీలో ముగుస్తుంది. ఇది 22 రాష్ట్రాల మీదుగా 11 వేల కిలోమీటర్ల మేర సాగనుంది. ఈ యాత్ర సెప్టెంబర్ 19న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, 20న కర్నూలుకు చేరుకుంటుంది. ఆ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తారు.

నీట్ ప్రకారమే వైద్య ప్రవేశాలు చేపట్టండి: సుప్రీం

దిల్లీ: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) మెరిట్ లిస్టు ఆధారంగా వెంటనే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టాలని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. నీట్ పరిధి నుంచి రాష్ట్రంలోని వైద్య, దంత కళాశాలలకు ఈ ఏడాదికి మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన అత్యవసరాదేశాల(ఆర్డినెన్స్)ను సమర్థించేదిలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయటంతో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలిచ్చింది. ప్రవేశాల ప్రక్రియను సెప్టెంబరు 4వ తేదీలోగా పూర్తి చేయాలని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

2600 కోట్ల పరిహారం చెల్లించండి

- జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థకు అమెరికా కోర్టు ఆదేశం

లాస్‌ఏంజెలెస్: జాన్సన్ బేబీ పౌడర్ ఉత్పత్తి చేసే జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ వినియోగదారుకు రూ.2600 కోట్ల పరిహారం చెల్లించాలని అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ కోర్టు ఆదేశించింది. జాన్సన్ బేబీ పౌడర్ ఉపయోగించడం వల్ల తనకు అండాశయ క్యాన్సర్ సోకిందని ఆ సంస్థపై కాలిఫోర్నియాకు చెందిన ఎవా ఎచివెరియా అనే మహిళ దావా వేసింది. కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇస్తూ రూ.2600 కోట్ల భారీ పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. తాను 1950 నుంచి 2016 వరకు ప్రతిరోజు ఈ పౌడర్‌నే వినియోగించానని ఎవా తెలిపింది. ఆమెకు 2007లోనే క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ పౌడర్ వాడటం వల్లే అండాశయ క్యాన్సర్ సోకినట్లు ఆమె ఆరోపించారు.

ఓపెన్ స్కూలు పరీక్షలకూ ఆధార్

దిల్లీ: ఓపెన్ స్కూలు పరీక్షలు రాయనున్న అభ్యర్థులకు ఇక నుంచి ఆధార్ తప్పనిసరి కానుంది. అభ్యాసకులు ఒకరికి బదులు మరొకరు పరీక్షలకు హాజరు కాకుండా ఉండేందుకు జాతీయ సార్వత్రిక విద్యా అభ్యాస సంస్థ(ఎన్ఐఓఎస్) ఈ నిర్ణయం తీసుకుంది. పరీక్షా కేంద్రాల వద్ద స్కానర్లు ఏర్పాటు చేసి, వేలిముద్ర ఆధారంగా అభ్యర్థుల వివరాలు సరిచూడనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సీసీటీవీ కెమెరాలు సౌకర్యం లేని కేంద్రాల్లో పరీక్ష నిర్వహించకూడదని సంస్థ నిర్ణయం తీసుకుంది.

న్యాయాధికారుల భర్తీ విధానమేంటి?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: న్యాయాధికారుల నియామకాలకు కేంద్రం రూపొందించిన మార్గదర్శకాల్లో ఇతర రాష్ట్రాల వారికి అవకాశాలు (ఆప్షన్) ఇచ్చే విధానమేంటని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఏపీ, తెలంగాణల మధ్య న్యాయాధికారుల విభజన చేపట్టకుండా నియామకాలు చేపట్టరాదని తెలంగాణ న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున తొలుత అడిషనల్ సొలిసిటర్ జనరల్ మణీందర్‌సింగ్ వాదనలు ప్రారంభించారు. నియామకాల్లో భాగంగా సీనియారిటీ, ఆప్షన్‌లను ప్రాధాన్యంగా తీసుకుంటామని తెలిపారు. 'ఏపీకి చెందిన 20 మంది అధికారులు హైదరాబాద్ కావాలని అడుగుతారు.. వారంతా సీనియారిటీలో ముందుంటారు అప్పుడెలా?' అని జస్టిస్ చలమేశ్వర్ ప్రశ్నించారు. 'ఏపీ, తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాల వారికి మార్గదర్శకాల్లో మీరిచ్చే ప్రాధాన్యమేంటి?' అని అడగ్గా సీనియారిటీ లేదా ఆప్షన్ అనే అవకాశం ఇస్తామని మణీందర్‌సింగ్ తెలిపారు. 'అసలు ఖాళీల వివరాలు ఎవరు రూపొందిస్తారు? ఆయా రాష్ట్రాల దగ్గర ఖాళీల జాబితా ఉందా?' అని జస్టిస్ చలమేశ్వర్ ప్రశ్నించారు. హైకోర్టు జాబితా రూపొందిస్తుందని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది ఏడీఎన్ రావు తెలిపారు. జాబితా సిద్ధంగా లేదని కొంత సమయం కావాలని హైకోర్టు తరఫు సీనియర్ న్యాయవాది రమణిరావు తెలిపారు. దీంతో ఆయా వివరాలు వచ్చే బుధవారానికి కోర్టుకు సమర్పించాలని ఆదేశించి విచారణ సెప్టెంబరు 5కు వాయిదా వేశారు.

అభివృద్ధి సైనికులుగా మారండి

- తక్కువ నగదు కలిగిన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలి
- యువ వ్యాపారవేత్తలకు మోదీ దిశానిర్దేశం

దిల్లీ: యువ వ్యాపారవేత్తలు అభివృద్ధి సైనికుల అవతారాన్ని ఎత్తాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తద్వారా దిగుమతులపై భారత్ ఆధారపడే పరిస్థితిని తప్పించాలని కోరారు. 'తక్కువ నగదు' కలిగిన ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగేందుకు దోహదపడాలన్నారు. మంగళవారం దిల్లీలో నీతి ఆయోగ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో 200 మందికిపైగా సీఈవోలు, అంకుర సంస్థలతో ప్రధాని మాట్లాడారు. వ్యవసాయ ఎగుమతులను పెంచడానికి, పర్యాటక రంగాన్ని వృద్ధి చేయడానికి కృషి చేయాలని కోరారు. గాంధీ స్ఫూర్తితో.. అభివృద్ధిని కూడా ఒక ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. నగదు రహిత లావాదేవీల కోసం 'భీమ్' యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. "2022 నాటి కల్లా మీ ఉద్యోగులంతా నగదు రహిత లావాదేవీలు చేసేలా చూడండి" అని చెప్పారు. దీపావళి కానుకలుగా ఖాదీ కూపన్లను పంపిణీ చేయాలని కోరారు.

పర్యాటక రంగంలో ఉద్యోగ సృష్టికి అపార అవకాశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. దేశ సమస్యలకు ఆచరణ సాధ్య పరిష్కారాల గురించి కొత్త తరం ఆలోచించడం మొదలుపెడితే.. మార్కెట్లు, ఉద్యోగాల సృష్టి దానంతటదే జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత కోసం ఇటీవల ప్రవేశపెట్టిన గవర్నమెంట్-ఈ-మార్కెట్ పోర్టల్ గురించి ఆయన వివరించారు. యువ సీఈవోలను తన బృందంగా మోదీ అభివర్ణించారు. పొలాల గట్లపై కలప సాగు వంటి వినూత్న ఆలోచనలు.. రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని అందుకోవడంలో సాయపడతాయన్నారు. సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకే రోజు 9500 ప్రాజెక్టులు

ఈనాడు, దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 29న ఓ సరికొత్త రికార్డును నెలకొల్పనున్నారు. ఆ ఒక్క రోజులోనే రహదారులకు సంబంధించిన 9500 ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ దీనికి వేదిక కానుంది. ఆ ప్రాజెక్టుల మొత్తం వ్యయ అంచనా రూ.27వేల కోట్లు.

'గృహహింస చట్టాన్ని నీరుగారుస్తున్నారు'

- సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ ఎన్‌సీడబ్ల్యూకు పౌరసంఘాల పిటిషన్

దిల్లీ: గృహహింస చట్టాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపిస్తూ కొన్ని పౌర సంఘాలు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)ను ఆశ్రయించాయి. 498ఏ సెక్షన్ (గృహహింస) కింద తప్పుడు కేసులు నమోదవుతున్నాయంటూ సుప్రీం కోర్టు ఇటీవల వెల్లడించిన తీర్పుకు వ్యతిరేకంగా. దాదాపు 150 మహిళా సంఘాలు ఎన్‌సీడబ్ల్యూ ఛైర్‌పర్సన్‌కు పిటిషన్‌ను సమర్పించాయి. పెద్ద సంఖ్యలో మహిళలు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న నిరాధార వాదనకు.. విశ్వాసం కల్పించే విధంగా ఈ తీర్పు ఉందని పేర్కొన్నాయి. అయితే దుర్వినియోగాన్ని రుజువుపరిచే సమాచారం, సాక్ష్యాలు ఏవీ లేవని వ్యాఖ్యానించాయి. ఇటు తమపై తప్పుడు కేసులు నమోదయ్యాయని ఆరోపించే పురుషుల కోసం ప్రత్యేక సేవలను ఏర్పాటు చేయాలని ఎన్‌సీడబ్ల్యూను కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనక గాంధీ ఇటీవల ఆదేశించారు. దీనిపైనా పౌర సంఘాలు వ్యతిరేకత వ్యక్తం చేశాయి.

ప్రత్యేక సందర్భాల్లోనే వీసా మార్చుకునే వెసులుబాటు



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

వచ్చే ఏడాది జూన్ వరకు నా బి1/బి2 వీసా చెల్లుబాటవుతుంది. నేను అమెరికా వెళ్ల వచ్చా? అక్కడికి వెళ్లిన తరవాత హెచ్-1 లేదా ఎల్-1 వీసా కోసం దరఖాస్తు చేయవచ్చా? *- ఎం.ప్రకాష్*

నాన్ ఇమిగ్రెంట్ వీసాదారులకు అమెరికా వెళ్లేందుకు వీసా ఏ కారణంతో అనుమతించారో స్పష్టంగా ఉంటుంది. తాత్కాలిక వ్యవధి కోసం అమెరికా వెళ్లొచ్చేందుకు బి1/బి2 వీసా అనువైనది. నిబంధనల మేరకు ఏ కారణంతో అమెరికా వెళ్లదలచుకున్నారో అందుకు అనువైన వీసాను పొందాలి. మీరు అమెరికాలో హెచ్1బిపై పని చేయటానికి వెళ్లాలనుకుంటే హెచ్1బి వీసాను పొందాలి. కొన్ని సందర్భాల్లో మాత్రమే వీసా స్థితిని మార్చుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. మీ వీసా స్థితిని మార్చుకునేందుకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్)కు మీ వీసా గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియను ఎలా నిర్వహించాలనేది తెలుసుకునేందుకు https://www.uscis.gov చూడండి. స్పష్టమైన సమాచారం కోసం లీగల్ కౌన్సిల్‌ను సంప్రదించండి. వీసాలో నిర్దేశించిన కార్యాకలాపాలను అతిక్రమించి వ్యవహరిస్తే మాతృదేశానికి పంపటంతోపాటు భవిష్యత్తులో అమెరికాలో పర్యటించేందుకు అవకాశం లేకుండా నిషేధించే వీలుంటుంది.

వచ్చే నవంబరులో పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్నాను. ఏయే ధ్రువపత్రాలు అవసరం. పర్యాటక వీసా ఎన్ని సంవత్సరాలు చెల్లుబాటయ్యేలా జారీ చేస్తారు? *- టీవీ కృష్ణమోహన్*

బి1/బి2 వీసాలు ఆయా దేశాల ప్రతిస్పందన ఆధారంగా వీసా వ్యవధి ఆధారపడి ఉంటుంది. భారతీయులకు బహుళ ప్రవేశాలకు వీలుగా పదేళ్లు చెల్లుబాటయ్యేలా నాన్ ఇమిగ్రెంట్ వీసాలు జారీ చేస్తున్నారు. మరింత సమాచారం కోసం https:// in.usembassy.gov/visas/nonimmigrantvisas/ ను పరిశీలించండి. ఏయే ధ్రువపత్రాలు అవసరమన్న సమాచారానికి https://www.ustraveldocs.com/ inను చూడండి.

2016లో లాటరీ విధానం ద్వారా నా హెచ్1బి దరఖాస్తును ఎంపిక చేశారు. 2016 అక్టోబరు నుంచి 2017 సెప్టెంబరు వరకు చెల్లుబాటయ్యేలా ఐ-797 జారీ చేశారు. 2016 నవంబరులో ఇంటర్వ్యూకు హాజరయ్యాను. నా దరఖాస్తును పరిపాలనా ప్రక్రియ కింద తీసుకున్నారు. కాన్సులేట్ నుంచి గత ఆరు నెలలుగా ఎలాంటి స్పందన లేదు. ఒక వేళ వీసా వస్తే ఎప్పటి వరకు చెల్లుబాటవుతుంది? *- దిలీప్‌కుమార్*

ఐ-797లో యూఎస్‌సీఐఎస్ నమోదు చేసిన చివరి తేదీ వరకు హెచ్1బి నాన్ ఇమిగ్రెంట్ వీసా చెల్లుబాటులో ఉంటుంది. పత్రికా ముఖంగా మీ సమస్యకు సమాధానం చెప్పలేకపోతున్నాం. మీకు సంబంధించిన సమాచారం కోసం కాన్సులేట్‌ను నేరుగా సంప్రదించండి. https://www.ustraveldocs.com/ in ను పరిశీలిస్తే సంప్రదించాల్సిన సమాచారం ఉంటుంది.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్ చేయండి.
- సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

భారత్‌ను విశ్వగురువుగా మారుస్తాం

- క్రియాశీల నిర్ణయాల కోసం ప్రపంచమంతా మన వైపు చూస్తోంది
- గుంటూరు 'సంకల్ప సిద్ధి' సభలో కేంద్రమంత్రి జేపీ నడ్డా



గుంటూరులో మంగళవారం సంకల్ప సిద్ధి సభలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి జేపీ నడ్డా

ఈనాడు-గుంటూరు, హైదరాబాద్, అమరావతి

భారత్‌ను విశ్వగురువుగా మారుస్తామని, అవినీతి రహితంగా, అభివృద్ధే అజెండాగా కేంద్రంలో ఎన్డీయే పాలన సాగుతోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. మూడేళ్ల క్రితం వరకు భారత్ అవినీతిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండేదన్నారు. అలాంటిది, తాము అధికారంలోకి వచ్చాక దేశాన్ని ఆ పరిస్థితి నుంచి తప్పించామన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు గుంటూరు అర్బన్ జిల్లా భాజపా నాయకులు మంగళవారం గుంటూరులో ఏర్పాటుచేసిన 'సంకల్ప సిద్ధి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. 2022 నాటికి దేశం ప్రపంచంలోనే అగ్రగామి అవుతుందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోందని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి ఈ మూడేళ్ల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అవన్నీ పేద, యువత, మహిళ, రైతుల సంక్షేమం కోసం చేసినవేనని గుర్తుచేశారు. వచ్చే ఏడాది ఎయిమ్స్‌లో తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కామినేని వెల్లడించారు. భాజపా పక్షనాయకుడు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ విశాఖలో భూ కుంభకోణాలను బయటపెట్టినట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు. భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణతో పాటు సీనియర్ నాయకులు లక్ష్మీపతి, అర్బన్ అధ్యక్షుడు ఆంజనేయులు, ఆలూరి కోటేశ్వరావు, శ్యాంకిశోర్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నీట్ ద్వారా మేలు: వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించేలా దేశవ్యాప్తంగా నీట్ ర్యాంకులను ప్రామాణికంగా తీసుకున్నామని, ఈ విధానంలో సీట్లు అమ్ముకునే అవకాశం లేకుండా చూడగలిగామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో మంగళవారం సాయంత్రం వైద్యులు, విద్యార్థులతో జరిగిన సంప్రదింపుల సమావేశానికి హాజరైన నడ్డా మాట్లాడుతూ పీజీ వైద్య విద్య సీట్లను ఒకేసారి 5 వేలు పెంచామన్నారు. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం జరిగేలా తర్వాత అధికారులతో మాట్లాడతానన్నారు.

ఎయిమ్స్‌పై చంద్రబాబు వినతికి నడ్డా సానుకూల స్పందన

ఎయిమ్స్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతుల్ని ప్రారంభిస్తామని కేంద్రమంత్రి నడ్డా పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు వేచిచూడకుండా తరగతులను వచ్చే ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబునాయుడును మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంత్రి నడ్డా కలిశారు. రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ సీట్ల పెంపునకు కూడా కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. 11 వైద్య కళాశాలల స్థాయి పెంచేందుకు, బోధన ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాల్టీ సేవలు అందించేందుకు సానుకూలత వ్యక్తంచేశారు. ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కర్నూలు కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.54 కోట్లను విడుదల చేసినందుకు సీఎం నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఓ ప్రకటన జారీచేసింది.

డయల్ 18004254440

- రాష్ట్రం ఆవల ఉన్నవారి కోసం ప్రభుత్వ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి ఆవల ఉన్నవారు ఏపీ ప్రభుత్వం దృష్టికి ఏమైనా సమస్యలు తీసుకురాదలుచుకుంటే 18004254440 నెంబరుకు ఫోన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఈ నెంబరును ఆయన మంగళవారం మీడియాకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 1100 పరిష్కార వేదిక కాల్ సెంటరు నెంబరుకు రాష్ట్రానికి ఆవల ఉన్నవారు ఫిర్యాదు చేయాలంటే సమస్యలు వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా అక్కడ ఇదే నెంబరుతో కాల్ సెంటరును నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దాంతో హైదరాబాద్‌లో నివసిస్తున్న సీమాంధ్ర ప్రజలు అక్కడి నుంచి ఇక్కడ తమ వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే వీలు కావడం లేదు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఈ ఏర్పాటు చేయించారు.

నేడు హైదరాబాద్‌కు సీఎం చంద్రబాబు

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సాయంత్రం 5 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయల్దేరి హైదరాబాద్ వెళతారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి సమీపంలోని ట్రిడెంట్ హోటల్‌లో జరిగే ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి విజయవాడ చేరుకుంటారు.

25న అమిత్‌షా ప్రమాణస్వీకారం

దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈనెల 25న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేయనున్నారు. రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆయనతో శుక్రవారం ప్రమాణం చేయిస్తారు. గుజరాత్ నుంచి ఎన్నికైన షా రాజ్యసభలో తొలిసారిగా అడుగుపెట్టనున్నారు. ఆయన రాకతో రాజ్యసభలోని భాజపా శ్రేణుల్లో నూతనోత్సాహం రానుంది.

దావూద్‌కు 21 పేర్లు, 3 చిరునామాలు

లండన్: భారత్‌లో 'మోస్ట్ వాంటెడ్'గా ఉన్న మాఫియా ముఠా నాయకుడు దావూద్ ఇబ్రహీం.. పాకిస్థాన్‌లో 21 మారుపేర్లతో చలామణీ అవుతున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం గుర్తించింది. పాక్‌లో అతడికి మూడు చిరునామాలు కూడా ఉన్నాయని పేర్కొంది. బ్రిటన్ ఆర్థిక శాఖ తాజాగా విడుదల చేసిన ఆర్థిక ఆంక్షల జాబితాలో ఇవి వెల్లడయ్యాయి. ఇందులో ఉన్న 'భారత జాతీయుడు' దావూద్ ఒక్కడే.

రోబోటిక్ ఆయుధాలతో మానవాళికి ముప్పు

శాన్ ఫ్రాన్సిస్కో: ప్రమాదకరమైన 'కిల్లర్ రోబోలు' వంటి స్వయంప్రతిపత్తి ఆయుధాల వల్ల మానవాళికి తలెత్తబోయే ముప్పుల గురించి ప్రపంచవ్యాప్తంగా వంద మందికిపైగా రోబోటిక్, కృత్రిమ మేధస్సు సంస్థల దిగ్గజాలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ముప్పుపై స్పందించాలని ఐరాసకు విజ్ఞప్తి చేశారు. "స్వయంప్రతిపత్తి కలిగిన ప్రమాదకర ఆయుధాలు.. యుద్ధరంగంలో మూడో విప్లవంగా రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. వీటిని అభివృద్ధి చేస్తే సాయుధ ఘర్షణల విస్తృతి, వేగం.. ఊహకందని రీతిలో పెరుగుతాయి. ఉగ్రవాదులు.. వీటిని అమాయక ప్రజలపై ప్రయోగించే ప్రమాదం ఉంది. పైగా వీటిని హ్యాక్ చేసి.. అవాంఛనీయ రీతిలో ఉపయోగించవచ్చు. ముంచుకొస్తున్న ఈ ముప్పుపై స్పందించడానికి ఎక్కువ సమయం లేదు. ఈ వివాదాల తుట్టె తెరుచుకుందంటే.. దాన్ని ముగింపు పలకడం చాలా కష్టం" అంటూ ఐరాసకు ఒక లేఖను సమర్పించారు. దీనిపై సాంకేతిక పరిశ్రమకు చెందిన 116 మంది దిగ్గజాలు సంతకాలు పెట్టారు.

మరోసారి తెరపైకి 'విశ్వాసం'..!

- గవర్నర్‌ను కలిసిన టీటీవీ దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు
- సభలో ముఖ్యమంత్రి బలం నిరూపించుకోవాలి: స్టాలిన్
- వేడెక్కిన తమిళ రాజకీయాలు



రాజ్‌భవన్‌కు చేరుకుంటున్న దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు

చెన్నై: అన్నాడీఎంకేలోని పన్నీర్‌సెల్వం, పళనిస్వామి వర్గాలు ఏకమై 24 గంటలు గడవక ముందే మరోసారి 'విశ్వాస తీర్మానం' అంశం తెరపైకి వచ్చింది. మంగళవారం టీటీవీ దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు 19 మంది రాజ్‌భవన్‌లో గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిశారు. పళనిస్వామి, పన్నీర్‌సెల్వం ఏకమవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, ప్రభుత్వానికి తాము మద్దతు ఉపసంహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు లేఖలు అందజేశారు. ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్ కూడా రంగంలోకి దిగారు. దినకరన్ వర్గం లేఖల నేపథ్యంలో ముఖ్యమంత్రి శాసనసభలో బల నిరూపణ చేసుకోవాలన్నారు. ఈ మేరకు గవర్నర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. తమ పార్టీ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందని వ్యాఖ్యానించారు. నగరంలో విలేకర్లతో మాట్లాడుతూ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. టీటీవీ దినకరన్ వర్గంలో 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ పరిస్థితిలో ప్రభుత్వం మైనారిటీలో పడిందన్నారు. విశ్వాస పరీక్షకు గవర్నర్ వెంటనే ముఖ్యమంత్రిని ఆదేశించాలని కోరారు.

హాజరుకాని దినకరన్: రెండు వర్గాల విలీనం తర్వాత 19 మంది దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు సోమవారం సాయంత్రం మెరీనాలోని జయలలిత సమాధి వద్దకు చేరుకున్నారు. చిన్నమ్మ శశికళ, దినకరన్‌లకు అనుకూలంగా నినదించారు. పన్నీర్, పళనిస్వామి ఏకమవడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దినకరన్ పాల్గొనలేదు. అనంతరం ఆ ఎమ్మెల్యేలు నగరంలోని ప్రముఖ హోటల్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్‌ను కలిసి తాము ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు లేఖలు అందించారు. ఇక్కడా దినకరన్ లేరు. ఈ నెల 23వ తేదీన చెన్నైతోపాటు తేని జిల్లాలో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభలను కూడా ఆయన వాయిదా వేసుకున్నారు.

పన్నీర్‌కు అదనపు బాధ్యతలు...: ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వానికి అదనపు శాఖలు కేటాయించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. సోమవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, గృహ నిర్మాణ శాఖల బాధ్యతలు చేపట్టిన పన్నీర్‌కు తాజాగా ప్రణాళిక, శాసనసభ వ్యవహారాలు, ఎన్నికలు, పాస్‌పోర్టుల శాఖలను కేటాయించారు. మధ్యాహ్నం గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు చెన్నై నుంచి ముంబయికి బయలుదేరి వెళ్లారు.

ఐక్యంగా ముందుకు సాగుతాం...: పార్టీలోని అంతర్గత సమస్యలను పరిష్కరించుకుంటామని, త్వరలోనే దినకరన్ కూడా తమతో కలిసి ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సహకార శాఖ మంత్రి సెల్లూరు కె.రాజు అన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00